


సత్యమేవ జయతే

సాక్షి

WWW.SAKSHI.COM

పేజీలు: 16 వెల: ₹ 5.50

సంపుటి: 17
సంచిక: 76

శుక్రవారం 7-6-2024



అడవిని డిజైన్ చేసింది -11లో



చదువు ఎంపికలో పిల్లల మాట కూడా వినండి -11లో

SIMULTANEOUSLY PRINTED AT KARIMNAGAR | HYDERABAD | BANGALORE | CHENNAI | DELHI | MUMBAI | ANANTAPUR | GUNTUR | KADAPA | KHAMMAM | KURNOOL | MAHABOOBNAGAR | MANGALAGIRI | NALGONDA | NELLORE | NIZAMABAD | ONGOLE | RAJAMAHENDRAVARAM | SRIKAKULAM | TADEPALLI GUDEM | TIRUPATHI | VIJAYAWADA | VISAKHAPATNAM | WARANGAL

సత్యమేవ జయతే

సాక్షి

WWW.SAKSHI.COM

పేజీలు: 16 వెల: ₹ 5.50

సంపుటి: 17 సంచిక: 76

శుక్రవారం 7-6-2024

SIMULTANEOUSLY PRINTED AT KARIMNAGAR | HYDERABAD | BANGALORE | CHENNAI | DELHI | MUMBAI | ANANTAPUR | GUNTUR | KADAPA | KHAMMAM | KURNOOL | MAHABOOBNAGAR | MANGALAGIRI | NALGONDA | NELLORE | NIZAMABAD | ONGOLE | RAJAMAHENDRAVARAM | SRIKAKULAM | TADEPALLI GUDEM | TIRUPATHI | VIJAYAWADA | VISAKHAPATNAM | WARANGAL



'పారిశ్రామిక రంగానికి దీటుగా సేద్యరంగం ఎదగాలి. వ్యవసాయ ఫలాలు పదింతలు పెరగాలి'



స్టాక్ మార్కెట్ స్కాంలో మోదీ, అమిత్ షా

దేశంలో అతిపెద్ద స్టాక్ మార్కెట్ కుంభకోణంలో ప్రధాని మోదీ, అమిత్ షా ప్రత్యక్షంగా భాగస్వాములయ్యారని కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ గాంధీ ఆరోపించారు. స్టాక్ మార్కెట్‌లో పెట్టుబడులు పెట్టాలంటూ వారిచ్చిన సలహాలు నమ్మి రిటైల్ ఇన్వెస్టర్లు రూ.30 లక్షల కోట్లు పోగొట్టుకున్నారని చెప్పారు. ఈ మొత్తం వ్యవహారంపై జేపీసీతో విచారణ జరిపించాలని డిమాండ్ చేశారు. - 6లో



స్కూలుపై దాడి.. 33 మంది మృతి

గాజాలోని అల్-నర్డి స్కూల్‌పై ఇజ్రాయెల్ జరిపిన దాడుల్లో 14 మంది చిన్నారులు సహా మొత్తం 33 మంది చనిపోయారు. . - వివరాలు 6లో



కంగనకు కానిస్టేబుల్ చెంపదెబ్బ

ఢిల్లీకి వెళ్లేందుకు చండీగఢ్ విమానాశ్రయానికి వచ్చిన ఎంపీ కంగనా రనౌత్‌ను సీఐఎస్ఎఫ్ మహిళా కానిస్టేబుల్ చెంపదెబ్బ కొట్టారు. - వివరాలు 6లో

'నీట్'గా గోల్‌మాల్?

మెడికల్ ఎంట్రన్స్ ఎగ్జామ్‌లో దేశవ్యాప్తంగా పలుచోట్ల కాపీయింగ్ జరిగినట్లు ఆరోపణలు

- హరియాణాలోని ఓ సెంటర్‌లో ఒకే గదిలో పరీక్ష రాసిన అనేక మందికి 720కి 720 మార్కులు రావడంపై అనుమానాలు
- 5 చొప్పున నెగెటివ్ మార్కులున్నా కొందరికి 717, 718, 719 మార్కులు వచ్చినట్లు పత్రికల్లో ప్రచార ప్రకటనలు
- ఈ వ్యవహారంపై అనుమానం వ్యక్తం చేస్తున్న కొన్ని కార్పొరేట్ కాలేజీల యాజమాన్యాలు
- కోర్టుకు వెళ్లాలని భావిస్తున్న పలువురు విద్యార్థుల తల్లిదండ్రులు



సాక్షి, హైదరాబాద్: ఎంబీబీఎస్, బీడీఎస్, బీఏఎంఎస్, బీయూఎంఎస్ తదితర మెడికల్ కోర్సుల్లో చేరేందుకు దేశవ్యాప్తంగా గత నెల 5న జరిగిన నీట్ ఎంట్రన్స్‌లో పలుచోట్ల గోల్‌మాల్ జరిగినట్లు ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి. పరీక్షా కేంద్రాల్లో కాపీయింగ్ జరిగినట్లు జోరుగా ప్రచారం జరుగుతోంది. మరోవైపు అనేక కార్పొరేట్ కాలేజీలు కూడా కాపీయింగ్ జరిగిందన్న అనుమానాలు వ్యక్తం చేస్తున్నాయి. ముఖ్యంగా ఉత్తరాది రాష్ట్రాల్లో నీట్ పరీక్ష సందర్భంగా పెద్ద ఎత్తున కాపీయింగ్ జరిగిందని పేర్కొంటున్నాయి. కొన్ని కాలేజీల్లో ఒకే విధమైన టాప్ మార్కులు పలువురికి రావడంపట్ల అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. ప్రతిసారీ తెలుగు రాష్ట్రాలకు జాతీయ స్థాయిలో టాప్ ర్యాంకులు వచ్చేవి. కానీ నేషనల్ టెస్టింగ్ ఏజెన్సీ (ఎన్‌టీఏ) విడుదల చేసిన ఫలితాల ప్రకారం ఈసారి టాప్ ర్యాంకులు పెద్దగా రాలేదు. గతేడాది దేశవ్యాప్తంగా నీట్‌లో 720కి 720 మార్కులు సాధించిన విద్యార్థులు ఇద్దరు ఉండగా ఈసారి 67 మంది ఉన్నారు. ఇంత మందికి నూరు శాతం మార్కులు రావడంపట్ల కూడా అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. ఉత్తరాదిలో ఒక సెంటర్‌లో ఒకే రూమ్‌లో రాసిన విద్యార్థుల్లో పక్కపక్కనే కూర్చున్న వారిలో 8 మందికి 720 మార్కులు రావడంపై విమర్శలు వస్తున్నాయి. ఇదేమీ యాదృచ్ఛికం కాదని అంటున్నారు. ఏదో గోల్‌మాల్ జరిగిందని అంటున్నారు.

720కి 717, 718, 719 మార్కులు ఎలా?

గతేడాది దేశవ్యాప్తంగా నీట్ పరీక్షకు 20.38 లక్షల మంది హాజరవగా ఈసారి 23.33 లక్షల మంది

మిగతా 3వ పేజీలో ▶

'సమ్మక్క' నుంచే అనుసంధానం?

- ఇచ్చంపల్లి వద్ద బ్యారేజీ నిర్మాణంపై కేంద్రం పునరాలోచన
- తెలంగాణ చేసిన ప్రతిపాదనలు పరిశీలిస్తున్న ఎన్‌డబ్ల్యూడీఏ
- 'సమ్మక్క' నీటి వినియోగంపై లెక్కలు కోరిన కేంద్రం - 3లో

'కొడంగల్' సామర్థ్యం పెంపు!

- 2.1 నుంచి 4.022 టీఎంసీల నిల్వకు వీలుగా చెరువుల అభివృద్ధి
- రూ.2,945.50 కోట్ల నుంచి రూ.4,350 కోట్లకు పెరిగిన అంచనా వ్యయం
- రాష్ట్ర ప్రభుత్వ నిర్ణయం.. త్వరలో టెండర్లకు ఆహ్వానం - 3లో

ఇంకా తేలని 'ఎమ్మెల్సీ' ఫలితం

- వరంగల్ – ఖమ్మం – నల్లగొండ పట్టభద్రుల ఉపఎన్నిక మొదటి ప్రాధాన్యతలో ఎవరికీ దక్కని గెలుపు
- ఆధిక్యంలో ఉన్నా సరిపడా ఓట్లు సాధించని తీన్మార్ మల్లన్న -2లో

9న మోదీ ప్రమాణ స్వీకారం

నేడు ఎన్డీఏ ఎంపీల భేటీ.. మోదీని తమ నేతగా ఎన్నుకోనున్న ఎంపీలు



పెద్ద శాఖలు ఇవ్వలేం!

- రక్షణ, ఆర్థిక, హోం, విదేశీ వ్యవహారాలు బీజేపీకే.. లోక్‌సభ స్పీకర్ పోస్టుపైనా ఇదే వైఖరి - 6లో

న్యూఢిల్లీ: నరేంద్ర మోదీ వరుసగా మూడోసారి ప్రధానమంత్రిగా ఆదివారం సాయంత్రం ప్రమాణ స్వీకారం చేయనున్నారు. బుధవారం ఎన్డీఏ పక్ష నేతలు సమావేశమై మోదీని తమ నేతగా ఎన్నుకున్న విషయం తెలిసిందే. కొత్తగా ఎంపికైన 293 మంది ఎన్డీఏ లోక్‌సభ సభ్యులు శుక్రవారం ఢిల్లీలో సమావేశం కానున్నారు. మోదీని తమ నేతగా ఎన్నుకోనున్నారు. ఈ భేటీ అనంతరం మోదీ తనకు మద్దతు తెలుపుతున్న ఎంపీల జాబితాను రాష్ట్రపతి ద్రౌపది ముర్ముకు సమర్పించి ప్రభుత్వ ఏర్పాటుకు సంసిద్ధత వ్యక్తం చేయనున్నారు. మోదీతో పాటు కూటమి సీనియర్ నేతలు చంద్రబాబు నాయుడు, నితీశ్ కుమార్ కూడా రాష్ట్రపతిని కలుస్తారని కూటమి వర్గాలు వెల్లడించాయి. ఎన్డీఏలోని పార్టీల అధ్యక్షులు కూడా మోదీకి మద్దతుగా రాష్ట్రపతికి లేఖలు సమర్పించనున్నారు.

ప్రమాణ స్వీకారానికి దేశాధినేతలు

బంగ్లాదేశ్, శ్రీలంక, మాల్దీవులు, భూటాన్, నేపాల్, మారిషస్, సీషెల్స్ దేశాధినేతలు ఆదివారం మోదీ ప్రమాణస్వీకారానికి హాజరయ్యే అవకాశాలున్నాయి. బంగ్లాదేశ్ ప్రధానమంత్రి షేక్ హసీనా,

మిగతా 2వ పేజీలో ▶

యథేచ్ఛగా హింస

- కఠిన చర్యలు తీసుకోండి.. గవర్నర్‌ను కోరిన వైఎస్సార్‌సీపీ
- సాక్ష్యాధారాలతో ఫిర్యాదు చేసిన పార్టీ నేతలు
- పోలీసులు ఏం చేస్తున్నారని గవర్నర్ విస్మయం

10లో



గవర్నర్‌కు ఫిర్యాదు చేసిన అనంతరం మీడియాతో మాట్లాడుతున్న వైఎస్సార్‌సీపీ నేతలు

టీడీపీ దాడులపై గవర్నర్ జోక్యం చేసుకోవాలి..

- అరాచకాలను అడ్డుకోవాలి
- టీడీపీ దాడులతో నష్టపోయిన ప్రతి కార్యకర్తకూ తోడుగా ఉంటాం
- సోషల్ మీడియా సైనికులకు అండగా నిలుస్తాం: వైఎస్సార్‌సీపీ అధ్యక్షుడు వైఎస్ జగన్ - 14లో

మా ప్రాణాలు కాపాడండి

- ఏపీలో వ్యవస్థీకృత హింసపై సుప్రీంను ఆశ్రయించిన బాధితులు
- ఎన్నికల అనంతరం రాష్ట్రంలో భయానక పరిస్థితులు
- వైఎస్సార్‌సీపీ మద్దతుదారులు, సానుభూతిపరులపై దాడులు
- సాక్ష్యాధారాలతో ఈ–మెయిల్ ద్వారా సీజేఐకి బాధితుల ఫిర్యాదు - 10లో

ఇదండీ సంగతి



మన అదృష్టం! 8మంది ఎమ్మెల్యేలే ఉన్నారు! ఇంకా ఎక్కువ మంది ఉంటే ఇంకా ఎక్కువ ఎంపీలు వచ్చేవి!!

వచ్చే అసెంబ్లీ ఎన్నికల్లో 88 స్థానాలు గెలుస్తాం

- కాంగ్రెస్ ప్రభుత్వం విశ్వాసం.. బీఆర్‌ఎస్ ఉనికి కోల్పోయాయి
- రాష్ట్ర బీజేపీ చరిత్రలో తొలిసారి గణనీయమైన సీట్లు సాధించాం
- ఢిల్లీలో మీడియాతో బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు కిషన్‌రెడ్డి



సాక్షి, న్యూఢిల్లీ: రానున్నరోజుల్లో రాష్ట్రంలో బలమైన రాజకీయశక్తిగా ఎదుగుతామని, అధికారంలోకి వచ్చేందుకు సమష్టిగా కృషి చేస్తామని బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు, కేంద్రమంత్రి కిషన్‌రెడ్డి అన్నారు. వచ్చే అసెంబ్లీ ఎన్నికల్లో 88 స్థానాల్లో విజయం సాధిస్తామని ఆయన ధీమా వ్యక్తం చేశారు. రాష్ట్రంలో రాజకీయ శూన్యత ఏర్పడిందని, ప్రజలు ప్రత్యామ్నాయశక్తిగా బీజేపీని చూస్తున్నారని తెలిపారు. గురువారం ఢిల్లీలో కిషన్‌రెడ్డి మీడియాతో మాట్లాడారు. ఆరునెలల్లోనే కాంగ్రెస్ ప్రభుత్వం ప్రజల విశ్వాసం, బీఆర్‌ఎస్ ఉనికి కోల్పోయాయని దుయ్యబట్టారు. ప్రజల గుండెచప్పుడైన సమస్యలపై కాంగ్రెస్ ప్రభుత్వాన్ని నిలదీస్తామన్నారు. ఉమ్మడి రాష్ట్రం నుంచి

మిగతా 2వ పేజీలో ▶

క్లుప్తంగా...

ఢిల్లీకి వెళ్లిన తెలంగాణ బీజేపీ ఎంపీలు

సాక్షి, న్యూఢిల్లీ: లోక్‌సభ ఎన్నికల్లో తాజాగా గెలుపొందిన 8 మంది తెలంగాణ బీజేపీ ఎంపీలు గురువారం ఢిల్లీకి చేరుకున్నారు. శుక్రవారం ఎన్డీఏ ఎంపీలు సమావేశం కానున్న నేపథ్యంలో బీజేపీ ఎంపీలు కిషన్‌రెడ్డి, డీకే అరుణ, బండి సంజయ్, ఈటల రాజేందర్, ధర్మపురి అర్వింద్, కొండా విశ్వేశ్వర్‌రెడ్డి, రఘునందన్‌రావు, గొడెం నగేష్ హస్తినకు చేరుకున్నారు. నేడు పార్లమెంటు భవనంలో ఉదయం 11గంటలకు జరగనున్న ఈ సమావేశంలో వీరు పాల్గొననున్నారు. ప్రధానిగా మోదీ ప్రమాణ స్వీకార కార్యక్రమంలో పాల్గొన్న తర్వాత వీరంతా తెలంగాణకు తిరిగి వెళ్లనున్నారు.

సోనియా తెలంగాణ తల్లా? బలి దేవతా?

రేవంత్‌ను ప్రశ్నించిన బీజేపీ ఎంపీ లక్ష్మణ్



సాక్షి, న్యూఢిల్లీ: సోనియా గాంధీని తెలంగాణ బలి దేవతగా అభివర్ణించిన సీఎం రేవంత్‌రెడ్డి.. ఆమెకు భక్తుడు ఎలా అయ్యారో రాష్ట్ర ప్రజలు తెలుసుకోవాలనుకుంటున్నారని బీజేపీ ఎంపీ కె.లక్ష్మణ్ ప్రశ్నించారు. ఇంతకు సోనియా గాంధీ తెలంగాణ తల్లా? బలి దేవతా? అని నిలదీశారు. గురువారం ఆయన ఢిల్లీలో మీడియా సమావేశంలో మాట్లాడుతూ.. ప్రజల దృష్టిని మళ్లించేందుకే తెలంగాణ తల్లి విగ్రహం, ఉత్సవాలు, అధికారిక చిహ్నం, గీతం పేరుతో వివాదాస్పద అంశాలను ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి తెరపైకి తెస్తున్నారని మండిపడ్డారు. కాంగ్రెస్ ఎన్ని కుట్రలు చేసినా రాష్ట్రంలో 8 ఎంపీ స్థానాలు గెలిచామన్నారు. రేపు రాష్ట్రాన్ని చేజిక్కించుకుంటామని ధీమా వ్యక్తం చేశారు. కేంద్ర మంత్రి పదవి రేసులో ఉన్నారా అన్న ప్రశ్నకు.. తాను ఎప్పుడూ ఏపదవికీ పోటీ పడలేదని, పార్టీ, ప్రధాని ఏ ఆదేశాలిచ్చినా శిరసావహిస్తానని లక్ష్మణ్ తెలిపారు.

బీఆర్‌ఎస్ కార్యకర్తలను మోసం చేసిన కేసీఆర్

కాంగ్రెస్ ఎమ్మెల్యే యెన్నం శ్రీనివాస్‌రెడ్డి



సాక్షి, హైదరాబాద్: తన కుటుంబాన్ని కాపాడుకోవడానికి మాజీ సీఎం కేసీఆర్ లక్షలాది మంది బీఆర్‌ఎస్ కార్యకర్తలను మోసం చేశారని మహబూబ్‌నగర్ కాంగ్రెస్ ఎమ్మెల్యే యెన్నం శ్రీనివాస్‌రెడ్డి విమర్శించారు. గాంధీభవన్‌లో గురువారం ఆయన మీడియాతో మాట్లాడు తూ బీజేపీ దగ్గర సుపారీ తీసుకున్న కేసీఆర్.. పార్లమెంటు ఎన్నికల్లో ఆ పార్టీకి బాహాటంగానే మద్దతు గా నిలిచారని ఆరోపించారు. అందుకే మహబూబ్‌నగర్ ఎంపీ నియోజకవర్గంలో కాంగ్రెస్ ఓడిపోయిందన్నారు. ఎవరు ఎన్ని కుట్రలు చేసినా అసెంబ్లీ ఎన్నిక ల్లో 65 స్థానాల్లో కాంగ్రెస్‌ను ప్రజలు గెలిపించారని, బీజేపీ రాముడి పేరు మీద ఓట్లు అడిగినప్పటికీ తమను ప్రజలు 8 ఎంపీ సీట్లలో గెలిపించారని పేర్కొన్నారు. అసెంబ్లీ ఎన్నికల కంటే పార్లమెంట్ ఎన్నికల్లో కాంగ్రెస్‌కు ఓట్ల శాతం పెరిగిందన్నారు. స్థానిక సంస్థల ఎన్నికల్లో కాంగ్రెస్‌కు 70 శాతం ఓట్లు వస్తాయన్నారు. కేసీఆర్ మద్దతుతోనే బీజేపీకి ఓటింగ్ పెరిగిందని అన్నారు.

బీఆర్‌ఎస్ ఓట్లతోనే బీజేపీకి ఎక్కువ ఎంపీ సీట్లు



సాక్షి, హైదరాబాద్: పార్లమెంట్ ఎన్నికల్లో బీఆర్‌ఎస్ ఓట్లతోనే బీజేపీకి 8 ఎంపీ సీట్లు వచ్చాయని టీపీసీసీ అధికార ప్రతినిధి చనగాని దయాకర్ ఆరోపించారు. గాంధీభవన్ గురువారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ... దేశవ్యాప్తంగా లేని మోదీ గాలి ఒక్క తెలంగాణలో ఎలా ఉంటుందని అడిగారు. బీఆర్‌ఎస్ ఓటు బ్యాంకును బీజేపీకి బదిలీ చేసిందే కేసీఆర్ అని అన్నారు. మోదీ కూటమిపై ప్రజలకు సరైన నమ్మకం లేదని, కూటమి ఎప్పుడు కూలుతుందోనని ప్రజలు గమనిస్తారన్నారు. వచ్చే స్థానిక సంస్థల ఎన్నికల్లో బీజేపీకి ఒక్క సర్పంచ్ సీటు కూడా రాదని ఎద్దేవా చేశారు. పదేళ్ల పాటు కేంద్రమంత్రిగా పని చేసిన కిషన్‌రెడ్డి రాష్ట్రానికి చేసింది శూన్యమన్నారు.

తెలంగాణ తల్లి జన్మదినంగా జరుపుకుంటే..

బీజేపీకి ఉలుకెందుకు?



సాక్షి, హైదరాబాద్: తెలంగాణ ఇచ్చిన సోనియాగాంధీ జన్మదినం రోజు డిసెంబర్ 9న తెలంగాణ తల్లి జన్మదినంగా జరుపుకుంటే తప్పేంటని, దీనిపై బీజేపీకి ఉలుకెందుకని టీపీసీసీ ఉపాధ్యక్షుడు జి.నిరంజన్ ప్రశ్నించారు. బీజేపీ పార్లమెంటరీ బోర్డు సభ్యుడు కె.లక్ష్మణ్ చేసిన వ్యాఖ్యలను గురువారం ఒక ప్రకటనలో ఆయన తీవ్రంగా ఖండించారు. అప్పటి యూపీఏ చైర్ పర్సన్‌గా సోనియా గాంధీ తీసుకున్న నిర్ణయం, పట్టుదల వల్లనే తెలంగాణ ఏర్పడిందని, ఆ మాత్రం కృతజ్ఞతాభావం ఉండకూడదా అని నిలదీశారు. రాష్ట్రం ఏర్పడిన జూన్ 2నే ఈ నిర్ణయం తీసుకుంటే బాగుండేదని, మాజీ సీఎం కేసీఆర్ తన పేరు ఎక్కడ మరుగున పడుతుందోనని సంకుచితబుద్ధితో వ్యవహరించారని విమర్శించారు.

ఇంకా తేలని ‘ఎమ్మెల్సీ’ ఫలితం

మొదటి ప్రాధాన్యతలో ఎవరికీ దక్కని గెలుపు

- ఆధిక్యంలో ఉన్నా సరిపడా ఓట్లు సాధించని తీన్మార్ మల్లన్న
- గెలవాలంటే కావాల్సిన ఓట్లు 1,55,095
- మల్లన్నకు 1,22,813 ఓట్లు.. రాకేశ్‌రెడ్డికి 1,04,248
- నేడు రెండో ప్రాధాన్యతలో వరంగల్ – ఖమ్మం – నల్లగొండ పట్టభద్రుల విజేత వెల్లడి



నల్లగొండ జిల్లా దుప్పలపల్లి గోదాములో కౌంటింగ్ నిర్వహిస్తున్న సిబ్బంది

సాక్షి ప్రతినిధి, నల్లగొండ: వరంగల్ – ఖమ్మం – నల్లగొండ పట్టభద్రుల ఎమ్మెల్సీ ఉప ఎన్నిక ఫలితం రెండో ప్రాధాన్యత ఓట్లతోనే తేలనుంది. మొదటి ప్రాధాన్యత ఓట్లలో గెలుపునకు సరిపడా ఓట్లు ఎవరికీ రాలేదు. కాంగ్రెస్ అభ్యర్థి తీన్మార్ మల్లన్నకు అత్యధిక ఓట్లు (1,22,813) వచ్చినా, 18,565 ఓట్ల ఆధిక్యంలో ఉన్నా.. గెలుపునకు సరిపడా ఓట్లు మాత్రం సాధించలేకపోయారు. గెలుపు కోసం 1,55,095 ఓట్లు సాధించాల్సి ఉంది. దీంతో గురువారం రాత్రి 10 గంటలకు ఎలిమినేషన్ ప్రక్రియ ద్వారా రెండో ప్రాధాన్యత ఓట్ల లెక్కింపు ప్రారంభించారు.

గెలుపెవరిదో?

హోరాహోరీగా సాగిన ఈ ఎన్నికల్లో గెలుపు ఎవరిదనే ఉత్కంఠ కొనసాగుతోంది. మొదటి ప్రాధాన్యతలో కాంగ్రెస్, బీఆర్‌ఎస్ అభ్యర్థుల మధ్య ఓట్ల తేడా 18,565 మాత్రమే ఉంది. తీన్మార్ మల్లన్న గెలవాలంటే రెండో ప్రాధాన్యత ఓట్లలో 32,282 ఓట్లు సాధించాల్సి ఉంది. బీఆర్‌ఎస్ అభ్యర్థి రాకేష్‌రెడ్డికి మొదటి ప్రాధాన్యతలో 1,04,248 ఓట్లు రాగా, ఆయన గెలవాలంటే 50,847 ఓట్లు రెండో ప్రాధాన్యతలో రావాల్సి ఉంది. అయితే కాంగ్రెస్, బీజేపీ, బీఆర్‌ఎస్ అభ్యర్థులతో పాటు స్వతంత్ర అభ్యర్థి అశోక్‌కు కూడా భారీగానే ఓట్లు లభించాయి. మొత్తం 52 మంది అభ్యర్థులలో ఈ నలుగురు అభ్యర్థులకు 3,00,071 ఓట్లు వచ్చాయి. మిగిలిన అభ్యర్థులందరికీ 10,118 ఓట్లు లభించాయి. ఇవన్నీ ఎలిమినేషన్‌లో క్రమంగా పోనున్నాయి. ఈ ఓట్లను లెక్కించినా గెలుపు టార్గెట్‌ను అభ్యర్థులు చేరుకునే అవకాశం లేదు. స్వతంత్ర అభ్యర్థి పాలకూరి అశోక్‌కు 29,697 మొదటి ప్రాధాన్యత ఓట్లు వచ్చాయి. ఆయన్ను ఎలిమినేట్ చేసి, ఆయనకు వచ్చిన రెండో ప్రాధాన్యత ఓట్లు లెక్కించినా గెలుపు కష్టంగానే కనిపిస్తోంది. చివరగా బీజేపీ అభ్యర్థి ఎలిమినేషన్ తరువాతే ఫలితం వెల్లడి కానుంది.

రెండు రోజులుగా కౌంటింగ్

ఈ ఉప ఎన్నిక కౌంటింగ్ ప్రక్రియ బుధవారం ఉదయం 8 గంటలకు ప్రారంభమైంది. మొత్తం ఓట్లు 4,63,839 కాగా, 3,36,013 ఓట్లు పోలయ్యాయి. ఆ రోజు సాయంత్రం 4 గంటల వరకు బ్యాలెట్ పత్రాలను బండిల్స్‌గా కట్టడానికే సరిపోయింది. సాయంత్రం 5 గంటలకు ప్రారంభమైన మొదటి ప్రాధాన్యత ఓట్ల లెక్కింపు గురువారం రాత్రి 9 గంటలకు పూర్తయింది. ఆ తరువాత గెలుపునకు టార్గెట్ 1,55,096 ఓట్లుగా నిర్ణయించారు. రెండో ప్రాధాన్యత ఓట్ల లెక్కింపు తర్వాత శుక్రవారం తుది ఫలితం తేలనుంది. ప్రస్తుతం ఓట్ల లెక్కింపు కొనసాగుతోంది. నాలుగు హాళ్లలో 96 టేబుళ్లపై కౌంటింగ్ నిర్వహిస్తున్నారు. ఒక్కో టేబుల్‌పై వేయి ఓట్ల చొప్పున గురువారం రాత్రి వరకు నాలుగు రౌండ్లలో 3,36,013 ఓట్లను లెక్కించారు. అందులో 3,10,189 ఓట్లు చెల్లినవిగా తేల్చారు. 25,824 చెల్లని ఓట్లుగా గుర్తించారు. ఈ లెక్కింపు ఒకటో రౌండ్ ఫలితం బుధవారం రాత్రి 12:45 గంటలకు వెలువడగా, రెండో రౌండ్ ఫలితం గురువారం మధ్యాహ్నం 12 గంటలకు వెల్లడైంది. మూడో రౌండ్ ఫలితం సాయంత్రం 5 గంటలకు వెల్లడించగా, 4వ రౌండ్ ఫలితం రాత్రి 9 గంటలకు వెల్లడైంది. ఈ ఎన్నికల్లో 52 మంది అభ్యర్థులు పోటీ చేయగా అందులో ప్రధానంగా కాంగ్రెస్, బీఆర్‌ఎస్, బీజేపీతోపాటు స్వతంత్ర అభ్యర్థి పాలకూరి అశోక్‌కు అధికంగా ఓట్లు పోలయ్యాయి. ఎన్నికల రిటర్నింగ్ అధికారి దాసరి హరిచందన నేతృత్వంలో సిబ్బందికి మూడు షిఫ్టులలో విధులు కేటాయించి కౌంటింగ్ నిర్వహిస్తున్నారు.

రౌండ్ వారీగా ఓట్ల వివరాలు..

అభ్యర్థి	రౌండ్-1	రౌండ్-2	రౌండ్-3,4	మొత్తం
తీన్మార్ మల్లన్న	36,210	34,574	52,029	1,22,813
ఏనుగుల రాకేశ్‌రెడ్డి	28,540	27,574	48,134	1,04,248
గుజ్జుల ప్రేమేందర్‌రెడ్డి	11,395	12,843	19,075	43,313
పాలకూరి అశోక్	9,109	11,214	9,374	29,697
చెల్లని ఓట్లు	7,728	7,398	10,698	25,824

జైమల్లన్న, జై రాకేశ్‌రెడ్డి, ఐ లవ్‌యూ

పట్టభద్రుల బ్యాలెట్ పేపర్‌పై నినాదాలు

- గ్రాడ్యుయేట్ ఓటర్ల అత్యుత్సాహం
- బ్యాలెట్ పేపర్‌పై ఓ అభ్యర్థి ఫొటో చించి తీసుకెళ్లిన ఓ ఓటరు
- ఇంకొందరు మొదటి ప్రాధాన్యత ఇవ్వకుండా ఇతర ప్రాధాన్యత ఓట్లు
- 25,824 ఓట్లు చెల్లుబాటుకానివిగా ప్రకటించిన ఎన్నికల అధికారులు

సాక్షి ప్రతినిధి, నల్లగొండ: పట్టభద్రుల ఎమ్మెల్సీ ఉపఎన్నికలో ఓటు వేసే సమయంలో కొందరు అత్యుత్సాహంతో నినాదాలు రాయగా, ఇంకొందరు ఇతర అభ్యర్థుల ఫొటోలు నలిపేయడం, బ్యాలెట్ పేపరు వెనుక అంకెలు వేయడం, మరి కొందరు ఐలవ్‌యూ అంటూ రాశారు.

చెల్లని ఓట్లు 7.69 శాతం

వరంగల్-ఖమ్మం-నల్లగొండ పట్టభద్రుల ఎమ్మెల్సీ ఉప ఎన్నికలో పోలైన ఓట్లలో 7.69% ఓట్లు చెల్లలేదని ఎన్నికల అధికారులు ప్రకటించారు. 4, 63,839 మంది గ్రాడ్యుయేట్లు ఓటు హక్కు కోసం నమోదు చేసుకున్నారు. వారిలో 3,36,013 మంది ఓటింగ్‌లో పాల్గొన్నారు. కొందరి అవగాహన రాహిత్యం, అత్యుత్సాహం కారణంగా 25, 824 వేల ఓట్లు చెల్లకుండా పోయాయి. 3,10,189 చెల్లిన ఓట్లుగా అధికారులు ప్రకటించారు. ఓట్ల లెక్కింపు సందర్భంగా ప్రతి రౌండ్‌లో అధిక సంఖ్యలో చెల్లుబాటుకాని ఓట్లు బయటపడ్డాయి. కొందరు తొలి ప్రాధాన్యత ఓట్లు వేయకుండా ఇతర ప్రాధాన్యత ఓట్లు వేయడం, టిక్కులు పెట్టడం చేశారు.

బ్యాలెట్ పేపరుపై ఇష్టానుసారంగా రాతలు

బ్యాలెట్‌పేపర్లపై ప్రాధాన్యతక్రమంలో అంకెలు మాత్రమే వేయాలి. ఇతర ఎలాంటి రాతలు రాయొద్దని ఎన్నికల అధికారులు పలుమార్లు చెప్పారు. అయినా అవేమీ పట్టించుకోకుండా బ్యాలెట్ పేపర్లపై కొందరు జైమల్లన్న, జైరాకేశ్‌రెడ్డి అంటూ రాశారు. ఓ పట్టభద్రుడైతే బ్యాలెట్ పేపర్‌లో ఉన్న అభ్యర్థి ఫొటో కట్ చేసుకుపోయాడు. మరికొందరు పట్టభద్రులు బ్యాలెట్ పేపర్ వెనుక అంకెలు వేయగా, మరికొందరు మొదటి ప్రాధాన్యత ఓటు వేయకుండా రెండో ప్రాధాన్యత ఓటు వేశారు. కొందరు పట్టభద్రులు ఒక అడుగు ముందుకేసి ఐలవ్‌యూ అంటూ రాసినట్టు తెలిసింది.

ఎమ్మెల్సీ ఓట్ల లెక్కింపులో అవకతవకలు

బీఆర్‌ఎస్ అభ్యర్థి రాకేశ్‌రెడ్డి ఆరోపణ



నల్లగొండ: వరంగల్-ఖమ్మం-నల్లగొండ పట్టభద్రుల ఎమ్మెల్సీ ఉపఎన్నిక ఓట్ల లెక్కింపులో అవకతవకలు జరుగుతున్నాయని బీఆర్‌ఎస్ అభ్యర్థి ఏనుగుల రాకేష్‌రెడ్డి ఆరోపించారు. 3వ రౌండ్‌లో తనకు మెజారిటీ ఉన్నా, కాంగ్రెస్ అభ్యర్థికి మెజారిటీ ఉందంటూ ప్రకటించారని, కౌంటింగ్‌పై తనకు అనుమానాలు ఉన్నాయన్నారు. నల్లగొండలో ఓట్ల లెక్కింపు కేంద్రం వద్ద రాకేష్‌రెడ్డి గురువారం మీడియాతో మాట్లాడారు. కౌంటింగ్ ఏకపక్షంగా చేస్తున్నారని ఆయన అభ్యంతరం వ్యక్తం చేశారు. కౌంటింగ్ ఏజెంట్ల సంతకాలు లేకుండానే 3వ రౌండ్ లీడ్‌ను ప్రకటించారని చెప్పారు. రిటర్నింగ్ అధికారి ప్రజాస్వామ్యబద్ధంగా వ్యవహరించడం లేదన్నారు. 3వ రౌండ్ ఫలితాలు అడిగితే బయటకు నెట్టివేశారని ఆవేదన వ్యక్తం చేశారు. తన గెలుపును అడ్డుకునే కుట్ర జరుగుతోందని, మళ్లీ లెక్కించాలని డిమాండ్ చేశారు. నల్లగొండ మాజీ ఎమ్మెల్యే భూపాల్‌రెడ్డి మాట్లాడుతూ రౌండ్ ఫలితాలు ప్రకటించే విషయంలో కౌంటింగ్ ఏజెంట్లకు చూపించకుండా ఏకపక్షంగా ప్రకటిస్తున్నారని అన్నారు. అడిగితే అనుమానం నివృత్తి చేయడం లేదని, రెండో ప్రాధాన్యత ఓట్ల లెక్కింపులో తారుమారు జరుగుతోందన్న అనుమానాలు ఉన్నాయని చెప్పారు.

ఎన్నికల కౌంటింగ్ పారదర్శకంగా సాగుతోంది

పట్టభద్రుల ఎమ్మెల్సీ ఉపఎన్నిక రిటర్నింగ్ అధికారి హరిచందన



నల్లగొండ: ఎన్నికల కౌంటింగ్ ప్రక్రియ పారదర్శకంగా సాగుతోందని పట్టభద్రుల ఎమ్మెల్సీ ఉపఎన్నిక రిటర్నింగ్ అధికారి, నల్లగొండ కలెక్టర్ దాసరి హరిచందన అన్నారు. గురువారం కౌంటింగ్ కేంద్రం వద్ద ఆమె మీడియాతో మాట్లాడారు. కౌంటింగ్ ప్రక్రియ సక్రమంగా జరగడం లేదని తనపై కొందరు ఆరోపణలు చేశారని, వాటిని నిరూపించాలన్నారు. ప్రతి టేబుల్ వద్ద హాలులో సీనియర్ అధికారులు, అసిస్టెంట్ రిటర్నింగ్ అధికారులు ధ్రువీకరించి పరిశీలించిన తర్వాత, ఏజెంట్లు సంతకాలు చేశాకే ఫలితం ప్రకటిస్తున్నామని చెప్పారు. చెల్లని ఓట్లు అధికంగా ఉండటం వల్ల.. అభ్యర్థుల సంఖ్య అధికంగా ఉండటం వల్లే కౌంటింగ్‌లో ఆలస్యమవుతుందన్నారు.

అధికారులపై ఆరోపణలు సరికాదు

కాంగ్రెస్ పార్టీ ఎమ్మెల్సీ అభ్యర్థి తీన్మార్ మల్లన్న



నల్లగొండ: ఎమ్మెల్సీ ఉపఎన్నికలో గట్టికే పరిస్థితి లేక.. కౌంటింగ్ హాల్ నుంచి ఉత్త చేతులతో పోవడం ఎందుకని, అధికారుల మీద మట్టిపోసి పోయే పనులు బీఆర్‌ఎస్ నేతలు చేస్తున్నారని కాంగ్రెస్ ఎమ్మెల్సీ అభ్యర్థి తీన్మార్ మల్లన్న మండిపడ్డారు. గురువారం నల్లగొండలో ఎమ్మెల్సీ ఎన్నికల ఓట్ల లెక్కింపు కేంద్రం వద్ద ఆయన మాట్లాడారు. బీఆర్‌ఎస్ ఎమ్మెల్సీ అభ్యర్థి రాకేశ్ రెడ్డి, మాజీ ఎమ్మెల్యే కంచర్ల భూపాల్‌రెడ్డిలు ఎన్నికల రిటర్నింగ్ అధికారిపై, జిల్లా అధికారులపై చేసిన ఆరోపణలను ఖండించారు. ఈ ఎన్నికలో రూ.100 కోట్లు ఖర్చుపెట్టి గెలుపొందాలని చేసిన ప్రయత్నం..బోగస్ ఓట్లతో లబ్ధిపొందాలనే కుతంత్రం బెడిసి కొట్టడంతో ఆరోపణలు చేస్తున్నారని ధ్వజమెత్తారు.

దక్షిణాది పుణ్యక్షేత్రాల సందర్శనకు ప్రత్యేక రైలు

22న సికింద్రాబాద్ నుంచి ప్రారంభం

సాక్షి, హైదరాబాద్: పుణ్యక్షేత్రాలు, ఆధ్యాత్మిక ప్రాంతాలకు ప్రత్యేకంగా ఏర్పాటు చేసే భారత్ గౌరవ్ రైళ్లకు యాత్రికుల నుంచి అనూహ్య స్పందన లభిస్తోంది. ఈ నేపథ్యంలో ఐఆర్‌సీటీసీ మరో భారత్ గౌరవ్ టూరిస్టు రైలును నడిపేందుకు ఏర్పాట్లు చేసింది. సికింద్రాబాద్ నుంచి జ్యోతిర్లింగసహిత దివ్యదక్షిణ యాత్ర కోసం ఈ ట్రైన్ ఏర్పాటు చేయనుంది. 9 రోజుల పర్యటనలో భాగంగా ఈ రైలు ఈ నెల 22న సికింద్రాబాద్ నుంచి ప్రారంభం కానుంది. దక్షిణాదిలోని తిరువణ్ణామలై (అరుణాచలం), రామేశ్వరం, మదురై, కన్యాకుమారి, త్రివేంద్రం, తిరుచ్చి, తంజావూరు వంటి దివ్యక్షేత్రాలను భక్తులు ఈ పర్యటనలో సందర్శించవచ్చు. ఈ రైలుకు సికింద్రాబాద్, కాజీపేట, వరంగల్, ఖమ్మం ,విజయవాడ, తెనాలి, ఒంగోలు, నెల్లూరు, గూడూరు, రేణిగుంట స్టేషన్లలో హాల్టింగ్ సదుపాయం ఉంది. ఈ నెల 22న మధ్యాహ్నం 12 గంటలకు సికింద్రాబాద్ నుంచి బయలుదేరే రైలు 30న తిరిగి సికింద్రాబాద్‌కు చేరుకోనుంది. అన్ని సదుపాయాలతో కలిపి స్లీపర్ క్లాస్‌లో అయితే ఒక్కొక్కరికీ రూ. 14,250, థర్డ్ ఏసీ రూ. 21,900, సెకండ్ ఏసీ రూ. 28,450 చొప్పున చార్జీలు వసూ లు చేయనున్నారు.

8న అయోధ్య రైలు...

రైల్వేశాఖ ఏర్పాటు చేసే 19వ అయోధ్య-కాశీ పుణ్యక్షేత్ర యాత్ర భారత్‌గౌరవ్ రైలు ఈ నెల 8న సికింద్రాబాద్ నుంచి బయలుదేరనుంది. ఇప్పటికే ఈ రైల్లో వంద శాతం సీట్లన్నీ బుక్ అయ్యాయి. 726 మంది పర్యాటకులు అయోధ్య, కాశీ యాత్రకు వెళ్లనున్నారు. కొత్తగా నిర్మించిన రామజన్మభూమి, జ్యోతిర్లింగాలలో ఒకటైన కాశీ విశ్వనాథ్ ఆలయాలను దర్శించుకోనున్నారు.

లోక్‌సభ ఎన్నికల కోడ్ ఎత్తివేత

మూడు జిల్లాల్లో ఎమ్మెల్సీ ఎన్నికల కోడ్ కొనసాగింపు

సాక్షి, హైదరాబాద్: లోక్‌సభ సాధారణ ఎన్నికల ప్రవర్తన నియమావళిని కేంద్ర ఎన్నికల సంఘం గురువారం ఎత్తివేసింది. అయితే వరంగల్-ఖమ్మం -నల్లగొండ పట్టభద్రుల ఎమ్మెల్సీ స్థానానికి ఉప ఎన్నికల ప్రక్రియ కొనసాగుతుండటంతో ఈ మూడు ఉమ్మడి జిల్లాల్లో మాత్రం ఇంకా ఎమ్మెల్సీ ఎన్నికల కోడ్ కొనసాగనున్నట్లు సీఈసీ తెలిపింది. మిగిలిన జిల్లాల్లో ప్రభుత్వ పాలన వ్యవహారాలు యథావిధిగా కొనసాగుతాయని వెల్లడించింది. కాగా, ఎమ్మెల్సీ ఎన్నికల ఫలితాలు ప్రకటించిన తర్వాత ఈ మూడు జిల్లాల్లో ఎన్నికల కోడ్ అమలు ముగియనుంది.

ఎస్సీల పథకాలపై శ్వేతపత్రం విడుదల చేయాలి

సెంటర్ ఫర్ బెటర్ ఇండియా రీసెర్చ్ ఫౌండేషన్ డిమాండ్

సాక్షి, హైదరాబాద్: తెలంగాణలో దళితుల కోసం అమలు చేసిన సంక్షేమ పథకాలకు సంబంధించిన వివరాలతో శ్వేతపత్రం విడుదల చేయాలని సెంటర్ ఫర్ బెటర్ ఇండియా రీసెర్చ్ ఫౌండేషన్ డైరెక్టర్ మామిడి నారాయణ రాష్ట్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ప్రత్యేక రాష్ట్రం ఏర్పాటైనప్పటి నుంచి ఇప్పటివరకు ప్రతి శాఖ ద్వారా మాల, మాదిగ, ఇతర ఉపకులాలకు అమలు చేసిన పథకాలు, లబ్ధిదారుల వివరాలతో కూడిన శ్వేతపత్రాన్ని ఇవ్వాలన్నారు. బీఆర్‌ఎస్ ప్రభుత్వంలో ఎస్సీ కార్పొరేషన్ రుణాలు, దళిత బంధు, మూడెకరాల భూపంపిణీ, అంబేడ్కర్ ఓవర్సీస్ స్కీం తదితర పథకాల ద్వారా ఎంత మంది లబ్ధి పొందారో చెప్పాలన్నారు. గురువారం సుందరయ్య విజ్ఞాన కేంద్రంలో ఎస్సీ కులాల సంక్షేమ పథకాలు- వాటాలు- వాస్తవాలు అనే అంశంపై జరిగిన రౌండ్ టేబుల్ సమావేశంలో ఆయన మాట్లాడారు. ఈ పదేళ్ల కాలంలో దళితులకు కలిగిన ప్రయోజనాలు ఏమిటో చెప్పాల్సిన అవసరం ఉందన్నారు. ఎస్సీ ఉపకులాల మధ్య ప్రభుత్వ పథకాల ప్రయోజనం విషయంలో అనేక అపోహలున్నాయని, వాటిని నివృత్తి చేయవలసిన బాధ్యత ప్రభుత్వానికి ఉందన్నారు. ఈ సమావేశంలో మంచాల లింగస్వామి, ప్రొఫెసర్ పట్టా వెంకటేశ్వర్లు, మాల సంక్షేమ సంఘం అధ్యక్షుడు బత్తుల రాంప్రసాద్, మాల విద్యావంతుల వేదిక అధ్యక్షుడు డాక్టర్ నిమ్మ బాబూరావు, ఆల్ మాల స్టూడెంట్స్ అసోసియేషన్ రాష్ట్ర కార్యదర్శి రాహుల్, సమతా సైనిక్ దళ్ నాయకుడు దుబ్బాక నవీన్, దళిత బహుజన ఫ్రంట్ నాయకుడు పులి నవీన్‌తోపాటు 11 సంఘాల ప్రతినిధులు పాల్గొన్నారు.

మల్లికార్జున ఖర్గేతో ఎంపీ మల్లు రవి భేటీ



సాక్షి, న్యూఢిల్లీ: నాగర్‌కర్నూల్ ఎంపీగా ఎన్నికైన కాంగ్రెస్ సీనియర్ నేత డా.మల్లు రవి ఏఐసీసీ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గేతో భేటీ అయ్యారు. గురువారం సాయంత్రం ఢిల్లీలోని రాజాజీ మార్గ్‌లోని ఖర్గే నివాసంలో ఆయనను కలసి తనకు కాంగ్రెస్ టికెట్ కేటాయించినందుకు కృతజ్ఞతలు తెలిపారు. ఈ సందర్భంగా ఖర్గే.. తెలంగాణలో ఎన్నికలు జరిగిన తీరుపై ఆరా తీశారు. బీజేపీ గెలిచిన 8 స్థానాలలో బీఆర్‌ఎస్ పార్టీ అభ్యర్థులు వారికి మద్దతిచ్చారని మల్లు రవి వివరించారు. 7 స్థానాలలో బీఆర్‌ఎస్ అభ్యర్థులు డిపాజిట్లు పోగొట్టుకున్నారని తెలిపారు. కాంగ్రెస్ పార్టీ నుంచి ఎన్నికైన 8 మంది ఎంపీల్లో నలుగురు ఎంపీలు ఎస్సీ/ఎస్టీ రిజర్వ్‌డ్ స్థానాలకు చెందిన వారేనని ఖర్గేకు మల్లు రవి తెలిపారు. అనంతరం మల్లు రవి కాంగ్రెస్ పార్టీ ప్రధాన కార్యదర్శి కేసీ వేణుగోపాల్‌ను కలిశారు.

ఓట్ల లెక్కింపులో బీఆర్‌ఎస్‌కు అన్యాయం: కౌశిక్‌రెడ్డి

సాక్షి, హైదరాబాద్: పట్టభద్రుల ఎమ్మెల్సీ ఉపఎన్నిక ఓట్ల లెక్కింపులో తమ పార్టీ అభ్యర్థికి తీవ్ర అన్యాయం జరుగుతోందని ఎన్నికల సంఘానికి బీఆర్‌ఎస్ ఫిర్యాదు చేసింది. నల్లగొండ, ఖమ్మం, వరంగల్ పట్టభద్రుల ఉపఎన్నిక ఓట్ల లెక్కింపులో అవకతవకలపై సీఈఓ వికాస్‌రాజ్‌కు ఈ మేరకు గురువారం ఎమ్మెల్యే కౌశిక్‌రెడ్డి, లీగల్ సెల్ సభ్యురాలు లలితారెడ్డి ఫిర్యాదుపత్రం అందజేశారు. ఓట్ల లెక్కింపులో మూడో రౌండ్‌లో 533, నాలుగో రౌండ్‌లో 170 పైచిలుకు ఓట్ల లీడ్ బీఆర్‌ఎస్‌కు వచ్చిందన్నారు. కానీ, బీఆర్‌ఎస్ అభ్యర్థి రాకేశ్‌రెడ్డికి వచ్చిన ఈ ఆధిక్యాన్ని కాంగ్రెస్ అభ్యర్థి తీన్మార్ మల్లన్న ఖాతాలో చూపిస్తున్నారని ఫిర్యాదులో పేర్కొన్నారు. ఓటమి భయంతోనే కాంగ్రెస్ పార్టీ ఈ తరహా చర్యలకు పాల్పడుతోందని వారు ఆరోపించారు.

9న మోదీ ప్రమాణ స్వీకారం

▶ మొదటి పేజీ తరువాయి

శ్రీలంక అధ్యక్షుడు రణిల్ విక్రమసింఘే, నేపాల్ ప్రధాని ప్రచండ, మాల్దీవుల అధ్యక్షుడు మొహమ్మద్ ముయిజ్జు, భూటాన్ ప్రధాని తెర్సింగ్ టోబ్గే, మారిషస్ ప్రధాని ప్రవింద్ జుగ్‌నాథ్, సీషెల్స్ అధ్యక్షుడు వావెల్ రామ్‌కలవాన్‌లకు భారత్ ఇప్పటికే ఆహ్వానాలు పంపింది. మాల్దీవులతో భారత్ సంబంధాలు బెడిసికొట్టిన నేపథ్యంలో ఆ దేశాధ్యక్షుడు ముయిజ్జును మోదీ ఆహ్వానించడం విశేషం.

జిల్లాకో నోడల్ ఆఫీసర్

గ్రూప్-1 పరీక్షల నిర్వహణపై సీఎస్ వీడియో కాన్ఫరెన్స్

- 4.03 లక్షల మంది విద్యార్థులు హాజరయ్యే అవకాశం
- 897 కేంద్రాల్లో ఏర్పాట్లు పక్కాగా చేయాలి
- 20 పరీక్షా కేంద్రాలకో రీజినల్ కోఆర్డినేటర్



వీడియో కాన్ఫరెన్స్‌లో మాట్లాడుతున్న సీఎస్ శాంతికుమారి

సాక్షి, హైదరాబాద్: గ్రూప్-1 ఉద్యోగాల భర్తీ ప్రక్రియలో భాగంగా ఈ నెల 9న నిర్వహించనున్న ప్రిలిమినరీ పరీక్షను ఎలాంటి అవాంతరాలు లేకుండా సజావుగా నిర్వహించాలని రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి శాంతికుమారి జిల్లా కలెక్టర్లను ఆదేశించారు. ఈ పరీక్షకు 4.03 లక్షల మంది విద్యార్థులు హాజరు కానున్నారని, పరీక్షల నిర్వహణలో భాగంగా జిల్లా అదనపు కలెక్టర్లతో పాటు ఒక పోలీసు ఉన్నతాధికారిని కూడా నోడల్ ఆఫీసర్‌గా నియమిస్తున్నట్లు తెలిపారు. అదేవిధంగా 20 పరీక్షా కేంద్రాలకు ఒక రీజినల్ కో ఆర్డినేటర్‌ను కూడా నియమించినట్లు చెప్పారు. రాష్ట్రవ్యాప్తంగా 31 జిల్లాల్లోని 897 పరీక్షా కేంద్రాల్లో ఏర్పాట్లు పక్కాగా చేయాలన్నారు. టీజీపీఎస్సీ నిర్వహిస్తున్న ఈ పరీక్షల ఏర్పాట్లతో పాటు విత్తనాలు, ఎరువుల సరఫరా, మిషన్ భగీరథ, గ్రామాల్లో ఇంటింటి సర్వే, జిల్లాల్లో పాఠశాలలకు స్కూల్ యూనిఫాంల పంపిణీ తదితర అంశాలపై సీఎస్ గురువారం సచివాలయం నుంచి వీడియో కాన్ఫరెన్స్‌ని ర్వహించారు. గ్రూప్- 1 పరీక్షల ఏర్పాట్లను టీజీపీఎస్సీ చైర్మన్ ఎం.మహేందర్‌రెడ్డిని అడిగి తెలుసుకున్నారు. పరీక్షలు ప్రశాంతంగా నిర్వహించేందుకు, క్షేత్రస్థాయి పరిస్థితిని నిశితంగా పరిశీలించేందుకు జిల్లా వ్యాప్తంగా పోలీసు, ఇతర అధికారులతో తక్షణమే సంయుక్త సమావేశం ఏర్పాటు చేయాలని కలెక్టర్లను ఆదేశించారు.

విత్తనాల బ్లాక్ మార్కెటింగ్‌పై నిఘా

బ్లాక్ మార్కెటింగ్, విత్తనాల నిల్వలను అరికట్టడంలో చర్యలు తీసుకున్నందుకు జిల్లాల కలెక్టర్లను సీఎస్ అభినందించారు. రానున్న మూడు వారాల పాటు నిఘా కొనసాగించాలన్నారు. రాష్ట్రంలో సరిపడా విత్తనాలు, ఎరువులు అందుబాటులో ఉన్నాయని, ప్యాక్ చేసిన విత్తనాలను మాత్రమే కొనుగోలు చేసేలా రైతులకు అవగాహన కల్పించాలని సూచించారు. కేంద్ర గోడౌన్ల నుంచి మండల స్థాయి గోడౌన్ల వరకు ఎరువుల తరలింపును పర్యవేక్షించి సక్రమంగా అందేలా చూడాలని, పోలీసు, రెవెన్యూ, వ్యవసాయ శాఖలు సమన్వయంతో పని చేసి పరిస్థితులను పర్యవేక్షించాలని ఆదేశించారు.

ప్రతి విద్యార్థికీ కనీసం జత యూనిఫాం

గ్రామీణ ప్రాంతాల్లోని ప్రతి ఇంటికి కుళాయి కనెక్షన్ ఉందా? లేదా అనే విషయాన్ని నిర్ణీత గడువులోగా సర్వే చేయాలని కలెక్టర్లను సీఎస్ ఆదేశించారు. జూన్ 12న పాఠశాలలు ప్రారంభించే నాటికి ప్రతి విద్యార్థికి కనీసం ఒక జత స్కూల్ యూనిఫాం అందేలా చర్యలు తీసుకోవాలన్నారు. ఈ కాన్ఫరెన్స్‌లో డీజీపీ రవిగుప్తా, పురపాలన, పట్టణాభివృద్ధి శాఖ ముఖ్య కార్యదర్శి దానకిశోర్, పంచాయతీ రాజ్, గ్రామీణాభివృద్ధి శాఖల ముఖ్య కార్యదర్శి సందీప్ కుమార్ సుల్తానియా, వ్యవసాయ శాఖ కార్యదర్శి రఘు నందన్ రావు, పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి శాఖ కమిషనర్ అనితా రామచంద్రన్, మున్సిపల్ అడ్మినిస్ట్రేషన్ కమిషనర్ దివ్య, టీజీపీఎస్సీ కార్యదర్శి నవీన్ నికొలస్, ఇతర అధికారులు పాల్గొన్నారు.

వచ్చే అసెంబ్లీ ఎన్నికల్లో 88 స్థానాలు గెలుస్తాం

▶ మొదటి పేజీ తరువాయి

చూస్తే.. ఇప్పటి వరకు బీజేపీ తొలిసారి గణనీయమైన స్థానాలు సాధించిందని తెలిపారు.

కాంగ్రెస్ తొండిఆట ఆడింది

బీజేపీ మూడోసారి గెలిస్తే రాజ్యాంగం రద్దు చేస్తారని, రిజర్వేషన్లు తొలగిస్తారని అసత్య ప్రచారం చేసి ఎన్నికల్లో కాంగ్రెస్‌పార్టీ తొండిఆట ఆడిందని కిషన్‌రెడ్డి అన్నారు. అమిత్‌షా వీడియోను మార్ఫింగ్ చేసి దిగజారుడు రాజకీయాలు చేసిందని మండిపడ్డారు. ఇంత చేసినా ప్రజలు బీజేపీ వైపే మొగ్గుచూపారని చెప్పారు. ప్రజలను మోసం చేయడం కాంగ్రెస్ పార్టీకి అలవాటే అని అన్నారు. ఆ పార్టీ మోసాలను ఎండగతామని, ఈ దిశగా ప్రత్యేక కార్యాచరణతో ముందుకెళతామని తెలిపారు.

బెదిరించినా, భయపెట్టినా విజయం సాధించాం

లోక్‌సభ ఎన్నికల్లో సీఎం రేవంత్‌రెడ్డి బెదిరింపులకు పాల్పడినా, భయపెట్టినా ఆయన సొంత జిల్లాతో పాటు, మల్కాజిగిరిలోనూ బీజేపీ విజయం సాధించిందని కిషన్‌రెడ్డి తెలిపారు. మాజీ సీఎం కేసీఆర్ సొంత జిల్లా, బీఆర్‌ఎస్‌కు కంచుకోటలాంటి మెదక్‌లో కోట్ల రూపాయలు ఖర్చు చేసినా బీజేపీ అభ్యర్థి రఘునందన్‌రావు విజయం సాధించారని చెప్పారు. తెలంగాణలో జరిగిన లోక్‌సభ ఎన్నికల్లో 47 అసెంబ్లీ నియోజకవర్గాల్లో బీజేపీకి ఆధిక్యం ప్రదర్శించిందన్నారు. గత అసెంబ్లీ ఎన్నికల్లో ఓట్ల శాతం 39 కాగా.. ఇప్పుడు 40 శాతానికి పెరిగిందని చెప్పారు. ఈ ఎన్నికలు ఆరు నెలల పాలనకు రెఫరెండంగా ప్రకటించుకున్న కాంగ్రెస్ పార్టీ ఒక్క శాతం ఓట్లు మాత్రమే అదనంగా సాధించిందని తెలిపారు. లోక్‌సభ ఎన్నికల్లో 8 చోట్ల గెలిచి 6 చోట్ల రెండో బలమైన ప్రత్యామ్నాయంగా నిలిచామని చెప్పారు. సికింద్రాబాద్‌లో కాంగ్రెస్ గుర్తుపై మజ్లిస్ పోటీ చేసినట్టు ఉందని, నాంపల్లి నియోజకవర్గాన్ని గమనిస్తే ఈ విషయం స్పష్టమవుతుందని కిషన్‌రెడ్డి ఆరోపించారు.

రామమందిరం రాజకీయ అంశం కాదు

దేశంలో చేపట్టిన అభివృద్ధి, సంక్షేమ పథకాల ఆధారంగానే బీజేపీ ఎన్నికలకు వెళ్లిందని, రామమందిరం రాజకీయ అంశం కాదని కిషన్‌రెడ్డి స్పష్టం చేశారు. ప్రభుత్వంలో ఉన్నా లేకున్నా పార్టీ బాధ్యతలు నిర్వర్తిస్తానని తెలిపారు. భిన్న సంస్కృతులు, భిన్న భాషలకు నిలయమైన దేశంలో హ్యాట్రిక్ విజయం సాధించి మూడో సారి బీజేపీ అధికారంలోకి రావడం చాలా గొప్ప విషయం అన్నారు. ప్రధానిగా ప్రమాణ స్వీకారం చేయబోతున్న మోదీకి కిషన్‌రెడ్డి శుభాకాంక్షలు తెలిపారు. ఏపీలో ఎన్డీఏ కూటమి విజయం సాధించడంపై హర్షం వ్యక్తం చేశారు. చంద్రబాబు నాయుడు, పవన్ కల్యాణ్, పురందేశ్వరిలకు శుభాకాంక్షలు తెలిపారు.

క్లుప్తంగా...

నేటి నుంచి ప్రజావాణి పునః ప్రారంభం

సాక్షి, హైదరాబాద్: ప్రజావాణి అర్జీల స్వీకరణ కార్యక్రమం శుక్రవారం నుంచి పునః ప్రారంభం కానున్నట్లు ప్రజావాణి ఇన్‌చార్జి, రాష్ట్ర ప్రణాళికా సంఘం వైస్ చైర్మన్ డాక్టర్ జి.చిన్నారెడ్డి తెలిపారు. దేశంలో లోక్‌సభ ఎన్నికల మోడల్ కోడ్ ఆఫ్ కండక్ట్ అమలులో ఉన్నందున ప్రజావాణి అర్జీల కార్యక్రమం గత కొంత కాలంగా తాత్కాలికంగా నిలిచిపోయిందని తెలిపారు. ఎన్నికల కోడ్ ముగిసిన నేపథ్యంలో ప్రజావాణి అర్జీల స్వీకరణ కార్యక్రమం మహాత్మా జ్యోతిబా పూలే ప్రజాభవన్‌లో యథావిధిగా ప్రతి మంగళ, శుక్ర వారాల్లో కొనసాగుతుందని చిన్నారెడ్డి వివరించారు. ఈ శుక్రవారం ప్రజావాణి కోసం అన్ని ఏర్పాట్లు చేసినట్లు తెలిపారు. ఈ అవకాశాన్ని ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని, ప్రజలు తమ సమస్యలను అర్జీల ద్వారా ప్రజావాణిలో అందజేయాలని చిన్నారెడ్డి కోరారు. ప్రజావాణి స్టేట్ నోడల్ అధికారిగా రాష్ట్ర మున్సిపల్ డైరెక్టర్ దివ్య వ్యవహరిస్తున్నారు.

అభివృద్ధి పనులకు ప్రతిపాదనలు సిద్ధం చేయండి

అధికారులకు మంత్రి సీతక్క ఆదేశం



సాక్షి, హైదరాబాద్: పంచాయతీలు, గ్రామీణ స్థానిక సంస్థలలో వివిధ అభివృద్ధి పనుల కోసం ప్రతిపాదనలు సిద్ధం చేయాలని అధికారులను పంచాయతీరాజ్, మహిళా శిశుసంక్షేమ శాఖ మంత్రి ధనసరి అనసూయ (సీతక్క) ఆదేశించారు. పంచాయతీల మౌలిక సదుపాయాల కోసం కొత్త పనులకు ప్రతిపాదనలు పంపాలని, పాడైన రోడ్లకు మరమ్మతులు, కొత్త రోడ్ల నిర్మాణం వంటి అంశాలపై అంచనాలు తయారు చేయాలని చెప్పారు. ఇంకా పూర్తి చేయాల్సిన పనుల్లో నాణ్యత పెంచే విధంగా చర్యలతో పాటు వాటిని త్వరితగతిన పూర్తి చేయాలని ఆదేశాలిచ్చారు. పనుల్లో నాణ్యత లోపిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. క్రెడిట్ రిజర్వ్ రేషియో (సీఆర్ఆర్) తదితర నిధులు ఉపయోగించి గ్రామీణ రహదారుల అభివృద్ధి కోసం కృషి చేయాలని పేర్కొన్నారు. గురువారం సచివాలయంలో పంచాయతీరాజ్ శాఖ, గ్రామీణ రహదారుల అభివృద్ధిపై అధికారులతో మంత్రి సమీక్ష నిర్వహించారు. ఈ సమావేశంలో పంచాయితీరాజ్ ఈఎన్సీ, ఇతర అధికారులు పాల్గొన్నారు.

కేసీఆర్‌ను కలిసిన నలుగురు ఎమ్మెల్యేలు

సాక్షి,హైదరాబాద్: బీఆర్ఎస్ అధినేత, మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్‌ను ఆ పార్టీకి చెందిన నలుగురు ఎమ్మెల్యేలు గురువారం కలిశారు. ఎర్రవెల్లిలోని కేసీఆర్ ఫాంహౌజ్‌లో మాజీమంత్రి మల్లారెడ్డితోపాటు ఉప్పల్, మల్కాజిగిరి, ఎల్బీనగర్ ఎమ్మెల్యేలు బండారి లక్ష్మారెడ్డి, మర్రి రాజశేఖర్ రెడ్డి, దేవిరెడ్డి సుధీర్‌రెడ్డి కలిసి కొద్దిసేపు మాట్లాడారు. మల్కాజిగిరిలో బీఆర్ఎస్ ఓటమికి గల కారణాలను వివరించినట్లు సమాచారం.

జీవో 317 బాధితులకు న్యాయం చేయాలి

సాక్షి, హైదరాబాద్: జీవో నంబర్ 317 బాధితులకు న్యాయం చేయాలని ప్రభుత్వాన్ని వీఆర్వో తెలంగాణ వ్యవస్థాపక అధ్యక్షుడు హర్షవర్ధన్‌రెడ్డి, రాష్ట్ర అధ్యక్షుడు ఉమాకర్‌రెడ్డి కోరారు. ఈ మేరకు గురువారం సీఎం రేవంత్‌రెడ్డి, 317 కేబినెట్ సబ్ కమిటీ సభ్యుడు, మంత్రి పొన్నం ప్రభాకర్‌ను కలిసి వినతిపత్రం సమర్పించారు. దీనిపై సీఎం రేవంత్, మంత్రి పొన్నం సానుకూలంగా స్పందించారని తెలిపారు.

వరి ఎగుమతులతో రైతులకు లాభాలు

- ప్రపంచ వరి సదస్సుతో ఎన్నో ఉపయోగాలు: మంత్రి తుమ్మల



సాక్షి, హైదరాబాద్: విదేశాలకు వరి ఎగుమతులతో మన రైతాంగానికి సరైన ధరతో పాటు పెద్దమొత్తంలో ఉన్న మార్కెట్ నిల్వల సమస్య కూడా పరిష్కరించుకోవచ్చని రాష్ట్ర వ్యవసాయ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు అభిప్రాయపడ్డారు. తెలంగాణ లాంటి వరి మిగులు రాష్ట్రాలకు ధాన్యాన్ని ఇతర దేశాలకు ఎగుమతి చేసే అవకాశాలు చాలా ఉన్నాయని, వీటిని వినియోగించుకోవడంలో మనం ఇప్పటికీ వెనకబడి ఉన్నామని పేర్కొన్నారు. శుక్రవారం నిర్వహించనున్న ప్రపంచ వరి సదస్సు ఎంతో ఉపయోగపడుతుందని గురువారం ఓ ప్రకటనలో తెలిపారు. 22 సంవత్సరాల నుంచి అంతర్జాతీయ కమోడిటీ సంస్థ ప్రతి సంవత్సరం ఒక్కో దేశంలో ప్రపంచ వరి సదస్సును నిర్వహిస్తోంది. వరికి సంబంధించిన ఎగుమతి, దిగుమతిదారులతో పాటు ప్రముఖ వరి శాస్త్రవేత్తలు, ప్రముఖులను ఒక గొడుగు కిందకి తీసుకువచ్చి వరి అభివృద్ధికి కావాల్సిన విధానపరమైన అంశాలను ఈ సదస్సులో చర్చిస్తారు. సదస్సులో దాదాపు 150 మంది విదేశీ వరిధాన్యం ఎగుమతిదారులు, అంతర్జాతీయ వరి పరిశోధన సంస్థ (ఫిలిప్పీన్స్) నుంచి ప్రముఖ వరి శాస్త్రవేత్తలు పాల్గొంటున్నారు. వీరితో పాటు రాష్ట్రంలోని అభ్యుదయ రైతులు, రైస్ మిల్లర్లు, వరి విత్తన కంపెనీ ప్రతినిధులు కూడా హాజరవుతున్నారు. సదస్సులో ఫెడరేషన్ ఆఫ్ తెలంగాణ ఛాంబర్స్ ఆఫ్ కామర్స్, ఇండస్ట్రీస్ కూడా భాగస్వామ్యం పంచుకుంటుందని మంత్రి తెలిపారు. సదస్సులో పౌరసరఫరాల శాఖ మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి పాల్గొననున్నట్టు ఆయన చెప్పారు.

‘సమ్మక్క’ నుంచే అనుసంధానం?



ఇచ్చంపల్లి వద్ద బ్యారేజీ నిర్మాణంపై కేంద్రం పునరాలోచన

- తెలంగాణ చేసిన ప్రతిపాదనలు పరిశీలిస్తున్న ఎన్‌డబ్ల్యూడీఏ
- ‘సమ్మక్క’నీటి వినియోగంపై లెక్కలు కోరిన కేంద్రం

సాక్షి, హైదరాబాద్: గోదావరి -కావేరీ నదుల అనుసంధానం ప్రాజెక్టులో భాగంగా ఇచ్చంపల్లి వద్ద బ్యారేజీ కడితే, దానికి దిగువన తమ రాష్ట్రానికి ఉన్న 158 టీఎంసీల నీటి అవసరాలకు నష్టం కలుగుతుందని తెలంగాణ చేసిన అభ్యంతరాలతో నేషనల్‌వాటర్ డెవలప్‌మెంట్ ఏజెన్సీ(ఎన్‌డబ్ల్యూడీఏ) పునరాలోచనలో పడింది. తమ రాష్ట్రం నిర్మించిన సమ్మక్క బ్యారేజీ నుంచే నీటిని తరలించాలని తెలంగాణ చేసిన ప్రతిపాదనలను పరిశీలిస్తోంది. ఇచ్చంపల్లికి దిగువన ఉన్న ప్రాజెక్టులైన దేవాదులకు 38 టీఎంసీలు, సీతారామకు 70 టీఎంసీలు, తుపాకులగూడెంకు 50 టీఎంసీలు కలిపి మొత్తం 158 టీఎంసీలు తమకు అవసరమని తెలంగాణ వాదిస్తోంది. ఈ నేపథ్యంలో సమ్మక్క సాగర్ బ్యారేజీకి ఎగువన కాళేశ్వరం ఎత్తిపోతల పథకంలో భాగంగా కట్టిన మేడిగడ్డ బ్యారేజీ నుంచి ఏ మేరకు నీటిని పంపింగ్ చేయనున్నారు? సమ్మక్క సాగర్ నుంచి దేవాదుల ఎత్తిపోతల పథకానికి, శ్రీరాంసాగర్ రెండో దశ ప్రాజెక్టుకు తరలించనున్న నీటి లెక్కలతో పాటు సీతారామ ఎత్తిపోతల పథకం ద్వారా తరలించనున్న 70 టీఎంసీల నీటి వినియోగం లెక్కలు అందించాలని ఎన్‌డబ్ల్యూడీఏ తాజాగా రాష్ట్ర ప్రభుత్వాన్ని కోరింది. ఈ లెక్కల ఆధారంగా సిమ్యులేషన్ స్టడీస్ నిర్వహించి ఇచ్చంపల్లి వద్ద బ్యారేజీ నిర్మాణం విషయంలో ఓ నిర్ణయం తీసుకుంటామని తెలిపింది.

తెలంగాణ అభ్యంతరం

నాలుగు నెలల క్రితం గోదావరి-కావేరీ అనుసంధానం ప్రాజెక్టు డీపీఆర్‌ను అందించిన ఎన్‌డబ్ల్యూడీఏ..దీనిపై తెలంగాణ అభిప్రాయాన్ని కోరింది. ఇచ్చంపల్లి వద్దే బ్యారేజీ నిర్మిస్తామని ఇందులో ప్రతిపాదించింది. అయితే ఇచ్చంపల్లి బ్యారేజీ నిర్మిస్తే నదుల అనుసంధానం ప్రాజెక్టుకి, ఇచ్చంపల్లి దిగువన ఉన్న తెలంగాణ ప్రాజెక్టుల అవసరాలకు ఏకకాలంలో నీళ్లను తరలించడం సాధ్యం కాదని తెలంగాణ అభ్యంతరం తెలిపింది. అలాగే దిగువన ఉన్న సమక్క సాగర్ బ్యారేజీకి బ్యాక్ వాటర్ సమస్య ఏర్పడుతుందని, వరదల నిర్వహణ సమస్యగా మారుతుందని ఆందోళన వ్యక్తం చేసింది.

1980లోనే ఇచ్చంపల్లి ప్రతిపాదనలు

గోదావరి నీళ్లను తెలంగాణ ప్రాంతానికి తరలించడానికి వీలుగా ఇచ్చంపల్లి వద్ద 118 మీటర్ల ఎత్తుతో బ్యారేజీ నిర్మించడానికి 1980లోనే బచావత్ ట్రిబ్యునల్ అనుమతినిచ్చింది. అయితే మధ్యప్రదేశ్, మహారాష్ట్ర అభ్యంతరాలతో దీని ఎత్తును తొలుత 112 మీటర్లకు, మళ్లీ 1986–88 లో 108 మీటర్లకు, కాలక్రమంలో 105 మీటర్లకు తగ్గించారు. తాజాగా నదుల అనుసంధానంలో భాగంగా 87 మీటర్ల ఎత్తుకు కుదించారు. అయినా ఛత్తీస్‌గఢ్‌లోని నాలుగు గ్రామాలు ముంపునకు గురికానున్నాయి. ఇక ఇచ్చంపల్లికి 24 కిలోమీటర్ల దిగువలోనే సమ్మక్క బ్యారేజీ ఉంది. ఇచ్చంపల్లి నుంచి అకస్మికంగా వరదను విడుదల చేస్తే సమ్మక్క బ్యారేజీ వద్ద వరదలు పోటెత్తి నిర్వహణ కష్టంగా మారుతుందని తెలంగాణ ఆందోళన వ్యక్తం చేస్తోంది. కాగా వరదల తీవ్రతపై సిమ్యులేషన్ స్టడీ చేయాలనే తెలంగాణ విజ్ఞప్తికి కేంద్రం అంగీకారం తెలుపడంతో సమ్మక్క బ్యారేజీ నుంచే గోదావరి- కావేరీ అనుసంధానం ప్రాజెక్టులో భాగంగా నీళ్లను తరలించే అవకాశాలు మెరుగైనట్టు నీటిపారుదల శాఖ వర్గాలు తెలిపాయి.

‘నీట్’గా గోల్‌మాల్?

▶ మొదటి పేజీ తరువాయి

హాజరయ్యారు. గతేడాది 11.45 లక్షల మంది అర్హత సాధించగా ఈసారి 13.16 లక్షల మంది అర్హత సాధించడం విశేషం. తెలంగాణ నుంచి గతేడాది 72,842 మంది నీట్ రాయగా 42,654 మంది అర్హత సాధించారు. ఈసారి 77,849 మంది పరీక్ష రాస్తే 47,371 మంది అర్హత సాధించారు. తెలంగాణలో ఈసారి ఎవరికీ 720కి 720 మార్కులు రాలేదు. ఇక కొందరికి 720 మార్కులకుగాను 717, 718, 719 వంటి మార్కులు వచ్చాయి. కానీ ఈ పద్ధతిలో రావడం సాధ్యం కానేకాదు. ఉదాహరణకు ఒక విద్యార్థి 720 మార్కులకు పరీక్ష రాస్తే అందులో ఒక ప్రశ్న తప్పయితే ఐదు మైనస్ మార్కులు పడతాయి. అంటే ఆ విద్యార్థికి 715 మార్కులే వస్తాయి. ఒకవేళ ఒక ప్రశ్న రాయకుంటే 4 మార్కులు తగ్గి 716 మార్కులు వస్తాయి. కానీ 717, 718, 719 మార్కులు ఎలా వస్తాయని పలు కార్పొరేట్ కాలేజీల అధ్యాపకులు ప్రశ్నిస్తున్నారు. అయితే తెలుగు రాష్ట్రాల్లో ఇటువంటి మార్కులు వచ్చినట్లు తాము గుర్తించలేదని.. ఉత్తరాది రాష్ట్రా ల్లో వెలుగు చూశాయంటున్నారు. కొన్ని పత్రికల ప్రకటనల్లోనూ వాటిని చూసినట్లు చెబుతున్నారు.

గ్రేస్ మార్కులు కలిపారంటూ ప్రచారం...

720కి 717, 718, 719... ఇలా సాధ్యంకాని మార్కులు ఏ పరిస్థితుల్లోనూ రాకూడదని అంటున్న నేపథ్యంలో ఎన్‌టీఏ గ్రేస్ మార్కులు కలిపిందన్న ప్రచారం జరుగుతోంది. రెండు గ్రేస్ మార్కులు కలిపారని అంటున్నారు. కానీ ఎన్‌టీఏ అధికారికంగా ప్రకటన జారీ చేయలేదు. కాబట్టి ఇది ఏ మేరకు వాస్తవమనేది తెలియదు. ఇలా కలిపితే తెలుగు రాష్ట్రాల నీట్ విద్యార్థులకు కూడా కలపాలి కదా? అని కొందరు ప్రశ్నిస్తున్నారు. విద్యార్థులందరినీ చెక్ చేశామని, ఎక్కడా తెలుగు రాష్ట్రాల్లో గ్రేస్ మార్కులు కలవలేదంటున్నారు. కాపీయింగ్, గ్రేస్ మార్కుల ప్రచారంపై కొందరు తల్లిదండ్రులు కోర్టుకు వెళ్లేందుకు ప్రయత్నాలు చేస్తున్నారని సమాచారం.

ఉద్యమపంథా మార్చాలి: ఆర్.కృష్ణయ్య



పంజగుట్ట (హైదరాబాద్): బీసీలు తమ హక్కుల సాధనకు ఉద్యమ పంథాను మార్చాలని, సాయుధ పోరాటాలను తీవ్రతరం చేయడం తప్పదని రాజ్యసభ సభ్యుడు ఆర్.కృష్ణయ్య పేర్కొన్నారు. రిజర్వేషన్లు మన హక్కని, ఎవరినో అడుక్కోవడం జనాభాలో సగానికి పైగా ఉన్న బీసీల దౌర్భాగ్యమని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. బీసీ కుల సంఘాల ఐక్యవేదిక, బీసీ జనసభ సంయుక్త ఆధ్వర్యంలో వేదిక చైర్మన్ కాటం నర్సింహ్మా యాదవ్, జనసభ రాష్ట్ర అధ్యక్షుడు రాజారాం యాదవ్ అధ్యక్షతన గురువారం సోమాజిగూడ ప్రెస్‌క్లబ్‌లో ‘కామారెడ్డి బీసీ డిక్లరేషన్’లోని అంశాలపై నిర్వహించిన రౌండ్ టేబుల్ సమావేశంలో ఆయన పాల్గొని మాట్లాడారు. బీసీలకు 42% రిజర్వేషన్లు పెంచి స్థానిక సంస్థల ఎన్నికలకు వెళ్తారా లేక జనాభాలో బీసీల గణాంకాలను తేల్చి అందుకనుగుణంగా రిజర్వేషన్లు కల్పిస్తారో చెప్పాలని ఈ సందర్భంగా ఆర్.కృష్ణయ్య డిమాండ్ చేశారు. ఆర్.ఎస్.ప్రవీణ్ కుమార్ మాట్లాడుతూ... సమగ్ర కులగణన చేపట్టాలని డిమాండ్ చేస్తూ ఈ నెల 8న ఉదయం 10 నుంచి సాయంత్రం 5 వరకు చలో ఇందిరాపార్క్ చేపడతామని అప్పటికీ ప్రభుత్వం స్పందించకపోతే 15న సెక్రటేరియట్ ముట్టడిస్తామని హెచ్చరించారు.

నేడు కాళేశ్వరం బ్యారేజీలకు మంత్రి ఉత్తమ్

అత్యవసర మరమ్మతుల పరిశీలన



సాక్షి, హైదరాబాద్: కాళేశ్వరం ప్రాజెక్టులోని బ్యారేజీలకు చేపడుతున్న అత్యవసర మరమ్మతులను మంత్రి ఎస్.ఉత్తమ్‌కుమార్‌రెడ్డి శుక్రవారం క్షేత్రస్థాయిలో పరిశీలించనున్నారు. నీటిపారుదల శాఖ ఈఎన్సీ(జనరల్) జి.అనిల్‌కుమార్‌తో కలిసి ఆయన హెలికాప్టర్ ద్వారా హైదరాబాద్ నుంచి వెళ్లి సుందిళ్ల, అన్నారం, మేడిగడ్డ బ్యారేజీలను సందర్శించనున్నారు. నేషనల్ డ్యామ్ సేఫ్టీ అథారిటీ(ఎన్డీఎస్ఏ) నిపుణుల కమిటీ మధ్యంతర నివేదికలో చేసిన సిఫారసుల మేరకు కాళేశ్వరం బ్యారేజీలకు అత్యవసర మరమ్మతులను రాష్ట్ర నీటిపారుదల శాఖ చేపట్టింది. వర్షాకాలం ప్రారంభమైన నేపథ్యంలో వరదల నుంచి బ్యారేజీలను రక్షించడానికి తీసుకుంటున్న చర్యలపై మంత్రి సమీక్షించనున్నారు. మేడిగడ్డ, అన్నారం, సుందిళ్ల బ్యారేజీలకు అత్యవసర మరమ్మతులు నిర్వహిస్తున్న ఎల్ అండ్ టీ, ఆఫ్‌కాన్స్, నవయుగ వంటి నిర్మాణ సంస్థల ఉన్నతాధికారులతో మాట్లాడి పురోగతిని తెలుసుకుంటారు. అనంతరం మంత్రి మేడిగడ్డ వద్ద విలేకరులతో మాట్లాడి పనుల్లో పురోగతిని వెల్లడిస్తారు.


పనికిరాని ప్రాజెక్టుకు మరమ్మతులెందుకు?

- కాళేశ్వరంపై కాంగ్రెస్ ప్రభుత్వం తప్పుదారిలో పడింది
- చేవెళ్ల ఎంపీ కొండా విశ్వేశ్వర్‌రెడ్డి



సాక్షి, హైదరాబాద్: ‘కాళేశ్వరంపై కాంగ్రెస్ ప్రభుత్వం తప్పుదారిలో పడింది. ఈ నిర్ణయం వల్ల కాంగ్రెస్‌కే నష్టం జరుగుతుంది. పనికిరాని ఈ ప్రాజెక్టుకు మరమ్మతులు చేయడం సరికాదు’అని చేవెళ్ల ఎంపీ కొండా విశ్వేశ్వర్‌రెడ్డి అన్నారు. దీనికి సంబంధించిన వివరాలను తాను పవర్ పాయింట్ ప్రజెంటేషన్‌తో వివరించేందుకు సిద్ధమవుతున్నట్టు వెల్లడించారు. గురువారం బీజేపీ కార్యాలయంలో విశ్వేశ్వర్‌రెడ్డి మీడియాతో మాట్లాడారు. రాజకీయంగా చూస్తే ఎన్నికల వరకే కొట్లాటలు ఉంటాయని, అభివృద్ధి కోసం కాంగ్రెస్ ప్రభుత్వంతో కలిసి పనిచేస్తామని తెలిపారు. తాను ప్రాతినిధ్యం వహిస్తున్న చేవెళ్ల పరిధిలోని జంట జలాశయాల పరిరక్షణకు సంబంధించి గత ప్రభుత్వం జీఓ 111 రద్దు చేసినా, దాని కంటే కూడా నిరర్థకమైన జీఓ 69ను కొత్తగా తీసుకొచ్చిందని విమర్శించారు. ఇక్కడ పర్యావరణ పరిరక్షణతో పాటు అభివృద్ధి కూడా జరగాలంటే ఈ ప్రాంతాన్ని ‘సస్టెయినబుల్ ఏరియా’గా ప్రకటించాలని కాంగ్రెస్ ప్రభుత్వానికి సూచించారు. లోక్‌సభ ఎన్నికల సందర్భంగా కాంగ్రెస్ పార్టీ ముస్లింలలో విషం నింపిందని మండిపడ్డారు. బీజేపీ మతతత్వ పార్టీ కాదని, దానికి పూర్తి విరుద్ధంగా కాంగ్రెస్ మతతత్వ రాజకీయాలు చేస్తోందని ధ్వజమెత్తారు. మోదీ వేవ్ తోనే తాను చేవెళ్లలో పెద్ద మెజారిటీతో గెలుపొందానని చెప్పారు. కేంద్ర కేబినెట్‌లో మీకు పదవి లభించనుందా అని విలేకరులు అడిగిన ప్రశ్నకు విశ్వేశ్వర్‌రెడ్డి స్పందిస్తూ ‘కేంద్రమంత్రి అయితే నాకు రాజకీయంగా నష్టం. దేశవ్యాప్తంగా నిర్వహించాల్సిన బాధ్యతల కారణంగా చేవెళ్ల ప్రజలకు దూరం అవుతా. కానీ నాకున్న పరిజ్ఞానం దేశం మేలు కోసం ఉపయోగించాలని ఉంది’ అని అన్నారు.

మేడిగడ్డలో మరో 2 గేట్లు ఎత్తివేత



మేడిగడ్డ బ్యారేజీలోని 16వ నంబర్ గేటును ఎత్తివేసిన దృశ్యం

సాక్షి, హైదరాబాద్: మేడిగడ్డ బ్యారేజీ కుంగిపోవడంతో మొరాయించిన 8 గేట్లలో ఇటీవల ఒక గేటును పైకి ఎత్తగా గురువారం మరో రెండు గేట్లను విజయవంతంగా పైకి ఎత్తారు. బ్యారేజీలో మొత్తం 8 బ్లాకులు, 85 గేట్లు ఉండగా.. గతేడాది అక్టోబర్ 21న ఏడో బ్లాక్ కుంగిన వెంటనే 77 గేట్లను ఎత్తి నీటిని కిందకు విడుదల చేశారు. 7వ బ్లాకులోని 15–22 నంబర్ గేట్లు మొరాయించడంతో అప్పట్లో ఎత్తలేకపోయారు. 15వ నంబర్ గేటును ఇటీవల పైకి ఎత్తగా మిగిలిన ఏడు గేట్లను వానాకాలం ప్రారంభానికి ముందే పైకి ఎత్తాలని నేషనల్ డ్యామ్ సేఫ్టీ అథారిటీ నిపుణుల కమిటీ మధ్యంతర నివేదికలో సిఫారసు చేసింది. గురువారం 16, 17వ నంబర్ గేట్లను బలప్రయోగం ద్వారా దాదాపుగా 100 మీటర్లు పైకి ఎత్తారు. మరో ఐదు గేట్లను వరదల ప్రారంభానికి ముందే పైకి ఎత్తాల్సి ఉంది.

‘కొడంగల్’ సామర్థ్యం పెంపు!

- 2.1 నుంచి 4.022 టీఎంసీలకు... నిల్వకు వీలుగా చెరువుల అభివృద్ధి
- రూ.2,945.50 కోట్ల నుంచి రూ.4,350 కోట్లకు పెరిగిన అంచనా వ్యయం
- రెండు దశల్లోనే నారాయణపేట-కొడంగల్ ఎత్తిపోతల ప్రాజెక్టు... లక్ష ఎకరాలకు సాగునీరు.. 0.38 టీఎంసీల మేర తాగునీరు
- రాష్ట్ర ప్రభుత్వ నిర్ణయం.. త్వరలో టెండర్లకు ఆహ్వానం



సాక్షి, హైదరాబాద్: ముఖ్యమంత్రి ఎ.రేవంత్‌రెడ్డి సొంత జిల్లా ఉమ్మడి మహబూబ్‌నగర్ సాగు, తాగునీటి అవసరాలను తీర్చడానికి నిర్మించతలపెట్టిన నారాయణపేట-కొడంగల్ ఎత్తిపోతల పథకం సామర్థ్యాన్ని మరింతగా పెంచాలని రాష్ట్ర ప్రభుత్వం నిర్ణయించింది. ప్రాజెక్టు ద్వారా మొత్తం 10 చెరువులకు నీటిని మళ్లించాల్సి ఉండగా, వాటి సామర్థ్యాన్ని 0.9 టీఎంసీల నుంచి 2.1 టీఎంసీలకు పెంచాలని మొదట్లో నిర్ణయించింది. తాజాగా 4.022 టీఎంసీలను నిల్వ చేసే జలాశయాలుగా ఈ చెరువులను అభివృద్ధి చేయాలని నిర్ణయం తీసుకుంది. దీంతో ప్రాజెక్టు అంచనా వ్యయం సైతం రూ.2,945.50 కోట్ల నుంచి రూ.4,350 కోట్లకు చేరింది. తొలుత ప్రతిపాదించిన నాలుగు దశలకు బదులుగా రెండు దశల్లో ఈ పథకాన్ని నిర్మించనుండగా, త్వరలోనే టెండర్లు పిలిచేందుకు నీటిపారుదల శాఖ ఏర్పాట్లు చేస్తోంది. ఉమ్మడి మహబూబ్‌నగర్ జిల్లాలోని నారాయణపేట, కొడంగల్, మక్తల్ నియోజకవర్గాల్లో లక్ష ఎకరాలకు సాగునీరు, నారాయణపేట జిల్లాకు తాగునీరు అందించేందుకు ఈ ప్రాజెక్టును నిర్మించనున్నారు. సీఎం రేవంత్‌రెడ్డి గత ఫిబ్రవరిలో ఈ ప్రాజెక్టు పనులకు శంకుస్థాపన చేశారు.

భూత్పూర్ నుంచి నీటి తరలింపు

నీటిని తీసుకునే ప్రాంతం నుంచి సరఫరా చేసే చివరి పాయింట్ వరకు ఇప్పటికే ఈ ప్రాజెక్టుపై సమగ్ర అధ్యయనం ముగిసింది. సంగంబండకు బదులు భీమా పథకంలో భాగంగా నిర్మించిన భూత్పూర్ జలాశయం నుంచి నీటిని తీసుకుంటారు. తాజా ప్రతిపాదనల ప్రకారం భూత్పూర్ జలాశయం నుంచి కనుకుర్తి వరకు మూడు చోట్ల నీటిని ఎత్తి పోయాలని, మొత్తం రెండు దశల్లో ఈ ప్రాజెక్టు చేపట్టాలని ప్రభుత్వం నిర్ణయం తీసుకుంది. తొలి దశలో భూత్పూర్ జలాశయం నుంచి ఊట్కూరు చెరువులోకి నీళ్లను ఎత్తిపోయనున్నారు. అక్కడి నుంచి జయమ్మ చెరువు, అక్కడి నుంచి కనుకుర్తి చెరువుకు నీళ్లను ఎత్తిపోస్తారు. ఇందుకోసం ఊట్కూరు, జయమ్మ, కనుకుర్తి చెరువుల ఆధునీకరణ, నిల్వ సామర్థ్యం పెంపు పనులను నిర్వహిస్తారు. తొలి దశ పనులకు రూ.2,945 కోట్ల వ్యయం కానుందని అంచనా వేశారు. రెండో దశ పనుల్లో భాగంగా జాజాపూర్, దౌలతాబాద్, బొమ్రాస్‌పేట, లక్ష్మీపూర్, ఎర్లపల్లి, హుస్నాబాద్, కొడంగల్ అనే మొత్తం ఏడు చెరువుల నిల్వ సామర్థ్యాన్ని పెంచుతారు. గ్రావిటీ కాల్వలు, డిస్ట్రిబ్యూటరీ కాల్వలను నిర్మిస్తారు. రెండో దశ పనులకు రూ.1,404.50 కోట్ల వ్యయం అవుతుందని అంచనా.

భూత్పూర్‌తో తక్కువ వ్యయం

పాలమూరు-రంగారెడ్డి ఎత్తిపోతల పథకంలో భాగంగా నిర్మించిన ఉద్దండాపూర్ రిజర్వాయర్ (+269 అడుగుల సముద్రం మట్టం) నుంచి నీటిని లిఫ్ట్ చేయటం కంటే సముద్రానికి 350 అడుగుల మట్టంలో ఉన్న భూత్పూర్ రిజర్వాయర్ నుంచి ఎత్తిపోయడానికి తక్కువ నిర్వహణ వ్యయం అవుతుందని, సులువుగా ఉంటుందని ప్రభుత్వం భావించినట్లు అధికార వర్గాలు తెలిపాయి.

లక్ష ఎకరాలకు ఏడు టీఎంసీలు

మక్తల్ నియోజకవర్గంలో ఊట్కూరు, మక్తల్ మండలాల పరిధిలో 25,783 ఎకరాలు, నారాయణపేట నియోజకవర్గంలో నారాయణపేట, ధన్వాడ, దామరగిద్ద మండలాల్లో 20,472 ఎకరాలు, కొడంగల్ నియోజకవర్గంలోని కొడంగల్, మద్దూరు, కోస్గి, దౌలతాబాద్, బొమ్రాస్‌పేట మండలాల్లో 53,745 ఎకరాలు కలిపి మొత్తం లక్ష ఎకరాలను ఈ ప్రాజెక్టు కింద ప్రతిపాదించారు. 0.38 టీఎంసీల నీటిని లిఫ్ట్ చేయడం ద్వారా నారాయణపేట జిల్లాలోని పలు గ్రామాలకు తాగునీటిని అందిస్తారు. ఇందుకోసం అప్రోచ్ ఛానెళ్లు, పంప్ హౌస్‌లు, డెలివరీ మెయిన్స్, సిస్టర్న్లు నిర్మించనున్నారు. భూగర్భ సొరంగాలకు బదులు ప్రెషర్ మెయిన్స్ నిర్మించాలని నిర్ణయించారు. ఉమ్మడి రాష్ట్రంలో సర్వే నిర్వహించి రూ.3,117 కోట్లతో ఈ ప్రాజెక్టును నిర్మించేందుకు డీపీఆర్‌ను సిద్ధం చేశారు. ఈ ప్రతిపాదనలకు పలు మార్పులు చేర్పులు చేసిన రేవంత్‌రెడ్డి సర్కారు రూ.2,945.5 కోట్ల పనులకు గత ఫిబ్రవరి 8న పాలనా పరమైన అనుమతులు జారీ చేసింది.



ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డిని మర్యాదపూర్వకంగా కలిసిన పెద్దపల్లి ఎంపీ వంశీకృష్ణ, ఎమ్మెల్యే వివేక్. చిత్రంలో మంత్రి పొంగులేటి

చంద్రబాబుకు రేవంత్‌రెడ్డి అభినందనలు

మహబూబాబాద్ సమీక్షా సమావేశం నుంచి ఫోన్ చేసిన సీఎం

సాక్షి, హైదరాబాద్: ఆంధ్రప్రదేశ్ శాసనసభ ఎన్నికల్లో విజయం సాధించిన టీడీపీ అధినేత చంద్రబాబునాయుడుకు తెలంగాణ సీఎం రేవంత్‌రెడ్డి అభినందనలు తెలిపారు. గురువారం మధ్యాహ్నం రేవంత్‌రెడ్డి నివాసంలో మహబూబాబాద్ నియోజకవర్గ ఫలితాలపై నిర్వహించిన సమీక్ష సమావేశం నుంచి రేవంత్ చంద్రబాబుకు ఫోన్ చేసి మాట్లాడారు. రెండు రాష్ట్రాల మధ్య సత్సంబంధాలు కొనసాగాలని, విభజన చట్టానికి సంబంధించి పెండింగ్‌లో ఉన్న అంశాలను సుహృద్భావ వాతావరణంలో పరిష్కరించుకునేందుకు సహకరించాలని కోరారు.

నేడు అన్నారానికి జస్టిస్ చంద్రఘోష్

- రేపు సుందిళ్ల బ్యారేజీల పరిశీలన
- ఈ నెల 10 నుంచి జ్యుడీషియల్ కార్యాలయంలో విచారణ



సాక్షి, హైదరాబాద్: కాళేశ్వరం ప్రాజెక్టులోని బ్యారేజీల నిర్మాణంపై న్యాయ విచారణ జరుపుతున్న జస్టిస్ పినాకి చంద్రఘోష్ శుక్రవారం అన్నారం బ్యారేజీ, శనివారం సుందిళ్ల బ్యారేజీని సందర్శించనున్నారు. కోల్‌కతా నుంచి గురువారం హైదరాబాద్ చేరుకున్న ఆయన... నీటి పారుదల శాఖ అధికారులతో సమావేశమయ్యారు. బ్యారేజీలకు నిర్వహిస్తున్న అత్యవసర మరమ్మతుల్లో పురోగతిని అడిగి తెలుసుకున్నారు. బ్యారేజీల సందర్శనలో భాగంగా వాటికి జరిగిన నష్టంతోపాటు మరమ్మతుల్లో పురోగతిని ఆయన పరిశీలించనున్నారు. ఈ నెల 10 నుంచి 15 వరకు ఆయన బీఆర్‌కేఆర్ భవన్‌లోని జ్యుడీషియల్ కమిషన్ కార్యాలయంలో రోజువారీ న్యాయ విచారణ ప్రక్రియలో పాల్గొంటారు. అనంతరం 16న సాయంత్రం హైదరాబాద్ నుంచి కోల్‌కతా తిరిగి వెళ్లనున్నారు. ఈ పర్యటనలో భాగంగా ఆయన బ్యారేజీల నిర్మాణం విషయంలో నిర్ణయాలు తీసుకున్న అధికారులందరికీ నోటీసులు జారీ చేసే అవకాశం ఉంది.

ఆ తహసీల్దార్లను వెనక్కి పంపించాలి

సీసీఎల్ఏకు టీజీటీఏ, ట్రెసా వినతి



నవీన్ మిత్తల్‌ను కలిసిన ట్రెసా బృందం

సాక్షి, హైదరాబాద్: అసెంబ్లీ ఎన్నికలకు ముందు బదిలీ అయిన తహసీల్దార్లను తిరిగి పాత జిల్లాలకు పంపించాలని తెలంగాణ తహసీల్దార్ల సంఘం (టీజీటీఏ), తెలంగాణ రెవెన్యూ ఉద్యోగుల సంఘం (ట్రెసా) ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశాయి. ఈ మేరకు గురువారం టీజీటీఏ ప్రతినిధులు, ట్రెసా అధ్యక్షుడు వంగ రవీందర్‌రెడ్డి, ప్రధాన కార్యదర్శి కె.గౌతమ్‌కుమార్ భూ పరిపాలన ప్రధాన కమిషనర్ (సీసీఎల్ఏ) నవీన్ మిత్తల్‌ను వేరువేరుగా కలిసి వినతిపత్రం సమర్పించారు. ఒకే జిల్లాలో మూడేళ్ల కంటే ఎక్కువ కాలంగా పనిచేస్తున్న, సొంత జిల్లాల్లో విధులు నిర్వహిస్తున్న తహసీల్దార్లను బదిలీ చేయాల్సిందిగా అసెంబ్లీ ఎన్నికల ముందు ఈసీ ఆదేశించినట్టు తెలిపారు. దీంతో అనేకమంది తహసీల్దార్లు వారు పనిచేస్తున్న జిల్లాల నుంచి దూరప్రాంతాలకు బదిలీ అయ్యారని వారు మిత్తల్ దృష్టికి తీసుకెళ్లారు. ప్రస్తుతం అసెంబ్లీ ఎన్నికలతో పాటు పార్లమెంటు ఎన్నికలు కూడా ముగిసినందున తహసీల్దార్లను తిరిగి పాత జిల్లాలకు బదిలీ చేయాలని విజ్ఞప్తి చేశారు. 2009 ఎన్నికల నుంచి ఇలా ఎన్నికల ప్రక్రియలో భాగంగా బదిలీ అయిన తహసీల్దార్లను ఎన్నికలు పూర్తి కాగానే తిరిగి పాత జిల్లాలకు బదిలీ చేస్తున్న విషయాన్ని సీసీఎల్ఏ దృష్టికి తీసుకెళ్లారు. అలాగే పెండింగ్‌లో ఉన్న అన్ని రకాల బిల్లులను వెంటనే మంజూరు చేయాలని కోరారు.

సమస్యల పరిష్కారానికి త్వరలో సీఎంతో ప్రత్యేక సమావేశం

ఉద్యోగ సంఘ నేతలతో ప్రణాళికా సంఘం ఉపాధ్యక్షుడు చిన్నారెడ్డి



ఉద్యోగ సంఘాల నేతలతో కలిసి సీఎస్‌కు వినతిపత్రం ఇస్తున్న కోదండరాం

సాక్షి, హైదరాబాద్: ప్రభుత్వ ఉద్యోగుల సమస్యల పరిష్కారానికి త్వరలో సీఎం రేవంత్‌రెడ్డి వద్ద ప్రత్యేక సమావేశం ఏర్పాటు చేస్తామని ప్రణాళికా సంఘం ఉపాధ్యక్షుడు జి.చిన్నారెడ్డి వెల్లడించారు. అన్ని సంఘాలను ఈ సమావేశంలో భాగస్వామ్యం చేస్తామని, ప్రతి ఒక్కరితో మాట్లాడి అభిప్రాయం తెలుసుకునేందుకు సీఎం సిద్ధంగా ఉన్నారన్నారు. త్రిసభ్య కమిటీ సభ్యులైన జి.చిన్నారెడ్డి, ప్రొఫెసర్ కోదండరాంలతో ఉద్యోగ సంఘాల నేతలు గురువారం నాంపల్లిలోని టీజేఎస్ కార్యాలయంలో సమావేశమయ్యారు. ఉద్యోగుల సమస్యలు, వాటి పరిష్కారానికి సంబంధించిన సూచనలను టీజీఓ, టీఎన్‌జీఓ సంఘాల నేతలు వేర్వేరుగా త్రిసభ్య కమిటీ ముందుంచారు. తెలంగాణ గెజిటెడ్ అధికారుల సంఘం రాష్ట్ర అధ్యక్షుడు ఏలూరి శ్రీనివాసరావు, టీఎన్‌జీఓ రాష్ట్ర అధ్యక్షుడు జగదీశ్వర్‌లతో కూడిన ప్రతినిధుల బృందం వేరువేరుగా వినతిపత్రాలు సమర్పించింది. దీంతో త్రిసభ్య కమిటీ సభ్యులు ఈమేరకు హామీ ఇచ్చారు. టీజీఓ, టీఎన్‌జీఓ సంఘాలతోపాటు ఉపాధ్యాయ సంఘ నేతలను కూడా భాగస్వామ్యం చేయాలని ప్రతినిధులు కోరగా, త్రిసభ్య కమిటీ సభ్యులు సానుకూలంగా స్పందించారు.అనంతరం ఉద్యోగ సంఘాల నేతలతో వెళ్లి సీఎస్ శాంతకుమారిని చిన్నారెడ్డి, కోదండరాం కలిశారు. సమస్యలను వెంటనే పరిష్కరించాలని సూచించారు. ఆ తర్వాత సీఎం ప్రధాన కార్యదర్శి శేషాద్రితో కలిసి ఉద్యోగుల సమస్యల పరిష్కరించాలని చర్చించారు.

వెబ్‌పోర్టల్ ఏర్పాటు: ప్రభుత్వ ఉద్యోగుల సమస్యల పరిష్కారానికి కొత్తగా వెబ్‌పోర్టల్‌ను ప్రభుత్వం ఏర్పాటు చేసింది. జీఓ 317, జీఓ 46 సమస్యల పరిష్కారం కోసం దీనిని ఏర్పాటు చేసినట్టు రాష్ట్ర ప్రభుత్వ కార్యదర్శి రఘునందన్‌రావు ఉత్తర్వులు జారీ చేశారు. ఉద్యోగుల నుంచి ఫిర్యాదులు స్వీకరించడానికే ప్రత్యేకంగా ‘‘GO317and46issues.telangana.gov.in’’అనే వెబ్ పోర్టల్‌ను ఏర్పాటు చేసినట్టు అందులో వివరించారు. రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన వెంటనే ఉద్యోగుల సమస్యలు పరిష్కరిస్తామని సీఎం రేవంత్‌రెడ్డి హామీ ఇచ్చిన నేపథ్యంలో మార్చి 14వ తేదీన మంత్రులు దామోదర రాజనర్సింహ, శ్రీధర్‌బాబు, పొన్నం ప్రభాకర్‌లతో కూడిన మంత్రివర్గ ఉపసంఘాన్ని ఏర్పాటు చేసిన సంగతి తెలిసిందే. ఈ క్రమంలో క్షేత్రస్థాయి నుంచి వినతులు స్వీకరించేందుకు వీలుగా ఈ వెబ్‌పోర్టల్ తెరిచినట్టు సమాచారం.

అల్లాహ్ ప్రజల కొరకు ఏ కారుణ్యాన్ని పంపినా దానిని ఆపేవాడు ఎవ్వడూ లేడు. ఏ కారుణ్యాన్నైనా ఆయన ఆపితే, ఆ తరువాత దానిని పంపగలవాడు కూడా ఎవ్వడూ లేడు. ఆయన సర్వ శక్తిమంతుడు, మహా వివేచనాపరుడు.

– ఇస్లాం ధర్మం

సాక్షి

శుక్రవారం, 7 జూన్ 2024

మెక్సికో పీఠంపై మహిళ!

అపారమైన వనరులున్నా ఏనాడూ కంటి నిండా కునుకు లేని మెక్సికో ప్రజానీకం అధ్యక్ష ఎన్నికల్లో వరసగా రెండోసారి సైతం వామపక్ష మొరెనా పార్టీకి పట్టంగట్టారు. ఆరుపదుల వయసుగల యూదు మహిళ క్లాడియా షీన్‌బామ్‌ను అధ్యక్ష పీఠానికి ఎన్నుకున్నారు. రెండు శతాబ్దాల రిపబ్లిక్ చరిత్రలో మహిళ దేశాధినేత కావటం ఇదే ప్రథమం. జనాభాలో యూదులు అత్యల్ప సంఖ్యాకులు కావటం గమనించదగ్గది. వచ్చే అక్టోబర్‌లో ఆమె పదవీబాధ్యతలు చేపడతారు. ఆకలి,నిరుద్యోగం, డ్రగ్స్ విజృంభణ, వ్యక్తుల అదృశ్యం... ఒకటి కాదు, మెక్సికోను సవాలక్ష సమస్యలు పీడిస్తున్నాయి. అంతటా నిరాశా నిస్పృహలు అలుముకున్న తరుణంలో అంతవరకూవున్న రెండు పార్టీల వ్యవస్థను బద్దలుకొడుతూ మొరెనా పార్టీ రంగంలోకొచ్చింది. 2018లో ఆరేళ్లకాలానికి అధ్యక్షుడైన ఆండ్రెస్ మ్యాన్యువల్ లొపెజ్ అబ్రడార్ (ఆమ్లో) ఆశించిన స్థాయిలో పాలించకపోయినా శాంతిభద్రతలను కాస్త అదుపు చేయగలిగారు.

అదే సమయంలో సంక్షేమపథకాలు అందించటం, మౌలిక సదుపాయాలు పెంచటం మొరెనా పార్టీని రెండోసారి అందలం ఎక్కించింది. అలాగని అంతా సవ్యంగా ఉందని కాదు. ఏడాదికి సగటున 30,000 హత్యలు జరగటం, అందులో 90 శాతం మిస్టరీగా మిగిలిపోవటం మెక్సికో ప్రత్యేకత. ఈ హత్యల్లో డ్రగ్స్ మాఫియాల వాటాతోపాటు, వాటిని అదుపు చేసే సాకుతో పారా మిలిటరీ దళాలు సాగించే నరమేధమూ ఉంటుంది. మారుమూల పల్లెల్లో ఏదో ఒకచోట హఠాత్తుగా ఖననం చేసిన శవాల గుట్టలు లేదా మాదకద్రవ్యాల డంప్‌లు బయటపడతాయి. అమెరికాకు చాటుగా వలసదారుల తరలింపు మరో పెద్ద వ్యాపారం. మూడునెలలక్రితం అధ్యక్ష ఎన్నికలు సమీపిస్తున్న తరుణంలో కొండ ప్రాంత ఆవాసాలపై మాదకద్రవ్య ముఠాలు డ్రోన్లతో బాంబుల వర్షం కురిపించి వందలాది పౌరులను హతమార్చటంతోపాటు ఇళ్లను దహనం చేశారు. గ్రామస్థులు తమ సమాచారం పారా మిలిటరీ దళాలకు చేరేస్తున్నారన్నది వారి అనుమానం. ఈ అధ్యక్ష ఎన్నిక సందర్భంగా దాదాపు డజనుమంది అభ్యర్థుల్ని మాదకద్రవ్యాల ముఠా కాల్చిచంపింది. ఇన్ని సమస్యలతో సతమతమయ్యే దేశానికి అధ్యక్షురాలు కావటం నిజానికి కత్తి మీద సామే. చిత్రమేమంటే అధ్యక్ష ఎన్నికల ప్రచారంలో ఆమె శాంతిభద్రతల అదుపు కోసం ఏం చేస్తానన్నది చెప్పలేదు. కానీ మెక్సికో నగర మేయర్‌గా పనిచేసిన అనుభవం ఆమెకు అక్కరకొస్తుందన్న ఆశ జనానికి ఉంది. నగరాన్ని సీసీ కెమెరాలతో నింపడం, నేరాలు తరచూ జరిగే ప్రాంతాల్లో నిరంతరం పోలీసు బలగాలను మోహరించటం వంటివి హత్యలను గణనీయంగా తగ్గించాయని గణాంకాలు చెబుతున్నాయి. అయితే ఈ సంఖ్య వాస్తవాలను ప్రతిబింబించటం లేదన్నది విపక్షాల ఆరోపణ.

నిరంకుశ పాలనకు వ్యతిరేకంగా సాగిన 1968 నాటి విద్యార్థి ఉద్యమంతో సహా అనేక సామాజికోద్యమాల్లో పాల్గొన్న యూదు కుటుంబంలో జన్మించటం వల్ల అటు రాజకీయాలపైనా, ఇటు పర్యావరణంపైనా ఆమెకు ఆది నుంచీ ఆసక్తి. అందుకే ఆ రంగంలో ఆమె పీహెచ్‌డీ చేయటంతోపాటు క్యాలిఫోర్నియా యూనివర్సిటీలో తన అధ్యయనాన్ని కొనసాగించి నైపుణ్యానికి పదును పెట్టుకున్నారు. పర్యావరణ పరిరక్షణకు కృషి చేసినందుకు 2007లో నోబెల్ పురస్కారాన్ని గెల్చుకున్న శాస్త్రవేత్తల బృందంలో క్లాడియా ఒకరు. 2018లో తెరపైకొచ్చిన మొరెనా పార్టీ ఆమెను సహజంగానే ఆకర్షించింది. వెంటనే మెక్సికో మేయర్ పదవి కూడా వరించింది. ఆ పదవికి మహిళ ఎన్నిక కావటం కూడా అదే ప్రథమం. 31 రాష్ట్రాలూ, 13 కోట్ల జనాభాగల దేశంలో నేరాలను అరికట్టడం మెక్సికో నగరాన్ని దారికి తెచ్చినంత సులభం కాదు. చాలా రాష్ట్రాల్లో మాదకద్రవ్య ముఠాలు వాహన సముదాయాల్లో ఏకే-47 తుపాకులతో సంచరించటం, పోలీసులు సమాచారం అందుకుని వచ్చేలోపే హత్యాకాండ ముగించి నిష్క్రమించటం తరచు కనబడే దృశ్యాలు. తల్లిదండ్రుల ఆలనా పాలనాలేని పిల్లల్ని, యువతను చేరదీస్తామని వారిలో అమాయకంగా కనబడేవారికి ప్రాధాన్యమిచ్చి ఏళ్ల తరబడి ఆయుధ శిక్షణ ఇచ్చి మాదకద్రవ్యాల పంపిణీకీ హత్యలకూ వినియోగిస్తామని మాదకద్రవ్య ముఠా నాయకుడొకరు చెప్పాడు. ఆ కోణంలో దృష్టి సారించి పాఠశాల విద్య నుంచే స్కాలర్‌షిప్‌లిచ్చే పథకాన్ని ఆమ్లో అమలుచేశారు. కానీ పెద్దగా ఫలించలేదు.

ఇవన్నీ అంతర్గత సమస్యలు. పొరుగునున్న అమెరికాతో అనేక పేచీలున్నాయి. ఆ దేశంలో ట్రంప్ తిరిగి అధికారంలోకి రాబోతున్నారన్న కథనాలు మెక్సికోకు ఇబ్బందిగానే ఉన్నాయి. ఆ దేశం నుంచి వలసలను అరికట్టడానికీ, మాదకద్రవ్యాలను కట్టడి చేయటానికీ సరిహద్దుల్లో గోడ నిర్మిస్తానని గతంలో ట్రంప్ ప్రకటించి పని మొదలెట్టినా బైడెన్ వచ్చాక ఆగిపోయింది. మరోపక్క లాటిన్ అమెరికా దేశాల్లో అమెరికాతో వాణిజ్యం నెరపే దేశాల్లో మెక్సికోయే నంబర్ వన్. అందువల్ల ఆ దేశాన్ని అంత సులభంగా అమెరికా వదులుకోలేదు. పైగా మెక్సికో పరిశ్రమల్లో ఉత్పత్తయ్యే కార్ల విడిభాగాల వల్లే అమెరికాలోని డెట్రాయిట్‌లో కార్ల పరిశ్రమలు సజావుగా సాగుతున్నాయి. మెక్సికో పవన విద్యుత్‌తోనే అమెరికా తయారీరంగ పరిశ్రమలు లక్షలమంది అమెరికన్లకు ఉపాధినిస్తున్నాయి. హృద్రోగులకు వాడే పేస్‌మేకర్లు మొదలుకొని పండ్లు, కూరగాయలు, ఆహారధాన్యాల వరకూ చాలా భాగం మెక్సికో నుంచి రావాల్సిందే. అందుకే ఇరుదేశాల వాణిజ్యమూ నిరుడు 80 వేల కోట్ల డాలర్ల వరకూ సాగింది. కనుక నేరస్థముఠాలను అరికట్టి శాంతిభద్రతలు తీసుకురాగలిగితే మెక్సికో సుసంపన్న దేశాల్లో ఒకటై నిలుస్తుంది. క్లాడియా ఆ పని చేయగలరా అన్నదే పెద్ద ప్రశ్న.

గ్రహం అనుగ్రహం

శ్రీ క్రోధి నామ సంవత్సరం, ఉత్తరాయణం, గ్రీష్మ ఋతువు, జ్యేష్ఠ మాసం, **తిథి:** శు.పాడ్యమి సా.4.53 వరకు, తదుపరి విదియ, **నక్షత్రం:** మృగశిర రా.8.16 వరకు, తదుపరి ఆరుద్ర, **వర్జ్యం:** తె.4.46 నుండి 6.23 వరకు, (తెల్లవారితే శనివారం), **దుర్ముహూర్తం:** ఉ.8.04 నుండి 8.56 వరకు, తదుపరి ప.12.25 నుండి 1.17 వరకు, **అమృతఘడియలు:** ప.11.40 నుండి 12.34 వరకు.

సూర్యోదయం : 5.28
సూర్యాస్తమయం: 6.28
రాహుకాలం : ఉ.10.30 నుండి 12.00 వరకు
యమగండం : ప.3.00 నుండి 4.30 వరకు

కాంగ్రెస్‌కు ఊపు... మోదీకి మేలుకొలుపు

అభిప్రాయం



సంజయ్ బారు

భారత్‌ను 'కాంగ్రెస్ ముక్త్' చేస్తానన్న మోదీ తన విధానాల ద్వారా అదే కాంగ్రెస్ పునరుద్ధరణకు తన వంతు కృషి చేశారు. ఫలితంగా బీజేపీ మెజారిటీ తగ్గింది. కేంద్రంలో సంకీర్ణం అనివార్యమైంది. ఎన్డీయే ప్రభుత్వ సుస్థిరతకు బలహీనపడిన మోదీ ఏం చేస్తారు? సంకీర్ణాల కంటే ఒకే పార్టీ మెజారిటీ ప్రభుత్వాలే మంచివనే అభిప్రాయం ఉంది. వాస్తవాలు దీనికి భిన్నంగా ఉన్నాయి. ఆర్థికాభివృద్ధి, పేదరికం తగ్గింపు, ఉపాధి పెరుగుదల వంటి అంశాల పరంగా దేశానికి అత్యుత్తమ కాలం 1991 నుండి 2014 వరకు గల పావు శతాబ్దం. పీవీ నరసింహరావు, వాజ్‌పేయి, మన్మోహన్‌సింగ్ లాంటి పెద్దమనుషులు అప్పటి సంకీర్ణ ప్రభుత్వాలకు నాయకత్వం వహించారు. మోదీ వారిలా వ్యవహరించగలరా?

అమెరికా పౌరహక్కుల నేత మార్టిన్ లూథర్ కింగ్ జూనియర్‌కు ఒక కల ఉండేది. చైనా అధ్యక్షుడు షీ జిన్‌పింగ్‌కు ఒక కల ఉంది. ఈ ఏడాది లోక్‌సభ ఎన్నికల ప్రచారానికి వెళుతున్నప్పుడు భారత ప్రధాని నరేంద్ర మోదీకి కూడా ఒక కల ఉండింది. బీజేపీ నేతృత్వంలోని ఎన్డీయేకు 400కు పైగా సీట్లు వస్తాయని ఆయన ఊహించారు. ఈ వారం ఆ కల చెదిరిపోయింది. 2014లో బీజేపీని పునరుద్ధరించడం మోదీ చేసిన ప్రధాన రాజకీయ తోడ్పాటు. కాగా, 2024లో ఆయన చేసిన అతిపెద్ద రాజకీయ దోహదం భారత జాతీయ కాంగ్రెస్ పునరుద్ధరణ.

నిజానికి, రాహుల్ గాంధీ 'భారత్ జోడో యాత్ర'తో తన సొంత గుర్తింపులోకి వచ్చారు. మల్లికార్జున్ ఖర్గే కాంగ్రెస్ పార్టీకి పరిణతి చెందిన, వివేకవంతమైన నాయకత్వాన్ని అందించారు. అయితే మోదీ తన రెండవ పాలనా కాలంలో చేపట్టిన విధానాలు, విభజన రాజకీయాలు, అథమ స్థాయి ఎన్నికల ప్రచార సరళి అనేవి టోకున కాంగ్రెస్ అదృష్టాన్ని పునరుద్ధరించడంలో తమ పాత్రను పోషించాయి. భారత్‌ను 'కాంగ్రెస్ ముక్త్'గా మారుస్తానని మోదీ 2014 ఎన్నికల ప్రచారాన్ని ప్రారంభించారు. 2024 ఎన్నికల ముగింపులో, అదే కాంగ్రెస్ పార్టీ పునరుద్ధరణలో తన వంతు కృషి చేసినందుకు మోదీకి ఆ పార్టీ కృతజ్ఞతలు చెప్పాలి. ఒక దశాబ్ద కాలంగా వెనుకబడి పోయిన దశ నుండి యవ్వన, శక్తిమంతమైన కాంగ్రెస్ ఉద్భవించింది.

మోదీ మూడోసారి ప్రధానిగా చరిత్ర సృష్టించబోతున్నారు. ప్రశ్న ఏమిటంటే, ఎన్డీయే ప్రభుత్వ సుస్థిరతకు బలహీనపడిన మోదీ ఏం చేస్తారు? మరీ ముఖ్యంగా, నారా చంద్రబాబు నాయుడు, నితీష్ కుమార్ వంటి మిత్రపక్షాలపై ఆధారపడబోతున్న ఎన్డీయే ప్రభుత్వ విధానం ఎలా ఉండబోతోంది? మరోసారి ప్రభుత్వ స్థాపన కోసం మోదీ తన 'హామీలు' ఇచ్చారు. అధికారం కోసం మోదీ పక్షాన ఉన్నప్పటికీ చంద్రబాబు గానీ, నితీష్‌గానీ బీజేపీ ఎజెండా వైపు సైద్ధాంతికంగా మొగ్గు చూపడం లేదు. మరి ఈ కలయిక పనిచేస్తుందా?

2024 జూన్ చాలావరకు 2004 మే లాగా అనిపిస్తుంది. ప్రతి రాజకీయ విశ్లేషకుడు, ఎన్నికల నిపుణుడు నాటి ప్రధాని అటల్ బిహారీ వాజ్‌పేయి నాయకత్వంలో ఎన్డీయే విజయం సాధిస్తుందని అంచనా వేశారు. కానీ ఫలితాలు రాగానే స్టాక్ మార్కెట్ తీవ్ర నష్టాల్లో కూరుకుపోయింది. కొన్ని గంటల్లోనే, యునైటెడ్ ప్రోగ్రెసివ్ అలయన్స్(యూపీఏ) అనే కొత్త కూటమికి శంకుస్థాపన జరిగింది. లెఫ్ట్ ఫ్రంట్ బయటి మద్దతుతో మన్మోహన్ సింగ్ నాయకత్వంలో ప్రభుత్వం ఏర్పడింది. అమిత్ షా... ప్రమోద్ మహాజన్ కావచ్చు గానీ మోదీ మాత్రం వాజ్‌పేయి కాదు. వాజ్‌పేయి వెనక్కి తగ్గారు. కానీ మోదీ, షా వెనక్కి తగ్గుతారా? మొత్తానికి ఎన్నికల ప్రచారం 'మోదీ కి గ్యారంటీ' గురించే. ఆయన హామీలను నిలబెట్టడానికి ఎన్డీయే ప్రభుత్వం సుముఖంగా ఉంటుందా?



చంద్రబాబు, నితీష్‌లపై దేశం ఒక ముఖ్యమైన బాధ్యతను మోపింది. ఇద్దరూ చిత్తశుద్ధి లేదా దార్శనిక దృష్టి గల వ్యక్తులుగా నిరూపితం కాలేదు. ఇద్దరూ స్వప్రయోజనాలు, అధికారం కోసం తహతహలాడుతున్నారు. అయినప్పటికీ, సాధారణ వ్యక్తుల నుండి హీరోయిజాన్ని డిమాండ్ చేసే విచిత్రమైన మార్గం చరిత్రకు ఉంది. విధి, రాజకీయాలు పీవీ నరసింహారావుకు ఎలాంటి పాత్రను కేటాయించడం జరిగిందో గుర్తుంచుకోండి. రాజకీయ విరమణ అంచున, ఆధ్యాత్మిక మార్గం పట్టడానికి తన బ్యాగులను సర్దుకుంటూన్న పీవీ నరసింహారావును ప్రధానమంత్రిని చేయడమే కాకుండా, దేశ విధిని మార్చే నిర్ణయాలను తీసుకునే బాధ్యతను కూడా చేపట్టేలా చేశాయి. మోదీ, షాల ఆధిపత్యంలో, నియంత్రణలో ఉన్న ప్రభుత్వానికి జూనియర్ భాగస్వాములుగా ఉన్న నితీష్, చంద్రబాబు అలాంటి పాత్ర పోషించగలరా? కష్టమే మరి. ఎందుకంటే ప్రధానమంత్రి ఆదేశం మేరకు అన్ని సంస్థలు ప్రతిరోజూ వారిని అదుపులో ఉంచుతాయి. మోదీ తన జీవిత పర్యంతం కఠినమైన రాజకీయ బేరసారాలను సాగిస్తూ వచ్చారు. సుష్మా స్వరాజ్‌ను పక్కన పెట్టి, అరుణ్ జైట్లీని తన విశ్వాసంలోకి తీసుకుని, లాల్ కృష్ణ అద్వానీ నుంచి బీజేపీని ఆయన ఎలా లాక్కున్నారో గుర్తు చేసుకోండి. ఇక్కడ ప్రశ్న ఏమిటంటే... చంద్రబాబు, నితీష్ అలాంటి బేరాలు చేసేంత గట్టిగా ఉండగలరా?

సంకీర్ణ ప్రభుత్వాల కంటే ఒకే పార్టీ మెజారిటీ ప్రభుత్వాలే మంచివి అని ఒక సాధారణ అభిప్రాయం ఉంది. కానీ వాస్తవాలు దీనికి భిన్నంగా ఉన్నాయి. అనేక విధాలుగా, స్వాతంత్ర్యానంతర మొదటి దశాబ్దం తర్వాత... ఆర్థికాభివృద్ధి, పేదరికం తగ్గింపు, ఉపాధి పెరుగుదల, ప్రపంచ ప్రొఫైల్ మరియు దేశీయ సామాజిక స్థిరత్వం వంటి అంశాల పరంగా దేశానికి అత్యుత్తమ కాలం 1991 నుండి 2014 వరకు గల పావు శతాబ్దం. ముగ్గురు మేధావులు, అందరినీ కలుపుకొనిపోయే వివేకవంతులైన పెద్దమనుషులు భారతదేశ ప్రధానులు అయ్యారు. పీవీ నరసింహా రావు, అటల్ బిహారీ వాజ్‌పేయి, మన్మోహన్ సింగ్ అప్పటి సంకీర్ణ ప్రభుత్వాలకు నాయకత్వం వహించారు. పీవీ విషయంలో కాంగ్రెస్ పార్టీయే స్వయంగా ఒక సంకీర్ణంలా పనిచేసింది. వాజ్‌పేయి, మన్మోహన్ స్పష్టమైన సంకీర్ణాలకు నాయకత్వం వహించారు. ఖర్గే వంటి మరో ప్రసన్నమైన పెద్దమనిషి నేతృత్వంలో సంకీర్ణ ప్రభుత్వం ఏర్పడితే, అది సుస్థిరతతో పాటు వివేకవంతమైన విధానాలను అందించదని నమ్మడానికి ఎటువంటి కారణమూ లేదు.

మోదీ వ్యక్తిత్వం, భావజాలం, ఆకాంక్షల దృష్ట్యా ఆయన మూడవసారి తన అధికార అన్వేషణలో అన్ని ప్రయత్నాలూ చేస్తారు. సంకీర్ణానికి ఆయన ఎలాంటి ప్రధానమంత్రి అవుతారో చూడాలి. తాను ఎలా ప్రవర్తిస్తారు, ఎలా పని చేస్తారు అనేది తన మిత్రపక్షాలు, తన సీనియర్ సహోద్యోగులు, బ్యూరోక్రసీ, జ్ఞానం, ధైర్యంపై ఆధారపడి ఉంటుంది. బ్యూరోక్రసీని వంగమని అడిగినప్పుడు తరచుగా అది పొర్లుదండాలు పెడుతుంది. మోదీ, షా పాలన భారత ప్రజాస్వామ్యంలోని ప్రతి వ్యవస్థనూ నిర్వీర్యం చేసింది. చంద్రబాబు, నితీష్ వారిని అదుపు చేయగలరా?

కన్యాకుమారి నుంచి న్యూఢిల్లీకి వెళ్లే విమానంలో మోదీ మూడు కీలకాంశాలను పేర్కొంటూ ఒక వ్యాసం రాశారు. మొదటిది – ఇకమీదట ఇండియా... భారత్ మాత్రమే! అధికారికంగా ఈ మార్పు చేయాలంటే, దానికి రాజ్యాంగ సవరణ అవసరం అవుతుంది. దీనిపై ఆయన ముందుకు సాగలేరు. రెండవది– 'జీవితంలో ప్రతి అంశంలో' దేశానికి సంస్కరణ అవసరమని సూచించడం ద్వారా మోదీ 'సంస్కరణ' అనే పదానికి కొత్త నిర్వచనాన్ని వివరించారు. తాజాగా బలహీనపడిన మోదీ అటువంటి సంస్కరణకు నాయకత్వం వహించగలనని భావిస్తున్నారా? మూడవది– దేశం 'కొత్త కల' కనవలసిన అవసరాన్ని ప్రస్తావిస్తూ చైనా అధ్యక్షుడు జిన్‌పింగ్‌ను మోదీ అనుకరించారు. ఒక దశాబ్దం క్రితం 'అమెరికన్ డ్రీమ్'లోంచి జిన్‌పింగ్ 'చైనా డ్రీమ్'ను ఎక్కువ భాగం అరువు తెచ్చుకున్నారు. కాకపోతే అమెరికన్ స్వప్నం, చైనా స్వప్నం రెండూ 'మంచి జీవితాన్ని గడపడం' గురించినవి. దేశ ప్రజలు 'వికసిత్ భారత్' కావాలని కల కనాలని మోదీ అంటున్నారు.

తదుపరి కేంద్ర ప్రభుత్వానికి ఎవరు నాయకత్వం వహిస్తారనే దానితో సంబంధం లేకుండా భారతదేశం 'వికసిత్'గా ఉంటుంది. కాబట్టి, లోక్‌సభలో 400కు పైగా స్థానాల మోదీ కల సాకారం కానప్పటికీ, అభివృద్ధి చెందిన దేశంగా మారాలనే దేశ స్వప్నం మాత్రం కాలక్రమేణా సాకారం అవుతుంది. బీజేపీ, ఇంకా మోదీ విషయానికొస్తే, ఓటర్ల మేల్కొలుపు పిలుపుతో వారి కలలు చెదిరిపోయాయి.

వ్యాసకర్త సీనియర్ జర్నలిస్ట్
('ద ట్రిబ్యూన్' సౌజన్యంతో)

సోషల్ నెట్ వర్కింగ్ వెబ్‌సైట్లు ఫేస్‌బుక్, ట్విట్టర్‌లలో సెలబ్రిటీల 'మనసులోని మాట'లు తాజాగా ఇలా...!

సోషల్ మీడియా

లేరు లెజెండ్స్

ఇరవై ఏళ్లలో తొలిసారి... అవును, ఇరవై ఏళ్లలో తొలిసారి... పురుషుల ఫ్రెంచ్ ఓపెన్ సెమీఫైనల్స్‌లో నాదల్, ఫెదరర్, జొకొవిచ్ ఆడటం లేదు.

– ఎం.ఎస్.పార్థ్, ఫెదరర్ అభిమాని

మరో దేశం

అంతర్జాతీయ నేర న్యాయస్థానంలో ఇజ్రాయెల్‌కు వ్యతిరేకంగా సాగుతున్న నరమేధం కేసులో దక్షిణాఫ్రికాతో చేతులు కలుపుతు న్నట్టు స్పెయిన్ ప్రకటించింది. ఈ కేసులో చేరుతున్న మొదటి యూరప్ దేశం అది.

– కార్లోస్ అజెవేడో, పోర్చుగల్ యాక్టివిస్ట్

మర్యాద ముఖ్యం

తమ సాటి మనుషులను దూషించేవాళ్లు, అదేపనిగా అవమానించేవాళ్లు ఇస్లాం ప్రవక్త ప్రేమికులు కాలేరు. మర్యాదపూర్వకంగా ఒక చర్చలో భాగం కాలేనివాళ్లు విశ్వాస సంరక్షకులు కాలేరు; అది ఏ విశ్వాసం అయినా సరే. కొంతమంది మనుషులను నిందిస్తూనే ఉంటారు. వాళ్లు ప్రవక్తను ప్రేమించలేరు.

– గౌహర్ గిలానీ, కాలమిస్ట్

పొరుగు ముఖ్యం

నూతన మోదీ ప్రభుత్వ ప్రమాణ స్వీకారోత్సవానికి మాల్దీవుల అధ్యక్షుడు ముయిజునూ కూడా ఆహ్వానించారు. ఇరుగు పొరుగు ముందు! ఎప్పటికీ మాల్దీవులు వ్యూహాత్మకంగా ఇండియాకు చాలా ప్రాధాన్యం కలిగినదే.

– గీతా మోహన్, జర్నలిస్ట్

వివరణ రావాలి!

500 కంటే తక్కువ ఓట్ల మార్జిన్‌తో బీజేపీ 30 స్థానాలు గెలిచింది. 1000 కంటే తక్కువ మార్జిన్‌తో 100కు పైగా గెలిచింది. ఇంత తక్కువ మార్జిన్లు ఉన్నప్పుడు వాటిని ఏమార్చడానికి అవకాశం ఉంటుందని అశోకా యూనివర్సిటీ ప్రొఫెసర్ (సవ్యసాచి దాస్) చెప్పింది గుర్తుందా? అదనపు ఓట్ల గురించి ఎన్నికల కమిషన్ ఇంకా వివరించాల్సే ఉంది. ఈ స్థానాలను విశ్లేషించడం ఉపయుక్తంగా ఉంటుంది.

– కె. సుజాతా రావు, ప్రభుత్వ మాజీ ఉన్నతాధికారి

తెలుస్తోందా?

పాలస్తీనియన్ లెజిస్లేటివ్ కౌన్సిల్‌లో ఎంతమంది యూదులున్నారు? సున్నా. ఇజ్రాయెల్ పార్లమెంటులో ఎంతమంది ముస్లిం అరబ్బులున్నారు? పది మంది. గాజాలో ఎంత మంది యూదులు నివసించగలరు? సున్నా. ఎంత మంది అరబ్బు ముస్లింలు ఇజ్రాయెల్‌లో నివసిస్తున్నారు? 16 లక్షలు. సమస్య ఎక్కడుందో, పరిష్కారం ఎవరు కోరుతున్నారో స్పష్టం.

– అమ్జద్ తాహా, పశ్చిమాసియా అంశాల వ్యాఖ్యాత

ఈ మాత్రానికే...

అహంకారం, మితిమీరిన ఆత్మవిశ్వాసం అని బీజేపీని చాలామంది నిందిస్తున్నారు. వాళ్లకు నాది ఒకటే ప్రశ్న. కేవలం 99 స్థానాలు మాత్రమే గెలిచిన కాంగ్రెస్ నిన్నటి నుంచి ఎట్లా నీలుగుతున్నదో మీరు అసలు గమనించారా?

– అద్వైత కళ, సినిమా రచయిత

ఇన్ బాక్స్

నమ్మకాన్ని వమ్ము చేయొద్దు!

పార్లమెంట్ ఎన్నికల్లో దేశవ్యాప్తంగా ప్రజలు ఎన్డీఏకి వ్యతిరేకంగా తీర్పునిచ్చారు. మోదీ హవా లేదనేది స్పష్టమైంది. 'భారతదేశాన్ని రక్షించండి! ప్రజాస్వామ్యాన్ని కాపాడండి!' అని దేశవ్యాప్తంగా 'ఇండియా' కూటమి, దాని భాగస్వామ్య పార్టీలు, సోషల్ మీడియా మేధావులు, అనేకమంది జర్నలిస్టులు చేసిన కృషి, ప్రజల స్పందన ద్వారా భారతదేశ లౌకిక సమాఖ్య స్ఫూర్తి కాపాడ బడింది. 400 సీట్లకు పైగా సాధించాలన్న బీజేపీ కల నెరవేరలేదు. ఎన్డీఏ 293 సీట్లతో సరి పెట్టుకోవాల్సి వచ్చింది. 'ఇండియా' కూటమి తన బలాన్ని పెంచుకొని 233 సీట్లు పొందగలిగింది.

రామ జపం చేసిన అయోధ్యలో కూడా బీజేపీ ఓడిపోయింది. యూపీలో అధికారంలో ఉండి కూడా కేవలం 37 సీట్లకే పరిమితమైంది. 'ఇండియా' కూటమి 43 స్థానాలు కైవసం చేసుకుంది. మహారాష్ట్రలో శివసేన కూటమిని విచ్ఛిన్నం చేసినందుకు ఎన్డీఏను ప్రజలు తిరస్కరించారు. 30 సీట్లు గెలుచుకొని 'ఇండియా' కూటమి బీజేపీని నివ్వెరపరిచింది. బెంగాల్‌లో మమతా బెనర్జీ తన పట్టు నిలబెట్టుకుంది. దక్షిణాదిన బలం పెంచుకోవాలని చూసిన బీజేపీ తమిళనాడులో ఒక్క సీటూ గెలవలేదు. కేరళలో ఒక్క స్థానం పొందింది. కర్ణాటకలో ఎనిమిది స్థానాలు కోల్పోవాల్సి వచ్చింది. ఆంధ్రప్రదేశ్‌లో టీడీపీ– జనసేనలతో కలిసి 21 స్థానాలు గెలుచుకుంది. తెలంగాణలో కేసీఆర్ వైఫల్యం బీజేపీకి అనుకూలించింది. జాతీయ రాజకీయాల్లో నేషనల్ ఫ్రంట్ పెట్టి ఆనాడు ఎన్టీఆర్ చరిత్ర సృష్టించారు. నేడు మతోన్మాద ఎన్డీఏ పాలన మైనారిటీల పైనా, దళితులపైనా దాడులు కొనసాగిస్తూ రాజ్యాంగ స్ఫూర్తికి విఘాతం కల్పిస్తున్న విధానాలను చంద్రబాబు సమీక్ష చేసుకొని ఎన్డీఏ భాగస్వామ్యం విషయంలో పునరాలోచన చేయాలి. భారతదేశ లౌకిక ఫెడరల్ స్ఫూర్తిని కాపాడాల్సిన చారిత్రక కర్తవ్యం చంద్రబాబుపై ఉంది. బిహార్‌లో నితీష్ కుమార్ సైతం ఎన్డీఏ కూటమి నుండి వేరు పడకపోతే తీవ్రంగా నష్టపోయే ప్రమాదం ఉంది. ప్రజల తీర్పును గౌరవించి ఫాసిస్ట్ శక్తులను మూడోసారి అధికార పీఠం ఎక్కకుండా నిరోధించాలి.

– దినవహి హరినాథ్

తూర్పు ఆసియాలో కొత్త సమీకరణాలు

అభిప్రాయం



రెహానా

నాలుగున్నర ఏళ్ళ తర్వాత సియోల్ వేదికగా చైనా, జపాన్, దక్షిణ కొరియా దేశాల మధ్య జరిగిన త్రైపాక్షిక సమావేశం ప్రపంచ రాజకీయ నాయకులు, విశ్లేషకుల్లో ఆసక్తిని రేపుతోంది. తూర్పు ఆసియాలో భౌగోళిక రాజకీయాల్లో కొత్త సమీకరణాల దిశగా అడుగులు పడనున్నాయా అన్న చర్చ మొదలయ్యింది. ఒకరిపై ఒకరికి ఉన్న అనుమానాలు, ఉద్రిక్తతలు పక్కన పెట్టి స్నేహ సంబంధాల బలోపేతానికి జరుగుతున్న ఈ ప్రయత్నాన్ని భారత దేశం కూడా నిశితంగా గమనించాల్సిందే.

వాస్తవంగా 2008లోనే చైనా, జపాన్, దక్షిణ కొరియా ఒక కూటమిగా ఏర్పడ్డాయి. చివరిసారిగా 2019లో త్రైపాక్షిక సమావేశం జరిగింది. వాస్తవంగా ఈ మూడు దేశాల మధ్య త్రిముఖ కోణాల్లో సంఘర్షణలు ఉన్నాయి. జపాన్–దక్షిణ కొరియా దేశాల మధ్య శత్రుత్వానికి చారిత్రక నేపథ్యమే ఉంది. 1910 నుంచి 1945లో రెండో ప్రపంచ యుద్ధం ముగిసే వరకు జపాన్ వలస పాలనలో దక్షిణ కొరియా మగ్గింది. అందుకే ఆ దేశం ఇప్పటికీ జపాన్ చేసిన గాయాలను మర్చిపోలేదు. అటు చైనా– జపాన్ మధ్య కూడా గత ఏడాది ఉద్రిక్త పరిస్థితులు నెలకొన్నాయి. ఫుకుషిమా న్యూక్లియర్ రియాక్టర్ నుంచి వ్యర్థ జలాలను శుద్ధి చేసి పసిఫిక్ సముద్రంలో జపాన్ విడుదల చేయటాన్ని చైనా తీవ్రంగా వ్యతిరేకించింది. ప్రపంచ స్థాయి ప్రమాణాలకు అనుగుణంగానే జపాన్ నీటిని విడుదల చేస్తోందని అంతర్జాతీయ అటామిక్ ఎనర్జీ ఏజెన్సీ, ఐక్యరాజ్య సమితి స్పష్టం చేసినా చైనా మాత్రం వెనక్కి తగ్గలేదు. జపాన్ నుంచి చేపల దిగుమతిపై చైనా, దక్షిణ కొరియాలు ఆంక్షలు విధించాయి. చైనా–జపాన్ దేశాల మధ్య ఉన్న డియాయు ద్వీపం ప్రాదేశిక జలాల్లో నాలుగు నెలల కిందట చైనా గస్తీ నిర్వహించటంతో ఇరు దేశాల మధ్య మళ్ళీ ఉద్రిక్తతలు తలెత్తాయి. తూర్పు చైనా సముద్రంలోని సెంకాకు ద్వీపాలకు సంబంధించి ఇరు దేశాల మధ్య వివాదం చాలా కాలంగా కొనసాగుతూనే ఉంది. వాస్తవంగా రెండో ప్రపంచ యుద్ధ సమయం అంటే 1939–1945 మధ్య కాలంలో దక్షిణ చైనా సముద్ర ప్రాంతం జపాన్ అధీనంలోనే ఉండేది. యుద్ధంలో జపాన్ ఓటమితో ఈ ప్రాంతంలో చైనా ప్రాబల్యం పెరిగింది. మరోవైపు అమెరికాతో తమ సంబంధాల బలోపేతానికి దక్షిణ కొరియా కృషి చేస్తుండటాన్ని చైనా జీర్ణించుకులేకపోతోంది.

ఇక దక్షిణ చైనా సముద్రం, ఇండో పసిఫిక్ జలాల్లో చైనా దూకుడు పెంచటంతో జపాన్, దక్షిణ కొరియాల్లో ఆందోళన ఉంది. ఇలా మూడు దేశాల మధ్య వివిధ అంశాల్లో తీవ్ర విభేదాలు, అపనమ్మకాలు, ఉద్రిక్త పరిస్థితులు ఉన్నా... ప్రస్తుతం అన్నింటినీ పక్కన పెట్టి ఒకే తాటిపైకి రావటం ఆసియా ఖండంలో కీలక పరిణామం. చైనా అధ్యక్షుడి తర్వాత నంబర్ టూ గా పరిగణించే ప్రీమియర్... లీ కియాంగ్ అన్నట్లు ఇది మరో శుభారంభం. ఈ సమావేశంలో మూడు దేశాలు పరస్పర సహకారం, భద్రత, వాణిజ్యం, వాతావరణ మార్పులు, పర్యావరణ పరిరక్షణ, పెరుగుతున్న వృద్ధ జనాభా సమస్య వంటి కీలక అంశాలపై చర్చతో పాటు ఫ్రీ ట్రేడ్ అగ్రిమెంట్ దిశగా అడుగులు వడిగా వేయటం మరో ప్రధాన విషయం.



ఈ మూడు తూర్పు ఆసియా దేశాల మధ్య సంబంధాల ప్రభావం ప్రపంచంపై కూడా ఉంటుంది అనటానికి వీరి గ్లోబల్ డొమెస్టిక్ ప్రొడక్ట్ వాల్యూమ్ ఒక ప్రామాణికం. గ్లోబల్ గ్రాస్ డొమెస్టిక్ ప్రోడక్ట్‌లో 25 శాతం వాటా ఈ మూడు దేశాలదే. అంతే కాదు జపాన్, సౌత్ కొరియాలకు చైనా అతిపెద్ద వాణిజ్య భాగస్వామి. ఇక్కడే మరో ఈక్వేషన్ కూడా ఉంది. ఆసియా ఖండంలో బలమైన ఆర్థిక వ్యవస్థగా మారి తనకు సవాలు విసురుతున్న చైనా ప్రాబల్యాన్ని అడ్డుకోవటానికి అమెరికాకు ఆసియాలో బలమైన స్నేహితులు కావాలి. అందుకే దక్షిణ కొరియా, జపాన్‌లతో కలిసి అగ్రరాజ్యం మిలటరీ డ్రిల్స్‌ను విస్తరిస్తోంది. అదే సమయంలో ఈ రెండు దేశాలకూ, అమెరికాకు మధ్య దూరం పెరగాలని ఆకాంక్షిస్తోంది చైనా. ఆసియా ఖండంలో శాంతి సామరస్యాలు పెరగటాన్ని ఆహ్వానించాల్సిందే. అయితే అదే సమయంలో ఈ భౌగోళిక రాజకీయ పరిణామాలు, మరింత బలపడేందుకు డ్రాగన్ చేస్తున్న ప్రయత్నాల పట్ల మన దేశం అప్రమత్తంగా ఉండాలి.

వ్యాసకర్త ఏపీ సమాచార కమిషనర్, ఆంధ్రప్రదేశ్

పొద్దు పోతున్నది...

'పొద్దు పోయెనే శ్రీరాముని పూని భజింపవే మనసా!'
అని దిగులు పడతారు త్యాగరాజ స్వామి ఒక కీర్తనలో.

'నిద్దుర చేత కొన్నాళ్ళు, విషయ/ బుద్ధుల చేత కొన్నాళ్ళు' అంటూ... జీవితంలో మూడోవంతు కాలం నిద్రలోనూ; ఇంద్రియ విషయాల మీదా, సుఖాల మీదా ఉన్న ఆరాటం తీర్చుకునే ప్రయత్నంలో మరింత కాలం వ్యయమై పోతుండె! అని వాపోయారు.

పొద్దున లేచి, త్రితాపములను, నరుల/ పొగడి, పొగడి కొన్నాళ్ళు, వట్టి ఎద్దు రీతి, కన్నతావుల భుజియించి,/ ఏమి తెలియక కొన్నాళ్ళు, ముద్దుగ తోచు భవసాగరమున/మునిగి లేచుచు కొన్నాళ్ళు, పద్దుమాలిన పామర జనులతో వెర్రి/ పలుకులాడుచు కొన్నాళ్ళు, ఓ మనసా!

జ్యోతిర్మయం

ఉదయం లేచినప్పట్నుంచి, తాపత్రయ పడుతూ, వాళ్ళకూ వీళ్ళకూ భజన చేస్తూ, కేవలం పశువులా ఎక్కడ ఏది కనిపిస్తే దాన్నంతా భుజిస్తూ, పైపై మెరుగులతో ఆకర్షించే సంసార సాగరంలో మునకలు వేస్తూ ఉండటంలోనూ, సాటి అజ్ఞానులతో సారహీనమైన పోచికోలు చర్చలలోనూ చాలాకాలం నష్టమై పోతుండె!

ముదమున ధన, తనయ, ఆగారముల చూచి/ మదము చేత కొన్నాళ్ళు, అందు, చెదిరినంత, శోకార్ణవగతుడై/జాలి చెందుటయు కొన్నాళ్ళు, ఎదటి పచ్చ చూచి తాళలేక, తా/ నిలను తిరుగుట కొన్నాళ్ళు, ముదిమది తప్పిన ముసలితనమున/ ముందు వెనక తెలియక కొన్నాళ్ళు.

కొన్నాళ్ళు ధనమూ, సంతానమూ, ఇల్లూ అనుకుంటూ, వాటిని చూసి మదించటంలో గడిచె. అవి బెడిసికొడితే, మళ్ళీ దుఃఖంలో మునిగి, దైన్యతలో కొన్నాళ్ళు. ఎదుటివాడు పచ్చగా ఉంటే, ఏడుస్తూ కొన్నాళ్ళు. పెద్ద వయసు మీదపడేసరికి, బుద్ధి పనిచేయని స్థితిలో కొన్నాళ్ళు... మొత్తం మీద, **బాగుగ నామ కీర్తనములు సేయుటే, భాగ్యమని అనక త్యాగరాజ నుతుడైన శ్రీరాముని తత్త్వము తెలియక కొన్నాళ్ళు.** ఎంతో పొద్దు గడిచింది. గమనించుకొని, పొద్దు కొంతయినా మిగిలి ఉండగానే, కోదండ రాముడి మీద మనసు పెట్టి భజించకపోతే, జన్మ వ్యర్థం అని నాదబ్రహ్మ హెచ్చరిక.

– ఎం. మారుతి శాస్త్రి



ఎస్సారెస్పీలో బాహుబలి చేపలు

డొంకేశ్వర్(ఆర్మూర్): శ్రీరాంసాగర్ ప్రాజెక్టు బ్యాక్ వాటర్‌లో బాహుబలి చేపలు లభ్యమవుతున్నాయి. ఇటీవల నిజామాబాద్ జిల్లా డొంకేశ్వర్ మండలం అన్నారం గ్రామానికి చెందిన ఓ మత్స్యకారుడికి 23 కిలోల చేప చిక్కింది. తాజాగా సిర్పూర్ గ్రామానికి చెందిన శ్రీనివాస్, స్వరాజ్ అనే మత్స్యకారులకు ఒకేసారి భారీ సైజున్న రెండు బొచ్చ రకానికి చెందిన చేపలు పడ్డాయి. అందులో ఒకటి 32 కిలోలు, మరొకటి 31 కిలోలు ఉండటం విశేషం. ఇంత పెద్ద చేపలు ఎస్సారెస్పీ బ్యాక్ వాటర్‌లో చిక్కడం ఇదే తొలిసారని మత్స్యకారులు చెబుతున్నారు. ఒక్కో దాని వయసు ఆరేడేళ్లు ఉంటుందని, ఇలాంటి చేపల వలన చేప పిల్లల ఉత్పత్తి బాగా పెరుగుతుందని జిల్లా మత్స్య శాఖ అధికారి రాజనర్సయ్య 'సాక్షి'తో తెలిపారు.

డీజీపీ, పలువురు కమిషనర్ల మార్పు?

పోలీస్ శాఖలో భారీ ప్రక్షాళన!

- ఎన్నికల కోడ్ ముగియడంతో బదిలీలపై సర్కార్ కసరత్తు
- డీజీపీ రేసులో శివధర్‌రెడ్డి, జితేందర్, సీవీ ఆనంద్
- పని భారం ఉన్న అధికారులకు ఉపశమనం కలిగించేలా పోస్టింగులు
- ఒకటి, రెండు రోజుల్లోనే ఉత్తర్వులు వెలువడే అవకాశం



సాక్షి, హైదరాబాద్: వరుస ఎన్నికల హడావుడి, కోడ్ ముగియడంతో పాలనపై దృష్టి సారించిన ప్రభుత్వం.. అత్యంత కీలకమైన పోలీస్ శాఖలో భారీ ప్రక్షాళనకు సిద్ధమవుతున్నట్టు తెలుస్తోంది. తనదైన టీంను సెట్ చేసుకోవడంపై సీఎం రేవంత్ రెడ్డి ఇప్పటికే కసరత్తు పూర్తి చేశారని, పెద్ద సంఖ్యలో ఐపీఎస్ అధికారుల బదిలీలు జరిగే అవకాశం ఉన్నట్టు సమాచారం. డీజీపీ, పలువురు పోలీస్ కమిషనర్లు సహా పలు కీలక పోస్టుల్లో ఉన్న అధికారులకు స్థాన చలనం తప్పదనే చర్చ జోరుగా నడుస్తోంది. కీలక బాధ్యతల్లో కొత్త అధికారులను నియమించడంతో పాటు ఇప్పటికే ఒకటికి మించి అదనపు పోస్టులతో పని భారం ఉన్న అధికారులకు ఉపశమనం కలిగించే అవకాశం ఉన్నట్టు తెలుస్తోంది. ఈ మేరకు ఒకట్రెండురోజుల్లోనే ఉత్తర్వులు వెలువడే చాన్స్ ఉందని సమాచారం.

శివధర్‌రెడ్డి వైపు సర్కారు మొగ్గు

ప్రస్తుతం డీజీపీ (హెచ్‌ఓపీఎఫ్–హెడ్ఆఫ్ పోలీస్ ఫోర్స్)గా ఉన్న రవిగుప్తా స్థానంలో కొత్త డీజీపీ (హెచ్ఓపీఎఫ్)గా సీనియర్ ఐపీఎస్ అధికారులు సీవీ ఆనంద్, శివధర్‌రెడ్డి, జితేందర్‌ల పేర్లు ప్రముఖంగా వినిపిస్తున్నాయి. ప్రస్తుతం డీజీ ర్యాంకులో ఉన్న సీవీ ఆనంద్ అత్యంత కీలకమైన ఏసీబీ డీజీ పోస్టులో ఉన్నారు. డీజీ ర్యాంకులో ఉన్న మరో అధికారి జితేందర్ హోంశాఖ ముఖ్య కార్యదర్శిగా ఉన్నారు. అయితే ప్రభుత్వం మాత్రం సీనియర్ ఐపీఎస్ శివధర్‌రెడ్డి వైపే మొగ్గు చూపుతున్నట్టు ప్రచారం జరుగుతోంది. ప్రస్తుతం అడిషనల్ డీజీ ర్యాంకులో ఇంటిలిజెన్స్ చీఫ్‌గా ఉన్న శివధర్‌రెడ్డిని ఇటీవల ఏర్పడిన రెండు డీజీపీ ర్యాంకు ఖాళీల భర్తీలో భాగంగా పదోన్నతి ఇచ్చి పోలీస్ బాస్‌గా నియమించే అవకాశం ఉన్నట్టు తెలుస్తోంది.

ఇద్దరికి డీజీపీలుగా పదోన్నతి

ప్రస్తుతం డీజీపీ ర్యాంకులో నలుగురు సీనియర్ ఐపీఎస్‌లు కొనసాగుతున్నారు. వీరిలో రవిగుప్తాతో పాటు అసెంబ్లీ ఎన్నికల ఫలితాల సమయంలో అనూహ్యంగా రోడ్డు సేఫ్టీ అథారిటీ చైర్మన్‌గా బదిలీ అయిన అంజనీకుమార్, సీవీ ఆనంద్, జితేందర్ ఉన్నారు. డీజీపీ ర్యాంకులోనే విజిలెన్స్ డీజీగా ఉన్న రాజీవ్‌రతన్ గుండెపోటుతో హఠాన్మరణం పాలయ్యారు. అదేవిధంగా టీఎస్ నార్కోటిక్స్ బ్యూరో డైరెక్టర్‌గా పనిచేసిన సందీప్ శాండిల్య కొద్దిరోజుల క్రితం పదవీ విరమణ పొందారు. ఇలా రెండు డీజీపీ ర్యాంకులు ఖాళీ అయ్యాయి. ప్రస్తుతం హైదరాబాద్ సీపీగా ఉన్న కొత్తకోట శ్రీనివాస్‌రెడ్డి, ఇంటిలిజెన్స్ అడిషనల్ డీజీగా ఉన్న శివధర్‌రెడ్డిలకు డీజీపీలుగా పదోన్నతి లభించే అవకాశం ఉంది.

ఆ ముగ్గురు కమిషనర్లు కూడా..

కరీంనగర్ పోలీస్ కమిషనర్ అభిషేక్ మొహంతి, వరంగల్ కమిషనర్ అంబర్ కిషోర్‌ఝా, రామగుండం సీపీ శ్రీనివాసులుకు స్థాన చలనం కలిగే అవకాశం ఉన్నట్టు ప్రచారం ఉంది. ఇంటిలిజెన్స్ ఏడీజీ పోస్టులో ఉన్న శివధర్‌రెడ్డికి డీజీపీగా బాధ్యతలు అప్పగిస్తే ఆ స్థానంలోకి మరో సీనియర్ ఐపీఎస్ అధికారి రమేశ్‌రెడ్డి వెళ్లే అవకాశం ఉన్నట్టు తెలుస్తోంది. ఇక ప్రస్తుతం అడిషనల్ డీజీగా ఉన్న శిఖా గోయల్ వద్ద కీలక పోస్టులైన సీఐడీ, మహిళా భద్రత విభాగం, టీఎస్ సైబర్ సెక్యూరిటీ బ్యూరోలు ఉన్నాయి. వీటిలో కొన్నింటిని ఇతర ఐపీఎస్‌లకు అప్పగించే అవకాశం ఉంది. హైదరాబాద్ పోలీస్ కమిషనరేట్‌లో అత్యంత కీలకమైన ట్రాఫిక్ అడిషనల్ సీపీ, స్పెషల్ బ్రాంచ్ అడిషనల్ సీపీ, క్రైమ్స్ అడిషనల్ సీపీ పోస్టులు ఖాళీగా ఉన్నాయి. ఉన్న అధికారులకే అదనపు బాధ్యతలు అప్పగించి కొనసాగిస్తున్నారు. ఆర్గనైజేషన్ ఐజీగా ఉన్న విశ్వప్రసాద్‌కే మళ్లీ ట్రాఫిక్ అడిషనల్ సీపీ పోస్టును ఇచ్చే చాన్స్ ఉన్నట్లు తెలుస్తోంది. అదేవిధంగా చాలా జిల్లాల ఎస్పీలు, డీసీపీలు ఎన్నికల బదిలీల్లో భాగంగా పోస్టింగ్‌లు పొందారు. వారిలో కొందరిని ప్రభుత్వం తమ ప్రాధాన్యాల మేరకు బదిలీ చేసి, ఆ స్థానాల్లో కొత్తవారికి బాధ్యతలు అప్పగించే అవకాశం కూడా ఉన్నట్లు సమాచారం.

హైదరాబాద్‌కూ కొత్త సీపీ?

రాష్ట్రంలో హైదరాబాద్, సైబరాబాద్, రాచకొండ సహా మొత్తం 9 పోలీస్ కమిషనరేట్లు ఉన్నాయి. కాగా త్వరలో జరగనున్న బదిలీల్లో ఎక్కువ మంది పోలీస్ కమిషనర్లకు స్థాన చలనం తప్పదనే వార్తలు వస్తున్నాయి. కమిషనర్ల తీరుపై రాజకీయ నాయకులు, సొంత శాఖలోని అధికారులు, సామాన్యుల నుంచి వచ్చిన ప్రతి స్పందనలు ప్రాతిపదికగా తీసుకుని బదిలీలు చేసే చాన్స్ ఉన్నట్టు తెలుస్తోంది. ప్రస్తుతం హైదరాబాద్ సీపీగా కొనసాగుతున్న కొత్తకోట శ్రీనివాస్‌రెడ్డి బదిలీ అయ్యే అవకాశం ఉన్నట్టు ప్రచారం జరుగుతోంది. ఆయన స్థానంలో హైదరాబాద్ సీపీ పోస్టుకు టీఎస్ఆర్టీసీ ఎండీగా పనిచేస్తున్న వీసీ సజ్జనార్, రైల్వే, రోడ్డు భద్రత అడిషనల్ డీజీగా ఉన్న మహేశ్ భగవత్, అగ్నిమాపక శాఖ డీజీగా ఉన్న నాగిరెడ్డి పోటీలో ఉండే అవకాశం ఉన్నట్టు తెలుస్తోంది. ఎన్నికల కోడ్ కారణంగా రాచకొండ సీపీగా ఉన్న సుధీర్‌బాబు అనూహ్యంగా బదిలీ కావడంతో ఐజీ తరుణ్ జోషీకి రాచకొండ సీపీగా బాధ్యతలు అప్పగించారు. అయితే సుధీర్‌బాబు తిరిగి సీపీగా వెళ్లే అవకాశం ఉందనే చర్చ జరుగుతోంది. మరోవైపు గతంలో ఈ పోస్టులో పనిచేసి, పౌరసరఫరాల కమిషనర్‌గా బదిలీ అయిన డీఎస్ చౌహాన్ పేరు సైతం పరిశీలనలో ఉన్నట్టు తెలుస్తోంది.

రెండ్రోజులు మోస్తరు నుంచి

భారీ వర్షాలు

- వాతావరణ శాఖ అంచనా
- హైదరాబాద్ సహా 14 జిల్లాలకు ఎల్లో అలర్ట్.. రాష్ట్రంలో చురుకుగా నైరుతి

సాక్షి, హైదరాబాద్: రానున్న రెండ్రోజులు రాష్ట్రంలోని పలు ప్రాంతాల్లో తేలికపాటి నుంచి మోస్తరు వర్షాలు, కొన్నిచోట్ల మోస్తరు నుంచి భారీ వర్షాలు కురిసే అవకాశం ఉన్నట్లు వాతావరణ శాఖ తెలిపింది. రాష్ట్రంలో నైరుతి రుతుపవనాలు చురుకుగా కదులుతున్నాయి. ఇప్పటికే తెలంగాణ ఉత్తర జిల్లాల్లో విస్తరించాయి. రానున్న 3 రోజుల్లో పూర్తిస్థాయిలో విస్తరించే అవకాశం ఉన్నట్లు వాతావరణ శాఖ తెలిపింది. రుతుపవనాల కదలికల నేపథ్యంలో రాష్ట్రంలోని పలుచోట్ల వర్షాలు కురిసే అవకాశం ఉందని సూచించింది. ఆదిలాబాద్, నల్లగొండ, రంగారెడ్డి, హైదరాబాద్, మేడ్చల్ మల్కాజిగిరి, వికారాబాద్, సంగారెడ్డి, మెదక్, కామారెడ్డి, మహబూబ్‌నగర్, నాగర్‌కర్నూల్, వనపర్తి, నారాయణపేట, జోగుళాంబ గద్వాల జిల్లాల్లోని పలుచోట్ల మోస్తరు నుంచి భారీ వర్షాలు కురుస్తాయని వివరించింది. ఆయా జిల్లాలకు ఎల్లో అలర్ట్ జారీ చేసింది. మరోవైపు రాష్ట్రంలో గరిష్ట ఉష్ణోగ్రతలు తగ్గుముఖం పట్టాయి. ఉక్కపోత కూడా క్రమంగా తగ్గుతోంది. గురువారం చాలాచోట్ల సాధారణ ఉష్ణోగ్రతలు, కొన్నిచోట్ల సాధారణం కంటే తక్కువగా గరిష్ట ఉష్ణోగ్రతలు నమోదయ్యాయి. రాష్ట్రంలోని ప్రధాన ప్రాంతాల్లో నమోదైన ఉష్ణోగ్రతలు పరిశీలిస్తే గరిష్ట ఉష్ణోగ్రత నిజామాబాద్‌లో 40.1 డిగ్రీ సెల్సియస్, కనిష్ట ఉష్ణోగ్రత మెదక్‌లో 23.3 డిగ్రీ సెల్సియస్ నమోదయ్యాయి.

క్లుప్తంగా...

డైరెక్టర్ అపహరణకు యత్నం..

- సిరిసిల్ల 'అర్బన్ బ్యాంకు' ఎన్నికల్లో హైడ్రామా



కౌంటింగ్ సెంటర్ ముందు వివిధ పార్టీల కార్యకర్తలపై పోలీసుల లాఠీచార్జి

సిరిసిల్ల: సిరిసిల్ల సహకార అర్బన్ బ్యాంకు పాలకవర్గ ఎన్నికల్లో హైడ్రామా చోటు చేసుకుంది. గురువారం ఫలితాలు వెలువడగానే బీఆర్ఎస్ బలపరిచిన అభ్యర్థి కోడం సంజీవ్‌ను బీజేపీ, కాంగ్రెస్ వర్గాలు అపహరించేందుకు యత్నించాయి. అయితే వారి ప్రయత్నాలను బీఆర్ఎస్ శ్రేణులు అడ్డుకున్నారు. దీంతో తోపులాట జరగ్గా, పోలీసులు లాఠీచార్జ్ చేసి ఇరువర్గాలను చెదరగొట్టారు. లాఠీచార్జ్‌లో కాంగ్రెస్ పార్టీకి చెందిన వారికి దెబ్బలు తగిలాయి. దీంతో ఆ పార్టీ నాయకులు చొప్పదండి ప్రకాశ్, సంగీతం శ్రీనివాస్ పోలీసులతో వాగ్వాదానికి దిగారు. పోలీసుల తీరుపై నిరసన వ్యక్తం చేశారు. అర్బన్ బ్యాంకు 12 డైరెక్టర్ల పదవులకు ఎన్నికలు జరగ్గా బీఆర్ఎస్ బలపరిచిన 8 మంది విజయం సాధించారు. కాంగ్రెస్ నుంచి ఒకరు, బీజేపీ బలపరిచిన మరొకరు విజయం సాధించగా, ఇద్దరు ఇండిపెండెంట్లు గెలిచారు. ఆ ఇద్దరు సైతం బీఆర్ఎస్ క్యాంపునకు వెళ్లారు. అయితే ఓట్ల లెక్కింపు సందర్భంగా ఉత్కంఠ నెలకొంది. 4వ డివిజన్‌లో రీకౌంటింగ్ చేశారు. నాలుగు ఓట్ల తేడాతో బీఆర్ఎస్‌కు చెందిన అడ్డగట్ల మురళి గెలిచారు. శుక్రవారం చైర్మన్, వైస్‌చైర్మన్ ఎన్నికకు సమావేశం నిర్వహించనున్నారు.

రామగుండంలో స్టేజీ-2కు గ్రీన్‌సిగ్నల్

జ్యోతినగర్(రామగుండం): పెద్దపల్లి జిల్లా రామగుండంలో 2400 మెగావాట్ల థర్మల్ పవర్ ప్రాజెక్టు నిర్మాణానికి గ్రీన్‌సిగ్నల్ లభించింది. ఈమేరకు అంతర్జాతీయ బిడ్డింగ్‌లకు ఆహ్వానం పలుకుతూ ఈనెల 4న ఎన్టీపీసీ ఉత్తర్వులు విడుదల చేసింది. ఏపీ పునర్విభజన చట్టంలో భాగంగా ఎన్టీపీసీ తెలంగాణలో 4,000 మెగావాట్ల విద్యుత్ ఉత్పత్తి ప్రాజెక్టులను నిర్మించాల్సి ఉంది. ఇందులో భాగంగా రామగుండంలో మొదటి స్టేజ్‌లో రెండు 800 మెగావాట్ల విద్యుత్ ఉత్పత్తి సామర్థ్యం గల యూనిట్ల నిర్మాణం పూర్తయ్యింది. తాజాగా స్టేజ్-2లో 800 మెగావాట్ల సామర్థ్యంతో మరో మూడు యూనిట్లు నిర్మించనున్నారు. ఇందుకు రామగుండంలో స్థలం, నీరు, బొగ్గు అందుబాటులో ఉంది.

బోరుగుంతలో పడిన ఆవు



బోరు గుంత నుంచి ఆవును బయటకు తీస్తున్న రైతులు

లింగంపేట: మేతకు వెళ్లిన ఓ ఆవు బోరుగుంతలో పడింది. కామారెడ్డి జిల్లా లింగంపేట మండలం పోతాయిపల్లికి చెందిన ఓ రైతు ఇటీవల తన చేనులో బోరు వేశాడు. నీరు రాకపోవడంతో గుంతను సరిగ్గా పూడ్చలేదు. గురువారం మేతకు వెళ్లిన ఓ ఆవు ఆ గుంతలో పడింది. గమనించిన స్థానికులు, రైతులు ఆవును తాళ్లసాయంతో బయటకు తీశారు.

పిడుగుపాట్లకు 9 మంది మృతి

- మృతుల్లో ఎక్కువ మంది రైతులు, కూలీలే..
- వర్షం కురుస్తున్న వేళ చెట్ల కిందకు వెళ్లడంతో పిడుగులు పడి మృత్యువాత

సాక్షి నెట్‌వర్క్: రాష్ట్రంలోని వివిధ ప్రాంతాల్లో గురువారం పిడుగుపాట్లకు గురై 9 మంది మృతిచెందారు. మరికొందరు గాయపడ్డారు. పలుచోట్ల పశువులు సైతం మృత్యువాతపడ్డాయి. మృతుల్లో ఎక్కువ మంది వ్యవసాయ పనుల్లో నిమగ్నమైన రైతులు, కూలీలే ఉన్నారు. వర్షం కురుస్తున్న వేళ చెట్ల కింద తలదాచుకుందామని వెళ్లిన వారిపై ఎక్కువగా పిడుగులు పడటంతో ప్రాణాలు పోగొట్టుకున్నారు.

వ్యవసాయ పనుల కోసం వెళ్లి..

ఆదిలాబాద్ జిల్లా ఇంద్రవెల్లి మండలం డొంగర్‌గామ్ గ్రామానికి చెందిన దంపతులు అనక సంతోష్ (27), స్వప్న (24) వ్యవసాయ పనులు చేస్తుండగా వర్షం కురవడంతో టేకు చెట్టు కింద ఉన్న గుడిసెలో తలదాచుకున్నారు. చెట్టుపై పిడుగు పడటంతో అక్కడికక్కడే మృతిచెందారు.

- మెదక్ జిల్లా హవేళీఘణాపూర్ మండల పరిధిలోని శమ్నాపూర్ గ్రామానికి చెందిన శెట్టబోయిన సిద్ధయ్య (50), అదే గ్రామానికి చెందిన ఓరుగంటి దుర్గమ్మ, రాజయ్య కుమారుడు నందు (22) గుడిసెపై కప్పేందుకు అవసరమైన పారుక కోసం గ్రామ సమీపంలోని దుర్గమ్మగుట్టపైకి బుధవారం మధ్యాహ్నం వెళ్లారు. ఉరుములు, మెరుపులు రావడంతో ఓ చెట్టు కింద నిల్చోగా పిడుగుపడి సిద్ధయ్య, నందు మృతిచెందారు.
- నిర్మల్ జిల్లా దిలావర్‌పూర్ మండలం కాల్వ గ్రామానికి చెందిన రైతు మూడపెల్లి ప్రవీణ్ (28) పొలంలో జీలుగ విత్తనాలు చల్లుతుండగా అతనికి సమీపంలో పిడుగు పడింది. దీంతో కుప్పకూలిన అతన్ని నిర్మల్‌లోని ఆస్పత్రికి తరలిస్తుండగా మరణించాడు.
- నిర్మల్ జిల్లాలోని తానూరు మండలం ఎల్వత్ గ్రామంలో మంగీర్‌వాడ్ శ్రీ(10) అనే బాలుడు తన తాతతో కలిసి మేకలను మేపేందుకు అడవికి వెళ్లి తిరిగొస్తుండగా పిడుగుపాటుకు అక్కడికక్కడే మృతిచెందాడు. రెండు మేకలు మృత్యువాతపడ్డాయి.
- సంగారెడ్డి జిల్లా కోహీర్ మండలంలోని పీచేర్యాగడి గ్రామానికి చెందిన శివరాంపురం గోపాల్ వ్యవసాయ పనులు చేసేందుకు పొలానికి వెళ్లాడు. వర్షం కురుస్తుండటంతో చెట్టు కిందకు వెళ్లగా పిడుగుపడి ప్రాణాలు కోల్పోయాడు.
- నాగర్‌కర్నూల్ జిల్లా వెల్దండ మండలం పెద్దాపూర్‌కు చెందిన కొమ్మరెక్క జంగమ్మ (40), ఆమె భర్త కృష్ణయ్య, తల్లి ఈదమ్మ పొలంలో పత్తి విత్తనాలు విత్తుతుండగా వర్షం కురుస్తోందని చెట్టు కిందకు వెళ్లారు. పిడుగు పడటంతో జంగమ్మ మృతిచెందగా మిగిలిన ఇద్దరినీ స్థానికులు కల్వకుర్తి ప్రభుత్వ ఆస్పత్రికి తరలించడంతో కోలుకుంటున్నారు.
- మెదక్ జిల్లా కొడిపల్లి మండలం పీర్లతండాకు చెందిన డలావత్ గేమ్యానాయక్ (60) పొలాల సమీపంలో గొర్రెలను మేపి ఇంటికి తిరిగొస్తుండగా పిడుగుపాటుకు గురై కన్నుమూశాడు.

మంజీరాలో దూకి ప్రేమ జంట ఆత్మహత్య

- సంగారెడ్డి జిల్లా న్యాల్‌కల్ మండలంలో ఘటన




ఉమా మహేశ్వరి



సదానంద్

న్యాల్‌కల్ (జహీరాబాద్): కుటుంబ సభ్యులు పెళ్లికి ఒప్పుకోకపోవడంతో ఓ ప్రేమజంట ఆత్మహత్యకు పాల్పడింది. రెండు రోజుల క్రితం అదృశ్యమైన జంట సంగారెడ్డి జిల్లా న్యాల్‌కల్ మండల పరిధిలోని మంజీరా నదిలో మృతదేహాలుగా తేలారు. మండల పరిధిలోని కాకిజన్‌వాడ గ్రామానికి చెందిన బేగరి విఠల్‌కు ముగ్గురు కుమారులు. ఇద్దరు కుమారుల వివాహం నారాయణఖేడ్ మండల పరిధిలోని చాప్టా(కె) గ్రామానికి చెందిన ఇద్దరు అక్కా చెల్లెళ్లతో జరిపించారు. వారి చెల్లెలు ఉమామహేశ్వరి (17), విఠల్ మూడో కుమారుడు సదానంద్ ప్రేమించుకున్నారు. ఇరువురూ వివాహం చేసుకోవాలని నిర్ణయించుకోగా, దీనికి ఇరువురి కుటుంబ సభ్యులు ఒప్పుకోలేదు. దీంతో ఈ నెల 4వ తేదీన సదానంద్, ఉమామహేశ్వరి వారి ఇళ్ల నుంచి వెళ్లిపోయారు. తెలిసిన వారి వద్ద వెతికినా ఆచూకీ లభించకపోవడంతో కుటుంబ సభ్యులు హద్నూర్, నారాయణఖేడ్ పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. కేసు దర్యాప్తులో భాగంగా పోలీసులు 5వ తేదీన రాఘవాపూర్ గ్రామ శివారులో గల మంజీరా నదిపై సదానంద్ బైక్, సెల్‌ఫోన్, చెప్పులు గుర్తించారు. ఇద్దరూ నదిలో దూకి ఆత్మహత్యకు పాల్పడి ఉంటారన్న అనుమానంతో గజ ఈతగాళ్లతో గాలింపు చర్యలు చేపట్టారు. గురువారం ఇద్దరి మృతదేహాలు లభించాయి. కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ వివరించారు.

పొంగిపొర్లుతున్న వాగులు



పొంగిపొర్లుతున్న శేషిలేటి వాగు

చండూరు: నల్లగొండ జిల్లా చండూరు, గట్టుప్పల్ మండలాల్లో బుధవారం రాత్రి భారీ వర్షం కురిసింది. చండూరులో 53.9 మిల్లీమీటర్లు, గట్టుప్పల్‌లో 25.8 మిల్లీమీటర్ల వర్షపాతం నమోదైంది. చండూరు వాగు, చామలపల్లిలో శేషిలేటి వాగు పొంగి పొర్లుతున్నాయి. రెండు మండలాల్లోని వివిధ గ్రామాల్లో ఇళ్లలోకి వరద నీరు చేరింది.

అత్యున్నత స్థాయిలో సింగరేణిని నిలపాలి

- వ్యాపార విస్తరణకు అవకాశాలు పుష్కలంగా ఉన్నాయి : సీఎండీ ఎన్.బలరాం



బలరాం

గోదావరిఖని (రామగుండం): సింగరేణి వ్యాపార విస్తరణకు అనుకూల అంశాలున్నాయని, సింగరేణీయులు తమ బాధ్యతలను సమర్థవంతంగా నిర్వహిస్తే దేశంలోనే అత్యున్నత స్థాయిలో సంస్థను నిలబెట్టవచ్చని సీఎండీ ఎన్.బలరాం స్పష్టం చేశారు. గురువారం రాత్రి సంస్థ వ్యాప్తంగా 32కు పైగా శాఖల అధిపతులతో ఆయన సమీక్షా సమావేశం నిర్వహించారు. రాష్ట్రంలో ఎన్నికల కోడ్ ముగిసిన నేపథ్యంలో సంస్థలో ఇకపై పాలన పరుగులు పెట్టాలన్నారు. ఉద్యోగుల సంక్షేమం, రక్షణపై ప్రత్యేక దృష్టి సారించాలని సూచించారు.

రక్షణ సంక్షేమంపై సమీక్ష..

ఇప్పటివరకు ఉత్పత్తి, రవాణాపైనే నెలవారీ సమీక్షలు నిర్వహించామని, ఇకపై రక్షణ, సంక్షేమంతోపాటు ఇతర అన్ని విభాగాల పనితీరుపై సమీక్ష నిర్వహించనున్నట్లు సీఎండీ పేర్కొన్నారు. సమీక్షలో ఆపరేషన్ డైరెక్టర్ ఎన్వీకే శ్రీనివాస్, ఈఅండ్ఎం డైరెక్టర్ సత్యనారాయణరావు, జీఎం (కో ఆర్డినేషన్) జి.దేవేందర్, కార్పొరేట్‌లోని వివిధ శాఖల అధిపతులు పాల్గొన్నారు.

వాట్సాప్ గ్రూప్ నుంచి తొలగించారని ఇద్దరు యువకుల దారుణహత్య

- కద్లాల్ సమీపంలోని బటర్ ఫ్లై సిటీ వెంచర్ విల్లాలో ఘటన

కద్లాల్: వాట్సాప్ గ్రూపు లొల్లి ఇద్దరు యువకుల ప్రాణాలను బలిగొంది. ఈ సంఘటన రంగారెడ్డి జిల్లా కద్లాల్ సమీపంలోని బటర్ ఫ్లై సిటీ వెంచర్‌లోని ఓ విల్లాలో గురువారం ఉదయం వెలుగుచూసింది. పోలీసులు, స్థానికులు తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. గోవిందాయిపల్లికి చెందిన బీజేపీ నేత జల్కం రవి ఇటీవల బటర్ ఫ్లై వెంచర్‌లోని ఓ విల్లాను అద్దెకు తీసుకొని రియల్ ఎస్టేట్ కార్యాలయం ఏర్పాటు చేశారు. ఈ నెల 4న సాయంత్రం బీజేపీ నేతలు, కార్యకర్తలు, స్నేహితులతో కలిసి రవి తన పుట్టిన రోజు వేడుకలు జరుపుకున్నాడు. ఈ ఫోటోలను రవి తన గ్రామా నికి చెందిన వాట్సాప్ గ్రూప్‌లో పోస్టు చేశాడు. దీనిపై పలువురు యువకులు అభ్యంతరం వ్యక్తం చేశారు. ఈ క్రమంలోనే గోవిందాయిపల్లికి చెందిన గుండెమోని శివగౌడ్(25), శేషగారి శివగౌడ్(27)లు రవిని వాట్సాప్ గ్రూప్ నుంచి తొలగించారు. దీంతో 5వ తేదీన సాయంత్రం రవి వీరిద్దరిని తన కార్యాలయానికి పిలిపించుకున్నాడు. అప్పటికే రవి వద్ద బీజేవైఎం నాయకుడు పల్లె రాజుగౌడ్ ఉన్నాడు. నలుగురూ మద్యం తాగడం మొదలుపెట్టారు. ఈ క్రమంలోనే వాట్సాప్ గ్రూప్ నుంచి నన్ను ఎందుకు తొలగించారు..? ఫొటోలు ఎందుకు డిలీట్ చేశారు అని రవి ప్రశ్నించాడు. ఈ క్రమంలో మాటామాట పెరిగి ఘర్షణకు దారి తీసింది. ఆగ్రహానికిలోనైన రవి, పల్లె రాజుగౌడ్ కత్తులలో దాడి చేసి గుండెమోని శివగౌడ్, శేషగారి శివగౌడ్‌ను చంపేశారు. అనంతరం విల్లాకు తాళం వేసి వెళ్లిపోయారు. సమాచారం తెలుసుకున్న పోలీసులు బటర్ ఫ్లై సిటీలోని ఆ విల్లాకు వెళ్లి తాళం పగులగొట్టారు. లోపల రక్తపు మడుగులో పడి ఉన్న మృతదేహాలను పరిశీలించి, క్లూస్‌టీంతో ఆధారాలు సేకరించారు. గుండెమోని శివగౌడ్ హైదరాబాద్‌లోని ఓ చికెన్ సెంటర్‌లో పనిచేస్తుండగా, శేషగారి శివగౌడ్ డ్రైవర్‌గా పనిచేస్తునట్టు తెలిసింది. యువకుల హత్యలకు వాట్సాప్ వివా దమే కారణమా.. మరేదైనా ఉందా..? అని గ్రామస్తుల నుంచి అనుమానాలు వ్యక్తమవుతున్నా యి. బాధిత కుటుంబాలకు న్యాయం చేయాలని డిమాండ్ చేస్తూ శ్రీశైలం-హైదరాబాద్ జాతీ య రహదారిపై గ్రామస్తులు ఆందోళనకు దిగారు. దీంతో రెండుగంటలకుపైగా ట్రాఫిక్ జామ్ అయ్యింది. ఈ సమయంలో హైదరాబాద్ వెళుతున్న కల్వకుర్తి ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణరెడ్డి, నాగర్‌కర్నూల్ జెడ్పీ వైస్‌చైర్మన్ బాలాజీసింగ్ మృతుల కుటుంబ సభ్యులతో మాట్లాడారు.




శేషగారి శివగౌడ్



గుండెమోని శివగౌడ్

సీఆర్‌పీసీ 41ఏ ప్రకారం నడుచుకోండి

- దిలీప్ పిటిషన్‌లో పోలీసులకు హైకోర్టు ఆదేశం



సాక్షి, హైదరాబాద్: ఆర్టీసీ ఫేక్ లోగో రూపొందించి సోషల్ మీడియాలో ప్రచారం చేశారంటూ కొణతం దిలీప్‌పై దాఖలైన కేసులో సీఆర్‌పీసీ 41ఏ చట్టప్రకారం, సుప్రీం కోర్టు మార్గదర్శకాల మేరకు విచారణ సాగించాలని పోలీసులను హైకోర్టు ఆదేశించింది. తదుపరి విచారణను జూలై 11కు వాయిదా వేసింది. రాష్ట్ర ప్రభుత్వం, తెలంగాణ రాష్ట్ర రోడ్డు రవాణా సంస్థ ప్రతిష్ఠకు భంగం కలిగించేలా ఫేక్ లోగో రూపొందించి ప్రచారం చేస్తున్నాంటూ చిక్కడపల్లి పోలీస్‌స్టేషన్‌లో అధికారులు ఫిర్యాదు చేశారు. ఈ కేసులో కొణతం దిలీప్, హరీశ్‌రెడ్డిలపై పోలీసులు కేసు నమోదు చేశారు. ప్రభుత్వం కావాలనే తప్పుడు కేసు నమోదు చేసిందని, దీనిని కొట్టివేసేలా పోలీసులను ఆదేశించాలని కోరుతూ దిలీప్ హైకోర్టులో పిటిషన్ దాఖలు చేశారు. దీనిపై జస్టిస్ కె.సుజన ధర్మాసనం విచారణ చేపట్టింది. వాదనలు విన్న న్యాయమూర్తి.. పిటిషనర్‌పై పెట్టిన కేసుల్లో 7 ఏళ్లకు మించి శిక్ష పడే అవకాశం లేదు కనుక సీఆర్‌పీసీ సెక్షన్ 41ఏ ప్రకారం, సుప్రీంకోర్టు మార్గదర్శకాల ప్రకారం దర్యాప్తు కొనసాగించాలని పోలీసులను ఆదేశించారు. తన నిర్దోషిత్వాన్ని సమర్థించే, విచారణకు అవసరమైన ఇతర సమాచారం, డాక్యుమెంట్లు దర్యాప్తు అధికారులకు సమర్పించాలని, విచారణకు అన్నివిధాలా సహకరించాలని పిటిషనర్‌కు చెప్పారు.

ఇద్దరు తెలుగు రైతులకు ఐఏఆర్ఐ పురస్కారాలు

సాక్షి, హైదరాబాద్: ఢిల్లీలోని భారతీయ వ్యవసాయ పరిశోధనా సంస్థ (ఐఏఆర్ఐ)లో గురువారం జరిగిన అవార్డుల ప్రదానోత్సవంలో తెలుగు రాష్ట్రాలకు చెందిన ఇద్దరు యువ ప్రకృతి వ్యవసాయదారులు ప్రతిష్టాత్మక 'ఐఏఆర్ఐ ఇన్నోవేటివ్ ఫార్మర్'పురస్కారాలను అందుకున్నారు. ఆదిలాబాద్ జిల్లా తలమడుగు మండలం లక్ష్మీపూర్‌కు చెందిన సారంగుల రవి, కృష్ణా జిల్లా పెనమలూరుకు చెందిన రైతు నందం రఘువీర్ ఐఏఆర్ఐ డైరెక్టర్ డాక్టర్ ఎ.కె. సింగ్ చేతుల మీదుగా పురస్కారాలు అందుకున్నారు. డిగ్రీ చదువుకున్న సారంగుల రవి మూడేళ్లుగా తన 5 ఎకరాల్లో ప్రకృతి వ్యవసాయం చేస్తున్నారు. కూరగాయలు, కందులు, పుచ్చ, చిరుధాన్యాలు, మిరప, వేరుశనగ తదితర పంటలను పాలేకర్ పద్ధతిలో పండిస్తున్నారు. తన తోటి 60 మంది రైతులతో కలసి ఆదిలాబాద్‌లో ఏర్పాటు చేసిన ఆర్గానిక్ స్టోర్ ద్వారా వాటిని విక్రయిస్తూ మంచి ఆదాయం పొందుతున్నారు. అలాగే బిట్స్ పిలానిలో బీటెక్ చదివి సాఫ్ట్‌వేర్ ఉద్యోగంలో స్థిరపడిన నందం రఘువీర్ ఉద్యోగానికి స్వస్తి చెప్పి అంతరించిపోతున్న దేశీ వరి వంగడాల పరిరక్షణను చేపట్టారు. దేశవ్యాప్తంగా తిరిగి 257 దేశీ వరి రకాలను సేకరించి సాగు చేస్తూ రైతులకు విత్తనాలను అందుబాటులోకి తెస్తున్నారు. ఆయన విశేష కృషికి గుర్తింపుగా గత ఏడాది ప్రతిష్టాత్మక ప్లాంట్ జీనోమ్ సేవియర్ పురస్కారాన్ని రాష్ట్రపతి చేతుల మీదుగా అందుకున్నారు. కేంద్ర వ్యవసాయ, రైతు సంక్షేమ శాఖ ఆధీనంలోని ప్రొటెక్షన్ ఆఫ్ ప్లాంట్ వెరైటీస్ అండ్ ఫార్మర్స్ రైట్స్ అథారిటీ సంస్థ ఈ పురస్కారంతో పాటు రూ. 1.5 లక్ష ల నగదు బహుమతిని రఘువీర్‌కు అందించింది. దేశీ వరి విత్తనాలతో రఘువీర్ 9 జిల్లాల్లో సీడ్ బ్యాంక్‌లను ఏర్పాటు చేస్తున్నారు.



ఐఏఆర్ఐ ఇన్నోవేటివ్ ఫార్మర్' పురస్కారాన్ని అందుకుంటున్న నందం రఘువీర్



పురస్కారాన్ని అందుకుంటున్న సారంగుల రవి

పదవిని కాపాడుకునే ఆరాటంలో రేవంత్

- బీజేపీ మాజీ ఎమ్మెల్యే ఎన్వీఎస్ఎస్ ప్రభాకర్

సాక్షి, హైదరాబాద్: వచ్చే డిసెంబర్ 9వ తేదీ వరకైనా తన పదవిని కాపాడుకోవాలనే ఆరాటంతో సీఎం రేవంత్‌రెడ్డి కొత్త ఆలోచన చేశారని బీజేపీ మాజీ ఎమ్మెల్యే ఎన్వీఎస్ఎస్ ప్రభాకర్ అన్నారు. తెలంగాణ తల్లి విగ్రహ ఆవిష్కరణ కార్యక్రమానికి సోనియా గాంధీని ఆహ్వానిస్తామంటూ, ఆమె మెప్పుకోసం ప్రయత్నాలు మొదలుపెట్టారని ఎద్దేవా చేశారు. డిసెంబర్ 9 తెలంగాణ ప్రజలకు ఆవేదన మిగిల్చిన రోజని.. ఆనాడు కాంగ్రెస్ పార్టీ తెలంగాణ రాష్ట్రాన్ని ప్రకటించి, వెనక్కి తీసుకున్న రోజని మండిపడ్డారు. గురువారం ఆయన మీడియాతో మాట్లాడుతూ.. బీఆర్ఎస్ పార్టీతో కాంగ్రెస్‌కు ఉన్న సంబంధాలు, అనుబంధం వల్లే కాంగ్రెస్ 8 ఎంపీ సీట్లలో గెలిచిందన్నారు. పార్లమెంటు ఎన్నికలు తన పాలనకు రెఫరండం అంటూ రేవంత్ ప్రకటించారని, అయితే ఆయనవల్ల కాంగ్రెస్ పార్టీ గెలవలేదని, అలాంటి వ్యక్తులు మోదీని విమర్శించడం సిగ్గుచేటని అన్నారు. 'గతంలో రేవంత్ ఎంపీగా ప్రాతినిధ్యం వహించిన మల్కాజిగిరి నుంచి ప్రజలు కాంగ్రెస్‌ను తరిమికొట్టారు. సొంత జిల్లా మహబూబ్‌నగర్‌లో కాంగ్రెస్ ఎంపీ అభ్యర్థిని ప్రజలు ఓడించారు అని అన్నారు. ఇప్పటికైనా రేవంత్ రెడ్డి పిచ్చి ప్రేలాపనలు మానుకోవాలని హెచ్చరించారు. పాలనపై, ప్రజాసమస్యల పరిష్కారంపై దృష్టి పెట్టాలని సీఎంకు సూచించారు.

స్టాక్ మార్కెట్ కుంభకోణంలో మోదీ, షా

- ఎన్నికల సమయంలో పెట్టుబడి సలహాలు ఎందుకిచ్చారు?
- బీజేపీకి మెజార్టీ రాదని తెలిసినా షేర్లు కొనాలని ఎందుకు సూచించారు?
- 200 నుంచి 220 సీట్లు వస్తాయని నిఘా సంస్థలు చెప్పడం నిజం కాదా?
- తప్పుడు ఎగ్జిట్ పోల్స్ ఫలితాల వెనుక గుట్టు ఏమిటి?
- బీజేపీకీ, విదేశీ ఇన్వెస్టర్లకు మధ్య సంబంధం ఏమిటి?
- జాయింట్ పార్లమెంటరీ కమిటీతో విచారణ జరిపించాలి
- కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ గాంధీ

రిటైల్ ఇన్వెస్టర్లకు రూ.30 లక్షల కోట్ల నష్టం

న్యూఢిల్లీ: దేశంలో అతిపెద్ద స్టాక్ మార్కెట్ కుంభకోణంలో ప్రధాని నరేంద్ర మోదీ, కేంద్ర హోం శాఖ మంత్రి అమిత్ షా ప్రత్యక్షంగా భాగస్వాములయ్యారని కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ గాంధీ ఆరోపించారు. స్టాక్ మార్కెట్‌లో పెట్టుబడులు పెట్టాలంటూ వారిచ్చిన సలహాలు నమ్మి రిటైల్ ఇన్వెస్టర్లు రూ.30 లక్షల కోట్లు పోగొట్టుకున్నారని చెప్పారు. ఈ మొత్తం వ్యవహారంపై సంయుక్త పార్లమెంటరీ కమిటీ(జేపీసీ)తో విచారణ జరిపించాలని డిమాండ్ చేశారు. రాహుల్ గాంధీ గురువారం ఢిల్లీలో మీడియా సమావేశంలో మాట్లాడారు. 'ఫేక్' ఎగ్జిట్ పోల్స్ ఫలితాలు విడుదలైన రోజు స్టాక్ మార్కెట్ సూచీలు విపరీతంగా పెరిగిపోయాయని, ఈ నెల 4న ఎన్నికల అసలు ఫలితాలు వెల్లడయ్యాక సూచీలు ఒక్కసారిగా కుప్పకూలాయని గుర్తుచేశారు. ఎన్నికల సమయంలో మోదీ, అమిత్ షా, ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్ స్టాక్ మార్కెట్ గురించి మాట్లాడారని, షేర్లు కొనాలంటూ ప్రజలకు సూచించారని చెప్పారు. స్టాక్ మార్కెట్లు, షేర్ల గురించి ప్రధానమంత్రి, హోంమంత్రి బహిరంగంగా మాట్లాడడం దేశంలో ఇదే మొదటిసారి అని గుర్తుచేశారు. ప్రధానమంత్రి, హోంమంత్రి చేసే పని స్టాక్ మార్కెట్ సలహాలు ఇవ్వడమేనా? అని ఆగ్రహం వ్యక్తం చేశారు. ఎన్నికల సమయంలో ఇన్వెస్ట్‌మెంట్ సలహాలు ఎందుకిచ్చారో చెప్పాలని ప్రశ్నించారు. ఎగ్జిట్ పోల్స్ ఫలితాలు లెక్క తప్పుతాయని బీజేపీ నేతలకు ముందే తెలుసని పేర్కొన్నారు. సార్వత్రిక ఎన్నికల్లో బీజేపీకి 220 సీట్ల వరకు వచ్చే అకాశం ఉందని అంతర్గత అధికారిక సర్వేలో తేలిందన్నారు. 200 నుంచి 220 సీట్లు వస్తాయంటూ నిఘా సంస్థలు మోదీ ప్రభుత్వానికి నివేదించాయని తెలిపారు. ఇదంతా తెలిసి కూడా 5 కోట్ల కుటుంబాలకు పెట్టుబడి సలహాలు ఎందుకిచ్చారని మోదీ, అమిత్ షాపై రాహుల్ మండిపడ్డారు.

రిటైల్ ఇన్వెస్టర్లను ముంచేశారు

షేర్ల విలువను తారుమారు చేసిన ఆరోపణలపై సెబీ దర్యాప్తును ఎదుర్కొంటున్న బిజినెస్ గ్రూప్‌నకు చెందిన మీడియా సంస్థకు ఇచ్చిన ఇంటర్వ్యూల్లో మోదీ, అమిత్ షా స్టాక్ మార్కెట్ పెట్టుబడి సలహాలను ఇచ్చారని రాహుల్ పేర్కొన్నారు. తప్పుడు ఎగ్జిట్ పోల్స్ ఫలితాలు విడుదల చేసిన వారికి, బీజేపీకీ, ఎగ్జిట్ పోల్స్ ఫలితాలకు ఒక్కరోజు ముందు పెట్టుబడి పెట్టిన విదేశీ ఇన్వెస్టర్లకు మధ్య ఉన్న సంబంధం ఏమిటని ప్రశ్నించారు. దీని వెనుక భారీ కుట్ర ఉందన్నారు. మోదీ, అమిత్ షా సలహాలను విశ్వసించి పెట్టుబడిన పెట్టిన భారత రిటైల్ ఇన్వెస్టర్ల సంపదను కొందరు బడాబాబులు కాజేశారని ఆరోపించారు. ఇన్వెస్టర్లను ముంచేసి రూ.వేల కోట్లు దోచుకున్నారని ధ్వజమెత్తారు. మోదీ, అమిత్ షాతోపాటు తప్పుడు ఎగ్జిట్ పోల్స్ ఫలితాలు ప్రకటించిన వారిపై దర్యాప్తు జరపాలని రాహుల్ డిమాండ్ చేశారు.



మీడియాకు గణాంకాలు వివరిస్తున్న రాహుల్, జైరాం రమేశ్

మీడియా సమావేశంలో రాహుల్ వెల్లడించిన ప్రకారం ఎప్పుడేం జరిగిందంటే

మే 13: జూన్ 4 (ఎన్నికల ఫలితాలు వెల్లడయ్యే రోజు) కంటే ముందే షేర్లు కొనేసి పెట్టుకోండి అని అమిత్ షా సూచించారు.

మే 19: జూన్ 4న స్టాక్ మార్కెట్ రికార్డులు బద్ధలవుతాయి. కొత్త రికార్డులు సృష్టించడం ఖాయం అని ప్రధాని మోదీ పేర్కొన్నారు.

జూన్ 1: సార్వత్రిక ఎన్నికల్లో తుది దశ పోలింగ్ జరిగింది. సాయంత్రం ఎగ్జిట్ పోల్స్ ఫలితాలు వెలువడ్డాయి.

జూన్ 3: కేంద్రంలో మళ్లీ బీజేపీ ప్రభుత్వం స్పష్టమైన మెజార్టీతో అధికారంలోకి రాబోతున్నట్లు ఎగ్జిట్ పోల్స్ వెల్లడించడంతో స్టాక్ మార్కెట్ రికార్డు స్థాయిలో పుంజుకుంది. సూచీలు ఆల్ టైమ్ అత్యధిక స్థాయికి చేరుకున్నాయి.

జూన్ 4: ఓట్ల లెక్కింపు మొదలైంది. బీజేపీకి మెజార్టీ సీట్లు వచ్చే అవకాశం లేదని తేలింది. దాంతో స్టాక్ మార్కెట్ ఒక్కసారిగా కుప్పకూలింది. మార్కెట్‌లో పెట్టుబడి పెట్టిన చిన్నస్థాయి ఇన్వెస్టర్ల సంపద రూ.30 లక్షల కోట్ల మేర కరిగిపోయింది.

పస లేని ఆరోపణలు

పీయూష్ గోయల్ మండిపాటు

స్టాక్ మార్కెట్‌లో అతిపెద్ద కుంభకోణం జరిగిందంటూ కాంగ్రెస్ నేత రాహుల్ గాంధీ చేసిన ఆరోపణలను కేంద్ర మంత్రి పీయూష్ గోయల్ ఖండించారు. లోక్‌సభ ఎన్నికల్లో ఇండియా కూటమికి ఎదురైన ఓటమిని తట్టుకోలేక ఇలాంటి పస లేని ఆరోపణలు చేస్తున్నారని రాహుల్‌పై మండిపడ్డారు. స్టాక్ మార్కెట్ పెట్టుబడిదారులను తప్పుదోవ పట్టించడానికి పెద్ద కుట్ర జరుగుతోందని ధ్వజమెత్తారు. ఇన్వెస్టర్లను దగా చేయొద్దని సూచించారు. ఎగ్జిట్ పోల్స్ ఫలితాల తర్వాత మన మార్కెట్‌లో విదేశీ పెట్టుబడిదారులు అధిక రేట్ల వద్ద భారీగా షేర్లు కొన్నారని, వాటిని భారత ఇన్వెస్టర్లు విక్రయించి, లాభం పొందారని పీయూష్ గోయల్ వివరించారు.



కాంగ్రెస్ నేతృత్వంలోని యూపీఏ ప్రభుత్వ హయాంలో కేవలం రూ.67 లక్షల కోట్లు ఉన్న స్టాక్ మార్కెట్ విలువ ఇప్పుడు రూ.415 లక్షల కోట్లకు చేరిందని గుర్తుచేశారు. దేశీయ, రిటైల్ ఇన్వెస్టర్లు భారీగా లబ్ధి పొందారని వెల్లడించారు. బీజేపీ ప్రభుత్వ పాలనలో స్టాక్ మార్కెట్ వేగంగా వృద్ధి చెందిందన్నారు. మార్కెట్‌లో నమోదైన ప్రభుత్వ రంగ సంస్థల విలువ 4 రెట్లు పెరిగిపోయిందని పేర్కొన్నారు. మోదీ పాలనలో భారత్ ప్రపంచంలోనే ఐదో అతిపెద్ద ఆర్థిక వ్యవస్థగా మారిందని గుర్తుచేశారు.

విగ్రహాలకు స్థానచలనం

పాత భవనం లాన్ దగ్గరకు తరలింపు • మండిపడ్డ కాంగ్రెస్

న్యూఢిల్లీ: నూతన పార్లమెంట్ ప్రాంగణంలో చూడగానే ఎదురుగా కనిపించే మహాత్మా గాంధీజీ, బీఆర్ అంబేడ్కర్, ఛత్రపతి శివాజీ మహరాజ్, జ్యోతిబా పూలే సహా పలువురు దేశ ప్రముఖుల విగ్రహాలను ప్రభుత్వం వేరే చోటుకు తరలించింది. ఉన్న చోటు నుంచి పాత పార్లమెంట్(సంవిధాన్ సదన్)లోని ఐదో నంబర్ గేట్ దగ్గరి లాన్ వద్దకు మార్చింది. ఈ లాన్‌లో ఇప్పటికే గిరిజన యోధుడు బిర్సా ముండా, మహారాణాప్రతాప్‌ల విగ్రహాలు ఉన్నాయి. విగ్రహాల తరలింపుపై కాంగ్రెస్ పార్టీ తీవ్ర ఆగ్రహం వ్యక్తంచేసింది. 'మహాత్ముడు, అంబేడ్కర్, ఛత్రపతి శివాజీ విగ్రహాలను ఉద్దేశపూర్వకంగా అప్రాధాన్య చోట్లో ప్రతిష్టించడం అరాచకం'అని కాంగ్రెస్ ప్రధాన కార్యదర్శి జైరాం రమేశ్ ఆగ్రహం వ్యక్తంచేశారు. '' సార్వత్రిక ఎన్నికల్లో మహారాష్ట్ర ఓటర్లు బీజేపీని తిరస్కరించారు. అందుకే మహారాష్ట్రతో అనుబంధమున్న ఛత్రపతి శివాజీ, అంబేడ్కర్‌ల విగ్రహాలను వేరే చోటుకు మార్చేశారు. గుజరాత్‌లో బీజేపీ ఈసారి క్లీన్‌స్వీప్ చేయలేకపోయింది. అందుకే గుజరాతీలపై ఆగ్రహంతో గాంధీజీ విగ్రహాన్నీ తరలించారు' అని మరో నేత పవన్ ఖేడా వ్యాఖ్యానించారు. 'మహానుభావుల విగ్రహాలు తొలగించి గాడ్సే, మోదీ విగ్రహాలు పెడతారా?' అని టీఎంసీ ఎంపీ జవహర్ సర్కార్ ప్రశ్నించారు. విమర్శలపై లోక్‌సభ సచివాలయం స్పందించింది. పార్లమెంట్‌కు విచ్చేసే సందర్శకులు చూసేందుకు అనువుగా 'ప్రేరణ స్థల్'కు విగ్రహాలను తరలించామని పేర్కొంది. ఏ విగ్రహాన్నీ పక్కనపడేయలేదని స్పష్టంచేసింది.

పెద్ద శాఖలు ఇవ్వలేం!

- రక్షణ, ఆర్థిక, హోం, విదేశీ వ్యవహారాలు బీజేపీకే
- లోక్‌సభ స్పీకర్ పోస్టుపైనా ఇదే వైఖరి

న్యూఢిల్లీ: ఎన్డీఏ నేతగా నరేంద్ర మోదీని ఎన్నుకున్న తర్వాత మంత్రివర్గ కూర్పుపై బీజేపీ దృష్టిసారించింది. మిత్రపక్షాల నుంచి కీలకశాఖలు కావాలనే డిమాండ్లు వచ్చిన నేపథ్యంలో గురువారం బీజేపీ అధ్యక్షుడు జేపీ నడ్డా నివాసంలో అమిత్ షా, రాజ్‌నాథ్‌సింగ్, ఇతర సీనియర్ నేతలు సమావేశమయ్యారు. ప్రాథమికంగా జరిగిన చర్చల్లో కీలకమైన రక్షణ, ఆర్థిక, హోం, విదేశీ వ్యవహారాల శాఖలను తమ వద్దే అట్టిపెట్టుకోవాలని బీజేపీ నేతల నిర్ణయించినట్లు విశ్వసనీయవర్గాల సమాచారం. బీజేపీకి సొంతంగా 240 సీట్లు (ఎన్డీఏకు 293) మాత్రమే వచ్చినందువల్ల ప్రభుత్వ ఏర్పాటులో టీడీపీ (16 సీట్లు), జేడీయూ (12 సీట్లు)లపై పూర్తిగా ఆధారాపడాల్సిన పరిస్థితి నెలకొంది. ఈ పార్టీలు నలుగురు ఎంపీలకు ఒక కేబినెట్ మంత్రి పదవిని అడుగుతున్నట్లు సమాచారం. ఈ లెక్కన టీడీపీకి నాలుగు, జేడీయూకు మూడు కేబినెట్ బెర్తులు ఇవ్వాల్సి ఉంటుంది. టీడీపీ స్పీకర్ పదవిని కూడా అడుగుతోంది. ఎలక్ట్రానిక్స్, ఇన్ఫర్మేషన్ టెక్నాలజీ శాఖను కూడా కోరుతోంది. ఏడుగురు ఎంపీలున్న శివసేన (షిండే), ఐదుగురు ఎంపీలున్న ఎల్జేపీ (ఆర్‌వీ) కూడా రెండేసి మంత్రిపదవులు అడుగుతున్నాయి. గత రెండు ప్రభుత్వాల్లో బీజేపీ సొంతంగా మెజారిటీ మార్కును దాటినందువల్ల మిత్రపక్షాలకు ముఖ్యమైన శాఖలు దక్కలేదు. ఎంపీల సంఖ్య ఆధారంగా మంత్రిపదవులు కేటాయించాల్సిన పరిస్థితిని ప్రస్తుతం బీజేపీ ఎదుర్కొంటోంది. కాబట్టి ఈసారి మిత్రపక్షాలకు మరింత ఎక్కువగా మంత్రిపదవులు దక్కనున్నాయి. మిత్రపక్షాల నుంచి ఎంత ఒత్తిళ్లు వచ్చినా అత్యంత కీలకమైన శాఖలపై బీజేపీ రాజీపడకపోవచ్చని సమాచారం. రక్షణ, ఆర్థిక, హోంశాఖ, విదేశీ వ్యవహారాలతో పాటు మౌలిక సదుపాయాల అభివృద్ధితో ముడిపడిన శాఖలను కూడా తమ వద్దే ఉంచుకోవాలని బీజేపీ భావిస్తోంది. అలాగే సంక్షేమం, యువజన వ్యవహారాలు, వ్యవసాయం తదితర శాఖలను అంత సులువుగా వదులుకునేలా లేదు. పేదలు, మహిళలు, యువకులు, రైతుల ఓటు బ్యాంకును దృష్టిలో పెట్టుకొని ఈ శాఖలను తామే ఉంచుకోవాలని బీజేపీ ఆశిస్తోంది. రైల్వేలు, రహదారుల విషయంలోనూ గడిచిన పదేళ్లలో తాము భారీ సంస్కరణలు తెచ్చామని.. ఈ వేగం మందగించకూడదంటే ఈ శాఖలు తమ వద్దే ఉండాలని పేర్కొంటోంది. సంకీర్ణ ప్రభుత్వాల్లో రైల్వే శాఖ సాధారణంగా మిత్రపక్షాల చేతుల్లో ఉంటూ వచ్చింది. కానీ బీజేపీ గట్టి ప్రయత్నంలో రైల్వే శాఖను తమ ఆధీనంలోకి తెచ్చుకుంది. జేడీయూకు పంచాయతీ రాజ్, గ్రామీణాభివృద్ధి శాఖలు ఇచ్చేందుకు బీజేపీ సుముఖంగా ఉన్నట్లు తెలుస్తోంది. పౌర విమానయాన శాఖ, ఉక్కు శాఖ టీడీపీకి ఇవ్వజూపుతున్నట్లు సమాచారం. భారీ పరిశ్రమల శాఖను ఏక్‌నాథ్ షిండే నేతృత్వంలోని శివసేనకు ఆఫర్ చేస్తోంది. అయితే ఆర్థిక, రక్షణ తదితర కీలకశాఖల్లో మిత్రపక్షాలకు సహాయమంత్రి పదవులు ఇవ్వడానికి బీజేపీ సిద్ధంగా ఉందని చర్చలకు సంబంధించిన విషయాలపై సమాచారం ఉన్న విశ్వసనీయవర్గాలు తెలిపాయి. పర్యాటక, ఎంఎస్ఎంఈ, నైపుణ్యాభివృద్ధి, సైన్స్ అండ్ టెక్నాలజీ, ఎర్త్ సైన్సెస్, సామాజిక న్యాయ శాఖలను మిత్రపక్షాలకు ఇచ్చే అవకాశముందని సమాచారం. చంద్రబాబు నాయుడు లోక్‌సభ స్పీకర్ పదవిపై పట్టుబడితే డిప్యూటీ స్పీకర్ పదవిని ఇవ్వజూపి ఆయన్ను ఒప్పించే ప్రయత్నం చేయవచ్చునంటున్నారు. బీజేపీ సంఖ్యాబలం లేనందున టీడీపీ, జేడీయూలు తమ డిమాండ్లపై పట్టుబడితే.. బీజేపీ ఎంతవరకు తలొగ్గుతుంది, ఎలా బుజ్జగిస్తుందనేది చూడాలి.

ప్రతిపక్ష నేతగా రాహుల్!

కాంగ్రెస్‌లో పెరుగుతున్న డిమాండ్

సాక్షి, న్యూఢిల్లీ: ప్రస్తుత ఎన్నికల్లో ఇటు కాంగ్రెస్ పుంజుకోవడంలో.. అటు కూటమి పక్షాల విజయంలో తనవంతు పాత్ర పోషించిన ఏఐసీసీ అగ్ర నాయకుడు రాహుల్‌గాంధీ ప్రధాన ప్రతిపక్ష నేతగా ఎన్నికయ్యే అవకాశం కనిపిస్తోంది. ఎన్నికల్లో ఆయన పనితీరుపై అన్ని పక్షాల నుంచి హర్షాతిరేకాలు వ్యక్తమవుతున్న నేపథ్యంలో రాహుల్ గాంధీ లోక్‌సభలో ప్రతిపక్ష నేతగా బాధ్యతలు చేపట్టి, పార్లమెంటులో ముందుండి పార్టీని నడిపించాలనే డిమాండ్‌లు క్రమంగా ఊపందుకుంటున్నాయి. ఇండియా కూటమిలోని చిన్నాచితకా పార్టీల నేతలు ఆయన ఎంపికను సమర్థిస్తున్నట్లు తెలుస్తోంది. నిజానికి 2014లో కాంగ్రెస్ 48, 2019 ఎన్నికల్లో 52 స్థానాలు గెలుచుకున్న సమయంలో కాంగ్రెస్ ప్రధాన ప్రతిపక్ష హోదాను కోల్పోయింది. ఈ సమయంలో కాంగ్రెస్ పక్ష నేతగా రాహుల్ గాంధీని కొనసాగించాలనే డిమాండ్‌లు వచ్చినా ఆయన నిరాకరించారు. అయితే ప్రస్తుతం పార్టీకి సొంతంగా 99 సీట్లు వచ్చాయి. లోక్‌సభలో 10 శాతం సీట్లు అంటే కనీసంగా 55 సీట్లు వస్తే ప్రధాన ప్రతిపక్ష హోదా దక్కుతుంది. ప్రస్తుతం ఆ స్థానాలు గెలిచినందున ఆ హోదాలో రాహుల్‌గాంధీ ఉండాలని పార్టీ నేతలు కోరుతున్నారు. ఆయన ప్రస్తుత ఎన్నికల్లో రాయ్‌బరేలీ, వయనాడ్‌ల నుంచి భారీ మెజార్టీలతో గెలవడంతో పాటు మహారాష్ట్ర, ఉత్తర్‌ప్రదేశ్, తమిళనాడులో కూటమి పక్షాలకు మెజార్టీ స్థానాలు దక్కడంలో కీలకపాత్ర పోషించారు. ఈ దృష్ట్యానే పార్టీ నేతలు ఆయన్ను ప్రధాన ప్రతిపక్ష నేతగా ఎన్నుకోవాలని డిమాండ్ చేస్తున్నారు. మాణిక్యం ఠాగూర్ 'ఎక్స్'లో స్పందిస్తూ 'నేను మా నాయకుడు రాహుల్ గాంధీ పేరు మీద ఓట్లు అడిగాను. ఆయన లోక్‌సభలో కాంగ్రెస్ నాయకుడిగా ఉండాలని భావిస్తున్నాను. ఎన్నికైన కాంగ్రెస్ ఎంపీలు కూడా అలాగే ఆలోచిస్తారని నేను ఆశిస్తున్నాను' అని పోస్ట్ చేశారు. మరో సీనియర్ నేత డీకే శివకుమార్ సైతం రాహుల్ ప్రధాన ప్రతిపక్ష నేతగా ఉంటారని జోస్యం చెప్పారు. ఒకవేళ రాహుల్ కాదన్న పక్షంలో సీనియర్ నేతలైన శశిథరూర్, గౌరవ్ గొగోయ్, మనీశ్ తివారీ, కేసీ వేణుగోపాల్‌లలో ఒకరిని ప్రతిపక్ష నేతగా ఎంపిక చేస్తారని చెబుతున్నారు. దీనిపై 8న జరిగే కాంగ్రెస్ వర్కింగ్ కమిటీ సమావేశం తర్వాత నిర్ణయం చేస్తారని అంటున్నారు. మల్లికార్జున ఖర్గే అధ్యక్షతన 8వ తేదీన కాంగ్రెస్ పార్టీ ప్రధాన కార్యాలయంలో సీడబ్ల్యూసీ భేటీ జరగనుంది. ఇక రాహుల్ గెలిచిన రెండు స్థానాల్లో దేనిలో కొనసాగుతారు, దేనిని వదులుకుంటారన్న దానిపై ఇదే భేటీలో కొంత స్పష్టత వచ్చే అవకాశాలున్నాయని ఏఐసీసీ వర్గాలు చెబుతున్నాయి.

శరణార్థులున్న స్కూలుపై దాడి..

33 మంది మృతి

డెయిర్ అల్ బలాహ్(గాజా): ఇజ్రాయెల్ బలగాలు సెంట్రల్ గాజాలో వరుస దాడులు కొనసాగిస్తున్నాయి. నుసెయిరత్‌లోని అల్-సర్ది స్కూల్‌పై గురువారం వేకువజామున జరిపిన దాడుల్లో 14 మంది చిన్నారులు, 9 మంది మహిళలు సహా మొత్తం 33 మంది చనిపోయారు. ఐక్యరాజ్యసమితి ఆధ్వర్యంలో అల్-సర్ది స్కూల్‌లో శరణార్థి శిబిరం నడుస్తోంది. ఉత్తర గాజాలోకి ఇజ్రాయెల్ ఆర్మీ ప్రవేశించిన తర్వాత అక్కడి నుంచి ప్రాణాలరచేతిలో పట్టుకుని వచ్చిన వారంతా ఈ శిబిరంలో తలదాచుకుంటున్నారు. అయితే, హమాస్ మిలిటెంట్లు ఈ స్కూల్ నుంచే కార్యకలాపాలు సాగిస్తున్నట్లు ఇజ్రాయెల్ మిలటరీ ఆరోపిస్తోంది. కాగా, గురువారం ఇజ్రాయెల్ ఆర్మీ నుసెయి రత్‌లోనే మరో నివాస భవనంపై జరిపిన దాడిలో మరో ఆరుగురు మృత్యువాత పడ్డారు. అల్-అక్సా మార్టిర్స్ ఆస్పత్రి క్షతగాత్రులతో కిటకిటలాడుతోందని స్థానికులు తెలిపారు. విద్యుత్ సరఫరా కూడా ఆస్పత్రిలోని కొన్ని ముఖ్యమైన వార్డుల్లోనే ఉందని చెప్పారు. మృతదేహాలతో కూడిన ప్లాస్టిక్ బ్యాగులు ఆవరణలో వరుసగా పడేసి ఉన్నాయని, బాధితుల బంధువుల రోదనలతో ఆ ప్రాంతం దద్దరిల్లుతోందన్నారు.

కంగనకు కానిస్టేబుల్ చెంపదెబ్బ

- చండీగఢ్ విమానాశ్రయంలో అనూహ్య ఘటన
- వెనువెంటనే ఆ మహిళా కానిస్టేబుల్‌పై సస్పెన్షన్ వేటు

న్యూఢిల్లీ: ఢిల్లీకి వెళ్లేందుకు గురువారం చండీగఢ్ విమానాశ్రయానికి వచ్చిన బాలీవుడ్ నటి, మండీ నియోజకవర్గ బీజేపీ ఎంపీ కంగనా రనౌత్‌కు చేదు అనుభవం ఎదురైంది. కేంద్ర పారిశ్రామిక భద్రతా దళం (సీఐఎస్ఎఫ్) మహిళా కానిస్టేబుల్ కుల్వీందర్ కౌర్ ఆమెను చెంపదెబ్బ కొట్టారు. ఈ అనూహ్య ఘటనపై కంగనా సోషల్‌మీడియా వేదికగా స్పందించారు. ''ఎయిర్‌పోర్ట్‌లో సెక్యూరిటీ చెక్‌ను పూర్తిచేసుకుని లోపలికి వెళ్తుంటే మహిళా కానిస్టేబుల్ హఠాత్తుగా ఎదురొచ్చి చెంప చెళ్లుమనిపించింది. తర్వాత దూషించింది. ఎందుకని అడిగితే రైతులకు మద్దతుగా ఆ పని చేశా అని చెప్పింది. పంజాబ్‌లో ఉగ్ర, హింసాత్మక ఘటనలు పెచ్చరిల్లుతున్నాయి'' అని కంగనా అన్నారు. ఢిల్లీకి చేరుకున్నాక సీఐఎస్ఎఫ్ డైరెక్టర్ జనరల్‌ను కలిసి జరిగింది వివరించారు.


కంగనా రనౌత్


కుల్వీందర్ కౌర్

కానిస్టేబుల్ వాదనేంటి?

చెంపదెబ్బ కొట్టాక అక్కడే కొద్దిసేపు ఉన్న కానిస్టేబుల్ అక్కడ వారితో.. '' నాలుగేళ్ల క్రితం వివాదాస్పద మూడు సాగు చట్టాలను రద్దుచేయాలంటూ ఆందోళన బాటపట్టిన వేలాది మంది రైతులను కించపరుస్తూ వ్యాఖ్యలు, పోస్టులు చేసినందుకే కంగనను కొట్టా. ఆనాడు ఢిల్లీలో బైఠాయించిన మహిళా రైతులను చూపిస్తూ వీళ్లంతా కేవలం రూ.100 కోసం ధర్నాలో పాల్గొన్నారు అని కంగనా కించపరిచారు. ఆనాడు ధర్నా చేస్తున్న వాళ్లలో మా అమ్మ కూడా ఉంది. మాది రైతు కుటుంబం. మా అన్న కూడా రైతు. కంగనా అలాగే రోడ్డుపై కూర్చొని ధర్నా చేయగలదా?'' అని ఆవేశంగా మాట్లాడారు.

కానిస్టేబుల్‌పై కోర్ట్ ఆఫ్ ఎంక్వైరీ

ఘటనను సిట్టింగ్ మహిళా ఎంపీపై దాడిగా జాతీయ మహిళా కమిషన్ (ఎన్‌సీడబ్ల్యూ) అభివర్ణించింది. ఆమెపై కఠిన చర్యలు తీసుకోవాలని ఎన్‌సీడబ్ల్యూ చైర్‌పర్సన్ రేఖా శర్మ 'ఎక్స్'లో ఒక పోస్ట్‌చేశారు. ఘటనను హరియాణా ప్రభుత్వం సీరియస్‌గా తీసుకుంది. కానిస్టేబుల్‌ను సస్పెండ్ చేసి ఎఫ్ఐఆర్‌ను నమోదుచేసి కేసు దర్యాప్తు ప్రారంభించామని ముఖ్యమంత్రి నయాబ్ సింగ్ సైనీ చెప్పారు. నిందితురాలు సీఐఎస్ఎఫ్ ఉద్యోగి కావడంతోపాటు ఎయిర్‌పోర్ట్‌లో ఘటన జరగడంతో కోర్ట్ ఆఫ్ ఎంక్వైరీకి సీఐఎస్ఎఫ్ ఆదేశించింది. ఆమెను అదుపులోకి తీసుకుని సీఐఎస్ఎఫ్ కమాండ్ ఆఫీస్‌కు తీసుకెళ్లి ప్రశ్నిస్తున్నారు.

భద్రతా మండలికి పాక్

ఐక్యరాజ్యసమితి: ఐక్యరాజ్యసమితిలోని ప్రధానమైన భద్రతా మండలికి శాశ్వతేతర సభ్య దేశాల కోటాలో 5 దేశాలు ఎన్నికయ్యాయి. అవి..పాకిస్తాన్, పనామా, సొమాలియా, డెన్మార్క్, గ్రీస్. ఐరాస జనరల్ అసెంబ్లీలో రహస్య బ్యాలెట్ విధానంలో గురువారం జరిగిన ఎన్నికలో ఆఫ్రికా, ఆసియా-పసిఫిక్ ప్రాంతాలకుగాను సొమాలియా, పాకిస్తాన్‌లు, లాటిన్ అమెరికా, కరీబియన్ ప్రాంత దేశాలకుగాను పనామా, పశ్చిమ యూరప్, ఇతర దేశాలకుగాను డెన్మార్క్, గ్రీస్‌లు అత్యధిక ఓట్లు సంపాదించాయి. 2025 జనవరి నుంచి రెండేళ్ల పాటు 2026 డిసెంబర్ 31వ తేదీ వరకు ఇవి శాశ్వతేతర సభ్య హోదాలో కొనసాగుతాయి.

కర్ణాటక మంత్రి రాజీనామా

బెంగళూరు: కర్ణాటకలోని కాంగ్రెస్ ప్రభుత్వానికి ఎదురుదెబ్బ తగిలింది. ఎస్టీ కార్పొరేషన్‌లో నిధులను అక్రమంగా బదిలీ చేశారంటూ ఆరోపణలను ఎదుర్కొంటున్న గిరిజన సంక్షేమ శాఖ మంత్రి బి.నాగేంద్ర రాజీనామా చేశారు. రాజీనామా పత్రాన్ని సీఎంకు అందజేసినట్లు గురువారం రాత్రి చెప్పారు. ఈ మొత్తం వ్యవహారంపై విచారణ నిష్పాక్షికంగా జరగాలనే పదవి నుంచి తప్పుకుంటున్నానని అన్నారు.



ముర్ముకు 18వ లోక్‌సభకు ఎన్నికైన సభ్యుల వివరాలను అందజేస్తున్న సీఈసీ రాజీవ్ కుమార్. పక్కన ఈసీలు జ్ఞానేశ్ కుమార్, సుఖ్‌బీర్ సింగ్

రాష్ట్రపతి ముర్ముతో ఈసీ భేటీ

నూతన లోక్‌సభ సభ్యుల వివరాలు అందజేత

న్యూఢిల్లీ: ప్రధాన ఎన్నికల కమిషనర్(సీఈసీ) రాజీవ్ కుమార్, ఇద్దరు ఎన్నికల కమిషనర్లతో కలిసి గురువారం రాష్ట్రపతి ద్రౌపదీ ముర్ముతో భేటీ అయ్యారు. సాయంత్రం 4.30 గంటల సమయంలో సీఈసీ రాజీవ్ కుమార్, కమిషనర్లు జ్ఞానేశ్ కుమార్, సుఖ్‌బీర్ సింగ్‌లు రాష్ట్రపతి ముర్మును కలిశారని రాష్ట్రపతి భవన్ ఒక ప్రకటనలో తెలిపింది. ప్రజాప్రాతినిధ్య చట్టం-1951లోని సెక్షన్ 73ను అనుసరించి సార్వత్రిక ఎన్నికల్లో 18వ లోక్‌సభకు, రాష్ట్రాల అసెంబ్లీలకు ఎన్నికైన, నామినేట్ అయిన సభ్యుల వివరాలతో కూడిన ఎన్నికల కమిషన్ నోటిఫికేషన్ ప్రతిని ఆమెకు అందజేశారని వివరించింది.

పోలింగ్ 65.79 శాతం

న్యూఢిల్లీ: ఇటీవల ముగిసిన సార్వత్రిక ఎన్నికల్లో 65.79 శాతం పోలింగ్ నమోదైందని కేంద్ర ఎన్నికల సంఘం గురువారం ప్రకటించింది. పోస్టల్ బ్యాలెట్లను ఇంకా ఇందులో కలపని కారణంగా తుది పోలింగ్ శాతంలో మార్పులు ఉంటాయని పేర్కొంది. దేశవ్యాప్తంగా లోక్‌సభ ఎన్నికల్లో 64.2 కోట్ల మంది ఓటర్లు తమ ఓటు హక్కును వినియోగించుకున్నట్లు ప్రధాన ఎన్నికల కమిషనర్ రాజీవ్ కుమార్ ప్రకటించడం తెల్సిందే. 2019 పార్లమెంట్ ఎన్నికల్లో 67.40 శాతం పోలింగ్ నమోదైంది. 2019 ఎన్నికలనాటికి దేశవ్యాప్తంగా 91.20 కోట్ల మంది ఓటర్లు ఉంటే ఆనాడు వారిలో 61.50 కోట్ల మంది మాత్రమే ఓటేశారు. ఇటీవల ముగిసిన 2024 లోక్‌సభ ఎన్నికల నాటికి మొత్తం ఓటర్ల సంఖ్య 96.88 కోట్లకు పెరగడం విశేషం. అన్ని రాష్ట్రాలు, కేంద్రపాలిత ప్రాంతాల నుంచి విడివిడిగా పోస్టల్ బ్యాలెట్ ఓట్లు, మొత్తంగా ఓటింగ్ శాతాల సమగ్ర వివరాలు తమకు అందాక అందరికీ అందుబాటులోకి తెస్తామని ఈసీ గురువారం విడుదలచేసిన ఒక ప్రకటనలో పేర్కొంది.

ఎన్నికల కోడ్ ముగిసింది: ఈసీ

న్యూఢిల్లీ: సార్వత్రిక ఎన్నికల ప్రక్రియ పూర్తవడంతో ఎన్నికల ప్రవర్తనావళి గడువు ముగిసింది. కేంద్ర కేబినెట్ సెక్రటరీ, రాష్ట్ర ప్రభుత్వాల ప్రధాన కార్యదర్శులకు ఎన్నికల కమిషన్ గురువారం పంపిన ఒక సర్క్యులర్‌లో ఈ విషయం తెలిపింది. లోక్‌సభ ఎన్నికల ప్రకటన వెలువడిన మార్చి 16వ తేదీ నుంచి ఎన్నికల కోడ్ అమల్లో ఉన్న విషయం తెల్సిందే. ఎన్నికల ప్రవర్తనా నియమావళి అమలు ఎత్తివేత నిర్ణయం తక్షణం అమల్లోకి వస్తుందని ఈసీ ప్రకటించింది. లోక్‌సభతోపాటు అరుణాచల్‌ప్రదేశ్, సిక్కిం, ఒడిశా, ఆంధ్రప్రదేశ్ శాసనసభలకు, కొన్ని రాష్ట్రాల్లో అసెంబ్లీలకు ఉప ఎన్నికలు జరిగిన విషయం తెలిసిందే. ఎన్నికల ప్రచారం, పోలింగ్ నిర్వహణ, లెక్కింపు ప్రక్రియ పారదర్శకంగా, ప్రశాంతంగా, నిష్పాక్షికంగా జరపడంతోపాటు అధికార పార్టీలు, ప్రభుత్వాలు అధికార దుర్వినియోగాన్ని నివారించే లక్ష్యంతో దేశంలో 1960 నుంచి ఎన్నికల వేళ ఎన్నికల కోడ్ అమలు చేస్తున్నారు.

ఆ 105 మంది ఎంపీల విద్యార్హత 5-12 తరగతే

న్యూఢిల్లీ: కేవలం ఐదో తరగతి నుంచి పన్నెండో తరగతి వరకు విద్యార్హత ఉన్న 105 మంది లోక్‌సభ అభ్యర్థులు తాజా ఎన్నికల్లో గెలిచి పార్లమెంట్‌లో అడుగుపెట్టబోతున్నారని అసోసియేషన్ ఫర్ డెమొక్రటిక్ రిఫామ్స్(ఏడీఆర్) నివేదికలో తేలింది. మేథో సంస్థ పీఆర్ఎస్ లెజిస్లేటివ్ రీసెర్చ్, ఏడీఆర్‌లు గెలిచిన అభ్యర్థుల విద్యార్హతల వివరాలను తాజాగా బహిర్గతం చేశాయి.

5-12 తరగతి: 105 మంది
(ఐదో తరగతి- ఇద్దరు
8వ తరగతి- నలుగురు
10వ తరగతి- 34 మంది
12వ తరగతి- 65 మంది)
డిగ్రీ, ఆపైన : 420 మంది
(ఇందులో డాక్టర్లు 4 శాతం, న్యాయవిద్య పట్టభద్రులు 7 శాతం, పీహెచ్‌డీ చేసిన వారు 5 శాతం ఉన్నారు)
డిప్లొమా : 17 మంది
అక్షరజ్ఞానం: ఒక్కరు
(విద్యార్హతలు లేవు)

ఎంపీల్లో 46 శాతం నేర చరితులు


ఏడీఆర్ నివేదిక వెల్లడి

న్యూఢిల్లీ: లోక్‌సభకు తాజాగా ఎన్నికైన 543 మందిలో 46 శాతం అంటే 251 మంది నేరచరితులు ఉన్నారని అసోసియేషన్ ఆఫ్ డెమొక్రటిక్ రిఫామ్స్(ఏడీఆర్) నివేదించింది. ఈ 251 మందిలో 27 మంది దోషులుగా తేలారు. నేర చరితులు ఇంత భారీ సంఖ్యలో దిగువసభకు ఎన్నికవడం ఇదే మొదటిసారి అని ఏడీఆర్ పేర్కొంది. 2014 ఎన్నికల్లో 34 శాతం అంటే 185 మంది, 2009లో 30 శాతం అంటే 162 మంది, 2004లో 23 శాతం అంటే 125 మంది క్రిమినల్ కేసులున్న వారు లోక్‌సభకు ఎన్నికైనట్లు ఏడీఆర్ వెల్లడించింది.

దోషులుగా నిర్ధారణ అయిన వారు: 27
విద్వేష ప్రసంగాల కేసులున్న వారు: 43
అత్యాచారం, హత్య, హత్యాయత్నం, అపహరణ, మహిళలపై నేరాలు: 170 మంది (మహిళలపై నేరాలు: 15, రేప్: 2, కిడ్నాప్: 4)
మామూలు క్రిమినల్ కేసులు ఉన్నవారు: 226
తీవ్రమైన క్రిమినల్ కేసులు ఉన్నవారు: 134

సంవత్సరం	నేర చరితులు
2024	251
2019	233
2014	185
2009	162
2004	125

మోదీకి ప్రత్యామ్నాయం అన్వేషిస్తున్న ఆర్ఎస్ఎస్: రౌత్



ముంబై: నరేంద్ర మోదీ బలవంతంగా మూడోసారి ప్రధానమంత్రి కావడానికి ప్రయత్నిస్తే ఆయన ప్రభుత్వం పూర్తికాలం అధికారంలో ఉండబోదని శివసేన(ఉద్ధవ్) సీనియర్ నేత, రాజ్యసభ సభ్యుడు సంజయ్ రౌత్ చెప్పారు. ఆయన గురువారం మీడియాతో మాట్లాడారు. కేంద్రంలో మోదీకి ప్రత్యామ్నాయ నాయకుడిని తెరపైకి తీసుకురావడానికి రాష్ట్రీయ స్వయంసేవక్ సంఘ్(ఆర్ఎస్ఎస్) కార్యాచరణ ప్రారంభించిందని అన్నారు. 2014, 2019లో బీజేపీ భారీ మెజార్టీతో అధికారంలోకి వచ్చిన తర్వాత ఆర్ఎస్ఎస్‌ను బానిసగా మార్చుకోవడానికి నరేంద్ర మోదీ, అమిత్ షా ప్రయత్నించారని ఆరోపించారు. ఇప్పుడు వారిద్దరి బలం తగ్గిపోయిందని పేర్కొన్నారు. మోదీని ఇంటికి సాగనంపే స్థితిలో ప్రస్తుతం ఆర్ఎస్ఎస్ ఉందన్నారు.

సాక్షి కరీంనగర్

శుక్రవారం : 7 : జూన్ : 2024



రాజన్న సేవలో సీజీఎం

వేములవాడఅర్బన్: రాజన్నను గురువారం స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా చీఫ్ జనరల్ మేనేజర్ మంజుశర్మ దర్శించుకున్నారు. స్వామివారికి కోడెమొక్కులు చెల్లించుకున్నారు.



అంజన్నకు 2.89లక్షల ఆదాయం

కొండగట్టు శ్రీ ఆంజనేయ స్వామివారి జయంతి సందర్భంగా సమర్పించిన ఇరుముడులను ఆలయ అధికారులు లెక్కించారు. 2.89 లక్షల ఆదాయం సమకూరింది. 8లో▸

వాతావరణం

గరిష్ఠం/కనిష్ఠం
38.0/27.0

ఆకాశం నిర్మలంగా ఉంటుంది. అప్పుడప్పుడు మేఘావృతమవుతుంది. జిల్లాలోని పలు ప్రాంతాల్లో వర్షం కురిసే అవకాశం ఉంది.



సాగులో సందేహాలా


- రేపు జిల్లా వ్యవసాయ అధికారితో 'సాక్షి' ఫోన్ఇన్

కరీంనగర్ అర్బన్: వానాకాలం సీజన్ ప్రారంభమైన నేపథ్యంలో రైతులు ఎదుర్కొంటున్న సమస్యలు పరిష్కరించుకునేందుకు 'సాక్షి' చక్కని అవకాశం కల్పిస్తోంది. వరినాట్లు, పత్తి, ఇతర మెట్ట పంటలు సాగుచేసే క్రమంలో వినియోగించే విత్తనాలు, ఎరువులు, సాగులో ఎదురవుతున్న ఇబ్బందులు, నకిలీ విత్తనాలు, రైతుబంధు, రైతుబీమా సమస్యలు, క్రిమిసంహారక మందుల వినియోగం, సస్యరక్షణ చర్యలు వంటి అంశాలను నేరుగా తెలుసుకోవచ్చు. విత్తనాలు వేసుకునేందుకు అనువైన అవకాశాలు, సమయాలను శనివారం జిల్లా వ్యవసాయ అధికారి బత్తిని శ్రీనివాస్‌తో మాట్లాడి తెలుసుకోవచ్చు. సందేహాలను నివృత్తి చేసుకోవడంతో పాటు సమస్యల పరిష్కారానికి ఇదో మంచి అవకాశం. నిర్దేశించిన సమయంలోజిల్లా రైతులూ సద్వినియోగం చేసుకోండి.

ఫోన్‌నంబర్: 9989575683
సమయం: శనివారం ఉదయం 10 నుంచి 11 గంటల వరకు

ఆమె జాడేది?





- పార్లమెంట్ ఎన్నికల్లో పెద్దగా ఓట్లు పోల్ కాలే.. సీట్లు రాలే
- 'ఆమె'కు టికెట్ ఇవ్వని ప్రధాన పార్టీలు
- మూడు సెగ్మెంట్ల బరిలో ఆరుగురు మహిళలు
- ఒక్కరికీ దక్కని డిపాజిట్

33 శాతం రిజర్వేషన్‌తోనే..

సార్వత్రిక ఎన్నికల సమరంలో మహిళల ఓట్లే కీలకంగా ఉన్నా.. సీట్ల విషయంలో మాత్రం వెనకబడుతున్నారు. మూడు పార్లమెంట్ స్థానాల్లో పరిశీలిస్తే అన్నిచోట్లా పురుషుల కంటే 'ఆమె' ఓట్లే అధికంగా ఉన్నాయి. అభ్యర్థుల గెలుపోటముల్లో వీరు కీలకం. అయినా, మహిళలకు సీట్లు కేటాయించేందుకు ప్రధాన పార్టీలు ముందుకు రావడం లేదు. పురుష అభ్యర్థులకే అవకాశం ఇస్తున్నాయి. మహిళలకు 33 శాతం రిజర్వేషన్ బిల్లును పార్లమెంట్‌లో ప్రవేశపెట్టిన బీజేపీ, వెంటనే అమల్లోకి తేవాలని డిమాండ్ చేసిన కాంగ్రెస్, బీఆర్ఎస్‌లు లోక్‌సభ బరిలో నిలిచాయి. కానీ, పార్లమెంట్‌లో అడుగుపెట్టేందుకు మహిళలకు అవకాశం కల్పించలేదు. వచ్చే పార్లమెంట్ ఎన్నికల్లో మహిళా రిజర్వేషన్ బిల్లు అమలు చేయనుండటంతో మహిళల ప్రాతినిధ్యం పెరిగే అవకాశాలున్నాయి.

సాక్షి ప్రతినిధి, కరీంనగర్:

ఉమ్మడి కరీంనగర్ జిల్లా నుంచి ఈసారి పార్లమెంట్‌లో అడుగుపెట్టి అధ్యక్షా..! అని అనాలనుకున్న మహిళా అభ్యర్థులకు నిరాశే మిగిలింది. ప్రధాన పార్టీలేవీ కరీంనగర్, పెద్దపల్లి, నిజామాబాద్ పార్లమెంట్ టికెట్లను వారికి ఇవ్వలేదు. చిన్నాచితకా పార్టీల నుంచి కొందరు, స్వతంత్రులుగా మరికొందరు మహిళలు ఎన్నికల బరిలో నిలిచి, తమ అదృష్టాన్ని పరీక్షించుకున్నారు. పెద్దగా ఓట్లు పోల్ కాలేదు. పైపెచ్చు వారందరి డిపాజిట్లు గల్లంతయ్యాయి. మూడు నియోజకవర్గాల పరిధిలో మహిళా ఓటర్లు అధికంగా ఉన్నా, వారికి అవకాశాలు, పోలైన ఓట్లు మాత్రం నామమాత్రమే కావడం గమనార్హం.

బరిలో ఆరుగురు మహిళలు..

అసెంబ్లీ, స్థానిక సంస్థల ఎన్నికల్లో రిజర్వేషన్ల ఆధారంగా పురుషులతో సమానంగా మహిళలు పోటీ పడుతున్నారు. లోక్‌సభకు వచ్చేసరికి మహిళల ప్రాతినిధ్యం గగనమవుతోంది. ప్రధాన పార్టీలు టిక్కెట్ ఇవ్వడానికి ఆసక్తి చూపకపోగా, స్వతంత్రంగా పోటీ చేసేందుకు ఎవరూ ముందుకు రావడం లేదు. వైశాల్యపరంగా పార్లమెంట్ పెద్దగా ఉండటం ఒక కారణంగా చెప్పవచ్చు. పార్టీలు టికెట్ ఇస్తే మాత్రం పోటీ చేసేందుకు చాలామంది మహిళలు ఆసక్తిగా ఉన్నారు. కరీంనగర్ పార్లమెంట్ బరిలో 28 మంది నిలవగా వారిలో ముగ్గురు మహిళలు ఉన్నారు. ఈ ముగ్గురికీ కలిపి కేవలం 11,933 ఓట్లు వచ్చాయి. అలాగే, నిజామాబాద్ నుంచి 29 మంది ఎన్నికల బరిలో నిలవగా, వారిలో ఒక్కరే మహిళ. ఆమెకు కేవలం 5,710 ఓట్లు పడ్డాయి. పెద్దపల్లి పార్లమెంట్ బరిలో 42 మంది అభ్యర్థులు నిలవగా.. వీరిలో ఇద్దరు మహిళలు. ఇద్దరికీ కలిపి 5,908 ఓట్లు వచ్చాయి. వీరెవరికీ డిపాజిట్ దక్కలేదు.

ఎంపీలందరూ పురుషులే..

కరీంనగర్ పార్లమెంట్ ఏర్పడినప్పటి నుంచి ఇప్పటివరకు ఒక్క మహిళకూ ఎంపీగా అవకాశం రాలేదు. నిజామాబాద్‌లో జాగృతి అధ్యక్షురాలు కవిత 2014లో ఎంపీగా గెలవగా, పెద్దపల్లిలో డాక్టర్ సుగుణకుమారి 1998, 99లలో రెండుసార్లు విజయం సాధించారు. ప్రస్తుతం కరీంనగర్ ఎంపీగా బండి సంజయ్, నిజామాబాద్ ఎంపీగా ధర్మపురి అర్వింద్, పెద్దపల్లి ఎంపీగా గడ్డం వంశీకృష్ణ గెలుపొందారు.

జర్మన్ భాష శిక్షణకు దరఖాస్తుల ఆహ్వానం

సప్తగిరికాలనీ(కరీంనగర్): జర్మన్ భాష శిక్షణ కోసం దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు జిల్లా ఉపాధి అధికారి వై.తిరుపతిరావు గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. జర్మనీలో రిక్రూట్ అయ్యే నర్సుల కోసం జూన్ 10లోగా జర్మన్ భాషా శిక్షణలో ప్రత్యేక స్క్రీనింగ్, ఎన్‌రోల్‌మెంట్ ప్రోగ్రాం కోసం దరఖాస్తు చేసుకోవాలని అన్నారు. జీఎన్ఎం, బీఎస్సీ కోర్సు చేసి ఉండి 21 నుంచి 38 ఏళ్ల మధ్య వయస్సు కలిగి ఉన్నవారు అర్హులని తెలిపారు. తెలంగాణలో గుర్తింపు పొందిన కళాశాలల నుంచి నర్సింగ్, ఐసీయూ, జిరియాట్రిక్స్, ఆర్థోపెడిక్, సైకియాట్రి, కార్డియాలజీ, నియో నాటల్, సర్జికల్ వార్డులో మూడేళ్ల ప్రొఫెషనల్, క్లినికల్ పనిచేసిన అనుభవం, జర్మన్ భాష నైపుణ్యం కలిగిన వాళ్లు దరఖాస్తు చేసుకోవాలని తెలిపారు. అభ్యర్థులు తమ బీ–1 భాషా శిక్షణను విజయవంతంగా పూర్తి చేసి జర్మనీలో నర్సింగ్ అసిస్టెంట్‌గా పనిచేసే అవకాశం ఉంటుందని, జర్మనీలో బీ–2, గుర్తింపు పరీక్షను క్లియర్ చేసిన తర్వాత రిజిస్టర్డ్ నర్స్‌గా ప్రమోట్ చేయబడతారని, కనీస జీతం 2300నుంచి 2800యూరోలు, ఓవర్ టైం అలవెన్సులు మినహాయించి ఇవ్వనున్నట్లు పేర్కొన్నారు. ఎంపికైన అభ్యర్థులకు వీసా, ఇమిగ్రేషన్ ప్రక్రియ, వన్–వే విమాన టికెట్లు ఉచితంగా అందించబడుతాయని, వివరాలకు 9908830438, 8919047600, 7032379066, 8499990304 నంబర్‌లను సంప్రదించాలని సూచించారు.

న్యూస్‌రీల్

ఎన్నికల కోడ్ ఎత్తివేత

- నామినేటెడ్ పదవులకు ప్రమాణ స్వీకారం

సాక్షిప్రతినిధి, కరీంనగర్: పార్లమెంట్ ఎన్నికల నేపథ్యంలో విధించిన కోడ్‌ను ఈసీ గురువారం ఎత్తివేసింది. దీంతో యథావిధిగా ప్రభుత్వ అభివృద్ధి కార్యక్రమాలు, పెండింగ్‌లో ఉన్న పనులకు మోక్షం కలగనుంది. ప్రతీ సోమవారం కలెక్టరేట్‌లో జరిగే ప్రజావాణి ప్రారంభం కానుంది. అభివృద్ధి పనులు, శంకుస్థాపనలు చేసేందుకు అధికారులు, ప్రజాప్రతినిధులు పల్లె, పట్నం బాట పట్టనున్నారు. గత కొన్ని రోజులుగా ఎన్నికల కోడ్ వల్ల ఎన్నికల నిర్వహణలో బిజీగా ఉన్న అధికారులంతా వారివారి కార్యాలయాల్లో పేరుకుపోయిన పెండింగ్ ఫైల్స్ క్లియర్ చేసే పనుల్లో నిమగ్నం కానున్నారు. భూకబ్జా వ్యవహారాల్లో ఫిర్యాదుదారులు ఇచ్చిన దరఖాస్తులు, ఇతరత్రా విషయాలపై ఆసక్తి రేకెత్తించనుంది.

నామినేటెడ్ ప్రమాణ స్వీకారానికి ముహూర్తం

ఉమ్మడి జిల్లా నుంచి ఎన్నికల కోడ్‌కు ముందే రాష్ట్ర ప్రభుత్వ సలహాదారుడిగా నియామకమైన హర్కర వేణుగోపాల్, మహిళా కమిషన్ చైర్‌పర్సన్‌గా నియామకమైన నేరెళ్ల శారద, సుడా చైర్మన్‌గా నియామకమైన కోమటిరెడ్డి నరేందర్‌రెడ్డి రెండు, మూడు రోజుల్లో ప్రమాణ స్వీకారం చేయనున్నట్లు సమాచారం.

బడిబాట ప్రారంభం



కరీంనగర్: ప్రభుత్వ పాఠశాలల్లో అధిక సంఖ్యలో విద్యార్థులను చేర్పించాలని డీఈవో సీహెచ్.జనార్దన్‌రావు పిలుపునిచ్చారు. బడిబాటలో భాగంగా గురువారం మన్నెంపల్లి ఉన్నత పాఠశాలలో విద్యార్థులు, బడీడు పిల్లల తల్లిదండ్రులతో ర్యాలీ నిర్వహించారు. కరీంనగర్ 35వ డివిజన్‌లో ప్రభుత్వపాఠశాలలో విద్యార్థులతో ఉపాధ్యాయులు ర్యాలీ నిర్వహించారు. కార్పొరేటర్ చాడగొండ బుచ్చిరెడ్డి, ప్రధానోపాధ్యాయులు రాజేందర్, సత్యనారాయణరెడ్డి పాల్గొన్నారు.

నేటి నుంచి ఇంటర్ సప్లిమెంటరీ మూల్యాంకనం

సప్తగిరికాలనీ(కరీంనగర్): ఇంటర్ అడ్వాన్స్‌డ్ సప్లిమెంటరీ పరీక్షలు జూన్–2024కు సంబంధించిన జవాబు పత్రాల మూల్యాంకనం నేటి నుంచి ప్రారంభం కానున్నట్లు జిల్లా ఇంటర్ విద్యాశాఖ అధికారి జి.జగన్‌మోహన్‌రెడ్డి తెలిపారు. ఉదయం 10 గంటల నుంచి మూల్యాంకన ప్రక్రియ రెండో విడత రెండు కేంద్రాలలో జరుగనున్నట్లు తెలిపారు. పద్మనగర్‌లోని జిల్లా ఇంటర్మీడియట్ విద్యాధికారి కార్యాలయంలో వాణిజ్యశాస్త్రం, చరిత్ర, డాక్టర్స్ స్ట్రీట్‌లోని ప్రభుత్వ జూనియర్ కళాశాల (బాలికలు)లో వృక్షశాస్త్రం, జంతు శాస్త్రం, రసాయన శాస్త్రం పేపర్ల మూల్యాంకనం జరుగనున్నట్లు తెలిపారు. కరీంనగర్ ఉమ్మడి జిల్లాలోని అన్ని జూనియర్ కళాశాలల యాజమాన్యాలు, ప్రిన్సిపాల్‌లు ఎగ్జామినర్ నియామక ఉత్తర్వుల మేరకు కేంద్రాలకు సకాలంలో అధ్యాపకులను పంపాలని సూచించారు.

గ్రూప్–1 ప్రశాంతంగా నిర్వహించండి

- విత్తనాలు, ఎరువులు అందుబాటులో ఉంచండి
- మిషన్ భగీరథ పథకం అమలుపై ఇంటింటా సర్వే
- స్కూల్ యూనిఫామ్స్ త్వరగా రెడీ చేయండి
- వీసీలో రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి శాంతి కుమారి



వీసీలో కలెక్టర్ పమేలా సత్పతి

కరీంనగర్ అర్బన్: ఈ నెల 9న గ్రూప్–1 ప్రిలిమ్స్ పరీక్ష ప్రశాంత వాతావరణంలో సాగేలా పకడ్బందీ చర్యలు తీసుకోవాలని రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి శాంతి కుమారి కలెక్టర్‌ను ఆదేశించారు. గురువారం హైదరాబాద్ నుంచి టీజీపీఎస్సీ చైర్మన్ మహేందర్‌రెడ్డి, డీజీపీ రవిగుప్తాతో కలిసి గ్రూప్–1 ప్రిలిమ్స్ పరీక్ష ఏర్పాట్లు, విత్తనాలు ఎరువుల సరఫరా, మిషన్ భగీరథ పథకం అమలు, స్కూల్ యూనిఫామ్స్ తయారీపై వీడియో కాన్ఫరెన్స్ ద్వారా సమీక్షించారు. ఈ నెల 9న ఉదయం ఐదు గంటలకల్లా ఆయా పరీక్ష కేంద్రాలకు ఓఎంఆర్ షీట్లు, ప్రశ్న పత్రాలు పోలీస్ ఎస్కార్ట్ మధ్య తరలించాలని సూచించారు. చీఫ్ సూపరింటెండెంట్లు, అబ్జర్వర్లు, ఫ్లయింగ్ స్క్వాడ్స్, ఇన్విజిలేటర్లు అప్రమత్తంగా విధులు నిర్వర్తించాలని పేర్కొన్నారు. ఎక్కడైనా నిర్లక్ష్యం వహిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

విత్తనాలు, ఎరువుల కొరత రావొద్దు

రైతులకు సరిపడా విత్తనాలు, ఎరువులు అందుబాటులో ఉంచాలని ఆదేశించారు. కృత్రిమ కొరత సృష్టించే వ్యాపారులపై ఉక్కుపాదం మోపాలని అన్నారు. నకిలీ విత్తనాలు మార్కెట్లోకి రాకుండా టాస్క్‌ఫోర్స్ బృందాలతో ఎప్పటికప్పుడు తనిఖీలు నిర్వహించాలని సూచించారు. రైతు వేదికల్లో వీడియో కాన్ఫరెన్స్ ద్వారా రైతు నేస్తం కార్యక్రమాన్ని నిర్వహించాలని సూచించారు.

మిషన్ భగీరథపై ఇంటింటా సర్వే

గ్రామీణ ప్రాంతాల్లో మిషన్ భగీరథ పథకం అమలు తీరు తెన్నులపై ఇంటింటా సర్వే చేపట్టాలని సూచించారు. ప్రతీఇంటా మిషన్ భగీరథ నల్ల నీరు వస్తుందా లేదా అనే అంశంపై పంచాయతీ కార్యదర్శులు, అంగన్వాడీ సిబ్బంది, స్వశక్తి మహిళలతో కలిసి సర్వే చేయించాలని ఆదేశించారు. ఈ అంశంలో కలెక్టర్, అదనపు కలెక్టర్లు ప్రత్యేక చొరవ తీసుకోవాలని తెలిపారు.

యూనిఫామ్స్ రెడీ చేయాలి

నాలుగైదు రోజుల్లోగా స్కూల్ యూనిఫామ్స్ రెడీ చేసి పంపిణీకి సిద్ధం చేయాలని పేర్కొన్నారు. ఈ నెల 12వ తేదీ నుంచి ప్రభుత్వ పాఠశాలలు ప్రారంభం కానున్న నేపథ్యంలో అంతకుముందే స్కూల్ యూనిఫామ్స్ పూర్తిస్థాయిలో తయారు చేసి సిద్ధంగా ఉంచాలని సూచించారు. విద్యార్థులకు యూనిఫామ్స్‌తో పాటు పాఠ్యపుస్తకాలు అందించే ఏర్పాట్లు పకడ్బందీగా చేపట్టాలని ఆదేశించారు. పార్లమెంట్ ఎన్నికలు ప్రశాంతంగా ముగిసినందున కలెక్టర్, అదనపు కలెక్టర్లు, పోలీస్ అధికారులకు, సిబ్బందికి కృతజ్ఞతలు తెలిపారు. గురువారం సాయంత్రమే ఎన్నికల కోడ్ ముగిసినందున సంక్షేమ పథకాల అమలు, అభివృద్ధి పనులను శుక్రవారం నుంచి వేగవంతం చేయాలని ఆదేశించారు. జిల్లా కలెక్టర్ పమేలా సత్పతి, స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ ప్రఫుల్ దేశాయ్, డీఆర్ఓ పవన్ కుమార్, జిల్లా వ్యవసాయ అధికారి బత్తిని శ్రీనివాస్, డీఈవో జనార్దన్ రావు, డీపీవో రవీందర్, డీఆర్డీఓ శ్రీధర్ పలువురు పాల్గొన్నారు.

విద్యుత్ సమస్యలా... ఫోన్ చేయండి

కొత్తపల్లి(కరీంనగర్): వినియోగదారులకు మెరుగైన విద్యుత్ సరఫరా లక్ష్యంగా టీజీఎన్‌పీడీసీఎల్ ముందడుగు వేస్తోంది. వినియోగదారులకు విద్యుత్ ఉద్యోగులను మరింత చేరువ చేయడంతో పాటు సమస్యలు తలెత్తకుండా చర్యలు తీసుకునేందుకు అవసరమైన ఏర్పాట్లు చేస్తోంది. ప్రకృతి వైపరీత్యాలతో తరచూ తలెత్తుతున్న విద్యుత్ అంతరాయాలను అధిగమించేందుకు, సమస్యల పరిష్కారానికి సంబంధిత సెక్షన్ కార్యాలయాల ఫోన్‌నంబర్లు అందుబాటులోకి తీసుకొచ్చింది. ఈ మేరకు కరీంనగర్ డివిజన్ పరిధిలోని ఫోన్ నంబర్లను గురువారం కరీంనగర్ రూరల్ డివిజన్ ఇంజినీర్ జె.రాజం ప్రకటించారు. సెక్షన్‌ల వారీగా ఫ్యూజ్ ఆఫ్ కాల్, సంబంధిత సెక్షన్ ఏఈల ఫోన్ నంబర్లను ప్రజల ముందుకు తీసుకొస్తున్నట్లు తెలిపారు. కరీంనగర్ డివిజన్ పరిధిలోని విద్యుత్ వినియోగదారులు ఫోన్ నంబర్లను అందుబాటులో ఉంచుకోవాలని, విద్యుత్ అంతరాయాలు కలిగినా, సమస్యలు తలెత్తినా ఈ నంబర్లకు ఫోన్ చేయాలని పేర్కొన్నారు.

సెక్షన్	ఏఈ నంబర్	ఫ్యూజ్ ఆఫ్ కాల్
కరీంనగర్ టౌన్–1	9440811432	9491075188
కరీంనగర్ టౌన్–2	9440811433	7036117117
కరీంనగర్ టౌన్–3	9440811434	8333994414
కరీంనగర్ టౌన్–4	9440811435	9491075190
కరీంనగర్ టౌన్–5	9491058663	9491075187
కరీంనగర్ టౌన్–6	8333923900	8331012624
కరీంనగర్ టౌన్–7	8333923901	9912225700
కరీంనగర్ టౌన్–8	7901624873	9491011885
కరీంనగర్ టౌన్–9	7901628354	9491074625
తీగలగుట్టపల్లి	9440811436	9491075193
ఆసిఫ్‌నగర్	9440811437	9491075192
మొగ్దుంపూర్	9491058664	9491075191
కొత్తపల్లి	7901678212	8977428373
బొమ్మకల్	7901624872	9491075194

11న జాబ్‌మేళా

కరీంనగర్: జిల్లాలోని నిరుద్యోగ యువతకు ప్రైవేటురంగంలో ఉద్యోగాలు కల్పించేందుకు ఈనెల 11న జిల్లా ఉపాధి కార్యాలయంలో జాబ్ మేళా నిర్వహిస్తున్నట్లు జిల్లా ఉపాధి అధికారి వై.తిరుపతిరావు ఒక ప్రకటనలో తెలిపారు. ఎంపికైనవారికి ఉద్యోగస్థాయిని బట్టి వేతనం ఇవ్వబడుతుందని పేర్కొన్నారు. అర్హత, ఆసక్తి ఉన్న నిరుద్యోగ యువకులు సర్టిఫికెట్ల జిరాక్స్ కాపీలతో హాజరుకావాలని సూచించారు. వివరాలకు 7207659969, 9908230384 నంబర్లను సంప్రదించవచ్చునని పేర్కొన్నారు.

సమస్యల పాఠశాల



దుర్శేడ్‌లో నిలిచిన డైనింగ్ హాల్ నిర్మాణం

మనఊరు– మనబడి కార్యక్రమంలో కరీంనగర్ మండలంలో మొదటి విడతలో 10 పాఠశాలలు ఎంపిక చేశారు. 2022 మేలో ఆయా పాఠశాలల్లో పనుల కోసం రూ.62.55 లక్షలు మంజూరు చేశారు. నగునూరు పాఠశాలలో పనులు పూర్తికాగా.. మిగితా తొమ్మిది పాఠశాలల్లో బిల్లుల మంజూరులో జాప్యంతో మధ్యలో నిలిచిపోయాయి. కొత్త ప్రభుత్వం అమ్మ ఆదర్శ పాఠశాలల కింద 18పాఠశాలల్లో అభివృద్ధి పనుల కోసం రూ.84.74 లక్షలు మంజూరు చేయగా పనులు సాగుతున్నాయి.



చొప్పదండిలో కూల్చేసిన పాఠశాల ప్రహరీ

చొప్పదండి మండలంలో అమ్మ ఆదర్శ పాఠశాల పథకం కింద 22 పాఠశాలల్లో పనులు కొనసాగుతున్నాయి. గతంలో మన ఊరు–మనబడి పథకం ద్వారా 13పాఠశాలల్లో చేపట్టిన పనులు బిల్లులు రాకపోవడంతో మధ్యలో ఆగిపోయాయి. చొప్పదండిలోని జిల్లా పరిషత్ బాలుర ఉన్నత పాఠశాలలో ఏడాదిగా ప్రహరీ నిర్మాణం చేపట్టడం లేదు.



గంగాధర మండలం రంగారావుపల్లి పాఠశాలలో పనులు పరిశీలిస్తున్న కలెక్టర్ పమేలా సత్పతి(ఫైల్)

- 12 నుంచి పాఠశాలలు పునఃప్రారంభం
- స్కూళ్లకు చేరుకోని పుస్తకాలు, జాడలేని యూనిఫామ్
- ముందుకుసాగని 'అమ్మ' ఆదర్శ కమిటీల పనులు
- జిల్లాలో 492 ఉపాధ్యాయ పోస్టులు ఖాళీ

కరీంనగర్: వేసవి సెలవులు ముగుస్తున్నాయి. ఈ నెల12 నుంచి నూతన విద్యాసంవత్సరం ప్రారంభం కానుంది. మరో నాలుగు రోజుల్లో స్కూళ్లు తెరుచుకోనున్నాయి. జిల్లాలో పాఠశాలలు ఎప్పటిలాగే సమస్యలతో స్వాగతం పలుకుతున్నాయి. మన ఊరు– మనబడి కార్యక్రమంలో ప్రారంభించిన పనులు మూలకు పడగా.. అమ్మ ఆదర్శ పాఠశాల పనులు నెమ్మదిగా కొనసాగుతున్నాయి. పాఠశాలల పునఃప్రారంభం రోజు పిల్లలకు ఇవ్వాల్సిన పుస్తకాలు పూర్తిస్థాయిలో స్కూల్ పాయింట్‌కు చేరలేదు. ఏకరూప దుస్తులు ఆలస్యంగానే పంపిణీ జరుగనున్నట్లు సమాచారం.

జిల్లాలో ఇలా..

జిల్లావ్యాప్తంగా 16 మండలాల్లో 651 ప్రభుత్వ, 11 ఆదర్శ పాఠశాలలు, 22 గురుకులాలు, కేజీబీవీలు 12పాఠశాలల్లో 62,251మంది విద్యార్థులు చదువుతున్నారు. వారికోసం 4,10,700 పుస్తకాలు అవసరమని విద్యాశాఖ అధికారులు ప్రభుత్వానికి నివేదించారు. ఇప్పటి వరకు 3,05,670 పుస్తకాలు జిల్లాకేంద్రం సమీపంలోని కొత్తపల్లి గోదాంకు చేరాయి. ఇంకా 1,05,030 పుస్తకాలు రావాల్సి ఉంది. గోడౌన్ పాయింట్‌నుంచి ఎంఈవో కార్యాలయాలకు అక్కడి నుంచి స్కూల్ పాయింట్‌కు పుస్తకాలు చేరవేసి పంపిణీ చేయాల్సి ఉంటుంది. యూనిఫాం పనులు శరవేగంగా జరుగుతున్నాయి.

492 ఉపాధ్యాయ ఖాళీలు

జిల్లావ్యాప్తంగా 492 ఉపాధ్యాయ ఖాళీలు ఉన్నాయి. కొత్తగా డీఎస్సీ వేసి టీచర్ల నియామకాలు చేపడుతామన్న ప్రభుత్వం ఎన్నికల కోడ్‌తో ప్రక్రియ చేపట్టలేదు. దీంతో 492 ఖాళీలతో పాటు 16మండలాలకు ఎంఈవోలు లేకుండానే విద్యాసంవత్సరం ప్రారంభం కానుంది. నాలుగేళ్లుగా విద్యా వలంటీర్లను నియమించకపోవడంతో ప్రభుత్వ పాఠశాలల్లో చదువు పేద విద్యార్థులకు అందని ద్రాక్షగా మారింది.

నత్తనడకన మనఊరు– మనబడి పనులు

గత బీఆర్ఎస్ ప్రభుత్వంలో ఎంతో ప్రతిష్ఠాత్మకంగా చేపట్టిన 'మనఊరు–మనబడి' కార్యక్రమం ప్రచారానికే పరిమితమైందన్న విమర్శలొస్తున్నాయి. జిల్లాలో పథకం కింద 230 పాఠశాలలను ఎంపిక చేసి, నిధులు కేటాయించారు. పైలట్ ప్రాజెక్టు కింద జిల్లాలో మొదటి విడతగా 14పాఠశాలల్లో పనులు పూర్తయ్యాయి. చాలాచోట్ల పాఠశాలల్లో పనులు పెండింగ్‌లో పెట్టారు. పూర్తయిన చోట బిల్లులు రాలేదంటూ కాంట్రాక్టర్లు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.



శంకరపట్నం మండలం ధర్మారం పాఠశాలలో అమ్మ ఆదర్శ పథకంలో ఏర్పాటుచేసిన నల్లాలు



గౌతమినగర్‌లో కొనసాగుతున్న పనులు

'అమ్మ' ఆదర్శ కమిటీలతో ముందుకు సాగని పనులు

ప్రభుత్వ పాఠశాలల్లో ఎస్ఎంసీ కమిటీలను రద్దు చేసిన ప్రభుత్వం అమ్మ ఆదర్శ కమిటీలను నియమించింది. పాఠశాలల్లో అవసరమైన పనులు ఈనెల 12లోగా పూర్తి చేయాలని నిర్ణయించారు. జిల్లాలో 345పాఠశాలల అభివృద్ధికి రూ.14.19 కోట్లు విడుదల చేశారు. తాగునీరు, టాయిలెట్ల మరమ్మతు, విద్యుత్ కనెక్షన్, కిటికీలు, తలుపులతో పాటు ఇతర పనులు చేపడుతున్నారు. చాలాచోట్ల పనులు నత్తనడకన సాగుతుండడంతో కలెక్టర్ ప్రత్యేకదృష్టి సారించారు. వేగంగా పూర్తిచేయాలని క్షేత్రస్థాయిలో సమీక్ష నిర్వహిస్తున్నారు.

శిక్షణ తరగతులు విజయవంతం

కరీంనగర్‌కల్చరల్: ప్రభుత్వ ప్రోత్సాహం, తల్లిదండ్రుల సహకారంతో శిక్షణ తరగతులు విజయవంతంగా ముగిశాయని బాలభవన్ సూపరింటెండెంట్ కట్టా మంజులాదేవి అన్నారు. గత 45 రోజులుగా నగరంలోని బాలభవన్‌లో నిర్వహిస్తున్న వేసవి శిక్షణ శిబిరం గురువారం ముగింపు కార్యక్రమంలో జ్యోతి ప్రజ్వలన చేసి మాట్లాడారు. అనంతరం విద్యార్థులకు ప్రశంసాపత్రాలు, చెస్ పోటీల్లో విజేతలకు బహుమతులు అందజేశారు. ఈ సందర్భంగా పలువురు చిన్నారులు తాము నేర్చుకున్న కళలను ప్రదర్శించారు. కార్యక్రమంలో బాలభవన్ శిక్షకులు సంగెం రాధాకృష్ణ, శ్రీధర్, కృష్ణకుమార్, సూ ర్యశ్రీ, అనూప్, రాధిక, మల్లిక, సుహాసిని, చిన్నారు ల తల్లిదండ్రులు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.



చిన్నారులతో బాలభవన్ సిబ్బంది

క్లుప్తంగా

ట్రాక్టర్ ఢీకొని బాలుడి దుర్మరణం


వేదాన్ష్ (ఫైల్)

ధర్మారం(ధర్మపురి): ట్రాక్టర్ ఢీకొని ఓ బాలుడు మృతిచెందిన ఘటన ధర్మారం మండలంలోని దొంగతుర్తి గ్రామంలో చోటుచేసుకుంది. ఎస్సై సత్య నారాయణ కథనం ప్రకారం.. దొంగతుర్తికి చెందిన మ్యాన ప్రభాకర్ గురువారం ట్రాక్టర్‌ను నిర్లక్ష్యంగా వెనక్కి తీయడంతో వెనకాలే తన మనవడు వేదాన్ష్(4)ను ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో ఆ బాలుడి తలకు తీవ్ర గాయాలయ్యాయి. కుటుంబసభ్యులు ఆస్పత్రికి తరలిస్తుండగానే మృతిచెందాడు. వేదాన్ష్ తండ్రి ఓంకార్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని, దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై పేర్కొన్నారు.

ఇటుకల బట్టీలో చిన్నారి..

మేడిపల్లి(జగిత్యాల): ట్రాక్టర్ ఢీకొని, 18 నెలల బాలుడు మృతిచెందిన ఘటన మేడిపల్లి మండల కేంద్రంలోని వీఎస్ఆర్ ఇటుకల బట్టీలో చోటుచేసుకుంది. వివరాల్లోకి వెళ్తే.. ఒడిశాకు చెందిన సారతి వోప్ అనే మహిళ నాలుగు నెలలుగా ఇటుకల బట్టీలో పని చేస్తోంది. గురువారం ఉదయం ఆమె కొడుకు నిఖిల్ ఆడుకుంటున్నాడు. అదే ఇటుకల బట్టీలో పనిచేసే డ్రైవర్ కమల్ గమనించకుండా ట్రాక్టర్‌ను వెనక్కి తీయడంతో ఆ చిన్నారిని బలంగా ఢీకొట్టింది. ఈ ఘటనలో తీవ్రంగా గాయపడిన నిఖిల్‌ను హుటాహుటిన జగిత్యాల ఏరియా ఆస్పత్రికి తరలించగా అప్పటికే మృతిచెందినట్లు వైద్యులు తెలిపారు. ఇటుకల బట్టీ నిర్వాహకుడు ప్రసాద్‌తోపాటు డ్రైవర్ కమల్‌పై కేసు నమోదు చేసినట్లు ఎస్సై శ్యాంరాజు పేర్కొన్నారు.

గుండెపోటుతో రైతు మృతి


అశోక్ రెడ్డి (ఫైల్)

చొప్పదండి: మండలంలోని రెవెల్లి గ్రామానికి చెందిన ఊకంటి అశోక్ రెడ్డి (47) అనే రైతు గుండెపోటుతో మృతి చెందాడు. స్థానికుల కథనం ప్రకారం.. అశోక్ రెడ్డి బుధవారం రాత్రి తన ఇంటి సమీపంలో చుట్టుపక్కల వారితో మాట్లాడుతుండగా గుండెపోటుకు గురయ్యాడు. ఆస్పత్రికి తరలించేలోగా మృతిచెందాడు. ఆయన గతంలో ఆదర్శ రైతుగా ఎంపికయ్యాడు. మృతుడికి భార్య, ఇద్దరు కూతుళ్లు ఉన్నారు. బాధిత కుటుంబసభ్యులను ఏఎంసీ మాజీ చైర్మన్ గడ్డం చుక్కారెడ్డి గురువారం పరామర్శించారు.

అనుమానాస్పద స్థితిలో సింగరేణి రిటైర్డ్ కార్మికుడు..


వెంకటరమణ మృతదేహం

తిమ్మాపూర్(మానకొండూర్): మండలంలోని మహాత్మానగర్‌కు చెందిన గుణుకుల వెంకటరమణ(66) అనే సింగరేణి రిటైర్డ్ కార్మికుడు అనుమానాస్పద స్థితిలో మృతిచెందాడు. వివరాల్లోకి వెళ్తే.. వెంకటరమణ రిటైరైన తర్వాత ఆటో నడుపుకుంటూ జీవనం సాగిస్తున్నాడు. ఇటీవల మద్యానికి బానిసయ్యాడు. ఈ క్రమంలో బుధవారం అతిగా మద్యం సేవించి, తిమ్మాపూర్ స్టేజీ వద్ద తన ఆటోలోనే చనిపోయాడు. స్థానికులు రాత్రి గుర్తించి, ఆయన కుటుంబసభ్యులకు సమాచారం అందించారు. మృతుడి భార్య జయలక్ష్మి పోలీసులకు సమాచారం అందించగా ఎస్సై చేరాలు సంఘటన స్థలానికి చేరుకొని, మృతదేహాన్ని పరిశీలించారు. పోస్టుమార్టం నిమిత్తం కరీంనగర్ ఆస్పత్రికి తరలించారు. మృతుడి భార్య ఇచ్చిన ఫిర్యాదు మేరకు అనుమానాస్పద మృతిగా కేసు నమోదు చేసుకొని, దర్యాప్తు చేస్తున్నట్లు పేర్కొన్నారు.

పత్తి విత్తనాలు విత్తుతూ కుప్పకూలి..

- మహిళా కూలి మృతి


అమృతవ్వ మృతదేహం

వేములవాడఅర్బన్: వ్యవసాయ పనులకు వెళ్లిన ఓ మహిళా కూలి అకస్మాత్తుగా మృతిచెందింది. స్థానికుల కథనం ప్రకారం.. వేములవాడ పట్టణంలోని భగవంతరావునగర్‌కు చెందిన గడ్డం అమృతవ్వ(65) జయవరం రోడ్డులోని వ్యవసాయ భూమిలో గురువారం పత్తి విత్తనాలు విత్తేందుకు వెళ్లింది. పని చేస్తూనే శ్వాస ఆడటం లేదంటూ ఒక్కసారిగా కుప్పకూలిపోయింది. అక్కడున్నవారు 108లో వాహనంలో ఆమెను వేములవాడ ఏరియా ఆస్పత్రి తరలించగా మృతిచెందినట్లు వైద్యులు నిర్ధారించారు. మృతురాలికి భర్త లక్ష్మారెడ్డి ఉన్నారు.

ఇంటిపై పడిన తాటిచెట్టు



జగిత్యాలరూరల్: మండలంలోని రఘురాముల కోటలో గురువారం సాయంత్రం ఈదురుగాలులతో వర్షం కురిసింది. దండె రఘుకు చెందిన రేకుల షెడ్డుపై తాటిచెట్టు పడింది. ఈ ఘటనలో ఇంటితోపాటు బాత్‌రూమ్ గోడలు కూలాయి. ఆ సమయంలో ఇంట్లో ఎవరూ లేకపోవడంతో పెనుప్రమాదం తప్పిందని బాధితుడు తెలిపాడు. అలాగే, లక్ష్మీపూర్ గ్రామంలో ఈదురు గాలులకు చెట్లు నేలకొరిగాయి.

గతంలో జైలు.. మళ్లీ చోరీలు

- అంతర్రాష్ట్ర దొంగల ముఠా అరెస్టు
- 13.6 తులాల బంగారం, రూ.1.70 లక్షలు, బైక్ స్వాధీనం
- వివరాలు వెల్లడించిన పెద్దపల్లి ఏసీపీ కృష్ణ


అరెస్టు చూపుతున్న ఏసీపీ కృష్ణ, పక్కన సీఐలు, ఎస్సైలు

సుల్తానాబాద్‌రూరల్(పెద్దపల్లి): గతంలో దొంగతనాలు చేసి, పోలీసులకు చిక్కారు.. జైలుకు వెళ్లి వచ్చినా వారి బుద్ధి మారలేదు.. మళ్లీ చోరీలకు పాల్పడుతున్న అంతర్రాష్ట్ర దొంగల ముఠాను సుల్తానాబాద్ సర్కిల్ పోలీసులు అరెస్టు చేశారు. సుల్తానాబాద్ సర్కిల్ కార్యాలయంలో గురువారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో పెద్దపల్లి ఏసీపీ కృష్ణ సంబంధిత వివరాలను వెల్లడించారు. ఖమ్మం జిల్లాకు చెందిన గుర్రం కోటేశ్వర్(ఏ1), ఆంధ్రప్రదేశ్‌లోని బాపట్లకు చెందిన షేక్ ఖాజా గరీబ్ (ఏ2), ఖమ్మం జిల్లా అగ్రహారానికి చెందిన శకుని వాసు(ఏ3) గతంలో ఆంధ్రప్రదేశ్, తెలంగాణ రాష్ట్రాల్లో పలుచోట్ల చోరీలకు పాల్పడ్డారు. గంజాయి కేసుల్లో ఉన్నారు. ముగ్గురూ జైలుకు వెళ్లగా అక్కడ వీరి మధ్య స్నేహం ఏర్పడింది.

గతేడాది జైలు నుంచి విడుదల..

గతేడాది డిసెంబర్‌లో ఈ ముగ్గురూ జైలు నుంచి విడుదలయ్యారు. అయినా, మారకుండా మళ్లీ చోరీలు చేస్తున్నారు. ఓదెలలో గత నెల 21న రాత్రి ఓ వైన్స్‌షాపులో దొంగతనం జరగా యజమాని కాసర్ల స్వామి పోలీసులకు ఫిర్యాదు చేశాడు. పోలీసులు కేసు నమోదు చేసుకొని, దర్యాప్తు చేపట్టారు. సీసీ ఫుటేజీ పరిశీలించి, చోరీ చేసింది కోటేశ్వర్‌గా గుర్తించారు. అతని నేరచరిత్ర తెలుసుకోగా అంతర్రాష్ట్ర దొంగ అని తేలింది. దీంతో పోలీసులు మూడు బృందాలుగా ఏర్పడి, అతని కోసం వెతకడం ప్రారంభించారు. బుధవారం సాయంత్రం ఓదెల రైల్వేస్టేషన్ రోడ్డు వద్ద వాహనాల తనిఖీ చేపట్టారు. ఆ సమయంలో కోటేశ్వర్, షేక్ ఖాజా గరీబ్, వాసు కలిసి వస్తూ పోలీసులను చూసి, పారిపోయేందుకు ప్రయత్నించారు. వారిని పట్టుకొని, విచారించామని ఏసీపీ తెలిపారు. కోటేశ్వర్‌పై గతంలో ఖమ్మం, పొత్కపల్లి, సుల్తానాబాద్, జూలపల్లి, కాల్వశ్రీరాంపూర్, పెద్దపల్లి, ఖమ్మం, లక్షెట్‌పేట్, ధర్మపురి, గంగాధర, ధర్మారం, షేక్ ఖాజా గరీబ్‌పై సుల్తానాబాద్, పొత్కపల్లి, ధర్మారం, వాసుపై కుసుమంచి, కమాన్‌పూర్ ఠాణాల్లో చోరీ కేసులు నమోదయ్యాయి. ప్రస్తుతం కాల్వశ్రీరాంపూర్, పొత్కపల్లి పోలీస్‌స్టేషన్ల పరిధిలో దొంగతనాలకు పాల్పడ్డారు. వారి వద్ద నుంచి 13.6 తులాల బంగారు ఆభరణాలు, రూ.1.70 లక్షలు, ద్విచక్రవాహనం స్వాధీనం చేసుకున్నట్లు ఏసీపీ పేర్కొన్నారు. ముగ్గురినీ కోర్టులో హాజరుపర్చనున్నట్లు తెలిపారు. అంతర్రాష్ట్ర దొంగలను పట్టుకున్న ఎస్సైలు శ్రీధర్, ఓంకార్‌యాదవ్, అశోక్‌రెడ్డి, లక్ష్మణ్‌రావు, ఏఎస్సైలు తిరుపతి, రత్నాకర్, హెడ్ కానిస్టేబుల్ సుధాకర్‌లను అభినందించి, రివార్డులు అందించారు. సుల్తానాబాద్, పెద్దపల్లి సీఐలు సుబ్బారెడ్డి, కృష్ణ, ఎస్సై శ్రావణ్‌కుమార్, పోలీసు సిబ్బంది ఉన్నారు.

మాటల్లో దింపి.. నగదు కాజేసి

- ఆగంతకుడికి రూ.49 వేలు ఇచ్చి, మోసపోయిన వృద్ధుడు
- జగిత్యాలలో ఘటన


బాధితుడు గంగారాం

జగిత్యాల క్రైం: ఓ వృద్ధుడిని మాటల్లో దింపిన ఆగంతకుడు అతని వద్ద నుంచి నగదు కాజేశాడు. ఈ ఘటన గురువారం జగిత్యాల పట్టణంలో చోటు చేసుకుంది. వివరాల్లోకి వెళ్తే.. సారంగాపూర్ మండలంలోని నగునూర్ గ్రామానికి చెందిన జక్కుల గంగారాం అనే వృద్ధుడు జగిత్యాల పట్టణ పోలీస్‌స్టేషన్ సమీపంలోని సహకార సంఘం బ్యాంక్‌లో రూ.49 వేలు డ్రా చేశాడు. ఇంటికి వెళ్తుండగా బ్యాంక్ ఎదుట ఆగంతకుడు కలిసి, కొత్త ప్రభుత్వం వృద్ధుల కోసం ప్రత్యేక పథకం పెట్టిందని నమ్మించాడు. తనతోపాటు బ్యాంకుకు వస్తే ఆ పథకం డబ్బులు తీసుకోవచ్చని చెప్పాడు. తన దగ్గర పెట్టుకుంటానని వృద్ధుడి వద్ద నున్న డబ్బులు తీసుకున్నాడు. అనంతరం అతన్ని జంబిగద్దె నుంచి యూనియన్ బ్యాంక్ వద్దకు తీసుకెళ్లాడు. తర్వాత గంగారాంను అక్కడే వదిలేసి, వెళ్లిపోయాడు. ఆ వ్యక్తి ఎంతసేపటికీ రాకపోవడంతో బాధితుడు తాను మోసపోయానని నిర్ధారించుకొని, కుటుంబసభ్యులకు సమాచారం అందించాడు. జగిత్యాల పట్టణ పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేయగా పోలీసులు సీసీ ఫుటేజీ ఆధారంగా నిందితుడిని గుర్తించేందుకు ప్రయత్నిస్తున్నారు.

సౌదీలో వేంపల్లివాసి బలవన్మరణం

- 20 ఏళ్లుగా తక్కువ జీతంతో ఇబ్బందులు
- అప్పులు తీరక మనస్తాపంతో ఆత్మహత్య
- కన్నీరుమున్నీరవుతున్న కుటుంబసభ్యులు


వెంకటి (ఫైల్)

మల్లాపూర్(కోరుట్ల): ఉన్న ఊరిలో పని లేక, ఉపాధి కోసం భార్యాపిల్లలను వదిలి ఏడారి దేశానికి వెళ్లిన ఓ వలసజీవి అక్కడే ఆత్మహత్య చేసుకున్నాడు. స్థానికుల కథనం ప్రకారం.. మల్లాపూర్ మండలంలోని వేంపల్లికి చెందిన కందెల వెంకటి(41)కి భార్య రాధ, కుమారుడు, కూతురు ఉన్నారు. అతను కుటుంబపోషణ, ఇతర ఆర్థిక అవసరాల కోసం రూ.5 లక్షల వరకు అప్పులు చేశాడు. వాటిని తీర్చేందుకు మళ్లీ అప్పు చేసి, గల్ఫ్ వెళ్లాడు. ఇలా 20 ఏళ్లుగా పలు దేశాలకు వెళ్లి, వస్తున్నాడు. మూడేళ్ల క్రితం ఇంటికి వచ్చి, సౌదీ అరేబియా వెళ్లాడు. అక్కడ కూలీ పని చేస్తుండటంతో జీతం తక్కువగా వస్తోంది. తన ఖర్చులు పోనూ కుటుంబం గడిచేందుకు డబ్బులు పంపిస్తున్నాడు. ఈ క్రమంలో కుటుంబసభ్యులకు ఏవైనా ఆరోగ్య సమస్యలు తలెత్తితే అప్పులు చేయాల్సిన పరిస్థితి. అవి అలాగే పెరిగిపోతుండటం, తీర్చే మార్గం లేకపోవడం, ఆర్థిక ఇబ్బందులతో తీవ్ర మనస్తాపానికి గురయ్యాడు. జీవితంపై విరక్తి చెంది, బుధవారం రాత్రి సౌదీలోనే ఉరేసుకున్నాడు. అతనితో పనిచేసేవారు ఈ విషయమై గురువారం వెంకటి కుటుంబసభ్యులు సమాచారం అందించారు. దీంతో వారు కన్నీరుమున్నీరుగా విలపిస్తున్నారు. వెంకటి మృతదేహాన్ని స్వగ్రామం తీసుకువచ్చేందుకు స్థానిక ప్రజాప్రతినిధులు, నాయకులు ప్రయత్నాలు చేస్తున్నారు.

విద్యుదాఘాతంతో యువకుడి మృతి

- పశువుల షెడ్డుకు విద్యుత్ కనెక్షన్ ఇస్తుండగా ప్రమాదం
- మర్తనపేటలో విషాదం


సందీప్ మృతదేహం వద్ద రోదిస్తున్న కుటుంబసభ్యులు

కోనరావుపేట(వేములవాడ): పశువుల షెడ్డుకు విద్యుత్ కనెక్షన్ ఇస్తుండగా విద్యుదాఘాతం సంభవించి, ఓ యువకుడు మృతిచెందాడు. వివరాల్లోకి వెళ్తే.. కోనరావుపేట మండలంలోని మర్తనపేటకు చెందిన ముంద్రాయి సందీప్(38) మరో ముగ్గురితో కలిసి గురువారం తమ పొలం వద్ద పశువుల షెడ్డుకు విద్యుత్ కనెక్షన్ ఇచ్చే పనులు చేస్తున్నాడు. విద్యుత్ తీగలను లాగుతుండగా ఒక్కసారిగా విద్యుత్ సరఫరా జరిగి, సందీప్ కుప్పకూలిపోయాడు. వెంటనే అతన్ని రాజన్నసిరిసిల్ల జిల్లా ఆస్పత్రికి తరలించగా మృతిచెందినట్లు వైద్యులు నిర్ధారించారు. మృతుడికి భార్య రమ్య, ఇద్దరు కుమారులు ఉన్నారు. మృతుడి సోదరుడు సతీశ్ న్యూజిలాండ్‌లో ఉన్నాడు. అతను వచ్చాక అంత్యక్రియలు చేయనున్నారు. సందీప్ తండ్రి విజయ్‌కుమార్ ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై ఆంజనేయులు తెలిపారు. బాధిత కుటుంబసభ్యులను జెడ్పీ చైర్‌పర్సన్ న్యాలకొండ అరుణ, సెస్ వైస్ చైర్మన్ దేవరకొండ తిరుపతి, బీఆర్ఎస్ నాయకులు రాఘవరెడ్డి, మల్యాల దేవయ్య తదితరులు పరామర్శించారు.

చికిత్స పొందుతూ గుర్తు తెలియని వ్యక్తి..



జమ్మికుంట(హుజూరాబాద్): గాయాలతో అపస్మారక స్థితిలో ఉన్న ఓ గుర్తు తెలియని వ్యక్తి చికిత్స పొందుతూ మృతిచెందాడు. బెల్లంపల్లి రైల్వే హెడ్ కానిస్టేబుల్ లక్ష్మణ్‌రెడ్డి తెలిపిన వివరాల ప్రకారం.. జమ్మికుంట పట్టణంలోని రైల్వేస్టేషన్ ప్లాట్‌ఫామ్‌పై గాయపడి, అపస్మారక స్థితిలో ఉన్న గుర్తు తెలియని వ్యక్తిని రైల్వే అధికారులు మంగళవారం ఉదయం గుర్తించారు. 108 వాహనంలో స్థానిక ప్రభుత్వ ఆస్పత్రికి తీసుకెళ్లగా వైద్యులు ప్రథమ చికిత్స అందించారు. అనంతరం మెరుగైన వైద్యం కోసం వరంగల్ ఎంజీఎంకు తరలించగా చికిత్స పొందుతూ బుధవారం సాయంత్రం మృతిచెందాడు. మృతుడి వద్ద ఎలాంటి ఆధారాలు లభించలేదని, 5 ఫీట్ల 6 ఇంచుల ఎత్తు ఉన్నాడని, కుడి చేతి చూపుడు వేలిపై పుట్టు మచ్చ ఉందని, వైట్, బ్లూ కలర్(ఆస్పత్రిలో ధరించు వంటి) గౌన్ ధరించాడని రైల్వే హెడ్ కానిస్టేబుల్ తెలిపారు. మృతదేహాన్ని ఎంజీఎం మార్చురీలో భద్రపరిచామని, వివరాలు తెలిసిన వారు 94410 14256, 87123 58601 ఫోన్ నంబర్లలో సంప్రదించాలని కోరారు. కేసు నమోదు చేసుకొని, దర్యాప్తు చేస్తున్నట్లు పేర్కొన్నారు.

రాఘవపేట యువకుడు..

మల్లాపూర్(కోరుట్ల): రాఘవపేటకు చెందిన అలకుంట ప్రవీణ్ (19) చికిత్స పొందుతూ మృతిచెందాడు. పోలీసుల వివరాల ప్రకారం.. ప్రవీణ్ ఉపాధి కోసం దుబాయి వెళ్లి, ఆరు నెలల క్రితమే ఇంటికి వచ్చాడు. అప్పులు తీర్చలేకపోయాడు. ఏ పనీ చేయకుండా ఖాళీగా ఉంటూ మద్యానికి బానిసయ్యాడు. జీవితంపై విరక్తి చెంది, బుధవారం ఉదయం ఇంట్లోనే క్రిమిసంహారక మందు తాగాడు. కుటుంబసభ్యులు ఓ ప్రైవేటు ఆస్పత్రికి తరలించగా చికిత్స పొందుతూ గురువారం చనిపోయాడు. మృతుడి తండ్రి ముత్తన్న ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై కిరణ్‌కుమార్ తెలిపారు.

యువకుడి ఆత్మహత్య


రిషికేశ్ (ఫైల్)

వేములవాడ అర్బన్: వేములవాడ పట్టణంలోని శాస్త్రినగర్‌కు చెందిన ఓ యువకుడు ఆత్మహత్య చేసుకున్నాడు. వివరాల్లోకి వెళ్తే.. లత–రాజలింగం దంపతుల పెద్ద కుమారుడు రిషికేశ్(19) ఇటీవల ఇంటర్మీడియట్ పూర్తి చేశాడు. రాజస్థాన్‌లో ఇంజినీరింగ్ చదవాలని తల్లిదండ్రులు చెప్పడంతో అక్కడికి తాను వెళ్లనని వారితో గొడవ పడ్డాడు. ఈ క్రమంలో బుధవారం రాత్రి ఇంట్లో ఎవరూ లేని సమయంలో ఉరేసుకున్నాడు. పోలీసులు గురువారం రిషికేశ్ మృతదేహానికి పోస్టుమార్టం చేయించి, కుటుంబసభ్యులకు అప్పగించారు. మృతుడి తండ్రి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు పేర్కొన్నారు.

ఒంటరితనం భరించలేక వ్యక్తి..

శంకరపట్నం(మానకొండూర్): మండలంలోని తాడికల్‌కు చెందిన అల్లెపు రాములు(55) ఒంటరితనం భరించలేక గురువారం ఉరేసుకొని ఆత్మహత్య చేసుకున్నట్లు హెడ్‌కానిస్టేబుల్ లతీఫ్ తెలిపారు. అతను అవివాహితుడని, కొంతకాలంగా అనారోగ్యంతోనూ బాధ పడుతున్నట్లు పేర్కొన్నారు. మృతుడి సోదరుడి ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

చోరీ కేసులో ఇద్దరికి జైలు

సిరిసిల్ల కల్చరల్: చోరీ కేసులో ఇద్దరు వ్యక్తులకు ఏడాది జైలుశిక్ష విధిస్తూ సిరిసిల్ల ఫస్ట్ క్లాస్ మెజిస్ట్రేట్ కావేటి సృజన గురువారం తీర్పు చెప్పారు. వివరాల్లోకి వెళ్తే.. సిరిసిల్ల సర్దార్ నగర్‌కు చెందిన బొట్ల వెంకటస్వామికి రగుడు శివారులో భూమి ఉంది. దాని చుట్టూ ప్రహరీ నిర్మించి, గేటు బిగించాడు. అయితే, ఆ గేటు చోరీ అవడంతో అతను గతేడాది ఆగస్టు 3న పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశాడు. పోలీసుల దర్యాప్తులో శాంతినగర్‌కు చెందిన గూడూరి కిరణ్, మెహర్‌నగర్‌కు చెందిన షేక్ రియాజ్‌లను నిందితులుగా తేల్చి, రిమాండ్‌కు పంపించారు. విచారణ అధికారి, ఎస్సై మల్లేశం చార్జ్‌షీట్ దాఖలు చేశారు. ప్రాసిక్యూషన్ తరఫున చెలుమల సందీప్‌కుమార్ వాదించగా కేసు పూర్వాపరాలు, సాక్ష్యాధారాలను న్యాయమూర్తి పరిశీలించారు. నేరం రుజువు కావడంతో కిరణ్, రియాజ్‌లకు ఏడాది జైలుశిక్షతోపాటు రూ.100 చొప్పున జరిమానా విధించారు.

దళితుడిపై చెప్పుతో దాడి


శంకరపట్నం(మానకొండూర్): మండలంలోని కరీంపేట గ్రామంలో ఓ దళితుడిని చెప్పుతో కొట్టిన ఘటన వెలుగుచూసింది. కేశవపట్నం ఎస్సై లక్ష్మారెడ్డి కథనం ప్రకారం.. కరీంపేటకు చెందిన సుంక రాజేశం, సంబు తిరుపతికి బుధవారం వ్యవసాయ భూమి వద్ద గొడవ జరిగింది. ఇద్దరి మధ్య మాటామాట పెరగడంతో దళితుడైన రాజేశంను బీసీ సామాజిక వర్గానికి చెందిన తిరుపతి చెప్పుతో కొట్టాడు. ఈ ఘటనపై బాధితుడు ఫిర్యాదు చేశాడని, విచారణ చేపడతామని ఎస్సై పేర్కొన్నారు.

నకిలీ పత్తి విత్తనాల పట్టివేత


నకిలీ విత్తనాలు, నిందితుడితో పోలీసులు

కరీంనగర్ క్రైం: కరీంనగర్ రూరల్ పోలీస్‌స్టేషన్ పరిధిలోని గోపాల్‌పూర్ క్రాస్‌రోడ్ దుర్శెడ్ వద్ద కరీంనగర్ టాస్క్‌ఫోర్స్, స్పెషల్ బ్రాంచ్, రూరల్ పోలీసులు గురువారం సంయుక్తంగా వాహనాల తనిఖీ చేపట్టారు. ఆ సమయంలో గుంటూరు జిల్లా పత్తిపాడు మండలం కోయవారిపాలెం గ్రామానికి చెందిన (ప్రస్తుతం మంచిర్యాల జిల్లా భీమారం గ్రామంలో నివాసం) చందు నాగేశ్వరరావు రూ.1.20 లక్షల విలువైన 60 కిలోల నకిలీ పత్తి విత్తనాలను తరలిస్తూ పట్టుబడ్డాడు. వాటిని స్వాధీనం చేసుకొని, సీడ్స్ యాక్ట్ కింద కేసు నమోదు చేశామని రూరల్ ఇన్‌స్పెక్టర్ ప్రదీప్‌కుమార్ తెలిపారు. స్పెషల్ బ్రాంచ్ ఇన్‌స్పెక్టర్ సృజన్‌రెడ్డి, టాస్క్‌ఫోర్స్ ఇన్‌స్పెక్టర్ రవీందర్, రూరల్ ఎస్సై శేఖర్ తదితరులు పాల్గొన్నారు.

అంజన్న ఇరుముడుల ఆదాయం రూ.2.89 లక్షలు


ఇరుముడులు లెక్కిస్తున్న భక్తులు, సిబ్బంది

కొండగట్టు(చొప్పదండి): కొండగట్టు అంజన్న ఆలయంలో గత నెల 30 నుంచి ఈ నెల 2వ తేదీ వరకు హనుమాన్ పెద్ద జయంతి ఉత్సవాలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆలయ అధికారులు దీక్షాపరులు కట్టిన ఇరుముడులను గురువారం విప్పించి, లెక్కింపు చేపట్టారు. రూ.2,89,810 ఆదాయం వచ్చినట్లు ఈవో చంద్రశేఖర్ తెలిపారు. కార్యక్రమంలో ఏఈవో అంజయ్య, సూపరింటెండెంట్ శ్రీనివాస్ శర్మ, సునీల్, చందు తదితరులు పాల్గొన్నారు.

ఈసెట్‌లో 'జ్యోతిష్మతి' విద్యార్థుల సత్తా


నగదు ప్రోత్సాహకం అందిస్తున్న చైర్మన్ జువ్వాడి సాగర్‌రావు

తిమ్మాపూర్(మానకొండూర్): మండల కేంద్రంలోని జ్యోతిష్మతి ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ అండ్ సైన్స్(అటానమస్) కళాశాలలో డిప్లొమా పూర్తి చేసిన విద్యార్థులు ఈసెట్‌లో సత్తా చాటారు. జె.సాయికిరణ్ ఈసీఈ విభాగంలో 87వ ర్యాంకు, డి.గోపి సీఎస్ఈలో 125, ఎ.నిషిద సీఎస్ఈ విభాగంలో 178, ఎస్.మౌర్య ట్రిపుల్‌ఈ విభాగంలో 185వ ర్యాంకు సాధించారని కళాశాల చైర్మన్ జువ్వాడి సాగర్‌రావు తెలిపారు. సాయికిరణ్‌కు రూ.50 వేలు, మిగతా వారికి రూ.20 వేల చొప్పున గురువారం నగదు ప్రోత్సాహకం అందించారు. భవిష్యత్తులో కార్పొరేట్ సంస్థల్లో ఉద్యోగాలు సాధించి, కళాశాలకు, తల్లిదండ్రులకు పేరు తీసుకురావాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ కేఎస్.రావు, డీన్ పీకే.వైశాలి, సజన్‌రావు, వివిధ విభాగాల అధిపతులు, అధ్యాపకులు పాల్గొన్నారు.

జల్సాల కోసం ద్విచక్రవాహనాల చోరీ

- దొంగగా మారిన ఆటోడ్రైవర్
- అతనితోపాటు సహకరించిన 15 మంది స్క్రాప్ వ్యాపారుల అరెస్టు
- 3 బైక్‌లు, రూ.6 లక్షలు స్వాధీనం



వివరాలు వెల్లడిస్తున్న డీఎస్పీ ఉమామహేశ్వర్‌రావు

మెట్‌పల్లి(కోరుట్ల): జల్సాల కోసం ఓ ఆటోడ్రైవర్ దొంగగా మారాడు. ద్విచక్రవాహనాలు చోరీ చేస్తూ స్క్రాప్ వ్యాపారులకు విక్రయిస్తున్నాడు. అతనితోపాటు సహకరించిన వ్యాపారులను పోలీసులు అరెస్టు చేశారు. మెట్‌పల్లి పట్టణంలోని సబ్ డివిజన్ కార్యాలయంలో డీఎస్పీ ఉమామహేశ్వర్ రావు సంబంధిత వివరాలను గురువారం విలేకరులకు వెల్లడించారు. మెట్‌పల్లి మండలంలోని సత్తెక్కపల్లికి చెందిన షేక్ ఇస్మాయిల్‌కు భార్య, ఇద్దరు పిల్లలు ఉన్నారు. ఆటో నడుపుకుంటూ కుటుంబాన్ని పోషించేవాడు. అయితే, మద్యానికి బానిసై, జల్సాలకు అలవాటు పడ్డాడు. అతనికి ఆటో నడపగా వచ్చిన డబ్బులు సరిపోలేదు. దీంతో సులువుగా డబ్బు సంపాదించాలన్న ఉద్దేశంతో దొంగతనాలు చేయాలని నిర్ణయించుకున్నాడు. ఇందులో భాగంగా హ్యాండిల్ లాక్ చేయని బైక్‌లను చోరీ చేయడం మొదలుపెట్టాడు. వాటిని స్క్రాప్ వ్యాపారులకు రూ.5 వేల చొప్పున విక్రయిస్తున్నాడు. వ్యాపారులు దొంగ సొత్తు అని తెలిసి కూడా అతని నుంచి కొనుగోలు చేసి, తర్వాత ఆ వాహనాలను అధిక ధరకు అమ్ముతున్నారు. ఈ నేపథ్యంలో బైక్ చోరీలపై పలు ఫిర్యాదులు రావడంతో పోలీసులు కొన్ని రోజులు నిఘా పెట్టారు. గురువారం ఉదయం మెట్‌పల్లి పట్టణంలోని పాత బస్టాండ్ వద్ద వాహనాల తనిఖీ చేపట్టారు. ఆ సమయంలో బైక్ వస్తున్న ఇస్మాయిల్ అనుమానాస్పదంగా కనిపించడంతో అదుపులోకి తీసుకున్నారు. అతన్ని ఠాణాకు తీసుకెళ్లి విచారించగా.. ద్విచక్ర వాహనాలు చోరీ చేస్తున్న విషయం బయటపడింది. ఈ మేరకు ఇస్మాయిల్ ఇచ్చిన సమాచారంతో కోరుట్ల, జగిత్యాల, గంగాధర, ఆర్మూర్, కమ్మర్‌పల్లి, మోర్తాడ్, పెర్కిట్, నిజామాబాద్‌లకు చెందిన 15 మంది స్క్రాప్ వ్యాపారులు షేక్ ఇస్మాయిల్, మహమ్మద్ మొయినుద్దీన్, గొట్టిపాటి మురళి, షేక్ మున్నా, ఎండీ.జాకీర్, కడమంచి సంపత్, షేక్ జలాల్, మహమ్మద్‌గౌస్, షేక్ అహ్మద్, షేక్ అబ్దుల్ ఖాదర్, మహమ్మద్ బిన్ అహ్మద్, మహమ్మద్ ఇలియాస్, మహమ్మద్ మహమూద్, షేక్ హబీబ్, కొంగరి మల్లేశం, షేక్ పాషాలను అరెస్టు చేశారు. వారి వద్ద నుంచి 3 బైక్‌లు, రూ.6 లక్షలు స్వాధీనం చేసుకున్నట్లు డీఎస్పీ పేర్కొన్నారు. నిందితులను పట్టుకున్న సీఐ నవీన్, ఎస్సై చిరంజీవి, పోలీసు సిబ్బందిని ఆయన అభినందించారు.

స్నాప్‌చాట్‌లో ఫేక్ ప్రొఫైల్‌తో మెస్సేజ్‌లు?

- యువతులు, మహిళలను వేధిస్తున్నట్లు ఆరోపణలు
- కథ అడ్డం తిరిగితే బలవుతున్న అమాయకులు!
- రుద్రంగిలో జోరుగా చర్చ

రుద్రంగి(వేములవాడ): స్నాప్‌చాట్‌లో ఫేక్ ప్రొఫైల్‌తో కొందరు మహిళలు, యువతులకు గుర్తు తెలియని వ్యక్తులు మెస్సేజ్‌లు పెడుతూ.. వారిని ఇబ్బందులకు గురిచేస్తున్నారని తెలిసింది. దీనిపై రుద్రంగి మండల కేంద్రంలో జోరుగా చర్చ జరుగుతోంది. ఆ మెస్సేజ్‌లకు స్పందించిన మహిళలు, యువతులను ఫేక్ ప్రొఫైల్‌గాళ్లు లోబర్చుకొంటున్నారన్న ఆరోపణలున్నాయి. ఈ క్రమంలో కథ అడ్డం తిరిగితే ఎవరి ప్రొఫైల్‌పై మెస్సేజ్‌లు పెడుతున్నారో సంబంధిత వ్యక్తులు బలవుతున్నట్లు సమాచారం. ఎవరికైనా చెబితే పరువు పోతుందని భావించి, బాధితులు తమలో తాము కుమిలిపోతున్నారని తెలిసింది. మండల కేంద్రంలో గతంలోనూ పలువురు మహిళలు, యువతులను ఇలా వేధింపులకు గురిచేశారన్న చర్చ జరిగింది. దీనివల్ల పలువురి కుటుంబాల్లో గొడవలు జరిగి, ఆత్మహత్య చేసుకునే స్థాయికి వెళ్లాయని, కుటుంబాలు విడిపోయే పరిస్థితులు ఏర్పడ్డాయని స్థానికంగా చర్చించుకుంటున్నారు. అధికారులు స్పందించి, ఫేక్‌గాళ్ల ఆట కట్టించాలని కోరుతున్నారు.

భూ కబ్జాలకు పాల్పడుతున్న వ్యక్తి అరెస్టు

వేములవాడ అర్బన్: భూ కబ్జాలకు పాల్పడుతున్న సిరిగిరి రమేశ్‌ను గురువారం అరెస్టు చేసినట్లు వేములవాడ టౌన్ సీఐ వీరప్రసాద్ తెలిపారు. ఆయన వివరాల ప్రకారం.. వేములవాడ మండలంలోని చంద్రగిరి పంచాయతీ పరిధి తెట్టకుంటకు చెందిన చెన్నమనేని వెంకటేశ్వర్లు వద్ద సిరిసిల్ల పట్టణానికి చెందిన సిరిగిరి రమేశ్ సుమారు రెండెకరాల భూమి కొనుగోలు చేశాడు. అతని వృద్ధాప్యాన్ని ఆసరాగా చేసుకొని, లేని ప్లాట్లను ఉన్నట్లు సృష్టించమే కాకుండా వెంకటేశ్వర్లు భూమి పక్కనున్న చెన్నమనేని జగన్‌మోహన్ భూమిలో అక్రమంగా చొరబడ్డాడు. రోడ్డుగా ఉన్న భూమిని లే అవుట్ చేసి, విక్రయించాడు. పర్మిషన్ లేకుండా ప్లాట్లు చేసి, అమ్మడం వల్ల అమాయక ప్రజలకు మోసపోతున్నారని పలువురు అతనిపై వేములవాడ పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదులు చేయగా పోలీసులు కేసు నమోదు చేశారు. రమేశ్‌ను అరెస్టు చేసి, రిమాండ్‌కు తరలించినట్లు సీఐ పేర్కొన్నారు. అతని బాధితులు ఎవరైనా ఠాణాలో ఫిర్యాదు చేయాలని సూచించారు.

రైతును బెదిరించిన వ్యక్తి..

చందుర్తి(వేములవాడ): రైతును బెదిరించిన ఓ వ్యక్తిని అరెస్టు చేసినట్లు చందుర్తి ఎస్సై శ్రీకాంత్ తెలిపారు. ఆయన కథనం ప్రకారం.. గత నెల 23న చందుర్తి మండలంలోని లింగంపేటకు చెందిన కమటం లక్ష్మీరాజంను అదే గ్రామానికి చెందిన గుంటి గణేశ్‌తోపాటు మరో ముగ్గురు తాము విలేకరులమని బెదిరించి, డబ్బులు డిమాండ్ చేశాడు. బాధితుడి ఫిర్యాదు పోలీసులు కేసు నమోదు చేశారు. అప్పటినుంచి తప్పించుకు తిరుగుతున్న గణేశ్‌ను గురువారం అరెస్టు చేశారు. ఈ కేసులో మరో ఇద్దరిని ఐదు రోజుల క్రితమే అరెస్టు చేసి, రిమాండ్‌కు తరలించామని ఎస్సై పేర్కొన్నారు. ఇంకో వ్యక్తి పరారీలో ఉన్నట్లు తెలిపారు.

కిడ్నాప్ కేసులో నలుగురు..

వేములవాడరూరల్: కిడ్నాప్ కేసులో నలుగురు వ్యక్తులను అరెస్టు చేసినట్లు ఎస్సై మారుతి పేర్కొన్నారు. ఆయన తెలిపిన వివరాల ప్రకారం.. వేములవాడ రూరల్ మండలంలోని అనుపురం గ్రామానికి చెందిన చింతకుంట ప్రవీణ్ భార్య కల్యాణి వట్టెంల గ్రామంలోని తన పుట్టింటికి వెళ్లింది. ఈ నెల 4న ప్రవీణ్ అక్కడికి వెళ్లాడు. కల్యాణి అక్కడ లేకపోవడంతో ఆమె బంధువు, ఫాజుల్‌నగర్ గ్రామంలోని గండి రాజు ఇంటికి వెళ్లాడు. దీంతో రాజు మరో ముగ్గురు ఆకుల రాజేశ్, కనకట్ల శ్రీనివాస్, మద్దివేణి సాయికుమార్‌లతో కలిసి అతన్ని కిడ్నాప్ చేసి, కొట్టారు. బాధితుడి తండ్రి కిషన్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి, ఆ నలుగురిని గురువారం అరెస్టు చేసినట్లు ఎస్సై పేర్కొన్నారు.

పిడుగుపడి, గొర్రెల కాపరికి గాయాలు



చికిత్స పొందుతున్న ఎల్లయ్య యాదవ్, మృతిచెందిన జీవాలు

ఎల్లారెడ్డిపేట(సిరిసిల్ల): పిడుగుపడి, ఓ గొర్రెల కాపరికి గాయాలయ్యాయి. వివరాల్లోకి వెళ్తే.. ఎల్లారెడ్డిపేట మండలంలోని బాకూర్‌పల్లికి చెందిన బొల్లారం అమరగొండ ఎల్లయ్య యాదవ్ గురువారం రాచర్లతిమ్మాపూర్ శివారులోని జాలకింద తూముకుంట ప్రాంతంలో గొర్రెలను మేపుతున్నాడు. ఆ సమయంలో భారీ వర్షం కురిసి, పిడుగు పడింది. ఈ ఘటనలో ఎల్లయ్యయాదవ్ చాతిపై గాయాలై, స్పృహతప్పి పడిపోయాడు. గమనించిన సమీప రైతులు అతన్ని ఎల్లారెడ్డిపేటలోని ఓ ప్రైవేట్ ఆస్పత్రికి తరలించగా చికిత్స పొందుతున్నాడు.

అచ్చన్నపల్లిలో ఆవు, గేదె మృతి

వేములవాడరూరల్: మండలంలోని అచ్చన్నపల్లిలో గురువారం సాయంత్రం ఈదురుగాలులతో వర్షం కురిసింది. పిడుగు పడటంతో కల్లూరి లచ్చయ్య అనే రైతుకు చెందిన ఆవు, గేదె మృతిచెందాయి. తనను ప్రభుత్వం ఆదుకోవాలని బాధితుడు కోరాడు.

భళా.. బాలభవన్

- ముగిసిన వేసవి శిక్షణ శిబిరం
- వివిధ కళల్లో తర్ఫీదు పొందిన విద్యార్థులు
- సంతోషం వ్యక్తం చేసిన చిన్నారులు

కరీంనగర్‌కల్చరల్: చిన్నారుల్లోని కళలను వెలికి తీయడానికి.. తమ నైపుణ్యాలను మెరుగుపర్చుకునేందుకు కరీంనగర్‌లోని బాలభవన్ చక్కటి వేదికగా నిలిచింది. చిన్నారులు వేసవి సెలవుల్లో ఇంటి వద్ద ఉండకుండా తమకు నచ్చిన కళల్లో ప్రావీణ్యం సంపాదించడం కోసం బాలభవన్‌లో నిర్వహిస్తున్న శిక్షణ శిబిరంలో చేరారు. కళలో నైపుణ్యం సాధిస్తూ.. కొత్త విషయాలు నేర్చుకున్నారు. ఏప్రిల్ 25 నుంచి ఇక్కడ వేసవి శిక్షణ తరగతులు ప్రారంభం కాగా.. గురువారంతో ముగిశాయి. సుమారు 700 మంది విద్యార్థులు హాజరై వివిధ కళల్లో నైపుణ్యాలు మెరుగుపర్చుకున్నారు. మ్యూజిక్‌లో 100 మంది, జానపద నృత్యంలో 200 మంది, మృదంగంలో 35 మంది, క్లాసికల్ డ్యాన్స్‌లో 60 మంది, చిత్రలేఖనంలో 150 మంది, ఆర్ట్స్ అండ్ క్రాఫ్ట్‌లో 80 మంది, యోగాలో 60 మంది, అబాకస్‌లో 70 మంది, చెస్‌లో 100 మంది పాల్గొని నిపుణుల, శిక్షకుల పర్యవేక్షణలో మెలకువలు నేర్చుకున్నారు. శిక్షణ ముగింపు సందర్భంగా బాలభవన్‌లో చిన్నారులను 'సాక్షి' పలకరించగా.. వారి అభిప్రాయాలు వెల్లడించారు.


నృత్యం చేస్తున్న చిన్నారులు




యోగాసనాలు వేస్తున్న చిన్నారులు

మెలకువలు నేర్చుకున్న..



నెల రోజుల నుంచి బాలభవన్‌లో నిర్వహిస్తున్న శిక్షణ శిబిరంలో కూచిపూడి, డ్రాయింగ్‌లో శిక్షణ తీసుకుంటున్న. నాకు క్లాసికల్ డ్యాన్స్ అంటే ఇష్టం. క్లాసికల్ డ్యాన్స్‌లో మంచి మెలకువలు నేర్చుకున్న. అలాగే చిత్రలేఖనంలో చిత్రాలు ఎలా గీయాలో తెలిసింది.

– బి. గ్రీష్మ, ఎల్ఎండీ కాలనీ

జాతీయ స్థాయి పోటీల్లో పాల్గొన్న



ఐదేళ్ల నుంచి బాలభవన్‌లో యోగాలో శిక్షణ తీసుకుంటున్న. ఇక్కడ శిక్షణ తీసుకొని జాతీయస్థాయి యోగా పోటీలో పాల్గొన్న. బాలభవన్ నుంచి జాతీయ స్థాయి వరకు వెళ్లడం సంతోషంగా ఉంది.

– పి.లహరిక, బొమ్మకల్, కరీంనగర్

క్లాసికల్ డ్యాన్స్ అంటే ఇష్టం



క్లాసికల్ డ్యాన్స్ అంటే నాకు చాలా ఇష్టం. బాలభవన్‌లో మూడు సంవత్సరాలుగా క్లాసికల్ డ్యాన్స్‌లో శిక్షణ తీసుకుంటున్న. వేంకటేశ్వర బ్రహ్మోత్సవాల్లో ప్రదర్శించాను. సమ్మర్ క్యాంప్ నాకు చాలా ఉపయోగపడింది.

– కర్నె రక్షిత, సుభాష్‌నగర్, కరీంనగర్

వేసవి శిక్షణ ఉపయోగపడింది



మూడేళ్లుగా బాలభవన్‌లో నిర్వహిస్తున్న వేసవి శిబిరంలో శిక్షణ తీసుకుంటున్న. మంచిగా నేర్పిస్తున్నారు. నేను మృదంగం, సంగీతం, ఆర్ట్ అండ్ క్రాఫ్ట్ వంటి వాటిలో తర్ఫీదు పొందాను. ఈ వేసవిలో శిక్షణ మాకు చాలా ఉపయోగపడింది.

– చరిత్ర, రాజీవ్‌చౌక్, కరీంనగర్

అబాకస్‌తో గణితం సులువైంది



అబాకస్‌లో శిక్షణ తీసుకున్న. నాకు గణితంలో లెక్కలు చేయడం చాలా సులువైంది. గతంలో చిన్న లెక్కలు కూడా సరిగా చేయలేకపోయాను. మేడం ఇచ్చిన శిక్షణలో పెద్ద పెద్ద ప్రాబ్లమ్స్ కూడా చాలా ఈజీ చేయగలుతున్నాను. ఏటా ఇలాంటి శిక్షణ తరగతులు నిర్వహించాలి. – తన్విశ్రీ, సరస్వతీనగర్, కరీంనగర్

అందమైన ఆకృతులు నేర్పించారు



ఇక్కడ శిక్షణ బాగుంది. ఆర్ట్ అండ్ క్రాఫ్ట్‌లో శిక్షణ తీసుకున్న. నిరుపయోగంగా ఉన్న వస్తువులతో అందమైన ఆకృతుల్లో ఎలా చేయాలో వివరంగా నేర్పించారు. వీటితో పాటు ఇక్కడ సంగీతం, చెస్‌లో శిక్షణ తీసుకున్న. చాలా సంతోషంగా ఉంది.

– హర్షిణీ, హనుమాన్‌నగర్, కరీంనగర్

నృత్యంతో ఏకాగ్రత, శ్రద్ధ



నాకు డ్యాన్స్ అంటే ఇష్టం. డ్యాన్స్ మాస్టర్ మంచి తర్ఫీదు ఇచ్చారు. ప్రతిరోజూ నృత్యంతో ఏకాగ్రత, శ్రద్ధ పెరుగుతుంది. ఇలా ఏటా వేసవి శిక్షణ శిబిరం ను ప్రభుత్వ ఉచితంగా నిర్వహించడం సంతోషంగా ఉంది.

– జి.అనూజ్ఞ, ఆదర్శనగర్, కరీంనగర్

'భగీరథ' పైపులైన్ ధ్వంసం

- డబుల్‌బెడ్రూం ఇళ్లకు నిలిచిన నీటిసరఫరా

కరీంనగర్‌రూరల్: కరీంనగర్ మండలం మొగ్దుంపూర్‌లో మిషన్ భగీరథ పైపులైన్ ధ్వంసం కావడంతో నీటి సరఫరా నిలిచింది. స్థానికుల కథనం ప్రకారం.. జెడ్పీ పాఠశాలలోని వాటర్‌ట్యాంకు నుంచి డబుల్‌బెడ్రూం ఇళ్ల సముదాయానికి రాజీవ్ రహదారి వెంట మిషన్ భగీరథ పైపులైన్ వేశారు. అయితే వారం రోజుల నుంచి ఇంటింటికీ గ్యాస్ సరఫరాలో భాగంగా రాజీవ్ రహదారి పక్క నుంచి పైపులైన్ వేసేందుకు జేసీబీతో కందకం తవ్వుతున్నారు. ఈక్రమంలో బుధవారం సాయంత్రం జెడ్పీ పాఠశాల సమీపంలో కందకం తవ్వుతుండగా భగీరథ పైపులైన్‌కు జేసీబీ బకెట్ తగలడంతో పలు చోట్ల పైపు ధ్వంసమైంది. దీంతో డబుల్‌బెడ్రూం ఇళ్లకు నీటి సరఫరా నిలిచిపోయింది. గురువారం పంచాయతీ సిబ్బంది పైపులైన్ మరమ్మతు చేపట్టినప్పటికీ పనులు పూర్తికాలేదు. ఇప్పటికైనా అధికారులు స్పందించి పైపులైన్ మరమ్మతు పనులను వెంటనే పూర్తి చేసి నీటి సరఫరా పునరుద్ధరించాలని డబుల్‌బెడ్రూం ఇళ్ల కాలనీవాసులు కోరుతున్నారు.


ధ్వంసమైన పైపులైన్

ఫీజుల నియంత్రణ చట్టం అమలు చేయాలి

కరీంనగర్: కార్పొరేట్, ప్రైవేటు పాఠశాలల్లో ఫీజుల నియంత్రణ చట్టం పకడ్బందీగా అమలు చేయాలని తెలంగాణ బీసీ విద్యార్థి సంఘం రాష్ట్ర కో ఆర్డినేటర్ పెంట అజయ్ డిమాండ్ చేశారు. గురువారం సంఘ కార్యాలయంలో ఏర్పాటు చేసిన సమావేశంలో మాట్లాడారు. అధిక ఫీజులు వసూలు చేస్తున్న విద్యాసంస్థలపై కఠిన చర్యలు తీసుకోవాలని అన్నారు. అనుమతులు లేకుండా నడుపుతున్న పాఠశాలలపైన చర్యలు తీసుకోవాలని, పెండింగ్‌లో ఉన్న స్కాలర్‌షిప్స్, ఫీజురీయింబర్స్‌మెంట్ బకాయిలను తక్షణమే విడుదల చేయాలని తెలిపారు. డొనేషన్లు వసూలు చేస్తున్న ఇంజనీరింగ్ కళాశాలల పై క్రిమినల్ కేసులు నమోదు చేయాలని, అన్నారు. బీసీ వసతి గృహ ప్రవేశాలకు ఆన్‌లైన్ పద్ధతిని రద్దు చేయాలన్నారు. హాస్టల్ విద్యార్థులకు మెస్ చార్జీలను ప్రస్తుతం ధరలకు అనుకూలంగా పెంచాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో తెలంగాణ బీసీ విద్యార్థి సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి రాపర్తి వికాస్, గరిగే కోటేశ్వర్, కాల్వ కిషన్, రాజు, తదితరులు పాల్గొన్నారు.


మాట్లాడుతున్న అజయ్

వీసీగా బీసీ వ్యక్తిని నియమించాలి

సప్తగిరికాలనీ(కరీంనగర్): శాతవాహన యూనివర్సిటీకి వైస్ ఛాన్స్‌లర్‌గా బీసీ సామాజిక వర్గానికి చెందిన వారిని నియమించాలని బీసీ యువజన సంఘం జిల్లా అధ్యక్షుడు నర్సింగోజు శ్రీనివాస్ అన్నారు. గురువారం బీసీ సంఘం జిల్లా కార్యాలయంలో జరిగిన సమావేశంలో మాట్లాడారు. 2008 కాంగ్రెస్ హయాంలో ప్రారంభమైన శాతవాహన యూనివర్సిటీకి వీసీగా వివిధ వర్గాలకు చెందిన వారిని నియమించడం అభినందనీయం కాగా బీసీ సామాజిక వర్గానికి సంబంధించిన వారిని ఇంతవరకు నియమించకుండా నిర్లక్ష్యం చేయడం బాధాకరమన్నారు. బీసీ సంక్షేమ సంఘం జిల్లా వర్కింగ్ ప్రెసిడెంట్ చిగుర్ల శ్రీనివాస్, జిల్లా ప్రధాన కార్యదర్శి కాటా వేణుగోపాల్, నగర ఉపాధ్యక్షులు రావుల రాజు, దాసరి అశోక్, అక్షిత్ బీసీ సంఘాల నాయకులు, తదితరులు పాల్గొన్నారు.


మాట్లాడుతున్న శ్రీనివాస్

క్లుప్తంగా

రాష్ట్రస్థాయి అథ్లెటిక్స్‌లో సిల్వర్ మెడల్

కరీంనగర్‌స్పోర్ట్స్: హన్మకొండలోని జవహర్‌లాల్ నెహ్రూ స్టేడియంలో జరుగుతున్న రాష్ట్ర స్థాయి అథ్లెటిక్ చాంపియన్‌షిప్‌లో జిల్లా క్రీడాకారిణి సత్తా చాటింది. అండర్-10 విభాగంలో లాంగ్ జంప్ కేటగిరిలో కరీంనగర్‌కు చెందిన నూర్జైన్ ప్రతిభ కనబరిచి సిల్వర్ మెడల్ సాధించింది. ఈ సందర్భంగా నూర్జైన్‌ను పలువురు అభినందించారు.


సిల్వర్ మెడల్ సాధించిన నూర్జైన్

బల్దియాలో ఆడిట్ షురూ

కరీంనగర్ కార్పొరేషన్: నగరపాలకసంస్థ కార్యాలయంలో ఆడిట్ మొదలైంది. ప్రతి ఐదేళ్లకోసారి చేపట్టే ఈ ఆడిట్ గురువారం ప్రారంభం కాగా దాదాపు పది రోజులపాటు కొనసాగనుంది. హైదరాబాద్ అకౌంటెంట్ జనరల్ కార్యాలయం నుంచి వచ్చిన ఇద్దరు అధికారులు, రెవెన్యూ, పట్టణ ప్రణాళిక తదితర విభాగాల్లో ఆడిట్ చేపట్టారు.

బీఆర్ఎస్ ఓటమికి బాధ్యత వహించాలి

కరీంనగర్‌రూరల్: ఎంపీ ఎన్నికల్లో బీఆర్ఎస్ ఓటమికి ఎమ్మెల్యే గంగుల కమలాకర్ నైతిక బాధ్యత వహించాలని తెలంగాణ అంబేడ్కర్ యువజన సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సుద్దాల లక్ష్మణ్, రాష్ట్ర కార్యదర్శి గోష్కి శంకర్, నాయకులు కొయ్యడ వినోద్‌కుమార్ ఒక ప్రకటనలో డిమాండ్ చేశారు. మూడు పర్యాయాలు ఎమ్మెల్యేగా, మంత్రిగా పనిచేసిన కమలాకర్ దళిత, ముస్లింలకు ఎలాంటి పనిచేయలేదని, తన సామాజిక వర్గానికి మాత్రమే లబ్ధిచేసినట్లు తెలిపారు. ఎంపీ ఎన్నికల్లో దళితులను నిర్లక్ష్యం చేయడంతోనే బీఆర్ఎస్ ఓటమి చెందిందని అన్నారు. వినోద్‌కుమార్ ఓటమికి కారణమైన కమలాకర్ వెంటనే ఎమ్మెల్యే పదవికి రాజీనామా చేయాలని డిమాండ్ చేశారు.

రక్తకణాల దానం


రక్తకణాలు దానం చేస్తున్న గంగాధర చందు

కొత్తపల్లి: కొత్తపల్లి మండలం మల్కాపూర్ గ్రామానికి చెందిన గంగాధర చందు గురువారం రక్తకణాలు దానం చేశారు. తిమ్మాపూర్ మండలం పర్లపల్లికి చెందిన వినోద్ ఓ ప్రైవేట్ ఆసుపత్రిలో తీవ్ర జ్వరంతో చికిత్స పొందుతూ రక్తకణాలు అవసరం కాగా చందు రక్తకణాలు దానం చేసి ఉదారతను చాటుకున్నాడు.

రారండోయ్.. మా బడికి


బడిబాటలో పాల్గొన్న సప్తగిరికాలనీ ప్రభుత్వ పాఠశాల ఉపాధ్యాయులు


జూబ్లీనగర్‌లో సమావేశమైన అధికారులు, ఉపాధ్యాయులు

సప్తగిరికాలనీ: ప్రభుత్వ పాఠశాలల్లో బడిబాట కార్యక్రమాలు ప్రారంభమయ్యాయి. పలు ప్రభుత్వ పాఠశాలలు ఎస్సెస్సీ ఫలితాలతో పాటు పలు కార్యక్రమాలకు సంబంధించి కరపత్రాలు ముద్రించుకొని, ఫ్లెక్సీని రూపొందించుకొని వీధుల వెంట తిరుగుతూ మా బడిలో మీ పిల్లలను చేర్పించండి అంటూ పిల్లల తల్లిదండ్రులతో మట్లాడుతున్నారు. ప్రైవేటు బడి వద్దు.. ప్రభుత్వ బడి ముద్దు అంటూ బడి ఈడు పిల్లలందరినీ బడిలో చేర్పించాలని తల్లిదండ్రులను కోరారు. గురువారం సప్తగిరికాలనీ ప్రభుత్వ ఉన్నత పాఠశాల ఉపాధ్యాయులు వీధుల్లో పెద్ద ఎత్తున ర్యాలీ నిర్వహించారు. కార్పొరేటర్ బుచ్చిరెడ్డి, పాఠశాల ప్రధానోపాధ్యాయుడు ఎం. రాజేందర్, ఉపాధ్యాయులు తిరుపతి, గాజుల రవీందర్, తిరుపతి, ప్రసాద్, శ్రీనివాస్, స్వామి, సత్యనారాయణ రావు, రామారావు, అన్నపూర్ణ, ఉమా మల్లీశ్వరి, గీత, పద్మజ, అపోలినా, షబానా, భారతి, ప్రమీల, అంతటి శంకరయ్య, స్వచ్ఛంద సంస్థల ప్రతినిధులు కోటేశ్, అంగన్‌వాడీ కార్యకర్తలు పాల్గొన్నారు.

బడీడు పిల్లలను గుర్తించాలి

కరీంనగర్‌రూరల్: బడీడు పిల్లలను గుర్తించి ప్రభుత్వ పాఠశాలల్లో చేర్పించాలని ఎంపీడీవో సంజీవరావు కోరారు. బడిబాట కార్యక్రమంలో భాగంగా గురువారం కరీంనగర్ మండలం జూబ్లీనగర్‌లో ఉపాధ్యాయులతో కలిసి ప్రజాప్రతినిధులు ర్యాలీ నిర్వహించారు. అనంతరం ఎంపీడీవో సంజీవరావు ఉపాధ్యాయులతో కలిసి సమీక్షా జరిపారు. బడి ఈడు పిల్లలను ప్రభుత్వ పాఠశాలలో చేర్పించకుంటే భవిష్యత్‌లో ప్రభుత్వ సంక్షేమ పథకాలు నిలిపివేసే ప్రమాదముందని తెలిపారు. ఈ సమావేశంలో ప్రధానోపాధ్యాయులు జలజారాణి, రామస్వామి, పంచాయతీ కార్యదర్శి కిరణ్‌రావు, మాజీ సర్పంచ్ రుద్ర రాము, ఏఏపీసీ చైర్‌పర్సన్ మల్లీశ్వరీ తదితరులు పాల్గొన్నారు. చెర్లభూత్కూర్‌లో నిర్వహించిన బడిబాట ర్యాలీలో ఎంపీటీసీ బుర్ర తిరుపతిగౌడ్, మాజీ సర్పంచ్ దబ్బెట రమణారెడ్డితో పాటు పలువురు ఉపాధ్యాయులు పాల్గొన్నారు.


చెర్లభూత్కూర్‌లో ర్యాలీ

10న ఉపాధి హామీ రాష్ట్ర సదస్సు


ఉపాధి హామీ కూలీలతో మాట్లాడుతున్న రాయికంటి శ్రీనివాస్

మానకొండూర్: హైదరాబాద్‌లోని సుందరయ్య విజ్ఞాన కేంద్రంలో 10న నిర్వహించే ఉపాధిహామీ రాష్ట్ర సదస్సును జయప్రదం చేయాలని వ్యవసాయకార్మిక సంఘం జిల్లా ఉపాధ్యక్షుడు రాయికంటి శ్రీనివాస్ అన్నారు. మండలంలోని అన్నారంలో ఉపాధిహామీ పనులను పరిశీలించి కూలీలతో మాట్లాడారు. గిట్టుబాటు కూలీ, సమయానికి డబ్బులు వస్తున్నాయా అని అడిగి తెలుసుకున్నారు. కూలీల పెండింగ్ బిల్లులు వెంటనే చెల్లించాలని డిమాండ్ చేశారు.

కాల్వ నర్సయ్యకు నివాళి

కరీంనగర్‌రూరల్: కరీంనగర్ మండలం బొమ్మకల్‌లో గురువారం దివంగత సీపీఐ, యాదవ సంఘం నాయకుడు కాల్వ నర్సయ్య జయంతి వేడుకలను ఘనంగా నిర్వహించారు. లక్ష్మీనగర్‌లోని గొర్రెల పెంపకందారుల సంఘం ఆవరణలోని కాల్వ నర్సయ్య విగ్రహానికి పలువురు యాదవ సంఘం నాయకులు పూలమాల వేసి నివాళి అర్పించారు. సీపీఐ నాయకుడిగా, యాదవ సంఘం నాయకుడిగా కాల్వ నర్సయ్య చేసిన సేవలను కొనియాడారు. అనంతరం గ్రామస్తులకు స్వీట్లు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో యాదవ మహాసభ జిల్లా అధ్యక్షుడు సత్యనారాయణ, రాష్ట్ర కౌన్సిల్ సభ్యులు మంచాల రవీందర్, కాల్వ మల్లేశం, యూత్ జిల్లా అధ్యక్షుడు కాల్వ శ్రీనివాస్, నాయకులు కాల్వ అశోక్, రాజు, రాజ్‌కుమార్, రవి, భూమిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.


నర్సయ్య విగ్రహానికి నివాళి అర్పిస్తున్న యాదవ సంఘం నాయకులు

నర్సరీల తనిఖీ


మాట్లాడుతున్న ఉద్యానశాఖ అధికారి స్వాతి

తిమ్మాపూర్: మండలంలోని కూరగాయల నర్సరీలను మానకొండూర్ ఉద్యానశాఖ అధికారి స్వాతి గురువారం తనిఖీ చేశారు. లైసెన్స్ పొందని నర్సరీల నిర్వాహకులు నాలుగు రోజుల్లో ఉద్యానశాఖ ద్వారా లైసెన్స్ పొందాలని, అవసరమైన దరఖాస్తులు సమర్పించాలని ఆదేశించారు. నర్సరీ చట్టం ప్రకారం కూరగాయల నర్సరీల నిర్వహణకు లైసెన్స్ తప్పనిసరి అని, లైసెన్స్ పొందకుండా నర్సరీ నిర్వహిస్తే రూ.50 వేల వరకు జరిమానాతోపాటు జైలుశిక్ష రెండు విధించే అవకాశం ఉందని తెలిపారు. వెంట ఎల్ఎండీ ఎస్సై చేరాలు, తిమ్మాపూర్ వ్యవసాయాధికారి సురేందర్ పాల్గొన్నారు.

చిన్నారులకు చెస్‌బోర్డులు పంపిణీ

సప్తగిరికాలనీ(కరీంనగర్): కరీంనగర్‌లోని మేము సైతం యువసేన ఫౌండేషన్ ఆధ్వర్యంలో గురువారం నగరంలోని పలువురు చిన్నారులకు చెస్ బోర్డులు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో ఫౌండేషన్ అధ్యక్షురాలు చకిలం స్వప్న శ్రీనివాస్, రూప, అనురూప్, తదితరులు పాల్గొన్నారు.


చెస్ బోర్డులను పంపిణీ చేసిన స్వప్న

'ప్రజలిచ్చిన తీర్పు ఒంటెద్దు పోకడలకు గుణపాఠం'

కరీంనగర్: దేశవ్యాప్తంగా జరిగిన పార్లమెంట్ ఎన్నికల్లో ప్రజలు ఇచ్చిన తీర్పు బీజేపీ ఒంటెద్దు పోకడలకు తగిన గుణపాఠం చెప్పారని సీపీఎం నగర కార్యదర్శి గుడికందుల సత్యం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఒంటరిగానే 400 సీట్లు సాధిస్తామని తద్వారా రాజ్యాంగాన్ని మారుస్తామని, రిజర్వేషన్లను సవరిస్తామని పగటి కలలు కన్న బీజేపీకి తగిన గుణపాఠం చెప్పారని తెలిపారు. 2019లో జరిగిన ఎన్నికల్లో 303 సీట్లు సాధించిన బీజేపీ నేడు 241కి పరిమితమైందని అన్నారు. దేశవ్యాప్తంగా ఇండియా కూటమిని ఆదరించి ఎక్కువ సీట్లు ఇచ్చారని, దీనిమూలంగా దేశంలో బలమైన ప్రతిపక్షం ఉంటుందని తెలిపారు. దేశవ్యాప్తంగా వామపక్షాల బలం పుంజుకుందని రానున్న రోజుల్లో ప్రజా సమస్యలపై మరింత ఉధృతంగా ఐక్య ఉద్యమాలు చేస్తామని పేర్కొన్నారు.

పవర్‌కట్ ప్రాంతాలు



కొత్తపల్లి: కరీంనగర్‌లో నూతన ట్రాన్స్‌ఫార్మర్ చార్జింగ్ పనులు చేపడుతున్నందున శుక్రవారం ఉదయం 9.30 నుంచి 10.30 గంటల వరకు అంబేడ్కర్ స్టేడియం నుంచి గౌతమినగర్, అభయాంజనేయ స్వామి ఆలయం, కాకతీయ స్కూల్, బృందావన్ ఫంక్షన్ హాల్ వెనుక భాగం, గంగపుత్ర వీధి, బ్రాహ్మణవీధి, న్యూ శ్రీనగర్ కాలనీ, గౌతమినగర్ ప్రాంతాల్లో విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్లు టౌన్-2 ఏడీఈ ఎం.సుధీర్ కుమార్ తెలిపారు. విద్యుత్ వినియోగదారులు సహకరించాలని కోరారు.

'దళారులతో మోసపోవద్దు'

హుజూరాబాద్: కార్మికులు దళారులను ఆశ్రయించి మోసపోవద్దని కార్మికశాఖ అధికారి చందన అన్నారు. గురువారం పట్టణంలోని కార్మికశాఖ అధికారి కార్యాలయంలో ఏర్పాటు చేసిన సమావేశంలో మాట్లాడారు. ప్రతి కార్మికుడు రిజిస్ట్రేషన్ ఫామ్ లేబర్ కార్డు కొత్తదాని కోసం సహాయ కార్మిక అధికారి కార్యాలయానికి వచ్చి స్వయంగా దరఖాస్తు ఫారం ఇచ్చి రిజిస్టర్‌లో సంతకం చేయాలన్నారు. కార్మికులకు ప్రభుత్వం కల్పించే సంక్షేమ పథకాలు అందాలంటే కార్డు కోసం నేరుగా దరఖాస్తు చేసుకోవాలని, కార్డులున్నవారు సమయానికి రెన్యూవల్ చేసుకోవాలన్నారు.


ప్లాస్టిక్ వినియోగం ఆగట్లే..

పర్యావరణానికి పెనుభూతంగా మారిన ప్లాస్టిక్ కవర్లను ప్రభుత్వం నిషేధించింది. కానీ, ఆచరణలో ఎక్కడా అమలు కావడం లేదు. నగరంలో ప్లాస్టిక్ క్యారీ బ్యాగుల విక్రయాలు యథావిధిగా సాగుతున్నాయి. అధికారులు చూసీచూడనట్లు వ్యవహరిస్తున్నారని, అడపాదడపా ప్లాస్టిక్ క్యారీ బ్యాగులు విక్రయించే దుకాణాలపై దాడులు చేస్తూ చేతులు దులుపుకుంటున్నారన్న ఆరోపణలున్నాయి. రీసైక్లింగ్‌కు వీలవని ప్లాస్టిక్ వస్తువులను పూర్తిస్థాయిలో నిషేధించాలని పర్యావరణ ప్రేమికులు కోరుతున్నారు.

– సాక్షి ఫొటోగ్రాఫర్, కరీంనగర్



12న చంద్రబాబు ప్రమాణ స్వీకారం



సాక్షి, అమరావతి: ఏపీ ముఖ్యమంత్రిగా ఈనెల 12న చంద్రబాబు ప్రమాణస్వీకారం చేయనున్నారు. తొలుత 9వ తేదీన ప్రమాణ స్వీకారం చేయాలని నిర్ణయించినా అదేరోజు ప్రధానిగా నరేంద్ర మోదీ ప్రమాణ స్వీకారం చేస్తుండడం .. ఆ కార్యక్రమానికి హాజరవ్వాల్సి వుండడంతో చంద్రబాబు తన కార్యక్రమాన్ని 12కు వాయిదా వేసుకున్నట్లు టీడీపీ వర్గాలు తెలిపాయి. ఆ రోజున రాజధాని ప్రాంతంలో భారీ బహిరంగ సభ ఏర్పాటుచేసి ప్రమాణ స్వీకారం చేయడానికి ఏర్పాట్లుచేస్తున్నారు. దానికి ముందు 11వ తేదీన టీడీపీ శాసనసభా పక్ష సమావేశం నిర్వహించనున్నారు. ఆ రోజు టీడీపీ ఎమ్మెల్యేలు చంద్రబాబును టీడీపీ పక్ష నేతగా ఎన్నుకుంటారు. చంద్రబాబును టీడీఎల్పీ నేతగా ఎన్నుకుని గవర్నర్‌కు నివేదించాక 12న ప్రమాణస్వీకార కార్యక్రమం జరుగుతుంది. చంద్రబాబు ప్రమాణస్వీకారం చేసిన రోజే తొలి విడతగా కొందరిని మంత్రులుగా ప్రమాణం చేయించనున్నట్లు తెలిసింది. సుమారు పది మందికి తొలి విడతలో అవకాశం దక్కే పరిస్థితి కనిపిస్తోంది. టీడీపీ నుంచి ఐదారుగురు, జనసేన, బీజేపీ నుంచి నలుగురు ఆ జాబితాలో ఉండే అవకాశం ఉంది. తొలి విడతలో కింజరాపు అచ్చెన్నాయుడు, ధూళిపాళ్ల నరేంద్ర, చింతకాయల అయ్యన్నపాత్రుడు, పి. నారాయణ, పయ్యావుల కేశవ్, కొల్లు రవీంద్ర, నిమ్మల రామానాయుడు వంటి వారికి అవకాశం ఉంటుందని టీడీపీ వర్గాలు చెబుతున్నాయి. జనసేన నుంచి పవన్‌కళ్యాణ్ మంత్రివర్గంలో చేరతారా లేదా అనే అంశంపై ఇంకా స్పష్టత రాలేదు. బీజేపీ తరపున సుజనాచౌదరికి తొలి విడతలోనే మంత్రివర్గంలో చోటు దక్కించుకోవడం ఖాయమని చెబుతున్నారు. అసెంబ్లీ స్పీకర్‌గా ఆనం రామనారాయణరెడ్డిని నియమించే యోచనలో టీడీపీ ఉన్నట్లు చర్చ జరుగుతోంది.

టీడీపీకి లోక్‌సభ డిప్యూటీ స్పీకర్ పదవి?

ఎన్డీయే భాగస్వామ్య పక్షాల్లో ప్రధాన పార్టీగా ఉండడంతో టీడీపీ లోక్‌సభ స్పీకర్ పదవిని ఆశిస్తున్నట్లు ప్రచారం జరుగుతోంది. అయితే, బీజేపీ అగ్రనేతలు డిప్యూటీ స్పీకర్ పదవి ఇచ్చే యోచనలో ఉన్నట్లు సమాచారం. ఒకవేళ చంద్రబాబు ఆ పదవి కావాలని గట్టిగా పట్టుబడితే ఏమైనా నిర్ణయం మారే అవకాశం ఉందంటున్నారు. కేంద్ర మంత్రివర్గంలో టీడీపీ ఐదుకి పైగా స్థానాలు కోరుతుండడం, కీలకమైన జల్‌శక్తి, రవాణా వంటి శాఖలు అడుగుతుండడంతో దానిపైనా రకరకాల ఊహాగానాలు వినిపిస్తున్నాయి. బీజేపీ పౌర విమానయాన, ఉక్కు శాఖలను టీడీపీకి ఇవ్వాలని యోచిస్తున్నట్లు ప్రచారం జరుగుతోంది.

యథేచ్ఛగా హింస

కఠిన చర్యలు తీసుకోండి.. గవర్నర్‌ను కోరిన వైఎస్సార్‌సీపీ

సాక్ష్యాధారాలతో ఫిర్యాదు చేసిన పార్టీ నేతలు

పోలీసులు ఏం చేస్తున్నారని గవర్నర్ విస్మయం



గవర్నర్‌కు ఫిర్యాదు చేసిన అనంతరం మీడియాతో మాట్లాడుతున్న వైఎస్సార్‌సీపీ నేతలు

సాక్షి ప్రతినిధి, విజయవాడ: అధికారం చేపట్టకముందే టీడీపీ, జనసేన నాయకులు యథేచ్ఛగా సాగిస్తున్న హింసాకాండపై తక్షణమే కఠిన చర్యలు తీసుకుని ప్రజాస్వామ్యాన్ని పరిరక్షించాలని వైఎస్సార్ సీపీ నేతలు గవర్నర్ అబ్దుల్ నజీర్‌కు విన్నవించారు. ఈమేరకు రాజ్యసభ సభ్యుడు వైవీ సుబ్బారెడ్డి, తిరుపతి ఎంపీ గురుమూర్తి, అరకు ఎంపీ తనూజ, దర్శి ఎమ్మెల్యే డాక్టర్ శివప్రసాద్‌రెడ్డి, మాజీ ఎంపీ కేశినేని నాని, అరకు ఎమ్మెల్యే మత్స్యలింగం, పాడేరు ఎమ్మెల్యే విశ్వేశ్వరరాజు, ఎమ్మెల్సీ తలశిల రఘురామ్, మాజీ ఎమ్మెల్యే ప్రతాప్‌కుమార్‌రెడ్డితో కలిసి గవర్నర్‌కు గురువారం వినతిపత్రం అందచేసిన అనంతరం మాజీ మంత్రి పేర్ని నాని మీడియాతో మాట్లాడారు. ఓట్ల లెక్కింపు అనంతరం బిహార్ తరహాలో రాష్ట్రంలో జరుగుతున్న విధ్వంసకాండ, హింసాత్మక ఘటనలను గవర్నర్ దృష్టికి తెచ్చినట్లు చెప్పారు. టీడీపీ మూకలు ఎన్నికల రోజు మధ్యాహ్నం నుంచే వైఎస్సార్‌సీపీ నాయకులు, కార్యకర్తలు, సానుభూతిపరుల ఇళ్లపై దాడులకు తెగబడి పలు చోట్ల గృహ దహనాలు, ఆస్తులను ధ్వంసం చేశాయన్నారు. మహిళలు, పిల్లలను సైతం హింసించి భయ భ్రాంతులకు గురిచేశాయని తెలిపారు. టీడీపీ, జనసేన విధ్వంస కాండకు సంబంధించి వీడియో, ఫొటో ఆధారాలను పరిశీలించి విస్తుపోయిన గవర్నర్.. పోలీసులు ఏం చేస్తున్నారని ప్రశ్నించారన్నారు. పోలీసులు ప్రేక్షక పాత్ర వహిస్తున్నారని, కళ్ల ముందే దాడి జరిగినా కనీసం ఎఫ్ఐఆర్ కూడా నమోదు చేయడం లేదని గవర్నర్ దృష్టికి తెచ్చినట్లు వెల్లడించారు. నూజివీడులో కౌన్సిలర్‌పై పోలీసుల సమక్షంలోనే కత్తులతో దాడి జరగటాన్ని గవర్నర్ దృష్టికి తెచ్చామన్నారు. ఈ ఘటనలపై డీజీపీతో చర్చించి చర్యలు తీసుకుంటానని గవర్నర్ హామీ ఇచ్చారన్నారు.

పర్యవసానాలు తప్పవు

వైఎస్సార్‌సీపీ జెండా పట్టుకున్న వారిపై దాడులు చేసేందుకే అధికారంలోకి వచ్చారా? అని టీడీపీ నేతలను పేర్ని నాని ప్రశ్నించారు. ఎర్ర పుస్తకం పేరుతో హింసకు పాల్పడుతున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. ఎల్లకాలం మీరే అధికారంలో ఉండరనే విషయాన్ని గుర్తు పెట్టుకోవాలని కూటమి నాయకులకు సూచించారు. చంద్రబాబు ఒత్తిడితో పోలీసులు ప్రేక్షక పాత్ర పోషిస్తున్నారని విమర్శించారు. దాడులను ఆపకుంటే పర్యవసానాలు తప్పవని హెచ్చరించారు.

కార్యకర్తలను కాపాడుకునేందుకు కమిటీలు, లీగల్ టీమ్స్

రాష్ట్రంలోని వైఎస్సార్‌సీపీ కార్యకర్తలు, నాయకులను కాపాడుకునేందుకు 26 జిల్లాల్లో మాజీ మంత్రులు, ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలతో కలిసి ప్రత్యేక కమిటీలను వైఎస్సార్‌సీపీ ఏర్పాటు చేసినట్లు పేర్ని నాని వెల్లడించారు. బాధితులను పరామర్శించడంతో పాటు న్యాయం జరిగేలా చర్యలు తీసుకుంటామన్నారు. టీడీపీ హింసాకాండను మీడియా ద్వారా ప్రపంచానికి తెలియజేస్తామన్నారు. 26 జిల్లాలో ఏర్పాటైన లీగల్ టీమ్‌లు బాధితులకు అండగా నిలుస్తాయని, శుక్రవారం నుంచి చురుగ్గా పని చేస్తాయని తెలిపారు. కింది స్థాయి పోలీసులు కేసులు నమోదు చేయకుంటే ఎస్పీలను కలిసి న్యాయం కోసం పోరాటం చేస్తామన్నారు.

మా ప్రాణాలు కాపాడండి

- ఏపీలో వ్యవస్థీకృత హింసపై సుప్రీంను ఆశ్రయించిన బాధితులు
- ఎన్నికల అనంతరం రాష్ట్రంలో భయానక పరిస్థితులు
- వైఎస్సార్‌సీపీ మద్దతుదారులు, సానుభూతిపరులపై యథేచ్ఛగా దాడులు
- గ్రామాలు వీడకుంటే చంపేస్తామంటూ హెచ్చరికలు
- ఆస్తుల ధ్వంసం.. మహిళలు, పిల్లలను హింసిస్తున్నారు
- పోలీసుల నిర్లిప్తతతో అసాంఘిక శక్తులు పేట్రేగుతున్నాయి
- సాక్ష్యాధారాలతో ఈ-మెయిల్ ద్వారా సీజేఐకి బాధితుల ఫిర్యాదు
- సుమోటో ప్రజాప్రయోజన వ్యాజ్యంగా స్వీకరించి విచారించాలంటూ అభ్యర్థన

సాక్షి, అమరావతి: సార్వత్రిక ఎన్నికల అనంతరం ఆంధ్రప్రదేశ్‌లో వైఎస్సార్‌సీపీ మద్దతుదారులు, సానుభూతిపరులపై ప్రధానంగా ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీలపై రాజకీయ ప్రత్యర్థులు, అసాంఘిక శక్తులు దాడులతో వ్యవస్థీకృత హింసకు పాల్పడుతుండటంపై బాధితులు సుప్రీం కోర్టును ఆశ్రయించారు. గ్రామాలు, ఆస్తులను వదిలేసి కట్టుబట్టలతో వెళ్లకుంటే హతమారుస్తామంటూ హెచ్చరిస్తున్నారని, ఆస్తులను ధ్వంసం చేస్తూ పిల్లలు, మహిళలను సైతం హింసిస్తున్నారని ఆందోళన వ్యక్తం చేశారు. ఈ ఘటనలపై పోలీసులు ఎలాంటి చర్యలు తీసుకోకపోవడంతో అసాంఘిక శక్తులు పేట్రేగిపోతున్నాయని విన్నవించారు. రాష్ట్రంలో విచ్చలవిడిగా సాగుతున్న వ్యవస్థీకృత హింసను సుమోటోగా ప్రజా ప్రయోజన వ్యాజ్యం (పిల్)గా స్వీకరించి ప్రజల ప్రాణాలను, ఆస్తులను రక్షించాలని అభ్యర్థించారు. వ్యవస్థీకృత హింసకు సంబంధించి మీడియా కథనాలు, సోషల్ మీడియా వీడియోల సాక్ష్యాధారాలతో బాధితులు సుప్రీం కోర్టు ప్రధాన న్యాయమూర్తికి గురువారం ఈ-మెయిల్ ద్వారా పిర్యాదు చేశారు.

బాధితుల ఆక్రందన ఇదీ..

- ప్రస్తుతం రాష్ట్రంలోని పాలనా యంత్రాంగంలో నెలకొన్న అస్థిర పరిస్థితులను ఆసరాగా చేసుకుని అసాంఘిక శక్తులు వైఎస్సార్‌సీపీ మద్దతుదారులు, సానుభూతిపరులు, పిల్లలు, మహిళలపై వ్యవస్థీకృత హింసకు పాల్పడుతున్నాయి. ఆస్తులను ధ్వంసం చేస్తున్నాయి.
- పోలీసులు నిర్లిప్తంగా వ్యవహరించడంతో అసాంఘిక శక్తులు యథేచ్ఛగా విధ్వంసానికి పాల్పడుతున్నాయి. గత 24 గంటల్లో హింసాత్మక సంఘటనలు భారీగా పెరిగాయి.
- సర్వోన్నత న్యాయస్థానం తక్షణమే స్పందించి చర్యలకు ఆదేశించకుంటే ఈ వ్యవస్థీకృత హింస నుంచి బాధితులకు రక్షణ లభించదు. ఈ అంశాన్ని సుమోటో పిల్‌గా స్వీకరించి విచారించాలి. రాష్ట్ర ప్రజల ప్రాణాలు, ఆస్తులను కాపాడాలి.

అరాచకాన్ని అరికట్టండి

ఏపీలో విధ్వంసకాండపై రాష్ట్రపతికి వైఎస్సార్‌సీపీ ఫిర్యాదు

సాక్షి, అమరావతి: ఆంధ్రప్రదేశ్‌లో వైఎస్సార్‌సీపీ నేతలు, కార్యకర్తలు, పార్టీ మద్దతుదారులు, సానుభూతిపరులపై యథేచ్ఛగా కొనసాగుతున్న దాడులు, హింసాకాండను తక్షణం అరికట్టేలా కఠిన చర్యలు తీసుకోవాలని రాష్ట్రపతి ద్రౌపది ముర్ము, గవర్నర్ ఎస్.అబ్దుల్ నజీర్‌ను పార్టీ కోరింది. రాష్ట్రంలో ఎన్నికల ఫలితాల విడుదల అనంతరం కొత్త ప్రభుత్వం ఏర్పడుతున్న వేళ అల్లరిమూకలు సంధి కాలాన్ని ఎంపిక చేసుకుని విధ్వంసాలకు తెగబడటం వెనుక పక్కా కుట్ర ఉందని స్పష్టం చేసింది. అరాచక శక్తులు చెలరేగుతున్నా పోలీసు యంత్రాంగం ఉదాసీనంగా వ్యవహరించడం పరిస్థితిని మరింత దిగజారుస్తోందని ఆందోళన వ్యక్తం చేసింది. రాష్ట్రంలో శాంతి భద్రతలను పునరుద్ధరించేలా తక్షణం కఠిన చర్యలకు ఆదేశించాలని కోరింది. ఈమేరకు రాష్ట్రపతి, గవర్నర్‌కు వైఎస్సార్‌సీపీ రాజ్యసభ సభ్యుడు ఎస్.నిరంజన్ రెడ్డి గురువారం విడివిడిగా లేఖలు రాశారు. వైఎస్సార్‌సీపీ నేతలు, కార్యకర్తలపై జరుగుతున్న దాడులను అరికట్టి ప్రజల ప్రాణాలు, ఆస్తులకు రక్షణ కల్పించాలని డీజీపీ హరీశ్‌కుమార్ గుప్తాను మరో లేఖ ద్వారా కోరారు.

ఊరూరా విధ్వంసం..

అదే టీడీపీ లక్ష్యం

- పలుచోట్ల శిలాఫలకాలు, వైఎస్సార్ విగ్రహాలపై దాడి
- ప్రభుత్వ కార్యాలయాల బోర్డులు కూల్చివేత
- సచివాలయాలపై అక్కసుతో పేట్రేగిన వైనం
- విజయనగరంలో ప్రభుత్వ ఆస్పత్రి వద్ద రచ్చ
- సంకురాత్రిపాడులో బోర్డులు, శిలాఫలకాలు, దిమ్మెలు ధ్వంసం
- సచివాలయంపై టీడీపీ, జనసేన, బీజేపీ జెండాలు

మరిన్ని వివరాలకు ఈ క్యూఆర్ కోడ్‌ను స్కాన్ చేయండి

వైఎస్సార్‌సీపీ వర్గీయులపై టీడీపీ కార్యకర్తల దాడి

- ఇద్దరికి తీవ్ర గాయాలు.. ఒకరి పరిస్థితి విషమం



తలకు గాయాలైన తలతోటి దావీదు



తలకు తీవ్ర గాయాలైన మద్దూరి పాలు

యడ్లపాడు : వైఎస్సార్‌సీపీ వర్గీయులపై టీడీపీ కార్యకర్తలు దాడి చేశారు. ఇద్దరికీ తీవ్ర గాయాలు కాగా, ఒకరి పరిస్థితి విషమంగా ఉంది. ఈ ఘటన పల్నాడు జిల్లా యడ్లపాడు మండలం కారుచోల గ్రామంలో గురువారం జరిగింది. ఎస్సీ కాలనీలోని చర్చి కింద జాలాది మార్గంలోని చెరువులో సుమారు 3.5 ఎకరాల ఆక్రమిత సాగుభూమి ఉంది. దీనిపై వచ్చే ఆదాయాన్ని ఏటా సంఘ పెద్దలు చర్చి అభివృద్ధి పనులకు వినియోగిస్తుంటారు. ఈ నేపథ్యంలో గతేడాది కౌలుకు తీసుకున్న కనపర్తి రత్తయ్య తన కౌలు డబ్బులు ఇస్తానంటూ చర్చికి రావాలని సంఘ పెద్దల్ని కోరాడు. దీంతో సంఘ పెద్దలు ఆరుగురు బెజ్జం అనిల్, వలేరు లాజర్, వడ్లానం మాణిక్యరావు, గడ్డ సీమోను, తిరుపతి రామారావు, మద్దూరి మనోహర్, తలతోటి దావీదు చర్చికి చేరుకుని కౌలు డబ్బులతో చేయాల్సిన అభివృద్ధి పనులపై చర్చించుకున్నారు. పెద్దలంతా చర్చి నుంచి బయటకు వస్తున్న క్రమంలో ఆ ప్రాంతానికి వచ్చిన గ్రామ టీడీపీ నాయకుడు మైలవరపు వెంకట కోటయ్య.. సంఘ పెద్ద, వైఎస్సార్‌సీపీ నాయకుడైన తలతోటి దావీదుతో వాగ్వాదం పెట్టుకున్నాడు. అదేకాలనీలోని తమ పార్టీ కార్యకర్తల్ని రెచ్చగొట్టి.. దాడికి దిగారు. దావీదుతో వచ్చిన మరో పెద్ద మద్దూరి మనోహర్ పరారు కాగా, దావీదును నాపరాయితో తలపై మోదారు. అదే సమయంలో అక్కడికి వచ్చిన మద్దూరి మనోహర్ అనే వలంటీర్ దావీదును చిలకలూరిపేట ప్రభుత్వ ఆసుపత్రికి తరలించాడు. ఇదిలా ఉండగా పొలం నుంచి కాలనీ వైపు టీవీఎస్‌పై వస్తున్న మద్దూరి పాలు.. టీడీపీ కార్యకర్తలు కర్రలతో రావడం గమనించి బండి వెనక్కు తిప్పే ప్రయత్నం చేశాడు. అతన్ని అంబేడ్కర్ విగ్రహం సెంటర్‌లో పట్టుకుని దాడి చేయడంతో తలకు తీవ్ర గాయాలయ్యాయి.

గ్రామీణులకు వరం.. అగ్రికల్చర్ పాలిటెక్నిక్

- 'అగ్రికల్చర్ పాలిటెక్నిక్' నోటిఫికేషన్ విడుదల
- ర్యాంకుల ఆధారంగా సీట్ల భర్తీ
- 26 వరకు ఆన్‌లైన్‌లో దరఖాస్తులకు అవకాశం



వ్యవసాయ పనులు చేస్తున్న అగ్రికల్చర్ పాలిటెక్నిక్ విద్యార్థినులు

జగిత్యాలఅగ్రికల్చర్: పదోతరగతి పూర్తయిన గ్రామీణ ప్రాంత విద్యార్థులకు అగ్రికల్చర్ పాలిటెక్నిక్ కోర్సులు వరంగా మారాయి. రెండేళ్ల కోర్సు చేసిన వారికి ప్రభుత్వ, ప్రైవేట్ సంస్థలో ఉపాధి, ఉద్యోగ అవకాశాలు ఉండటంతో ఇటీవల డిమాండ్ పెరిగింది. ముఖ్యంగా వ్యవసాయంపై అభిరుచి ఉన్నవారు, రైతుబిడ్డలు మరింత వ్యవసాయ పరిజ్ఞానాన్ని పొంది, సాగుచేసే పంటల్లో అధిక దిగుబడులు సాధించే అవకాశం ఉంది. ఈ కోర్సులు చేసిన అనంతరం ఉన్నత విద్యాభ్యాసం చేయాలంటే ఎంసెట్‌తో సంబంధం లేకుండా బీఎస్సీ (అగ్రికల్చర్) కోర్సులో చేరవచ్చు. డిప్లొమా చేసిన వారికి బీఎస్సీ అగ్రికల్చర్‌లో 15శాతం సీట్లు రిజర్వ్ చేస్తారు. అయితే వీరు డిప్లొమా తర్వాత అగ్రిసెట్ పరీక్ష రాయాల్సిన ఉంటుంది.

సీట్ల వివరాలు..

దరఖాస్తులను బట్టి సీట్లను కౌన్సెలింగ్ ద్వారా భర్తీచేస్తారు. రెండేళ్ల అగ్రికల్చర్ పాలిటెక్నిక్ కళాశాలలు..11 ప్రభుత్వ వ్యవసాయ పాలిటెక్నిక్ కళాశాలల్లో 240 సీట్లు, 6 ప్రైవేట్ కళాశాలల్లో 390 సీట్లు ఉన్నాయి. అలాగే మూడేళ్ల అగ్రికల్చర్ ఇంజినీరింగ్ డిప్లొమా కళాశాలల్లో ఒక ప్రభుత్వ కళాశాలలో 20 సీట్లు, మూడు ప్రైవేట్ కళాశాలల్లో 90 సీట్లు ఉన్నాయి. మూడేళ్ల క్రితం నూతనంగా ప్రవేశపెట్టిన రెండేళ్ల ఆర్గానిక్ అగ్రికల్చర్ డిప్లొమా కళాశాల ఒకటి ఉండగా, అందులో 60 సీట్లు ఉన్నాయి. ఈ కళాశాల వికారాబాద్ జిల్లా గింగుర్తిలో ఉండగా, ఏకలవ్య ప్రైవేట్ కళాశాల యాజమాన్యం నిర్వహిస్తోంది. ఈ కోర్సులన్నీ ఇంగ్లిష్ మీడియంలో చదవాల్సి ఉంటుంది. ఇదిలా ఉంటే, ఉమ్మడి కరీంనగర్ జిల్లాలో రెండు పాలిటెక్నిక్ కళాశాలలు ఉండగా, ఒక్కటి జగిత్యాల జిల్లా పొలాస, రెండోది కరీంనగర్ జిల్లా జమ్మికుంటలో ఉన్నాయి. ప్రతి అగ్రికల్చర్ పాలిటెక్నిక్ కళాశాలలో 20 సీట్లు మాత్రమే ఉన్నాయి. ప్రభుత్వ, ప్రైవేట్ కళాశాలల్లో కలిపి మొత్తం 800 సీట్లు ఉన్నాయి.

అర్హులు వీరే..

ఈ ఏడాదికి గాను అగ్రికల్చర్, ఆర్గానిక్ అగ్రికల్చర్, అగ్రికల్చర్ ఇంజినీరింగ్ డిప్లొమా కోర్సులకు సంబంధించిన నోటిఫికేషన్ బుధవారం విడుదలైంది. ఈ కోర్సుల్లో చేరేందుకు పదో తరగతి చదివి, పాలిసెట్-2024 అగ్రికల్చర్ విభాగంలో పరీక్ష రాసిన వారు అర్హులు. మున్సిపల్ ఏరియాలో కాకుండా గ్రామీణ ప్రాంతాల్లో నాలుగేళ్ల పాటు చదివిన విద్యార్థులకు 60 శాతం సీట్లు రిజర్వ్ చేస్తారు. ఈసారి పట్టణ ప్రాంతాల అభ్యర్థులు కూడా దరఖాస్తు చేసుకోవచ్చు. అభ్యర్థులు 15-22 ఏళ్ల మధ్య వయస్సువారై ఉండాలి. పాలిసెట్-2024 (అగ్రికల్చర్ విభాగం)లో వచ్చిన ర్యాంకుల ఆధారంగా సీట్లను కౌన్సెలింగ్ ద్వారా కేటాయిస్తారు.

ఈనెల 26 వరకు దరఖాస్తులు

ఆన్‌లైన్ దరఖాస్తుల స్వీకరణ బుధవారం నుంచి ప్రారంభమైంది. ఎస్సీ, ఎస్టీ పీహెచ్ అభ్యర్థులు రూ.600, ఇతర అభ్యర్థులు రూ.1200 రిజిస్ట్రేషన్ ఫీజు చెల్లించాల్సి ఉంటుంది. ఫీజు పేమెంట్ రిజిస్ట్రేషన్‌కు ఈనెల 25 వరకు కాగా, ఆన్‌లైన్‌లో దరఖాస్తులు చేసుకునేందుకు ఈనెల 26 వరకు అవకాశం ఉంది. ప్రభుత్వ కళాశాలల్లో సీట్లు వస్తే మొదటి సెమిస్టర్‌కు రూ.19,460, ప్రైవేట్ కళాశాలల్లో వస్తే రూ.22,210 ఫీజు చెల్లించాల్సి ఉంటుంది. మరిన్ని వివరాలకు ప్రొఫెసర్ జయశంకర్ తెలంగాణ వ్యవసాయ వర్సిటీ వెబ్‌సైట్ పీజేటీఎస్‌ఏయూ సంప్రదించవచ్చు.

మంచి అవకాశం



వ్యవసాయంపై ఆసక్తి, అభిరుచి ఉన్నవారికి వ్యవసాయ పాలిటెక్నిక్ మంచి అవకాశం. ఇందుకు సంబంధించి నోటిఫికేషన్‌ను ప్రొఫెసర్ జయశంకర్ తెలంగాణ వ్యవసాయ విశ్వవిద్యాలయం విడుదల చేసింది. పదో తరగతి చదివి, పాలిసెట్-2024 అగ్రికల్చర్ రాసిన వారు ఈనెల 26 వరకు దరఖాస్తు చేసుకోవచ్చు.

– డాక్టర్ శ్రీనివాస్, వ్యవసాయ పాలిటెక్నిక్ కళాశాల ప్రిన్సిపాల్, పొలాస

బడి బయట

బడీడు పిల్లలు

బడీడు పిల్లలంతా చదువుకోవాలన్న లక్ష్యంతో కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు అనేక చర్యలు తీసుకుంటున్నాయి. ఉచిత విద్య, భోజనం, పుస్తకాలు, యూనిఫాంలు అందిస్తున్నాయి. బడీడు పిల్లలందరినీ బడిలో చేర్పించేందుకు గురువారం నుంచి బడిబాట కార్యక్రమం కూడా చేపట్టారు. నిర్మల్ జిల్లాలో ఒకవైపు బడిబాట సాగుతుండగానే నిర్మల్ పట్టణంలోని ఆఫీసర్స్ క్లబ్ ఉన్న కమర్షియల్ కాంప్లెక్ వద్ద బడీడు పిల్లలు ఇలా యాచిస్తూ కనిపించారు.

- సాక్షి ఫొటోగ్రాఫర్, నిర్మల్



పొట్ట చేత పట్టుకొని సంకన చెల్లిని ఎత్తుకొని జిల్లా కేంద్రంలో యాచిస్తున్న చేస్తున్న బాలిక



నెత్తిన సంచి కట్టుకొని తమ్ముని చేత పట్టుకొని భిక్షాటన చేస్తున్న బాలిక

గిరి గ్రామాల్లో కప్పతల్లి ఆట



పొల్లుగూడలో కప్పతల్లి ఆడుతున్న చిన్నారులు

ఇంద్రవెల్లి: మండలంలోని ఆదివాసీ గిరిజన గ్రామాల్లో గురువారం కప్పతల్లి ఆట ఆడారు. చిన్నారులు, యువకులు కప్పతల్లిని రోకలిబండకు మధ్యలో కట్టి ఊరేగింపు నిర్వహించారు. మహిళలు కప్పతల్లిపై నీళ్లు పోసి వర్షాలు పుష్కలంగా కురవాలని, పంటలు బాగా పండాలని పూజలు చేశారు. అనంతరం గ్రామ పొలిమేరలో కప్పతల్లిని వదిలారు. కప్పతల్లి వెళ్లిన దిక్కు నుంచి వర్షాలు వస్తాయని నమ్మకం.



కప్పతల్లిని వదులుతున్న ఆదివాసీలు

అమ్మవారి సేవలో

ఏపీ హైకోర్టు జడ్జి



అమ్మవారి చిత్రపటం అందిస్తున్న అర్చకులు

బాసర: బాసర జ్ఞాన సరస్వతి అమ్మవారిని ఆంధ్రప్రదేశ్ హైకోర్టు న్యాయమూర్తి శ్రీనివాస్‌రెడ్డి కుటుంబ సమేతంగా గురువారం దర్శించుకున్నారు. వీరికి ఆలయ వైదిక బృందం, ఈవో విజయరామారావు పూర్ణకుంభ స్వాగతం పలికారు. అనంతరం అమ్మవారి సన్నిధిలో శ్రీనివాస్‌రెడ్డి దంపతులు ప్రత్యేక పూజలు, కుంకుమార్చనలు చేశారు. మొక్కులు చెల్లించుకున్నారు. అనంతరం ఆలయ స్థానాచార్యులు ప్రవీణ్‌పాటక్, ప్రధాన అర్చకుడు సంజీవ్ పూజారి అమ్మవారి హారతి, తీర్థ ప్రసాదాలు న్యాయమూర్తి దంపతులకు అందించి ఆశీర్వదించారు. ఈవో న్యాయమూర్తిని సన్మానించారు.

కాళికామాత ఆలయంలో పూజలు



అమావాస్య పురస్కరించుకొని గురువారం కరీంనగర్ కిసాన్‌నగర్‌లోని కాళికామాత ఆలయంలో ప్రత్యేక అభిషేక పూజలు నిర్వహించారు. అమ్మవారిని నిమ్మకాయలు, పూలతో అందంగా అలంకరించారు. అమ్మవారిని దర్శించుకునేందుకు భక్తులు పెద్ద ఎత్తున తరలివచ్చారు. కార్పొరేటర్ తిరుపతితో పాటు భక్తులు, తదితరులు పాల్గొన్నారు.

- సప్తగిరికాలనీ(కరీంనగర్)

'సమాఖ్య' చేపల అమ్మకం



సమాఖ్య సిబ్బంది పెంచిన కొరమీను చేపలు



పరిశీలిస్తున్న కలెక్టర్ ఆశీష్‌సంగ్వాన్

నిర్మల్: నిర్మల్ జిల్లా గ్రామీణాభివృద్ధి సంస్థ వినూత్న కార్యక్రమాలతో ఆకట్టుకుంటోంది. డీఆర్డీవో విజయలక్ష్మి చొరవతో జిల్లా కేంద్రం సమీపంలోని కొండాపూర్‌లో సమీకృత సాగును చేపట్టారు. అందులో భాగంగా మార్కెట్లో డిమాండ్ ఉండే కొరమీను చేపలనూ పెంచారు. అవి బాగా పెరగడంతో మృగశిరకార్తె నేపథ్యంలో గురువారం నుంచి వాటిని విక్రయించడం ప్రారంభించారు. బయట మార్కెట్లో మృగశిరకార్తె సందర్భంగా కొరమీను(మొట్ట)చేపలు కిలోకు రూ.500పైనే ధర పలుకుతున్నాయి. నిర్మల్ మహిళ సమాఖ్య ఆధ్వర్యంలో పెంచిన చేపలను మాత్రం కిలోకు రూ.350కే విక్రయించారు. చేపల పెంపకం, విక్రయాలను కలెక్టర్ ఆశిష్ సంగ్వాన్ స్వయంగా పరిశీలించారు. డీఆర్డీవో, మహిళా సమాఖ్యను అభినందించారు.

ఫ్యాషన్

అడవిని డిజైన్ చేసింది





చీరకట్టును అందమైన పదాలతో
కవితలను అల్లుతుంటారు కవులు.
కానీ, సయంతీ ఘోష్ చీరల డిజైన్స్ చూస్తే మాత్రం
పచ్చని అడవి తల్లి చెప్పే
జ్ఞాపకాల కథల గొలుసును అల్లుకోవచ్చు.
రంగు రంగుల పక్షులు, జంతువులు,
పెద్ద పెద్ద వృక్షాలు, దట్టమైన పొదలు, అందమైన లతలు...
ఇవన్నీ డిజైన్లుగా చేరి సయంతీ కలెక్షన్‌ను ఆకర్షణీయంగా మార్చేశాయి.
ఆ కథల డిజైన్ల సృజన వెనకాల కృషి మనమూ తెలుసుకుందాం.



సయంతీ ఘోష్

ఫ్యాషన్ డిజైనర్ సయంతీ ఘోష్ కలకత్తావాసి. తనపేరు మీదుగానే డిజైనర్ స్టూడియోను నడుపుతున్నారు ఆమె. అడవి, అందులోని జంతుజాలం నుంచి స్ఫూర్తి పొంది వైల్డ్ లైఫ్‌ను చీరలు, బ్లౌజుల మీదకు తీసుకువస్తున్నారు. ప్రకృతి అందాన్ని ఎంబ్రాయిడరీ ద్వారా చూపుతూ ఫారెస్ట్ డిజైన్స్‌ని ఆకట్టుకునేలా చూపుతోంది.

"సంప్రదాయ చేనేతలు, భారతీయ వస్త్రాలపైన థ్రెడ్‌వర్క్‌తో కూడిన హ్యాండ్ క్రాఫ్ట్ డిజైన్స్ రూపొందించడమే మా ప్రత్యేకత. డిజైన్ల ద్వారా కథలు చెప్పడం మా బ్రాండ్ గొప్పతనం. చిన్నతనంలో అందరం జంతువుల బొమ్మల పట్ల ఆకర్షితులం అయ్యేవాళ్లం. ఆ చిన్ని మనసు ఎప్పుడూ నాటి ఆనందాల చుట్టూ తానే ఆలోచిస్తూ ఉంటుంది. ఆ చిన్ననాటి జ్ఞాపకాలను సజీవంగా తీసుకు రావాలని చేసిన ప్రయత్నమే ఈ డిజైనర్ చీరలు, బ్లౌజులు.





సృజనకు మొదటి కిటికీ

ముడి సిల్క్, మస్లిన్, ఆర్గన్జా, టస్సర్, ముగా సిల్క్.. వంటి ఫ్యాబ్రిక్స్ వాడుతున్నాం. అడవిని భూమికి ఊపిరితిత్తులుగా పిలుస్తారు. చిన్నప్పుడు మోగ్లీ (ది జంగిల్ బుక్) జీవితం, ప్రయాణాన్ని గురించి తెలుసుకోవడానికి చాలా ఆసక్తి చూపేదానిని. ఆ యానిమేషన్ అందమైన, సృజనాత్మక ప్రపంచం నా ముందు తెరుచుకున్న మొదటి కిటికీ. జంగిల్ బుక్ మా ఇంటికి చాలా దగ్గరే అనిపించేది. అడవి, అందులోని జంతువులపై నా అభిమానాన్ని పెంచుకున్నాను. ఆ అడవి అందాన్ని చెక్కు చెదరకుండా ఉంచుతూ, చిన్ననాటి జ్ఞాపకాలు, ప్రకృతి పట్ల ప్రేమతో ప్రతిధ్వనించేలా నా కొత్త సేకరణ ఉండేలా చూసుకున్నాను. అంతేకాదు, చిన్నతనంలో మన హృదయాలలో గూడుకట్టుకున్న అడవిలోని స్నేహితులను ఇప్పటికీ ప్రేమించడం చాలా ముఖ్యం. ఆ అడవిలోని స్నేహితులు అంతరించి పోకుండా జాగ్రత్తలు తీసుకోవాలి. మనం ఆరోగ్యంగా ఉండాలంటే మన అడవులు ఇంకా పచ్చదనంతో నిండాలి. ఈ ఆలోచనే నా డిజైన్స్ సృష్టికి మూలం.



తొమ్మిదేళ్ల క్రితం ..

మొదట్లో మా హోమ్ గ్యారేజ్ స్పేస్‌లోనే బ్లౌజుల రూపకల్పనతో ఈ బ్రాండ్‌ను మొదలుపెట్టాను. అక్కణ్ణుంచి ఈ రోజు వరకు భారతదేశం అంతా ప్రత్యేక యూనిట్లను నడుపుతున్నాను. మెషిన్ ఎంబ్రాయిడరీ, హ్యాండ్ ఎంబ్రాయిడరీ, జమ్దానీ, కలంకారీ, ఎకో–ప్రింటింగ్, మధుబని, హ్యాండ్ పెయింటింగ్, బాతిక్, పిచ్వాయి.. వంటి పన్నెండు టెక్నిక్‌లతో డిజైన్ చేస్తాను. నా రోజువారి జీవితమంతా ప్రకృతి, వాస్తు శిల్పం నుంచి స్ఫూర్తి పొందుతూ ఈ డిజైన్స్ సృష్టిస్తుంటాను" అని వివరిస్తుంది సయంతీ.







మార్కులు రాలేదని తల్లి
పెద్ద ర్యాంకు రాలేదని తండ్రి
ఫలానా కోర్సు చదవాలని తల్లి
ఆ కాలేజీలోనే చేర్పిస్తానని తండ్రి
టీనేజ్ పిల్లలకు ఇది కీలక సమయం.
వారు ఇంటర్‌లో, డిగ్రీలో చేరాలి.
కాని పిల్లల మాట వింటున్నారా?
మీరే గెలవాలని పట్టుబడుతున్నారా?
అప్పుడు పిల్లలు లోలోపల
నలిగి పోవడం కన్నా ఏం చేయలేరు.
పత్రికల్లో వస్తున్న ఘటనలు హెచ్చరిస్తున్నాయి.
ఆచితూచి అడుగు వేయండి.

కాలేజీ సమయం

చదువు ఎంపికలో పిల్లల మాట కూడా వినండి

'నువ్వు ఆ కోర్సు చేయాలనేది మా కల' అనే మాట తల్లిదండ్రుల నుంచి వెలువడితే అది పిల్లల నెత్తిమీద ఎంత బరువుగా మారుతుందో పిల్లలకే తెలుసు. టీనేజ్ మొదలయ్యి టెన్త్ క్లాస్‌లో అడుగు పెట్టినప్పటి నుంచి ఈ 'కలలు వ్యక్త పరచడం' తల్లిదండ్రులు మొదలెడతారు. టెన్త్‌లో ఎన్ని మార్కులు తెచ్చుకోవాలో, ఇంటర్‌లో ఏ స్ట్రీమ్‌లోకి వెళ్లాలో, అందుకు ఏ కాలేజీలో చేరాలో, ఆ కాలేజీ ఏ ఊళ్లో ఉంటే బాగుంటుందో ఇన్ని డిసైడ్ చేసి పిల్లలకు చెబుతుంటారు. పిల్లలు వినాలి. వారికి ఏ అభిప్రాయం లేకుండా ఆ కోర్సు పట్ల ఆసక్తి ఉంటే మంచిదే. వారికి మరేదో ఇంటరెస్ట్ ఉండి, ఇంకేదో చదవాలని ఉంటే... ఆ సంగతి చెప్పలేకపోతే ఇబ్బంది. అది భవిష్యత్తును కూడా దెబ్బ కొట్టగలదు.

ఏంటి... ఆ కోర్సా?

ఆ ఇంట్లో తండ్రి అడ్వకేట్, తల్లి గవర్నమెంట్ ఉద్యోగి. కుమార్తెకు మేథ్స్‌గాని, బయాలజీగాని చదవాలని లేదు. హాయిగా టీచర్‌గా సెటిల్ అవ్వాలని ఉంది. తన స్కూల్‌లో చక్కగా తయారై వచ్చే టీచర్ పిల్లల పేపర్లు దిద్దే సన్నివేశం ఆ అమ్మాయికి ఇష్టం. తాను కూడా టీచరయ్యి పేపర్లు దిద్దాలని అనుకుంటుంది. టెన్త్ అవుతున్న సమయంలో 'టీచర్ అవుతాను' అని కూతురు అంటే తల్లిదండ్రులు ఆశ్చర్యపోయారు. 'మన హోదాకు టీచర్ కావడం ఏం బాగుంటుంది... మన ఇళ్లల్లో టీచర్లు ఎవరూ లేరే' లాంటి మాటలు చెప్పి ఎంపీసీలో చేర్పించారు. ఆ అమ్మాయి ఆ లెక్కలు చేయలేక తల్లిదండ్రులకు చెప్పలేక కుమిలిపోయింది. డిప్రెషన్ తెచ్చుకుంది. అదే 'టీచర్ కావాలనుకుంటున్నావా? వెరీగుడ్. అక్కడితో ఆగకు. నువ్వు హార్వర్డ్‌లో ప్రొఫెసర్ అవ్వాలి. అంత ఎదగాలి' అని తల్లిదండ్రులు ప్రోత్సహిస్తే హార్వర్డ్‌కు వెళ్లకపోయినా ఒక మంచి యూనివర్సిటీలో లెక్చరర్ అయినా అయ్యేది కదా.

అన్నీ మాకు తెలుసు

తల్లిదండ్రులకు అన్నీ మాకు తెలుసు అనే ధోరణి ఉంటుంది. నిజమే. కాని వాళ్ల ఇప్పుడున్న స్థితి రకరకాల ప్రయోగాలు చేసి రకరకాల దారుల్లో ప్రయత్నించి ఒక మార్గంలో సెటిల్ అయి ఉంటారు. తమ లాగే తమ పిల్లలు కూడా కొన్ని దారుల్లో నడవాలని అనుకోవచ్చు అని భావించరు. అన్నీ తమ ఇష్టప్రకారం జరగాలనుకుంటారు,



ఓవర్ కన్సర్న్ చూపించి ఉక్కిరిబిక్కిరి చేస్తారు. ఉదాహరణకు ఒకబ్బాయికి 'నీట్'లో మెడిసిన్ సీటు వచ్చే ర్యాంకు రాలేదు. కాని డెంటిస్ట్రీ సీటు వచ్చే ర్యాంకైతే వచ్చింది. అబ్బాయికి ఆ కోర్సు ఇష్టమే. కాని తల్లిదండ్రులకు తమ కొడుకు ఎలాగైనా ఎంబిబిఎస్ మాత్రమే చదవాలనేది 'కల'. 'లాంగ్ టర్మ్ తీసుకో' అని సూచించారు. లాంగ్ టర్మ్ అంటే ఒక సంవత్సరం వృథా అవుతుంది... పైగా ఈసారి ఎంట్రన్స్‌లో కూడా మంచి ర్యాంక్ వస్తుందో రాదో అనే భయం ఆ అబ్బాయికి ఉన్నా బలవంతం చేస్తే ఎంత చెప్పినా వినకపోతే ఆ అబ్బాయి ఉక్కిరిబిక్కిరి అవ్వడా?

ప్రతిదీ నిర్ణయించడమే

తల్లిదండ్రుల స్తోమత పిల్లలకు తెలుసు. వారు చదివించ దగ్గ చదువులోనే తమకు ఇష్టం, ఆసక్తి, ప్రవేశం ఉన్న సబ్జెక్టును చదవాలని కోరుకుంటారు. పైగా తమ స్నేహితుల ద్వారా వారూ కొంత సమాచారం సేకరించి ఫలానా కాలేజీలో ఫలానా కోర్సు చదవాలని నిశ్చయించుకోవచ్చు. అయితే తల్లిదండ్రులు పిల్లల ఆసక్తికి ఏ మాత్రం విలువ లేకుండా ఎలాగైనా చేసి రికమండేషన్లు పట్టి తాము ఎంపిక చేసిన కాలేజీలోనే చదవాలని శాసిస్తారు. ఇది అన్నివేళలా సమంజసం కాదు.

ఒత్తిడి వద్దు

టీనేజ్ సమయంలో పిల్లల భావోద్వేగాలు పరిపక్వంగా ఉండవు. కొంత తెలిసీ కొంత తెలియనితనం ఉంటుంది. ఆసక్తులు కూడా పూర్తిగా షేప్ కావు. ఇంటర్, గ్రాడ్యుయేషన్ కోర్సులకు సంబంధించి, కాలేజీలకు సంబంధించి వారికి ఎన్నో సందేహాలుంటాయి. ఎంపికలు ఉంటాయి. ఇవాళ రేపు తల్లిదండ్రులు 'తాము చదివించాలనుకున్న కోర్సు' కోసం ఏకంగా పంజాబ్, హర్యాణ, మధ్యప్రదేశ్ వంటి రాష్ట్రాలకు పంపుతున్నారు. ఇంట్లో ఉండి చదివే వీలున్నా రెసిడెన్షియల్ కాలేజీల్లో పడేస్తున్నారు. అంతంత మాత్రం చదువు చెప్పినా పర్లేదని మెడిసన్ పట్టా ఉంటే చాలని ఆసియా దేశాలకు సాగనంపుతున్నారు. పిల్లలతో ఎంతో మాట్లాడి, కౌన్సెలింగ్ చేసి, మంచి చెడ్డలన్నీ చర్చించి, వారికి సంపూర్ణ అవగాహన కలిగించి రెండు ఆప్షన్లు ఇచ్చి వారి ఆప్షన్లు కూడా పరిగణించి సానుకూలంగా ఒక ఎంపిక చేయడం ఎప్పుడూ మంచిది. లేదంటే 'కోటా' లాంటి కోచింగ్ ఊర్లలో జరుగుతున్న విషాదాలు, హైదరాబాద్‌లాంటి చోట్ల ఇల్లు విడిచి పోతున్న సంఘటనలు ఎదుర్కోనాల్సి వస్తుంది.

వంటిల్లు

సీజనల్ ఫ్రూట్స్ ఉంటాయి... సీజనల్ వెజిటబుల్స్ ఉంటాయి.
అలాగే సీజనల్ ఆకులూ ఉంటాయి...చింతచిగురు నోరూరిస్తోంది.
ఎప్పుడూ చింతచిగురు పప్పేనా! ఈ సారి ఇలా ట్రై చేద్దాం.
ఓ పచ్చడి... ఓ పొడి... ఓ అన్నం... ఓ కూర.
వెరైటీగా ఏం వండాలా అనే చింత వద్దు. చింత ఉంది చిరుపుల్లగా...
జిహ్వకు హితవుగా.



చింత లేని వంట

చింత చిగురు పొడి



కావలసినవి: చింత చిగురు – కప్పు; ఎండుమిర్చి – 7 లేదా 8; ఎండు కొబ్బరి – అర చిప్ప; వెల్లుల్లి రేకలు – 4; ఉప్పు – అర టీ స్పూన్ లేదా రుచికి తగినంత;

తయారీ: ● చింత చిగురును మంచినీటితో శుభ్రం చేసి నీడలో ఆరబెట్టాలి. ● స్టవ్ మీద మందపాటి బాణలి వేడి చేసి సన్నమంట మీద చింత చిగురులో తేమ పోయే వరకు వేయించాలి. వేగిన ఆకును ఒక ప్లేట్‌లోకి తీసుకుని అదే బాణలిలో ఎండుమిర్చి, కొబ్బరి వేసి వేయించాలి. ● అన్నీ చల్లారిన తర్వాత మిక్సీలో వేసి కొంచెం పలుకుగా గ్రైండ్ చేయాలి. ఉప్పు, వెల్లుల్లి వేసి మరో రౌండ్ గ్రైండ్ చేస్తే చింత చిగురు పొడి రెడీ. వేడి అన్నంలో చింతచిగురు పొడి, నెయ్యి కలుపుకుంటే రుచి అమోఘం. ఇడ్లీ, దోశెల్లోకి కూడా బాగుంటుంది. ● ఈ పొడిని గాలి దూరని డబ్బాలో నిల్వ చేస్తే పది రోజుల వరకు తాజాగా ఉంటుంది. ఇంకా ఎక్కువ కాలం నిల్వ ఉండాలంటే ఫ్రిజ్‌లో పెట్టుకోవచ్చు.

చింత చిగురు పులిహోర



కావలసినవి: చింతచిగురు – 2 కప్పులు; బియ్యం – 2 కప్పులు; పచ్చిమిర్చి – 3 (నిలువుగా చీరాలి); నూనె – టీ స్పూన్; పచ్చి కొబ్బరి తురుము – 2 టేబుల్ స్పూన్‌లు; ఉప్పు – టీ స్పూన్ లేదా రుచిని బట్టి; పోపు కోసం... నూనె – 2 టీ స్పూన్‌లు; ఆవాలు – అర టీ స్పూన్; మినప్పప్పు – టీ స్పూన్; పచ్చి శనగపప్పు – టీ స్పూన్; వేరు శనగపప్పు – టేబుల్ స్పూన్; జీడిపప్పు – పది; ఎండుమిర్చి – 4; ఇంగువ – చిటికెడు; పసుపు – పావు టీ స్పూన్; కరివేపాకు – 2 రెమ్మలు.

తయారీ: ● బియ్యం కడిగి అన్నం పలుకుగా వండుకోవాలి. వండిన తర్వాత వెడల్పుగా ఉన్న పళ్లెంలో వేసి చల్లారనివ్వాలి. ● చింతచిగురును శుభ్రంగా కడిగి చిల్లుల పాత్రలో వేసి నీరు పూర్తిగా కారిపోయే వరకు ఉంచాలి. ● బాణలిలో నూనె వేడిచేసి పచ్చిమిర్చి, చింత చిగురు వేసి సన్నమంట మీద దాదాపు ఐదు నిమిషాల సేపు వేయిస్తూ ఆకు మెత్తగా మగ్గిన తరవాత ఉప్పు కలిపి దించేసి చల్లారనివ్వాలి. ● కొబ్బరిని మిక్సీలో వేసి మెత్తగా గ్రైండ్ చేయాలి. ● పోపు కోసం మరొక బాణలిలో నూనె వేడి చేసి ఆవాలు, ఎండుమిర్చి వేసి అవి వేగిన తర్వాత జీడిపప్పు, వేరుశనగపప్పు, పచ్చి శనగపప్పు, మినప్పప్పు వేసి దోరగా వేయించాలి. అవి వేగిన తర్వాత కరివేపాకు, ఇంగువ, పసుపు వేసి కలపాలి. ఇప్పుడు ముందుగా మరొక బాణలిలో మగ్గించి పెట్టుకున్న పచ్చిమిర్చి, చింతచిగురు మిశ్రమాన్ని వేసి కలపాలి. ఈ మొత్తం మిశ్రమాన్ని చల్లారిన అన్నంలో వేసి కలిపితే చింతచిగురు పులిహోర రెడీ. చివరగా రుచి చూసి అవసరమైతే ఉప్పు కలుపుకోవాలి.

చింతచిగురు కొబ్బరి పచ్చడి



కావలసినవి: చింత చిగురు – 2 కప్పులు (శుభ్రంగా కడగాలి); పచ్చి కొబ్బరి ముక్కలు – కప్పు; పచ్చిమిర్చి – 2; ఉప్పు – అర టీ స్పూన్ లేదా రుచిని బట్టి; పోపు కోసం... ఆవాలు – అర టీ స్పూన్; ఇంగువ – చిటికెడు; కరివేపాకు – 2 రెమ్మలు; మినప్పప్పు – అర టీ స్పూన్; ఎండుమిర్చి – 2; నూనె – అర టీ స్పూన్;

తయారీ: ● కొబ్బరిముక్కలు, చింతచిగురు, పచ్చిమిర్చి, ఉప్పు వేసి మిక్సీలో మెత్తగా గ్రైండ్ చేయాలి. ●చిన్న పాత్రలో నూనె వేసి చిన్న మంట మీద వేడి చేసి అందులో ఆవాలు వేసి అవి వేగిన వెంటనే ఎండుమిర్చి (విరిచి ముక్కలు చేసి వేయాలి), మినప్పప్పు వేసి ఎర్రగా వేగిన తర్వాత ఇంగువ వేసి స్టవ్ ఆపేయాలి. పోపును స్పూన్‌తో కలిపి అందులో మిక్సీలో గ్రైండ్ చేసిన కొబ్బరి పచ్చడి వేసి కలపాలి. ఘుమఘుమలాడే కొబ్బరి పచ్చడి రెడీ. ఇది ఇడ్లీ, దోశెలతోపాటు అన్నంలోకి కూడా రుచిగా ఉంటుంది.

చింతచిగురు మటన్



కావలసినవి: మటన్ – అర కేజీ; చింతచిగురు – పావు కేజీ; ధనియాల పొడి – టీ స్పూన్; పుదీన ఆకులు – కప్పు; కొత్తిమీర తరుగు – కప్పు; కొబ్బరి పొడి – టేబుల్ స్పూన్; అల్లం వెల్లుల్లి పేస్ట్– టేబుల్ స్పూన్; పసుపు– టీ స్పూన్; మిరప్పొడి – టేబుల్ స్పూన్; ఉల్లిపాయ ముక్కలు – కప్పు; ఆవాలు – టీ స్పూన్; జీలకర్ర – టీ స్పూన్; ఉప్పు – అర టేబుల్ స్పూన్ లేదా రుచిని బట్టి; గరం మసాలా పొడి – అర టేబుల్ స్పూన్; నూనె – 3 టేబుల్ స్పూన్‌లు;

తయారీ: ● మాంసాన్ని శుభ్రం చేసి పక్కన పెట్టాలి. ● ప్రెషర్ పాన్‌లో నూనె వేడి చేసి ఆవాలు, జీలకర్ర, గరం మసాలా పొడి, ఉల్లిపాయ ముక్కలు, పసుపు, అల్లంవెల్లుల్లి పేస్ట్ కలిపి రెండు నిమిషాల సేపు మీడియం మంట మీద మగ్గనివ్వాలి. ఇప్పుడు కొబ్బరి పొడి వేసి మరో నిమిషం పాటు కలుపుతూ దోరగా వేగనివ్వాలి. ఇందులో మాంసం ముక్కలు, రెండు కప్పుల నీరు, ఉప్పు, ధనియాల పొడి, మిరప్పొడి వేసి బాగా కలిపి ప్రెషర్ పాన్ మూత పెట్టి మంట పెంచాలి. రెండు విజిల్స్ వచ్చిన తర్వాత మంట మీడియంలో పెట్టి మరో రెండు విజిల్స్ వచ్చిన తర్వాత ఆపేయాలి. ● ప్రెషర్ తగ్గిన తర్వాత మూత తీసి కొత్తిమీర, పుదీన, చింతచిగురు వేసి కలిపి ఐదు నిమిషాల సేపు (ఆకులు మగ్గి కూరలో నీరు తగ్గి ఇగురుగా వచ్చే వరకు) వేయించి స్టవ్ ఆపేయాలి. చింతచిగురు మాంసం వేడి అన్నం, చపాతీల్లోకి బాగుంటుంది.

యువర్స్

● టెక్.. టాక్

హువావే వాచ్ ఫిట్ 3



డిస్‌ప్లే: 1.82 అంగుళాలు
రిజల్యూషన్: 480×408 పిక్సెల్స్
బరువు: 26 గ్రా.
బ్యాటరీ: 400 ఎంఏహెచ్
■ ఆటోమెటిక్ ప్రాంప్ట్స్- ట్రాక్ స్పోర్ట్స్ అండ్ యాక్టివిటీస్, వెదర్ వార్నింగ్స్ డిస్‌ప్లే

ఇన్‌స్టాగ్రామ్ ప్రొఫైల్‌కు సంగీతం



ఇన్‌స్టాగ్రామ్ ప్రొఫైల్‌కు పర్సనలైజ్‌డ్ టచ్ ఇవ్వడానికి, మ్యూజిక్ ద్వారా మన మూడ్‌ను రెఫ్లెక్ట్ చేయడానికి ఉపకరించే లేటెస్ట్ ఫీచర్ ఇది. దీని కోసం...

■ ఇన్‌స్టాగ్రామ్ యాప్‌ను అప్‌డేట్ చేయాలి ■ ప్రొఫైల్ స్క్రీన్‌తో యాక్సెస్ కావడానికి బాటమ్ రైట్ కార్నర్‌లోని ప్రొఫైల్ పిక్చర్ ట్యాప్ చేయాలి ■ ఎడిట్ ప్రొఫైల్-ట్యాప్ ■ మ్యూజిక్-ట్యాప్ ■ పాటను ఎంపిక చేసుకోవడానికి ప్రొఫైల్ సాంగ్ సెక్షన్‌లో ప్లస్ ఐకాన్ సెలెక్ట్ చేయాలి.

ఆస్క్ ఫొటోస్



టెక్ దిగ్గజం గూగుల్ రకరకాల కొత్త ఫీచర్‌ల గురించి ప్రకటించింది. అందులో 'ఆస్క్ ఫొటోస్' ఒకటి. అడ్వాన్స్‌డ్ జెమిని ఏఐ మోడల్‌తో వస్తున్న ఈ ఫీచర్‌ను యూజర్‌లు తమ ఫొటో కలెక్షన్స్‌తో ఇంటరాక్ట్ అయ్యేలా డిజైన్ చేశారు. యూజర్‌లు తమ గ్యాలరీని విస్తరించినప్పుడు వారికి అవసరమైన ఫొటోను కనుక్కోవడం కష్టంగా ఉండవచ్చు. దీన్ని దృష్టిలో పెట్టుకొని స్పెసిఫిక్ ఫొటోను త్వరగా కనిపెట్టడానికి 'ఆస్క్ ఫొటోస్' ఫీచర్ ఉపయోగపడుతుంది. కీవర్డ్ కాంబినేషన్స్‌తో పనిలేదు. ప్రాంప్ట్ చాలు. ఉదాహరణకు... 'షో మీ ది బెస్ట్ ఫొటో ఫ్రమ్ ఈచ్ నేషనల్ పార్క్ ఐ హ్యావ్ విజిటెడ్' అని ప్రాంప్ట్ ఇస్తే సంబంధిత ఇమేజ్‌లను చూపిస్తుంది. ఈ ఏఐ ఫీచర్ ప్రత్యేకత ఏమిటంటే.... యూజర్‌లు తమ ఫొటోల గురించి వివరంగా అడగవచ్చు.

షావోమీ ప్యాడ్ 6ఎస్ ప్రో 12.4



డిస్‌ప్లే: 12.40 అంగుళాలు
ఫ్రంట్ కెమెరా: 32 ఎంపీ
బ్యాటరీ: 10000 ఎంఏహెచ్
రిఫ్రెష్ రేట్: 144 హెచ్‌జడ్

మెమొరీ:
256జీబి 8జీబి ర్యామ్/
256జీబి 12జీబి ర్యామ్/
512జీబి 12జీబి ర్యామ్

డ్రీమ్ స్క్రీన్

'డ్రీమ్ స్క్రీన్' అనే కొత్తఫీచర్‌ని పరీక్షిస్తోంది యూట్యూబ్. ఏఐ ద్వారా 'షార్ట్స్'కు బ్యాక్‌డ్రాప్‌ను జెనరేట్ చేసే ఫీచర్ ఇది. యూజర్‌లు డ్రీమ్ స్క్రీన్‌కు యాక్సెస్ పొందిన తరువాత బ్యాక్‌గ్రౌండ్‌లో తమకు ఏమి కావాలో వివరిస్తూ ప్రాంప్ట్ ఇవ్వవచ్చు.



ఉదా: ఒక ద్వీపంలో ఫ్యాన్సీ హోటల్. ఇమేజ్ జనరేట్ అయిన తరువాత వెంటనే బ్యాక్‌గ్రౌండ్‌కు జత చేయవచ్చు. ఈ ప్రయోగాత్మక ఫీచర్ ప్రస్తుతం ఎంపిక చేసిన 'షార్ట్స్' క్రియేటర్స్ మాత్రమే అందుబాటులో ఉంది.

● ఇన్నోవేషన్



● ఆదిత్య దాదియ

అక్షరాలా ఆల్‌రైట్

బీమా రంగాన్ని దృష్టిలో పెట్టుకొని కొత్త డిజిటల్ సాఫ్ట్‌వేర్‌ను రూపొందించాడు ఆదిత్య దాదియ.
ముంబైకి చెందిన ఆదిత్య స్టార్టప్ 'ఆల్ రైట్' సూపర్ సక్సెస్ అయింది.
ఎన్నో చిక్కుముడులకు పరిష్కార మార్గం చూపించింది.
'ఆల్‌రైట్' సృష్టించిన సాఫ్ట్‌వేర్, ఇన్సూరెన్స్ కంపెనీల పనితీరును సులభతరం చేస్తుంది. సమయాన్ని ఆదా చేస్తుంది.

వాణిజ్య బీమా విభాగం పాత దారిలోనే నడుస్తోంది. ఇంటర్నల్ ఇన్సూరెన్స్ ప్రాసెస్ ఇప్పటికీ మాన్యువల్‌గానే ఉంది. ఈ నేపథ్యంలో బీమా కంపెనీలను కొత్త దారిలో నడిపించడానికి ముందుకు వచ్చింది నెక్స్ట్-జెనరేషన్ టెక్ ప్లాట్‌ఫామ్ ఆల్‌రైట్.

కోవిడ్ మహమ్మారి కాలంలో 'ఆల్‌రైట్'పై దృష్టి పెట్టాడు కార్పొరేట్ లాయర్ అయిన ఆదిత్య దాదియ.

ప్రపంచ వ్యాప్తంగా గుర్తింపు ఉన్న ఫిన్‌టెక్ స్టార్టప్‌లతో కలిసి పనిచేసిన ఆదిత్య ఆ టైమ్‌లో గమనించిన విషయం ఏమిటంటే.... కమర్షియల్ ఇన్సూరెన్స్ స్పేస్‌లో పని పూర్తిగా మాన్యువల్‌గానే జరుగుతుందని. ఈ నేపథ్యంలోనే 'ఆల్‌రైట్'పై దృష్టి పెట్టాడు.

అయితే ఇది అంత తేలికైన విషయం కాదనేది ఆదిత్యకు తెలుసు.

రకరకాల ప్రయత్నాల తరువాత విజయం సాధించాడు.

బీమా కంపెనీల పనిని సులభతరం చేసే సాఫ్ట్‌వేర్‌ను సక్సెస్‌ఫుల్‌గా రూపొందించాడు.

సమయాన్ని ఆదా చేయగలిగే సాఫ్ట్‌వేర్ ఇది. ఉదాహరణకు..రెండు వారాలు పట్టే పనిని నిమిషాల్లో చేయవచ్చు.

ఈ సాఫ్ట్‌వేర్‌కు తక్కువ కాలంలోనే మార్కెట్ నుంచి పాజిటివ్ ఫీడ్‌బ్యాక్ వచ్చింది.

ఇన్నోవేటివ్ స్టార్టప్‌గా గుర్తింపు పొందిన 'ఆల్‌రైట్' గత సంవత్సరం సీడ్ ఫండింగ్ రౌండ్‌లో విజయవంతంగా పది కోట్లు సమీకరించింది.

జనరల్ ఇన్సూరెన్స్ కంపెనీలతో పాటు ఏజెంట్లు, ఇన్సూరెన్స్ బ్రోకర్స్, కార్పొరేట్ ఏజెంట్స్ తమ 'టార్గెట్ కస్టమర్స్' అంటున్నాడు ఆదిత్య.

బీమా కంపెనీలు, బ్రోకర్లు, ఏజెంట్లు, కార్పొరేట్ ఇంటర్‌మీడియరీస్, బ్యాంకుల మధ్య అంతరాన్ని తగ్గించే సొల్యూషన్స్ అందించాలని 'ఆల్‌రైట్' లక్ష్యంగా పెట్టుకుంది.

కోట్ ప్రొక్యూర్‌మెంట్, ప్లేస్‌మెంట్, అండర్ రైటింగ్, యూజర్ మేనేజ్‌మెంట్, నాలెడ్జ్ అండ్ రిస్క్ మేనేజ్‌మెంట్ టూల్....స్థూలంగా చెప్పాలంటే బీమా ప్రక్రియను సులభతరం చేయడాన్ని లక్ష్యంగా నిర్ణయించుకుంది ఆల్‌రైట్.

'ఫోర్బ్స్ 30 అండర్ 30-ఆసియా' జాబితాలో చోటు సంపాదించిన ఆదిత్య తన కంపెనీ మరింత విస్తరించే ప్రణాళికలతో బిజీగా ఉన్నాడు.

'ఇది ఇలాగే ఉంటుంది. అంతే' అనుకునేవారు కొందరు.

'అలాగే ఎందుకు ఉండాలి? మరోలా కూడా ఉండవచ్చు కదా' అని అడిగే వాళ్లు కొందరు.

ఆదిత్య రెండో కోవకు చెందిన యువకుడు. కొత్తగా ఆలోచిస్తే విజయం ఖాయం అని అక్షరాలా 'ఆల్‌రైట్'తో నిరూపించిన యువకుడు.

● గేమింగ్



గురి తప్పకుండా....

యాక్షన్ రోల్-ప్లేయింగ్ సర్వైవల్ గేమ్ వి రైజింగ్. ఒపెన్ వరల్డ్‌లో సెట్ చేసిన ఈ గేమ్‌ను అయిదు బయోమ్‌లుగా విభజించారు. కొత్తగా ఉనికిలోకి వచ్చిన రక్తపిశాచిని కంట్రోల్ చేయడం ప్లేయర్ పని. దీని కోసం రకరకాల సాధనాలను, ఆయుధాలను సమకూర్చుకోవాల్సి ఉంటుంది. అంతేకాదు శత్రువుకు చిక్కని దుర్భేద్యమైన కోటను కూడా నిర్మించుకోవాల్సి ఉంటుంది. సూర్యకాంతి, నీడ, రక్తనమూన... ఇలా ఎన్నో అంశాలు ఈ ఆటలో ప్రధాన పాత్ర పోషిస్తాయి. ఏ అడుగులో ప్రమాదం, నష్టం పొంచి ఉందో కనిపెట్టే స్పృహ ఆటగాడిలో ఉండాలి. ఆటలో నాన్-ప్లేబుల్ క్యారెక్టర్లు(ఎన్‌పీసీ) కీలకం.

ప్లాట్‌ఫామ్స్: విండోస్, ప్లేస్టేషన్: 5 జానర్స్: సర్వైవల్
మోడ్స్: సింగిల్-ప్లేయర్, మల్టీప్లేయర్



ఆన్ ది హరైజన్

త్వరలో జరగబోతుంది, త్వరలో రాబోతుంది....ఇలాంటి సందర్భాల్లో వాడే మాట...ఆన్ ది హరైజన్

ఉదా: వి హ్యావ్ సమ్ ఎగ్జాయిటింగ్ న్యూ ప్రొడక్ట్స్ ఆన్ ది హరైజన్

గో డచ్

మూవీకి లేదా రెస్టారెంట్... మొదలైన వాటికి గ్రూప్‌గా వెళ్లినప్పుడు టికెట్ డబ్బులు, బిల్ ఒక్కరే చెల్లించకుండా ఎవరి డబ్బులు వారే చెల్లించడాన్ని గో డచ్ అంటారు. ఆర్థిక భారం ఒక్కరి మీదే పడకుండా చూసుకునే పద్ధతి ఇది.

ఉదా: వి డిసైడెడ్ టు గో డచ్ ఎట్ ది రెస్టారెంట్ లాస్ట్ నైట్. సో ఎవ్రీవన్ పెయిడ్ ఫర్ దెయిర్ వోన్ మీల్.

● మ్యూజిక్ వరల్డ్

స్వగత సంగీతం

డిజిటల్ సింగిల్ 'కీపింగ్ ది ఫైర్'తో ఆరంగేట్రం చేసింది 'ఎక్స్:ఇన్' అనే అయిదుగురు సభ్యుల మల్టీనేషనల్ గర్ల్ గ్రూప్. ఈ గ్రూప్‌లోని సభ్యుల పేర్లు.... ఇషా, నిజ్, హన్నా, నోవ, ఆరియా (ఇండియా)

సెకండ్ మినీ ఆల్బమ్ 'ది రియల్'తో మరోసారి సంగీత ప్రియులను ఆకట్టుకుంటోంది 'ఎక్స్:ఇన్' బృందం.

'మా కలలు, కన్నీళ్లు, కష్టాలు ఈ ఆల్బమ్‌లో ఉంటాయి' అంటుంది మెయిన్ ర్యాపర్, లీడ్ డ్యాన్సర్ నోవ.

ఈ ఆల్బమ్ తమ పర్సనల్ స్టోరీలకు సంబంధించిన 'మ్యూజికల్ ఎక్స్‌ప్రెషన్' అని కూడా అంటుంది నోవ. 'ది రియల్'లో నో డౌట్, మై ఐడల్, విత్‌డ్రా, నెవర్ సారీ అనే పాటలు ఉన్నాయి. సవాళ్లు, ఆటుపోట్లను అధిగమించి ఉన్నతస్థానానికి చేరడమే ఆల్బమ్‌లోని పాటల సారాంశం.

'కష్టాలు ఉన్నట్లే వాటిని అధిగమించే దారులు ఉన్నాయి. అయితే ఆ దారి గురించి ఎంత త్వరగా తెలుసుకుంటామనేది మన వివేకం మీద ఆధారపడి ఉంటుంది' అంటుంది ఆరియా.



● ఆరియా

సినిమా



● మహేశ్‌బాబు

సెప్టెంబరులో స్టార్ట్

మహేశ్‌బాబు హీరోగా రాజమౌళి దర్శకత్వంలో ఓ సినిమా తెరకెక్కనున్న సంగతి తెలిసిందే. కేఎల్ నారాయణ ఈ సినిమాను నిర్మించనున్నారు. ఈ సినిమా స్క్రిప్ట్ వర్క్ పూర్తయిందని ఇటీవల ఓ సందర్భంలో ఈ చిత్ర కథా రచయిత విజయేంద్ర ప్రసాద్ పేర్కొన్నారు. ఫారెస్ట్ అడ్వెంచరస్ బ్యాక్‌డ్రాప్‌లో సాగే ఈ సినిమా కోసం మహేశ్‌బాబు సరికొత్తగా మేకోవర్ అవుతున్నారు. మహేశ్ జుట్టు పెంచుతున్నారు. అలాగే బరువు కూడా పెరుగుతున్నారట. కాగా ఈ సినిమాకు సంబంధించిన ప్రీ ప్రొడక్షన్ వర్క్స్‌ను పూర్తి చేసి, సెప్టెంబరులో చిత్రీకరణను మొదలుపెట్టేలా ప్లాన్ చేస్తున్నారట రాజమౌళి. అలాగే ఈ సినిమా రెండు భాగాలుగా విడుదల కానుందని, ఈ రెండు భాగాలను ఒకేసారి చిత్రీకరించేలా రాజమౌళి ప్లాన్ చేస్తున్నారని భోగట్టా.

అందుకే 'సత్యభామ'ని నేను డైరెక్ట్ చేయలేదు

- శశికిరణ్ తిక్క



''ఇప్పటివరకూ ఎన్నో పోలీస్ స్టోరీస్ వచ్చినా భావోద్వేగాలతో రూపొందిన 'సత్యభామ' ప్రత్యేకంగా ఉంటుంది. షూటింగ్ టైమ్‌లో కాజల్ అగర్వాల్‌గారి ఎనర్జీ మా యూనిట్‌కి ఉత్సాహాన్నిచ్చేది. ఈ సినిమాలో ఆమె చేసిన యాక్షన్ సీక్వెన్సులు చాలా స్పెషల్. 'సత్యభామ'లో ప్రేక్షకులు కొత్త కాజల్‌ను చూస్తారు'' అన్నారు శశికిరణ్ తిక్క. కాజల్ అగర్వాల్ లీడ్ రోల్‌లో నటించిన చిత్రం 'సత్యభామ'. సుమన్ చిక్కాల దర్శకత్వంలో బాబీ తిక్క, శ్రీనివాసరావు తక్కలపల్లి నిర్మించిన ఈ సినిమా నేడు రిలీజవుతోంది. ఈ చిత్రానికి సమర్పకులుగా వ్యవహరించి, స్క్రీన్ ప్లే అందించిన శశికిరణ్ తిక్క మాట్లాడుతూ- ''యూకేలో ఉండే మా మిత్రులు రమేష్, ప్రశాంత్ చెప్పిన పాయింట్ నచ్చడంతో నేను, దర్శకుడు సుమన్ 'సత్యభామ' కథ సిద్ధం చేశాం. దర్శకుడిగా నేను బిజీగా ఉండటంతో ఈ మూవీకి దర్శకత్వం వహించలేదు. పైగా మా అవురమ్ ఆర్ట్స్‌పై మరిన్ని సినిమాలు నిర్మించాలనుకుంటున్నాం. నిర్మాత అనుభవాలు ఎలా ఉంటాయో 'సత్యభామ'తో తెలిశాయి. ఇన్వెస్టిగేటివ్ థ్రిల్లర్‌గా ఈ మూవీ ఉంటుంది. 'సత్యభామ' సినిమా ప్రీమియర్స్ వేశాం... చూసిన వాళ్ల నుంచి మంచి స్పందన వచ్చింది. 'గూఢచారి' సినిమాకి నేను దర్శకత్వం వహించాను. 'గూఢచారి 2'కి వేరేవాళ్లు దర్శకత్వం చేయాలని నేను, అడివి శేష్ ముందే అనుకున్నాం. మహేశ్‌బాబుగారు 'మేజర్' సినిమాలో భాగస్వామ్యం అయ్యారు. ఆయనకు 'సత్యభామ' చూపించాలనుకుంటున్నాను'' అన్నారు.

రెండున్నరేళ్లు ఒకే గెటప్‌లో ఉన్నాను - నవదీప్



''లవ్ మౌళి' సినిమా షూటింగ్ మొత్తం మేఘాలయాలోని చిరపుంజీలో చేశాం. ఎన్నో వ్యయ ప్రయాసలతో అక్కడ షూట్ చేయడం పెద్ద సాహసమే అని చెప్పాలి. ఎప్పుడూ వర్షం పడే ఆ ప్రదేశంలో సినిమా మీద ప్యాషన్‌తో షూటింగ్ చేశాం. ఈ సినిమాలోని నా పాత్ర కోసం రెండున్నరేళ్లు ఒకే గెటప్‌లో ఉన్నాను. 'లవ్ మౌళి' ప్రేక్షకులకు సరికొత్త అనుభూతినిస్తుంది'' అని హీరో నవదీప్ అన్నారు. ప్రముఖ దర్శకుడు రాజమౌళి శిష్యుడు అవనీంద్ర దర్శకత్వంలో నవదీప్ హీరోగా నటించిన చిత్రం 'లవ్ మౌళి'. నైరా క్రియేషన్స్, శ్రీకర స్టూడియోస్ బ్యానర్స్‌తో కలిసి సి స్పేస్ సంస్థ నిర్మించిన ఈ సినిమా నేడు విడుదలవుతోంది. ఈ సందర్భంగా నవదీప్ మాట్లాడుతూ- ''నా కెరీర్ ప్రారంభంలో జెట్ స్పీడులో వెళ్లింది. ఇప్పుడు ప్రేక్షకుల ఆలోచనకు తగ్గట్లుగా కెరీర్ మార్చుకోవాలనిపించింది. ఆ సమయంలో విన్న కథే 'లవ్ మౌళి'. ఇది రెగ్యులర్ ప్రేమకథ కాదు. అందరికీ కనెక్ట్ అవుతుంది. ముఖ్యంగా యువతకు కచ్చితంగా కనెక్ట్ అవుతుంది. 'లవ్ మౌళి' విజయంతో నా సెకండ్ ఇన్నింగ్స్ స్టార్ట్ అవుతుందనుకుంటున్నాను. సరదాగా హీరో రానాకు ఈ చిత్రకథ చెప్పాను. కథ బాగుండటంతో అఘోరా పాత్ర చేశాడు. ప్రస్తుతం తమిళంలో నిత్యా మీనన్‌తో ఓ సినిమా, అలాగే 'న్యూసెన్స్ 2' వెబ్ సిరీస్ చేస్తున్నాను. నేను నటించిన మరికొన్ని వెబ్ సిరీస్‌లు విడుదలకు సిద్ధంగా ఉన్నాయి. ఇక నుంచి సోలో హీరోగా మంచి కథలతో సినిమాలు చేయాలనుకుంటున్నాను'' అన్నారు.

అతిగా తినను... ఉపవాసం ఉండను

సిల్వర్ స్క్రీన్‌పై మెరుపు తీగలా కనిపించడానికి కథానాయికలు కఠినమైన కసరత్తులు చేస్తారు... డైట్ ఫాలో అవుతారు. అయితే ఒక్కొక్కరిది ఒక్కో డైట్... చేసే వ్యాయామాలు కూడా వేరుగా ఉంటాయి. హీరోయిన్ కియారా అద్వానీ తానేం చేస్తారో ఇటీవల ఓ సందర్భంలో పేర్కొన్నారు. ''నేను ఎంత త్వరగా బరువు పెరగగలనో అంతే త్వరగా తగ్గగలను. బరువు పెరగడం, తగ్గడం రెండూ నాకు సులభమే. డ్యాన్స్, స్విమ్ చేయడం చాలా ఇష్టం. స్కూల్ డేస్‌లో అప్పుడప్పుడూ ఈ రెండూ చేసేదాన్ని. కానీ ఎప్పుడైతే సినిమా రంగంలోకి వచ్చానో అప్పట్నుంచి వీటిని నేను నా దినచర్యలో భాగంగా ప్లాన్ చేసుకుని చేస్తున్నాను. జిమ్, డ్యాన్స్, స్విమ్మింగ్.. ఇవన్నీ ఫిట్‌నెస్‌లో భాగమే. వీటిని మనం ఇష్టంగా చేస్తే సరదాగా ఉంటుంది'' అని చెప్పుకొచ్చారు కియారా. ఇంకా తన ఆహారపు అలవాట్ల గురించి మాట్లాడుతూ- ''నచ్చిన ఆహారాన్ని అతిగా తినడం, ఉపవాసాలు చేయడం వంటివి పాటించను. మసాలా ఎక్కువగా ఉండని ఇంటి భోజనం తినడానికే ఇష్టపడతాను'' అన్నారు.



● కియారా అద్వానీ

అందుకే రక్షణ టైటిల్ పెట్టాం

- ప్రణదీప్ ఠాకోర్



''ఓ పోలీసాఫీసర్ జీవితంలో జరిగిన ఘటనను స్ఫూర్తిగా తీసుకుని కల్పిత కథతో 'రక్షణ' తీశాను. ఈ సినిమాలో చిన్న సందేశం కూడా ఉంది. సినిమా మొత్తం ఇన్వెస్టిగేటివ్ థ్రిల్లర్‌లా ఉంటుంది. బాధితుల కోసం పోరాడటంతో పాటు వారిని రక్షించేలా ఉంటుంది కాబట్టి 'రక్షణ' అని టైటిల్ పెట్టాం'' అన్నారు దర్శక-నిర్మాత ప్రణదీప్ ఠాకోర్. పాయల్ రాజ్‌పుత్ లీడ్ రోల్‌లో నటించిన చిత్రం 'రక్షణ'. ప్రణదీప్ ఠాకోర్ స్వీయ దర్శకత్వంలో నిర్మించిన ఈ చిత్రం నేడు విడుదలవుతోంది. ఈ సందర్భంగా ప్రణదీప్ ఠాకోర్ మాట్లాడుతూ- ''గుణశేఖర్‌గారి వద్ద 'ఒక్కడు, సైనికుడు, రుద్రమ దేవి' సినిమాలకు అసిస్టెంట్ కో డైరెక్టర్‌గా పని చేశాను. ఆనంద్ రంగా 'ఓయ్' చిత్రానికి, భాస్కర్ 'ఆరెంజ్' సినిమాకి కో-డైరెక్టర్‌గా చేశాను. ఓ పెద్ద కథ పట్టుకుని చాలామంది వద్దకు వెళ్లాను... కానీ కుదరలేదు. అందుకే చిన్న సినిమా తీసి, నిరూపించుకోవాలని 'రక్షణ' తీశాను. ఇందులో పాయల్ అద్భుతంగా నటించారు. 'రక్షణ' తర్వాత ఆమెకు మరింత పవర్‌ఫుల్ రోల్స్ వస్తాయి. సినిమా తీయడం క్రియేటివ్... రిలీజ్ చేయడం మార్కెటింగ్ థింగ్. నేను సినిమా బాగానే తీశా. కానీ, మార్కెటింగ్‌లో పూర్. ఈ రోజుల్లో సినిమా తీయడం కంటే దాన్ని రిలీజ్ చేయడమే కష్టంగా మారింది'' అన్నారు.

ప్రేమ ఉన్నప్పుడు గొడవలూ ఉంటాయి

- శర్వానంద్



● శ్రీరామ్ ఆదిత్య, కృతీ శెట్టి, శర్వానంద్, టీజీ విశ్వప్రసాద్, కృతీ ప్రసాద్, వివేక్ కూచిభొట్ల

''ఫొటోలు పట్టుకుని సినిమా ఆఫీసుల చుట్టూ తిరిగిన రోజులు ఇంకా గుర్తున్నాయి. ఇరవయ్యేళ్లు ... ముప్పైఐదు సినిమాలు ఎలా అయ్యాయో తెలియదు. స్టార్ స్టేటస్ రావడానికి ఇరవై ఏళ్లు పట్టింది. నాకు 'చార్మింగ్ స్టార్' అనే టైటిల్ ఇచ్చినందుకు విశ్వగారికి థ్యాంక్స్. నేను చేసిన సినిమాల పట్ల నేను గర్వంగా ఫీలవుతున్నాను'' అని శర్వానంద్ అన్నారు. శర్వానంద్, కృతీ శెట్టి జంటగా శ్రీరామ్ ఆదిత్య దర్శకత్వంలో పీపుల్ మీడియా ఫ్యాక్టరీ బ్యానర్ పై రామ్‌సే స్టూడియోస్ ప్రొడక్షన్‌తో కలిసి టీజీ విశ్వప్రసాద్ నిర్మించిన చిత్రం 'మనమే'. ఈ సినిమా నేడు విడుదలవుతోంది. ఈ సందర్భంగా హైదరాబాద్‌లో జరిగిన 'మనమే' ప్రీ రిలీజ్ వేడుకలో శర్వానంద్ మాట్లాడుతూ- ''మనమే' సినిమాలో నేను కొత్తగా కనిపించినా, కొత్తగా పెర్ఫార్మ్ చేసినా ఆ క్రెడిట్ శ్రీరామ్‌కే వెళ్తుంది. ప్రతి ఒక్కరం చాలా కష్టపడి గొడవలు పడుతూ ఈ సినిమాను పూర్తి చేశాం. ప్రేమ ఉన్నప్పుడు గొడవలూ ఉంటాయి. ఒక మనిషికి మరో మనిషి ఇవ్వగలిగే గొప్ప బహుమతి టైమ్. ఈ పాయింట్‌నే శ్రీరామ్ ఈ సినిమాలో చెప్పారు'' అని అన్నారు. ''శర్వానంద్ తన ఎనర్జీతో ఈ సినిమాను మరో లెవెల్‌కు తీసుకువెళ్లారు'' అన్నారు శ్రీరామ్ ఆదిత్య. ''శర్వానంద్ నటన అద్భుతంగా ఉంటుంది. తన చార్మింగ్ లుక్స్, పెర్ఫార్మెన్స్ చూసి తనకి 'చార్మింగ్ స్టార్' అనే టైటిల్ ఇస్తున్నాను'' అన్నారు టీజీ విశ్వప్రసాద్. ఇంకా డిస్ట్రిబ్యూటర్ శశిధర్ రెడ్డి కూడా మాట్లాడారు.



● ప్రకాశ్, చాందిని

యేవమ్ అంటే...

చాందినీ చౌదరి, వశిష్ఠ సింహా, భరత్ రాజ్, అషు రెడ్డి ముఖ్య తారలుగా రూపొందిన సినిమా 'యేవమ్'. ప్రకాశ్ దంతులూరి దర్శకత్వంలో నవదీప్, పవన్ గోపరాజు నిర్మించిన ఈ చిత్రం ఈ నెల 14న రిలీజ్ కానుంది. ఈ సందర్భంగా ఈ సినిమా ట్రైలర్‌ను దర్శకుడు అనిల్ రావిపూడి విడుదల చేసి, శుభాకాంక్షలు తెలిపారు. చాందినీ చౌదరి మాట్లాడుతూ- ''ఈ చిత్రకథ వికారాబాద్ నేపథ్యంలో జరుగుతుంది. తెలంగాణ కల్చర్‌కు సంబంధించిన అంశాలు కూడా ఉన్నాయి. నేను మొదటిసారి పోలీసాఫీసర్‌గా నటించిన క్రైమ్ థ్రిల్లర్ చిత్రమిది. సైకలాజికల్ ఎమోషన్స్ చాలా ఉంటాయి'' అన్నారు. ''యేవమ్' అంటే 'ఇది ఇలా జరిగింది' అని అర్థం. విభిన్నమైన వ్యక్తిత్వాలు ఉన్న నలుగురు వ్యక్తులు అనుకోని పరిస్థితుల్లో కలుసుకుని, అక్కడి నుంచి వారి ప్రయాణాన్ని మొదలు పెడితే ఎలా ఉంటుంది? అనేది ఈ సినిమా కథాంశం'' అన్నారు ప్రకాశ్.

'మా'లో హేమ ప్రాథమిక సభ్యత్వం సస్పెన్షన్



● హేమ

బెంగళూరు రేవ్ పార్టీ కేసులో హేమ అరెస్టు అయిన సంగతి తెలిసిందే. దీంతో 'మూవీ ఆర్టిస్ట్స్ అసోసియేషన్' (మా) ఆమె ప్రాథమిక సభ్యత్వాన్ని సస్పెండ్ చేసింది. హేమ సభ్యత్వాన్ని సస్పెండ్ చేసే విషయమై 'మా' అధ్యక్షుడు విష్ణు మంచు ప్యానెల్ సభ్యులతో బుధవారం సమావేశం నిర్వహించారట. ఆమె ప్రాథమిక సభ్యత్వాన్ని రద్దు చేస్తున్నట్లు 'మా' కార్యదర్శి రఘుబాబు ఓ లేఖ విడుదల చేశారు. మే నెలలో బెంగళూరు రేవ్ పార్టీలో హేమ డ్రగ్స్ తీసుకున్నట్లు పోలీసుల నివేదికలో నిర్ధారణ కావడంతో 'మా' ఈ నిర్ణయం తీసుకున్నట్లు తెలుస్తోంది. డ్రగ్స్ కేసుపై వివరణ ఇవ్వాలని హేమకు 'మా' నోటీసులు ఇచ్చిన నేపథ్యంలో ఆమె నుంచి స్పందన లేకపోవడంతో సస్పెన్షన్ నిర్ణయం తీసుకున్నట్లు, విచారణ తేలేవరకూ ఈ సస్పెన్షన్ కొనసాగుతుందన్నట్లు హేమకు 'మా' లేఖ పంపినట్లు తెలిసింది.

స్టాక్ మార్కెట్లు

దేశీ సూచీలు		
సెన్సెక్స్ ▲	692	75,075
నిఫ్టీ ▲	201	22,821

విదేశీ సూచీలు (తొలి రెండు రాత్రి 11.30 గంటలకు)

సూచీ		
నాస్‌డాక్	17,175	▽ 13
డోజోన్స్	38,825	▲ 18
ఎఫ్‌టీఎస్‌ఈ 100	8,285	▲ 38
డాక్స్	18,647	▲ 71
షాంఘై	3,049	▽ 17
నికాయ్	38,703	▲ 213

•అమెరికా •బ్రిటన్ •జర్మనీ •చైనా •జపాన్

బులియన్ రూ.లలో — ముంబై

బంగారం (99.9 స్వచ్ఛత)	72,757	▲ 771
బంగారం (99.5 స్వచ్ఛత)	72,466	▲ 768
వెండి (కిలో)	90,407	▲ 1,877

ఫారెక్స్ రేట్లు రూ.లలో

		కొనుగోలు	అమ్మకం
$	యూఎస్ డాలర్	83.00	84.02
€	యూరో	89.78	92.15
¥	జపాన్ ఎన్ (100)	53.07	54.25
AU$	ఆస్ట్రేలియా డాలర్	54.70	56.64
£	బ్రిటన్ పౌండ్	104.20	109.13
S$	సింగపూర్ డాలర్	59.61	64.30
SAR	సౌదీ రియాల్	21.36	22.92
UAE D	యూఏఈ దిర్హామ్	21.84	23.62
¥	చైనా యువాన్	10.40	12.47

రెండో రోజూ మార్కెట్ ర్యాలీ

- సెన్సెక్స్ 692 పాయింట్లు అప్ • 75,000 అధిగమించిన ఇండెక్స్
- 201 పాయింట్లు ఎగసిన నిఫ్టీ • 22,821 వద్ద ముగింపు
- అమ్మకాల బాటలోనే ఎఫ్‌పీఐలు



ముంబై: అనిశ్చితికి తెరదించుతూ మూడోసారి బీజేపీ కూటమి అధికారాన్ని చేపట్టనుండటంతో వరుసగా రెండో రోజు దేశీ స్టాక్ మార్కెట్లు లాభాల దౌడు తీశాయి. సెన్సెక్స్ 692 పాయింట్లు జంప్‌చేసింది. 75,000 పాయింట్ల మైలురాయిని అధిగమించి 75,075 వద్ద ముగిసింది. నిఫ్టీ సైతం 201 పాయింట్లు ఎగసి 22,821 వద్ద నిలిచింది. తొలుత ఒక దశలో గరిష్టంగా సెన్సెక్స్ 75,298కు చేరగా.. నిఫ్టీ 22,910ను తాకింది. వెరసి సెన్సెక్స్ 915 పాయింట్లు, నిఫ్టీ 290 పాయింట్లు చొప్పున దూసుకెళ్లాయి. దీంతో బీజేపీకి మెజారిటీ లభించకపోవడంతో మంగళవారం నమోదైన రూ. 31 లక్షల కోట్ల మార్కెట్ విలువ నష్టంలో చాలావరకూ రికవరైంది. గత రెండు రోజుల్లో బీఎస్‌ఈ మార్కెట్ క్యాప్ రూ. 21 లక్షల కోట్లకుపైగా బలపడింది. ఫలితంగా బీఎస్‌ఈ మార్కెట్ క్యాప్ దాదాపు రూ. 416 లక్షల కోట్లకు(4.98 ట్రిలియన్ డాలర్లు) చేరింది.

నేటి ఆర్‌బీఐ పాలసీ నిర్ణయాలపై దృష్టి

నేడు(శుక్రవారం) ఆర్‌బీఐ పాలసీ సమీక్ష నిర్ణయాలు వెలువడనున్న నేపథ్యంలో ఇకపై ఇన్వెస్టర్ల దృష్టి వడ్డీ రేట్లవైపు మళ్లనున్నట్లు మార్కెట్ నిపుణులు వివరించారు. కాగా.. రియల్టీ, మీడియా, పీఎస్‌యూ బ్యాంక్స్, ఐటీ, ఆయిల్, మెటల్ రంగాలు 5–1.5 శాతం మధ్య లాభపడ్డాయి. మరోవైపు హిందాల్కో, హీరోమోటో కార్ప్, ఏషియన్ పెయింట్స్, ఎంఅండ్ఎం, నెస్లే, ఇండస్‌ఇండ్, సిప్లా, బ్రిటానియా 2.4–1% మధ్య నీరసించాయి.

కాగా, బీఎస్‌ఈలో ట్రేడైన షేర్లలో 2,981 లాభపడితే.. కేవలం 878 నష్టపోయాయి. నగదు విభాగంలో విదేశీ ఇన్వెస్టర్లు(ఎఫ్‌పీఐలు) మరోసారి అమ్మకాలకే ప్రాధాన్యమిచ్చారు. రూ. 6,868 కోట్ల విలువైన స్టాక్స్ విక్రయించారు. దేశీ ఫండ్స్ మాత్రం రూ. 3,718 కోట్లు ఇన్వెస్ట్ చేశాయి. గత 2 రోజుల్లో ఎఫ్‌పీఐలు రూ. 18,000 కోట్ల పెట్టుబడులు వెనక్కి తీసు కున్నారు.

బీహెచ్‌ఈఎల్ 9% జంప్

అదానీ పవర్ రూ. 3,500 కోట్ల భారీ ఆర్డర్ నేపథ్యంలో బీహెచ్‌ఈఎల్ షేరు తాజాగా 9 శాతం జంప్‌చేసింది. రూ. 278 వద్ద ముగిసింది. ఇంట్రాడేలో 15% దూసుకెళ్లి రూ. 292ను అధిగమించింది. మార్కెట్ విలువ రూ. 7,974 కోట్లు బలపడి రూ. 96,854 కోట్లకు చేరింది.

అదానీ షేర్లు జూమ్



వరుసగా రెండో రోజు అదానీ గ్రూప్ కౌంటర్లకు డిమాండ్ నెలకొంది. గ్రూప్‌లోని 10 లిస్టెడ్ కంపెనీలలో అదానీ పోర్ట్స్ స్వల్ప వెనకడుగు వేయగా.. ఎనర్జీ సొల్యూషన్స్, టోటల్ గ్యాస్, ఎన్‌డీటీవీ, పవర్, విల్మర్, ఏసీసీ, ఎంటర్‌ప్రైజెస్, గ్రీన్ ఎనర్జీ, అంబుజా 5– 2 శాతం మధ్య ఎగశాయి. గ్రూప్ మార్కెట్ విలువ రూ. 17 లక్షల కోట్లను అధిగమించింది.

కోడిగుడ్లు (హోల్‌సేల్-నెక్ / 100కు రూ.లలో)

7-6-2024	
విశాఖ	450-00
చిత్తూరు	513-00
ఈస్ట్, వెస్ట్ గోదావరి	445-00
విజయవాడ	450-00
రిటైల్ ధర (డజను)	72.00
హైదరాబాద్	430-00
వరంగల్	432-00
రిటైల్ ధర	4.90

బెటర్ న్యూట్రిషన్‌లో పీవీ సింధు పెట్టుబడులు



న్యూఢిల్లీ: అగ్రి స్టార్టప్ సంస్థ గ్రీన్‌డేకి చెందిన బెటర్ న్యూట్రిషన్ బ్రాండ్‌లో బ్యాడ్మింటన్ క్రీడాకారిణి పీవీ సింధు ఇన్వెస్ట్ చేశారు. సదరు బ్రాండ్‌కి ఆమె ప్రచారకర్తగా కూడా వ్యవహరించనున్నారు. సింధు ఎంత ఇన్వెస్ట్ చేసినదీ వెల్లడి కాలేదు. కీలకమైన పౌష్టికాహార లోపాలను పరిష్కరించేందుకు కృషి చేస్తున్న బ్రాండ్‌తో చేతులు కలపడం సంతోషంగా ఉందని సింధు తెలిపారు. దేశీయంగా 50 శాతం మంది ప్రజలు జింక్, ఐరన్, ప్రొటీన్ మొదలైన వాటి లోపాలతో బాధపడుతున్నారని గ్రీన్‌డే సీఈవో రస్తోగి తెలిపారు. ఈ నేపథ్యంలో తాము సూక్ష్మపోషకాలు పుష్కలంగా ఉండే పంటలను పండించేందుకు 15,000 మంది పైచిలుకు రైతులతో కలిసి పని చేస్తున్నామని ఆయన పేర్కొన్నారు. ప్రస్తుతం ఈ స్టార్టప్‌కి 75 పైచిలుకు అగ్రి–ఇన్‌పుట్ స్టోర్స్, కొనుగోలు కేంద్రాలు ఉన్నాయి. బెటర్ న్యూట్రిషన్ పేరిట బియ్యం, గోధుమ పిండి, రాగులు మొదలైనవి విక్రయిస్తోంది.

నెక్ట్స్‌వేవ్‌కు డబ్ల్యూఈఎఫ్ లిస్టులో చోటు

హైదరాబాద్, బిజినెస్ బ్యూరో: ఏఐ ఆధారిత కోడింగ్ కోర్సులు అందిస్తున్న హైదరాబాదీ స్టార్టప్ సంస్థ నెక్ట్స్‌వేవ్ తాజాగా వరల్డ్ ఎకనామిక్ ఫోరం (డబ్ల్యూఈఎఫ్) లిస్టులో చోటు దక్కించుకుంది. ప్రపంచవ్యాప్తంగా 100 టెక్ స్టార్టప్‌లతో డబ్ల్యూఈఎఫ్ రూపొందించిన టెక్నాలజీ పయొనీర్స్ జాబితాలో భారత్ నుంచి ఎంపికైన 10 సంస్థల్లో నెక్ట్స్‌వేవ్ కూడా ఉంది. మిగతా వాటిలో పిక్సెల్, నిరామయ్, సర్వమ్ ఏఐ తదితర సంస్థలు ఉన్నాయి. ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్‌ని ఉపయోగించి బయోటెక్, స్పేస్, న్యూరోటెక్నాలజీ తదితర రంగాల్లో సొల్యూషన్స్‌ను రూపొందిస్తున్న సంస్థలతో డబ్ల్యూఈఎఫ్ ఈ లిస్టును తయారు చేసింది.

భారత్‌కు ఎంజీ బింగో ఈవీ

హైదరాబాద్, బిజినెస్ బ్యూరో: ఎలక్ట్రిక్ కార్ల విపణిలో బింగో ఈవీ 2025లో రంగ ప్రవేశం చేయనుంది. ఎంజీ మాతృ సంస్థ ఎస్ఏఐసీ ఈ మేరకు సిద్ధం అవుతోంది. ఎంజీ మోటార్ ఇండియా గ్లోస్టర్ అప్‌డేటెడ్ వర్షన్‌తోపాటు ఎంజీ క్లౌడ్ ఈవీని ఈ ఏడాది భారత్‌లో ప్రవేశపెడుతోంది. బింగో హ్యాచ్‌బ్యాక్ తొలుత చైనాలో ఎంట్రీ ఇచ్చింది. ఇండోనేషియాలోనూ విక్రయిస్తున్నారు. ఎంజీ కామెట్ మాదిరి కాకుండా అయిదు డోర్లతో బింగో ఈవీ రూపుదిద్దుకుంది. గ్లోబల్ స్మాల్ ఎలక్ట్రిక్ వెహికిల్ ప్లాట్‌ఫామ్‌పై ఈ కారు తయారైంది. 3,950 మిల్లీమీటర్ల పొడవు ఉంది. 41 హెచ్‌పీ మోటార్, 17.3 కిలోవాట్ అవర్ బ్యాటరీ వేరియంట్ 203 కిలోమీటర్ల వరకు, 68 హెచ్‌పీ మోటార్, 31.9 కిలోవాట్ అవర్ బ్యాటరీ వేరియంట్ 333 కిలోమీటర్ల వరకు ప్రయాణించగలదు.



హరిత ఇంధనాల్లో 500 బిలియన్ డాలర్ల అవకాశాలు

ఐపీఈఎఫ్ సదస్సులో భారత్ వెల్లడి

న్యూఢిల్లీ: దేశీయంగా పునరుత్పాదక ఇంధనాలు, గ్రీన్ హైడ్రోజన్, ఎలక్ట్రిక్ వాహనాలు తదితర పర్యావరణ అనుకూల ఇంధనాల వినియోగ వ్యవస్థలో భారీగా పెట్టుబడులకు అవకాశాలు ఉన్నాయని కేంద్ర వాణిజ్య శాఖ తెలిపింది. 2030 నాటికి 500 బిలియన్ డాలర్ల మేర ఇన్వెస్ట్ చేసేందుకు ఆస్కారం ఉందని ఇండో–పసిఫిక్ ఎకనమిక్ ఫ్రేమ్‌వర్క్ ఫర్ ప్రాస్పరిటీ (ఐపీఈఎఫ్) క్లీన్ ఎకానమీ ఇన్వెస్టర్ ఫోరంలో పాల్గొన్న సందర్భంగా వాణిజ్య శాఖ కార్యదర్శి సునీల్ బర్త్‌వాల్ తెలిపారు. గత దశాబ్ద కాలంగా వ్యాపారాల నిర్వహణకు అనువుగా భారత్ అమలు చేసిన పలు సంస్కరణలను ఈ సందర్భంగా ఆయన వివరించారు. రెండు రోజుల ఈ సదస్సులో ప్రాంతీయంగా టాప్ ఇన్వెస్టర్లు, పర్యావరణ అనుకూల ఆర్థిక వ్యవస్థల కోసం కృషి చేస్తున్న కంపెనీలు, స్టార్టప్‌లు పాల్గొన్నాయి. పర్యావరణ అనుకూల ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ విభాగానికి సంబంధించి తమ కాన్సెప్టులను తెలియజేసేందుకు భారత్ నుంచి నాలుగు సంస్థలు (రెన్యూ పవర్, అవాడా ఎనర్జీ మొదలైనవి) షార్ట్‌లిస్ట్ అయ్యాయి. అలాగే క్లైమేట్ టెక్ విషయంలో వినూత్న ఐడియాలను ఆవిష్కరించేందుకు 10 భారతీయ స్టార్టప్‌లు, కంపెనీలు ఎంపికయ్యాయి.



ఆరు సంస్థలుగా వేదాంతా

ఎస్‌బీఐసహా రుణదాతల గ్రీన్‌సిగ్నల్



న్యూఢిల్లీ: ప్రయివేట్ రంగ మైనింగ్ దిగ్గజం వేదాంతా లిమిటెడ్ బిజినెస్‌ల విడదీతకు రుణదాతలు ఆమోదముద్ర వేశారు. దీంతో ఆరు స్వతంత్ర లిస్టెడ్ కంపెనీలుగా ఆవిర్భవించేందుకు వేదాంతాకు వీలు చిక్కనుంది. ఎస్‌బీఐసహా రుణదాతలు అంగీకరించడంతో 52 శాతానికిపైగా అనుమతి లభించినట్లేనని వేదాంతా సీనియర్ ఎగ్జిక్యూటివ్ ఒకరు పేర్కొన్నారు. అధిక శాతం రుణదాతలు విడదీతను సమర్థించినట్లు వెల్లడించారు. విడదీత ప్రణాళికకు 75% ఆమోదం లభించవలసి ఉండగా.. వారం, పది రోజుల్లో మిగిలిన లక్ష్యాన్ని సైతం చేరుకోగలమని తెలియజేశారు. కొన్ని అనుమతులకు కమిటీ మీటింగ్, బోర్డు సమావేశాల కోసం చూస్తున్నట్లు తెలియజేశారు. వీటి తదుపరి ఎన్‌సీఎల్‌టీకి దరఖాస్తు చేయనున్నట్లు వెల్లడించారు. ప్రధాన రుణదాత ఎస్‌బీఐ ఇప్పటికే సమ్మతించగా.. 20 బిలియన్ డాలర్ల విలువైన విడదీత ప్రణాళికకు దారి ఏర్పడినట్లు వివరించారు. గత జనవరి–మార్చిలో రూ. 6,155 కోట్ల నికర రుణభారాన్ని తగ్గించుకున్నట్లు కంపెనీ వెల్లడించింది. దీంతో రుణ భారం రూ. 56,388 కోట్లకు చేరినట్లు తెలియజేసింది. వేదాంతా రుణదాతల జాబితాలో ఎస్‌బీఐ, బీవోబీ, పీఎన్‌బీ, కెనరా బ్యాంక్, ఐవోబీ, యూనియన్ బ్యాంక్, బ్యాంక్ ఆఫ్ మహారాష్ట్రతో పాటు.. ప్రయివేట్ బ్యాంకులైన యస్ బ్యాంక్, ఐసీఐసీఐ, యాక్సిస్, ఐడీఎఫ్‌సీ ఫస్ట్, కొటక్ మహీంద్రా ఉన్నాయి.

విడదీతలో భాగంగా వేదాంతా.. అల్యూమినియం, ఆయిల్ అండ్ గ్యాస్, విద్యుత్, స్టీల్, ఫెర్రస్ మెటీరియల్స్, బేస్ మెటల్స్ సంస్థలుగా ఏర్పాటు కానుంది. ఇవన్నీ స్వతంత్ర కంపెనీలుగా స్టాక్ ఎక్స్ఛేంజీలలో లిస్ట్‌కానున్నాయి

దేశీ విమాన ప్రయాణికుల్లో వృద్ధి



- మే నెలలో 1.39 కోట్ల మంది ప్రయాణం
- గతేడాదితో పోలిస్తే 5.1 శాతం అధికం
- ఇక్రా రేటింగ్స్ నివేదికలో వెల్లడి

హైదరాబాద్, బిజినెస్ బ్యూరో: దేశీయంగా మే నెలలో 1.39 కోట్ల మంది విమాన ప్రయాణం చేశారు. 2023 మే నెలతో పోలిస్తే ఇది 5.1 శాతం అధికం. కోవిడ్ ముందస్తు కాలంతో పోలిస్తే 14 శాతం ఎక్కువ అని రేటింగ్స్ ఏజెన్సీ ఇక్రా తాజా నివేదిక వెల్లడించింది. ఏప్రిల్‌లో 1.32 కోట్ల మంది రాకపోకలు సాగించారు. 2024–25లో ట్రెండ్ కొనసాగుతుందని ఇక్రా భావిస్తోంది. దేశీయ, అంతర్జాతీయ విమాన ప్రయాణికుల ట్రాఫిక్‌లో సానుకూల ధోరణి కొనసాగుతుందని పేర్కొంది. నివేదిక ప్రకారం.. గత నెలలో వియానయాన సంస్థల సామర్థ్యం 2023 మే నెలతో పోలిస్తే 6 శాతం, 2024 ఏప్రిల్‌తో పోలిస్తే 2 శాతం పెరిగింది. భారత్ నుంచి 2023–24లో 24 శాతం అధికంగా 2.97 కోట్ల మంది విదేశీయానం చేశారు. పరిశ్రమ కోవిడ్‌కు ముందు స్థాయిల కంటే అధిక రాబడి అందుకుంది.

సాక్షి స్పోర్ట్స్

రెజ్లర్ అమన్‌కు రజతం



పొల్యాక్ ఇమ్రి–వర్గా జోనస్ స్మారక ర్యాంకింగ్ సిరీస్ రెజ్లింగ్ టోర్నీలో భారత రెజ్లర్ అమన్ సెహ్రావత్ రజత పతకం సాధించాడు. హంగేరి రాజధాని బుడాపెస్ట్‌లో జరుగుతున్న ఈ టోర్నీలో అమన్ పురుషుల ఫ్రీస్టయిల్ 57 కేజీల విభాగంలో రన్నరప్‌గా నిలిచాడు. రె హిగుచి (జపాన్)తో జరిగిన ఫైనల్లో అమన్ 1–11 పాయింట్లతో ఓడిపోయాడు. నేరుగా క్వార్టర్ ఫైనల్ ఆడిన అమన్ 11–1తో రొబెర్టి డింగాష్‌విలి (జార్జియా)పై, సెమీఫైనల్లో 14–4తో టిసిటర్స్ (బెలారస్)పై గెలుపొందాడు.

క్వార్టర్స్‌లో సుమిత్ నగాల్



జర్మనీలో జరుగుతున్న నెకర్ కప్ ఏటీపీ చాలెంజర్ టోర్నీలో భారత టెన్నిస్ నంబర్‌వన్ సుమిత్ నగాల్ క్వార్టర్ ఫైనల్లోకి ప్రవేశించాడు. పురుషుల సింగిల్స్ రెండో రౌండ్‌లో సుమిత్ 6–4, 6–1తో జేవియర్ కొసానో (స్పెయిన్)పై గెలుపొందాడు.

సరబ్‌జోత్ 'పసిడి' గురి



మ్యూనిక్: ప్రపంచకప్ షూటింగ్ టోర్నీలో భారత్ పతకాల ఖాతా తెరిచింది. పురుషుల 10 మీటర్ల ఎయిర్ పిస్టల్ ఈవెంట్‌లో భారత షూటర్ సరబ్‌జోత్ సింగ్ స్వర్ణ పతకాన్ని సాధించాడు. వరల్డ్ చాంపియన్, నాలుగుసార్లు ఒలింపియన్ తదితర మేటి షూటర్లు పోటీపడ్డ ఫైనల్లో 22 ఏళ్ల సరబ్‌జోత్ 242.7 పాయింట్లు సాధించి విజేతగా నిలిచాడు. బు షుహైహాంగ్ (చైనా; 242.5 పాయింట్లు) రజతం నెగ్గగా... రాబిన్ వాల్టర్ (జర్మనీ; 220 పాయింట్లు) కాంస్య పతకాన్ని కైవసం చేసుకున్నాడు.

క్వార్టర్ ఫైనల్లో లక్ష్య సేన్



జకార్తా: ఇండోనేసియా ఓపెన్ వరల్డ్ టూర్ సూపర్–1000 బ్యాడ్మింటన్ టోర్నీలో పురుషుల సింగిల్స్ విభాగంలో భారత స్టార్ లక్ష్య సేన్ క్వార్టర్ ఫైనల్లోకి దూసుకెళ్లాడు. గురువారం జరిగిన ప్రిక్వార్టర్ ఫైనల్లో ప్రపంచ 14వ ర్యాంకర్ లక్ష్య సేన్ 21–9, 21–15తో ప్రపంచ 12వ ర్యాంకర్ కెంటా నిషిమోటో (జపాన్)పై విజయం సాధించాడు. నేడు జరిగే క్వార్టర్ ఫైనల్లో ప్రపంచ ఐదో ర్యాంకర్ ఆండెర్స్ ఆంటోన్సెన్ (డెన్మార్క్)తో లక్ష్య సేన్ తలపడతాడు. ముఖాముఖి రికార్డులో లక్ష్య సేన్ 2–3తో వెనుకంజలో ఉన్నాడు. మరోవైపు భారత్‌కే చెందిన ప్రియాన్షు రజావత్ పోరాటం ముగిసింది. ప్రిక్వార్టర్ ఫైనల్లో ప్రియాన్షు 10–21, 17–21తో ప్రపంచ చాంపియన్ కున్లావుత్ వితిద్‌సర్న్ (థాయ్‌లాండ్) చేతిలో ఓటమి పాలయ్యాడు.

గాయత్రి జోడీ నిష్క్రమణ

డబుల్స్ విభాగాల్లో భారత జోడీల కథ ముగిసింది. మహిళల డబుల్స్ ప్రిక్వార్టర్ ఫైనల్స్‌లో పుల్లెల గాయత్రి–ట్రెసా జాలీ ద్వయం 21–19, 19–21, 19–21తో మయు మత్సుమోటో–వకానా నాగహార (జపాన్) జంట చేతిలో... అశ్విని పొన్నప్ప–తనీషా క్రాస్టో జోడీ 13–21, 21–19, 13–21తో హనా బేక్–సో హీ లీ (దక్షిణ కొరియా) ద్వయం చేతిలో ఓడిపోయాయి. మిక్స్‌డ్ డబుల్స్ ప్రిక్వార్టర్ ఫైనల్లో సిక్కి రెడ్డి–సుమీత్ రెడ్డి జోడీ 9–21, 11–21తో ప్రపంచ నంబర్‌వన్ ర్యాంక్ ద్వయం సివె జెంగ్–యా కియాంగ్ హువాంగ్ (చైనా) చేతిలో పరాజయం పాలైంది.

అమెరికా 'సూపర్' సంచలనం

'సూపర్ ఓవర్'లో పాకిస్తాన్‌పై విజయం





దాలస్: టి20 ప్రపంచకప్‌లో పెను సంచలనం... టోర్నీ 11వ మ్యాచ్‌లో 'సూపర్ ఓవర్' ద్వారా అనూహ్య ఫలితం వచ్చింది. తొలిసారి వరల్డ్ కప్ బరిలోకి దిగిన ఆతిథ్య అమెరికా జట్టు అద్భుతం చేసింది. అటు బౌలింగ్‌లో, ఇటు బ్యాటింగ్‌లో సత్తా చాటి మాజీ చాంపియన్ పాకిస్తాన్‌ను చిత్తు చేసింది. 20 ఓవర్ల సమరంలో ఇరు జట్లు సమంగా నిలవడంతో 'సూపర్ ఓవర్' అనివార్యమైంది. గురువారం జరిగిన గ్రూప్ 'ఎ' మ్యాచ్‌లో యూఎస్ఏ 'సూపర్ ఓవర్'లో 5 పరుగులతో పాక్‌ను ఓడించింది. 2009 విజేత పాకిస్తాన్ సమష్టి వైఫల్యం కారణంగా పరాభవంతో టోర్నీని మొదలు పెట్టగా...తొలి మ్యాచ్‌లో కెనడాపై నెగ్గిన యూఎస్ వరుసగా రెండో విజయాన్ని అందుకుంది. పాక్ తరఫున ఆమిర్ వేసిన సూపర్ ఓవర్లో అమెరికా 18 పరుగులు చేయగా... గెలవాలంటే 'సూపర్ ఓవర్'లో 19 పరుగులు చేయాల్సిన పాక్... అమెరికా బౌలర్ సౌరభ్ నేత్రావల్కర్ వేసిన సూపర్ ఓవర్లో ఒక వికెట్ కోల్పోయి 13 పరుగులు మాత్రమే చేసి ఓడిపోయింది. అంతకుముందు టాస్ ఓడి ముందుగా బ్యాటింగ్‌కు దిగిన పాకిస్తాన్ 20 ఓవర్లలో 7 వికెట్ల నష్టానికి 159 పరుగులు చేసింది. బాబర్ ఆజమ్ (43 బంతుల్లో 44; 3 ఫోర్లు, 2 సిక్స్‌లు), షాదాబ్ ఖాన్ (25 బంతుల్లో 40; 1 ఫోర్, 3 సిక్స్‌లు) రాణించగా... షాహిన్ అఫ్రిది (16 బంతుల్లో 23 నాటౌట్; 1 ఫోర్, 2 సిక్స్‌లు) చివర్లో కీలక పరుగులు చేశాడు. అమెరికా బౌలర్లలో నాస్తుష్ కెన్‌జిగే 3 వికెట్లు పడగొట్టగా, సౌరభ్ నేత్రావల్కర్ 2 వికెట్లు తీశాడు. అనంతరం అమెరికా 20 ఓవర్లలో 3 వికెట్లకు 159 పరుగులు సాధించింది. కెప్టెన్ మోనాంక్ పటేల్ (38 బంతుల్లో 50; 7 ఫోర్లు, 1 సిక్స్), ఆరోన్ జోన్స్ (26 బంతుల్లో 36 నాటౌట్; 2 ఫోర్లు, 2 సిక్స్‌లు), గూస్ (26 బంతుల్లో 35; 5 ఫోర్లు, 1 సిక్స్) కీలక ఇన్నింగ్స్‌లు ఆడారు. ఒక దశలో చేతిలో 9 వికెట్లతో 8 ఓవర్లలో 56 పరుగులు చేయాల్సిన మెరుగైన స్థితిలో నిలిచిన అమెరికా ఆ తర్వాత పాక్ బౌలింగ్ ముందు తడబడింది. అయితే 19వ ఓవర్ వరకు పట్టు బిగించిన పాక్...చివరి ఓవర్లో వెనుకంజ వేసింది. రవూఫ్ వేసిన ఈ ఓవర్లో గెలుపు కోసం 15 పరుగులు చేయాల్సి ఉండగా యూఎస్ ఫోర్, సిక్స్ సహా 14 పరుగులు రాబట్టింది.

స్టొయినిస్ షో

తొలి మ్యాచ్‌లో ఆస్ట్రేలియా విజయం • 39 పరుగులతో ఒమన్ ఓటమి

బ్రిడ్జ్‌టౌన్: మాజీ చాంపియన్ ఆస్ట్రేలియా టి20 ప్రపంచ కప్ తొలి మ్యాచ్‌లో విజయం కోసం కాస్త శ్రమించాల్సి వచ్చింది. చిన్న జట్టే అయినా ఒమన్ గట్టి పోటీనివ్వడంతో కంగారూలు ఆరంభంలో తడబడినా చివరకు గట్టెక్కారు. 'ప్లేయర్ ఆఫ్ మ్యాచ్' స్టొయినిస్ (36 బంతుల్లో 67 నాటౌట్; 2 ఫోర్లు, 6 సిక్స్‌లు; 3/19) ఆల్‌రౌండ్ ప్రదర్శనతో జట్టు గెలుపులో కీలకపాత్ర పోషించాడు. గురువారం జరిగిన గ్రూప్ 'బి' పోరులో ఆస్ట్రేలియా 39 పరుగుల తేడాతో ఒమన్‌ను ఓడించింది. టాస్ ఓడి ముందుగా బ్యాటింగ్‌కు దిగిన ఆస్ట్రేలియా 20 ఓవర్లలో 5 వికెట్ల నష్టానికి 164 పరుగులు సాధించింది. వార్నర్ (51 బంతుల్లో 56; 6 ఫోర్లు, 1 సిక్స్) అర్ధ సెంచరీతో రాణించాడు. అనంతరం ఒమన్ 20 ఓవర్లలో 9 వికెట్లకు 125 పరుగులే చేయగలిగింది. అయాన్ ఖాన్ (30 బంతుల్లో 36; 2 ఫోర్లు, 2 సిక్స్‌లు), మెహ్రాన్ ఖాన్ (16 బంతుల్లో 27; 1 ఫోర్, 2 సిక్స్‌లు) మినహా అంతా విఫలమయ్యారు. బ్యాటింగ్‌కు పెద్దగా అనుకూలించని పిచ్‌పై హెడ్ (12) విఫలం కాగా... మిచెల్ మార్ష్ (14), మ్యాక్స్‌వెల్ (0) వరుస బంతుల్లో అవుట్ కావడంతో ఆసీస్ 50/3 వద్ద నిలిచింది. ఈ స్థితిలో వార్నర్, స్టొయినిస్ నాలుగో వికెట్‌కు 64 బంతుల్లోనే 102 పరుగులు జోడించి చెప్పుకోదగ్గ స్కోరును అందించారు. ఒమన్ కట్టుదిట్టమైన బౌలింగ్‌తో పవర్‌ప్లేలో 37 పరుగులే చేసిన ఆసీస్... 14 ఓవర్లు ముగిసేసరికి 80 పరుగులే సాధించింది. అయితే ఆ తర్వాత స్టొయినిస్ చెలరేగిపోయాడు. మెహ్రాన్ ఖాన్ వేసిన 15వ ఓవర్లో అతను నాలుగు సిక్సర్లు బాదాడు. 27 బంతుల్లో స్టొయినిస్ హాఫ్ సెంచరీ పూర్తి చేసుకోగా, వార్నర్ అర్ధ సెంచరీకి 46 బంతులు పట్టాయి. చివరి 6 ఓవర్లలో ఆసీస్ 84 పరుగులు సాధించడం విశేషం. తాజా ఇన్నింగ్స్‌తో అంతర్జాతీయ టి20ల్లో అత్యధిక పరుగులు చేసిన ఆస్ట్రేలియా బ్యాటర్‌గా డేవిడ్ వార్నర్ (3155) నిలిచాడు. ఈ క్రమంలో ఆరోన్ ఫించ్ (3120)ను అతను అధిగమించాడు.



టి20 ప్రపంచకప్‌లో నేడు

ఐర్లాండ్ X కెనడా

వేదిక: న్యూయార్క్ ; రాత్రి గం. 8 నుంచి

స్టార్ స్పోర్ట్స్, హాట్ స్టార్‌లో ప్రత్యక్ష ప్రసారం

సునీల్ ఛెత్రి వీడ్కోలు

జాతీయ జట్టు తరఫున చివరి మ్యాచ్ ఆడిన కెప్టెన్

- భారత్, కువైట్ మ్యాచ్ 0–0తో 'డ్రా'



కోల్‌కతా: రెండు దశాబ్దాలుగా భారత ఫుట్‌బాల్ ముఖచిత్రంగా ఉన్న సునీల్ ఛెత్రి అంతర్జాతీయ కెరీర్‌కు వీడ్కోలు పలికాడు. ఫుట్‌బాల్ ప్రపంచ కప్–2026 ఆసియా జోన్ క్వాలిఫయర్స్‌లో భాగంగా గురువారం కువైట్‌తో జరిగిన గ్రూప్ 'ఎ' మ్యాచ్‌ను సునీల్ ఛెత్రి నాయకత్వంలోని భారత జట్టు 0–0తో 'డ్రా' చేసుకుంది. నిర్ణీత సమయంలోపు రెండు జట్లు ఒక్క గోల్ కూడా చేయలేకపోయాయి. నాలుగో నిమిషంలో కువైట్ ప్లేయర్ ఈద్ అల్ రషీది కొట్టిన షాట్‌ను భారత గోల్‌కీపర్ గుర్‌ప్రీత్ సింగ్ సంధూ నిలువరించాడు. అనంతరం 11వ నిమిషంలో అన్వర్ అలీ కొట్టిన హెడర్ షాట్ లక్ష్యాన్ని చేరలేకపోయింది. 48వ నిమిషంలో భారత ప్లేయర్ రహీమ్ అలీ 'డి' ఏరియాలోకి వెళ్లినా అతను కొట్టిన షాట్‌లో బలం లేకపోవడంతో బంతి నేరుగా కువైట్ గోల్‌కీపర్ చేతుల్లోకి వెళ్లింది. ఆ తర్వాత రెండు జట్లకు గోల్ చేసేందుకు ఒకట్రెండు అవకాశాలు వచ్చినా వాటిని సద్వినియోగం చేసుకోలేకపోయాయి. భారత్ తన చివరి మ్యాచ్‌ను జూన్ 11న ఆసియా చాంపియన్ ఖతర్ జట్టుతో ఆడనుంది.

2005లో జాతీయ సీనియర్ జట్టుకు తొలిసారి ప్రాతినిధ్యం వహించిన సునీల్ ఛెత్రి ఓవరాల్‌గా భారత్ తరఫున 151 అంతర్జాతీయ మ్యాచ్‌లు ఆడి 94 గోల్స్ సాధించాడు. ఇందులో నాలుగు 'హ్యాట్రిక్'లున్నాయి. జాతీయ జట్టు తరఫున అత్యధిక గోల్స్ చేసిన ఫుట్‌బాలర్స్ జాబితాలో ఛెత్రి నాలుగో స్థానంలో ఉన్నాడు. క్రిస్టియానో రొనాల్డో (పోర్చుగల్; 206 మ్యాచ్‌ల్లో 128 గోల్స్), అలీ దాయ్ (ఇరాన్; 149 మ్యాచ్‌ల్లో 109 గోల్స్); లయనెల్ మెస్సీ (అర్జెంటీనా; 180 మ్యాచ్‌ల్లో 106 గోల్స్) వరుసగా తొలి మూడు స్థానాల్లో ఉన్నారు. రికార్డుస్థాయిలో ఏడుసార్లు జాతీయ ఉత్తమ ఫుట్‌బాల్ ప్లేయర్ అవార్డు గెల్చుకున్న సునీల్ ఛెత్రికి దేశ అత్యున్నత క్రీడా పురస్కారం 'ఖేల్‌రత్న' (2021లో)... అర్జున అవార్డు (2011లో), పద్మశ్రీ (2019లో) లభించాయి.

టైటిల్ పోరుకు స్వియాటెక్, జాస్మిన్





పారిస్: ఫ్రెంచ్ ఓపెన్‌లో నాలుగో టైటిల్ గెలిచేందుకు పోలాండ్ స్టార్ ఇగా స్వియాటెక్ విజయం దూరంలో నిలిచింది. డిఫెండింగ్ చాంపియన్ హోదాలో బరిలోకి దిగిన స్వియాటెక్ గురువారం జరిగిన మహిళల సింగిల్స్ తొలి సెమీఫైనల్లో 6–2, 6–4తో మూడో ర్యాంకర్ కోకో గాఫ్ (అమెరికా)పై గెలిచింది. రెండో సెమీఫైనల్లో 12వ సీడ్ జాస్మిన్ పావ్లిని (ఇటలీ) 6–3, 6–1తో రష్యాకు చెందిన 17 ఏళ్ల మిరా ఆండ్రీవాపై విజయం సాధించింది. పురుషుల డబుల్స్ సెమీఫైనల్లో రెండో సీడ్ రోహన్ బోపన్న (భారత్)–ఎబ్డెన్ (ఆస్ట్రేలియా) ద్వయం 5–7, 6–2, 2–6తో బొలెలీ–వావసోరి (ఇటలీ) జోడీ చేతిలో ఓడింది.

క్లుప్తంగా...

సెమీకండక్టర్ల టెక్నాలజీపై జైకా, ఐఐటీహెచ్ మధ్య ఒప్పందం

సాక్షి, హైదరాబాద్: సెమీ కండక్టర్ల రూపకల్పనలో అత్యాధునిక సాంకేతిక పరిజ్ఞానాన్ని ఇచ్చిపుచ్చుకునేందుకు ఇండియన్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ హైదరాబాద్ (ఐఐటీహెచ్), జపాన్ ఇంటర్నేషనల్ కో–ఆపరేషన్ ఏజెన్సీ (జైకా) మధ్య ఒప్పందం కుదిరింది. మేక్ ఇన్ ఇండియాలో భాగంగా ఈ ఒప్పందం చేసుకున్నట్లు రెండు సంస్థలు వెల్లడించాయి. ఈ భాగస్వామ్యం వల్ల సెమీకండక్టర్ల రూపకల్పనలో సరికొత్త పురోభివృద్ధి సాధ్యమని జైకా ఇండియా ప్రతినిధి సైటో మిట్స్‌నోరి తెలిపారు. ఐఐటీ విద్యార్థుల ఇంటర్న్‌షిప్‌లో ఈ టెక్నాలజీ ఆధారంగా పరిశోధనలు చేసేందుకు అవకాశం ఉంది. సరికొత్త సెమీ కండక్టర్లు దీని వల్ల రూపొందించే వీలుందని తెలిపారు. రూ. 1,500 కోట్లతో చేపట్టే ఈ ప్రాజెక్టుకు ఇండియా, జపాన్ పరిశ్రమలు తోడ్పాటు నందిస్తాయి.

రేపు జాతీయ లోక్ అదాలత్

సాక్షి, హైదరాబాద్: ఎక్సైజ్, ఎన్‌ఐ యాక్ట్ కేసు లు, కార్మిక వివాదాలు, విడాకుల కేసులు, సివిల్ కేసుల్లో రాజీ కోసం ఈ నెల 8న జాతీయ లోక్ అదాలత్ నిర్వహించనున్నారు. ఈ మేర కు తెలంగాణ రాష్ట్ర న్యాయ సేవాధికార సంస్థ(టీఎస్ఎల్ఎస్ఏ) సభ్య కార్యదర్శి పంచాక్షరి గురువారం ఓ ప్రకటన విడుదల చేశారు. జాతీయ న్యాయసేవాధికార సంస్థ ఆదేశాల మేరకు ఈ కార్యక్రమాన్ని ఫిజికల్‌గా, ఆన్‌లైన్‌లో నిర్వహిస్తున్నట్లు వెల్లడించారు. హైకోర్టు తో పాటు తాలూకా కోర్టుల్లోనూ ఈ లోక్ అదాలత్ నిర్వహించడం జరుగుతుందన్నారు. కేసులను పరిష్కరించుకోవాలనుకునే వారు జిల్లా న్యాయసేవాధికార సంస్థ చైర్మన్, న్యాయసేవాసదన్, మండల న్యాయసేవా కమిటీలను సంప్రదించాలని.. కక్షిదారులు ఈ అవకాశాన్ని వినియోగించుకుని సత్వర న్యాయం పొందాలని ఆయన సూచించారు. హైకోర్టు ప్రధాన న్యాయమూర్తి, టీఎస్ఎల్ఎస్ఏ ఎగ్జిక్యూటివ్ చైర్మన్ మార్గదర్శకాల మేరకు కార్యక్రమ నిర్వహణకు ఏర్పాట్లు చేస్తున్నట్లు వెల్లడించారు.

వ్యవసాయ డిప్లొమా కోర్సులకు నోటిఫికేషన్

సాక్షి, హైదరాబాద్: ప్రొఫెసర్ జయశంకర్ తెలంగాణ రాష్ట్ర వ్యవసాయ విశ్వవిద్యాలయం పరిధిలోని వివిధ వ్యవసాయ డిప్లొమా కోర్సులలో ప్రవేశాలకు గురువారం అడ్మిషన్ నోటిఫికేషన్ విడుదలైంది. ఈ కోర్సుల్లో ప్రవేశం కోసం దరఖాస్తు చేసుకునే అభ్యర్థులు ఎస్ఎస్‌సీలో ఉత్తీర్ణులై, టీఎస్–పాలీసెట్ పరీక్ష రాసి ర్యాంక్ పొంది ఉండాలి. ఈ కోర్సుల్లో మొత్తం 800 సీట్లు ఉండగా, అందులో ప్రభుత్వ పాలిటెక్నిక్‌ల్లో 260 సీట్లు, ప్రైవేటు పాలిటెక్నిక్‌ల్లో 540 సీట్లు ఉన్నాయి. ఇందులో 60% సీట్లు రూరల్ కోటాలో, 40% సీట్లు నాన్ రూరల్ కోటాలో భర్తీ చేస్తారు. రూరల్ కోటాలో సీటు పొందాలంటే విద్యార్థులు ఒకటి నుంచి పదో తరగతి వరకు ఏవైనా నాలుగేళ్లు గ్రామీణ ప్రాంతంలో చదివినట్లుగా ఆ పాఠశాల ప్రధానోపాధ్యాయుల సంతకం చేసి ధృవీకరించిన పత్రాన్ని (అనెక్షర్–1) అప్‌లోడ్ చేయాలి. రూరల్, నాన్ రూరల్ కోటాలోని సీట్లు రిజర్వేషన్ ప్రాతిపదికన ప్రభుత్వ నియమాలను అనుసరించి ఉంటుందని వర్సిటీ రిజిస్ట్రార్ రఘురామిరెడ్డి తెలిపారు. ఈ కోర్సులకు ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవడానికి ఈ నెల 26 సాయంత్రం 5 గంటల వరకు గడువు ఉందని తెలిపారు. ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకునే విధానం, పాలిటెక్నిక్‌లున్న ప్రదేశాలు, వివిధ కోర్సుల ఫీజులు, ఇతర సమాచారం కోసం వర్సిటీ వెబ్‌సైట్ www.pjtsau.edu.inను సందర్శించాలని కోరారు.

కొత్త చట్టాలపై ఐపీఎస్‌లకు ఒక రోజు వర్క్‌షాప్

సాక్షి, హైదరాబాద్: కొత్త క్రిమినల్ చట్టాలపై తెలంగాణ పోలీస్ శాఖలోని ఉన్నతాధికారులకు ఒక రోజు సమగ్ర వర్క్‌షాప్‌ను నిర్వహించారు. గురువారం తెలంగాణ రాష్ట్ర పోలీస్ అకాడమీ ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ వర్క్‌షాప్‌నకు డీజీపీ రవి గుప్తా ముఖ్య అతిథిగా హాజరయ్యారు. గౌరవ అతిథిగా హోంశాఖ కార్యదర్శి డా.జితేందర్ పాల్గొన్నారు. పోలీస్ ఉన్నతాధికారులకు కొత్త క్రిమినల్ చట్టాలపై క్రిమినల్ లాయర్ ఏపీ సురేష్ వివరించారు. పోలీస్ అకాడమీ ద్వారా తయారు చేయించిన 'న్యూ క్రిమినల్ లా బుక్స్', న్యూ క్రిమినల్ లా యాప్, సీఐడీ ఆధ్వర్యంలో తయారు చేసిన 'రెడీ కాలిక్యులేటర్ ఫర్ న్యూ లాస్'పుస్తకాలను డీజీపీ రవిగుప్తా ఆవిష్కరించారు. నల్సార్, సీడీటీఐ నుంచి అధ్యాపకులు సైతం ఈ వర్క్‌షాప్‌లో పాల్గొని పోలీస్ ఉన్నతాధికారులకు పలు అంశాలను వివరించడంతోపాటు గ్రూప్ డి స్కషన్స్ నిర్వహించారు. వర్క్‌షాప్‌కు సీఐడీ అడిషనల్ డీజీ శిఖాగోయల్, పోలీస్ అకాడమీ డైరెక్టర్ అ భిలాష్ బిష్త్, సీనియర్ ఐపీఎస్‌లు హాజరయ్యారు.

విచారణ ఎదుర్కోవాల్సిందే

- 'గొర్రెల పంపిణీ' కేసులో హైకోర్టు

సాక్షి, హైదరాబాద్: గొర్రెల పంపిణీ పథకంలో అక్రమాలు జరిగినట్లు ప్రాథమిక ఆధారాలున్నందున విచారణ ఎదుర్కోవాల్సిందేనని, కేసు కొట్టివేయమని ఆదేశాలు ఇవ్వలేమని నిందితుడు సయ్యద్ మోహిదుద్దీన్‌కు హైకోర్టు తేల్చిచెప్పింది. కేసు కొట్టివేయాలన్న అభ్యర్థనను తిరస్కరిస్తూ, ఆయన దాఖలు చేసిన పిటిషన్‌ను కొట్టివేసింది. గొర్రెల పంపిణీ పథకంలో అక్రమాలపై వచ్చిన ఫిర్యాదు ఆధారంగా తనపై గచ్చిబౌలి పోలీస్ స్టేషన్‌లో నమోదైన కేసును కొట్టివేయాలని కోరుతూ మోహిదుద్దీన్ హైకోర్టును ఆశ్రయించారు. ఈ పిటిషన్‌పై జస్టిస్ కె.సుజన గురువారం విచారణ చేపట్టారు.

మన విశ్వసనీయతే పునర్వైభవానికి పునాది

ప్రతి గడపకూ మంచి చేసిన చరిత్ర మనదే

- కుమ్మక్కు కుట్రలతో సీట్లు తగ్గినా వైఎస్ జగన్ కృషితోనే 40 శాతం ఓట్లు సాధించగలిగాం
- గత ఐదేళ్ల సుపరిపాలనకు గీటురాయిలా నిలుస్తాయి
- నిస్సంకోచంగా మళ్లీ ప్రజల్లోకి వెళ్తాం
- వైఎస్ జగన్‌ను క్యాంపు కార్యాలయంలో కలిసిన గెలుపొందిన ఎమ్మెల్యేలు, ఎంపీలు, అభ్యర్థులు, ఎమ్మెల్సీలు, పార్టీ నేతలు



వైఎస్సార్‌సీపీ నాయకులతో మాట్లాడుతున్న వైఎస్ జగన్

సాక్షి, అమరావతి: వైఎస్సార్ సీపీ విశ్వసనీయతే పార్టీ పునర్వైభవానికి పునాదిగా నిలుస్తుందని, గత ఐదేళ్ల సుపరిపాలనను రాబోయే పాలనతో ప్రజలు కచ్చితంగా బేరీజు వేసుకుంటారని పలువురు పార్టీ నేతలు పేర్కొన్నారు. ఇచ్చిన హామీలను నెరవేర్చి మాట మీద నిలిచిన పార్టీగా వైఎస్సార్ సీపీకి ప్రజల మనసులో ఎప్పటికీ చోటు ఉంటుందని, పార్టీ పునర్ వైభవానికి ఇదే గట్టి పునాది అని స్పష్టం చేశారు. వైఎస్సార్ సీపీ నుంచి గెలుపొందిన ఎమ్మెల్యేలు, ఎంపీలతో పాటు ఎన్నికల్లో పోటీ చేసిన అభ్యర్థులు, పలువురు ఎమ్మెల్సీలు, నేతలు గురువారం తాడేపల్లిలోని క్యాంపు కార్యాలయంలో పార్టీ అధ్యక్షుడు వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిని కలసి ఫలితాలపై ఒక్కొక్కరూ తమ అభిప్రాయాలను వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా వారు ఏమన్నారంటే...

- మన ప్రభుత్వ పాలనలో సంక్షేమానికి పెద్దపీట వేయడంతో ప్రజల జీవన ప్రమాణాలు మెరుగుపడ్డాయి.
- యువతకు ఉద్యోగ అవకాశాలు కల్పించాం. మేనిఫెస్టో హామీలను 99 శాతానికిపైగా అమలు చేయడంతో పేద వర్గాల్లో సంతోషం వ్యక్తమైంది. రాష్ట్రంలో ప్రతి కుటుంబం జీవన ప్రమాణాలు పెంపొందేలా సీఎం జగన్ చేసిన విశేష కృషి కచ్చితంగా ప్రజల మనసుల్లో నిలిచిపోతుంది. విద్య, వైద్యం, వ్యవసాయ రంగాల్లో విప్లవాత్మక మార్పులు తెచ్చి ప్రజల జీవితాలను మార్చే దిశగా గొప్ప అడుగులు వేశాం. ప్రతి గడపకూ మంచి చేశాం. పార్టీ కచ్చితంగా పునర్ వైభవం సాధిస్తుందని మాకు గట్టి విశ్వాసం ఉంది.
- రాజకీయ ఒత్తిళ్లకు ఈసీ తలొగ్గడం, కొందరు పోలీసు అధికారులు కుట్రల్లో కుమ్మక్కు కావడం, ఈవీఎంల మేనేజ్‌మెంట్‌పై అనుమానాలు, పోలింగ్ బూత్‌ల వద్ద మన ఓటర్లను కట్టడి చేయడంతో సీట్లు గణనీయంగా తగ్గినా వైఎస్సార్ సీపీకి 40 శాతం ఓట్లు రావడం వెనుక ఐదేళ్ల పాటు సీఎం జగన్ చేసిన కృషి ఉంది. గత ఐదేళ్లలో అమలు చేసిన పథకాలు, చేసిన అభివృద్ధి ప్రజల కళ్ల ముందే కనిపిస్తున్నాయి. మేమంతా నిస్సంకోచంగా మళ్లీ ప్రజల్లోకి వెళ్తాం. గడచిన ఐదేళ్ల సుపరిపాలనకు ఒక గీటురాయిలా నిలుస్తాయి. కొత్తగా ఏర్పడనున్న ప్రభుత్వం ఇచ్చిన హామీలు, అమలు తీరుపై కచ్చితంగా ప్రజలు దృష్టి సారిస్తారు.

ఎన్నికల తీరుపై అనుమానాలు

ఎన్నికలు జరిగిన తీరుపై పలువురు నేతలు జగన్ వద్ద అనుమానాలు వ్యక్తం చేశారు. పార్టీకి గట్టి పట్టున్న గ్రామాల్లో సైతం ఓట్లు రాకపోవడం సందేహించాల్సిన అంశమని, ఈవీఎంల వ్యవహారంపై పరిశీలన చేయాల్సిన అవసరం ఉందని పేర్కొన్నారు. మూడు పార్టీలు కూటమిగా ఏర్పడిన తరువాత ఎన్నికల్లో తీవ్ర అక్రమాలకు పాల్పడ్డాయన్నారు. ఈసీ ఒత్తిళ్లకు లొంగిపోయి హడావుడిగా పోలీసు అధికారులను బదిలీ చేసి కూటమికి అనుకూలంగా వ్యవహరించే వారిని నియమించడంతో వైఎస్సార్ సీపీ నాయకులు, కార్యకర్తలు, ఓటర్లను భయ భ్రాంతులకు గురి చేశారని చెప్పారు. పోలీసుల అండతో టీడీపీ నేతలు పోలింగ్ సమయంలో భయానక పరిస్థితులు సృష్టించారన్నారు.

పార్టీ శ్రేణులకు అండగా నిలవాలి: వైఎస్ జగన్

కొత్త ప్రభుత్వం ఏర్పాటు కాకముందే రాష్ట్ర వ్యాప్తంగా టీడీపీ మూకలు ఉన్మాదంతో స్వైర విహారం చేస్తున్నాయని, పలుచోట్ల దాడులకు తెగబడుతున్నాయని వైఎస్సార్ సీపీ నేతలు ప్రస్తావించారు. వైఎస్సార్ సీపీ నాయకులు, కార్యకర్తల ప్రాణాలకు హాని తలపెట్టడమే కాకుండా ఆస్తుల విధ్వంసానికి తెగబడుతున్నాయన్నారు. దీనిపై వెంటనే స్పందించిన సీఎం జగన్ పార్టీ శ్రేణులకు అండగా నిలిచి భరోసా కల్పించాలని నాయకులను ఆదేశించారు. పార్టీ తరఫున న్యాయపరంగా తీసుకోవాల్సిన చర్యలపై ఇప్పటికే ప్రక్రియ మొదలైందని తెలిపారు. ఈ ఘటనలను రాష్ట్రపతి, గవర్నర్ దృష్టికి తెచ్చి పార్టీ తరఫున ఫిర్యాదు చేసినట్లు వెల్లడించారు. సీఎం జగన్‌ను కలిసిన వారిలో శాసన మండలి ఛైర్మన్ మోషేన్ రాజు, వైస్ ఛైర్మన్ జకియా ఖానమ్, నూతనంగా గెలిచిన వైఎస్సార్‌సీపీ ఎమ్మెల్యేలు ఆకేపాటి అమర్‌నాథ్‌రెడ్డి, తాటిపత్రి చంద్రశేఖర్, బూచేపల్లి శివప్రసాద్‌రెడ్డి, రేగం మత్స్యలింగం, మత్స్యరాస విశ్వేశ్వరరాజు, ఎంపీలు మద్దిల గురుమూర్తి, తనూజ రాణి తదితరులున్నారు. ఎమ్మెల్సీలు పొన్నపురెడ్డి రామసుబ్బారెడ్డి, మొండితోక అరుణ్‌కుమార్, రూహుల్లా, మాజీ మంత్రులు కొట్టు సత్యనారాయణ, విడదల రజని, పేర్ని నాని, ఉషా శ్రీచరణ్, కె.నాగేశ్వరరావు, వెలంపల్లి శ్రీనివాస్, జోగి రమేష్, కొడాలి నాని, మాజీ ఎమ్మెల్యేలు మొండితోక జగన్‌మోహన్‌రావు, కై లే అనిల్ కుమార్, పార్టీ నాయకులు దేవినేని అవినాష్, ఉప్పాల రాము, మాజీ ఎంపీ కేశినేని నాని తదితరులు కార్యక్రమంలో పాల్గొన్నారు.

టీడీపీ దాడులపై గవర్నర్ జోక్యం చేసుకోవాలి

- అరాచకాలను అడ్డుకోవాలి
- టీడీపీ దాడుల కారణంగా నష్టపోయిన ప్రతి కార్యకర్తకూ తోడుగా ఉంటాం
- సోషల్ మీడియా సైనికులకు అండగా నిలుస్తాం
- వైఎస్సార్‌సీపీ అధ్యక్షుడు వైఎస్ జగన్


సాక్షి, అమరావతి: రాష్ట్ర వ్యాప్తంగా తెలుగుదేశం పార్టీ దాడులతో అత్యంత భయానక వాతావరణం నెలకొందని, గవర్నర్ వెంటనే జోక్యం చేసుకొని పచ్చ మూకల అరాచకాలకు అడ్డుకట్ట వేయాలని వైఎస్సార్‌సీపీ అధ్యక్షుడు వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి డిమాండ్ చేశారు. రాష్ట్రంలో జరుగుతున్న దాడులు, అరాచకాలను తీవ్రంగా ఖండించారు. దాడులను అడ్డుకోవాలని గురువారం ఆయన సోషల్ మీడియా వేదిక ఎక్స్ (ట్విట్టర్) ద్వారా గవర్నర్‌కు విజ్ఞప్తి చేయడంతో పాటు, పార్టీ శ్రేణులకు భరోసా ఇచ్చారు. 'రాష్ట్ర వ్యాప్తంగా తెలుగుదేశం పార్టీ దాడులతో అత్యంత భయానక వాతావరణం నెలకొంది. ప్రభుత్వం ఏర్పాటు కాకముందే టీడీపీ ముఠాలు స్వైర విహారం చేస్తున్నాయి. ఎక్కడికక్కడ గ్రామ సచివాలయాలు, ఆర్బీకేల్లాంటి ప్రభుత్వ, ప్రైవేటు ఆస్తులను ధ్వంసం చేస్తున్నారు. వైఎస్సార్‌సీపీకి చెందిన నాయకులు, కార్యకర్తలకు రక్షణ లేకుండా పోయింది. అధికార పార్టీ ఒత్తిళ్లతో పోలీసు వ్యవస్థ నిస్తేజంగా మారిపోయింది. ఐదేళ్లు పటిష్టంగా ఉన్న శాంతి భద్రతలు పూర్తిగా దెబ్బ తిన్నాయి. గవర్నర్ వెంటనే జోక్యం చేసుకుని పచ్చ మూకల అరాచకాలను అడ్డుకోవాలి. ప్రజల ప్రాణాలకు, ఆస్తులకు, ప్రభుత్వ ఆస్తులకు రక్షణగా నిలవాలని విజ్ఞప్తి చేస్తున్నాం. టీడీపీ దాడుల కారణంగా నష్టపోయిన ప్రతి కార్యకర్తకూ, సోషల్ మీడియా సైనికులకు తోడుగా ఉంటాం' అని పేర్కొన్నారు.

నీట్ (యూజీ)-2024 ఫలితాల్లో 'నారాయణ' ఆల్‌టైమ్ రికార్డు

సాక్షి, హైదరాబాద్: వైద్యవిద్య ప్రవేశాల కోసం నిర్వహించే నీట్ (యూజీ)–2024 ఫలితాల్లో నారాయణ విద్యాసంస్థలు కొత్త రికార్డులు సృష్టించాయి. ఆలిండియా ఓపెన్ కేటగిరీలో నారాయణ విద్యార్థులు 720కి 720 (నూటికి నూరు శాతం) మార్కులతో 8 ఫస్ట్ ర్యాంకులు సాధించారు. ఇది ఆల్‌టైమ్ రికార్డు అని నారాయణ విద్యాసంస్థల డైరెక్టర్లు డాక్టర్ పి.సింధూర నారాయణ, పి.శరణి నారా యణ తెలిపారు. ఇంకా 715 ఆపైన మార్కులను 26 మంది, 710 ఆపైన 45 మంది, 700 ఆపైన 105 మంది నారాయణ విద్యార్థులు ర్యాంకులు సాధించారని వారు తెలిపారు. సీబీఎస్‌ఈ సిలబస్ ఆధారంగా నిర్వహిస్తున్న నీట్ పరీక్ష కోసం.. విశిష్టమైన ప్రణాళికతో రూపొందించిన 'స్టార్ సీఓ బ్యాచ్, ఎస్–40 ప్రోగ్రామ్‌ల ద్వారా తమ విద్యార్థులు ఈ ర్యాంకులు సాధించగలిగారని వారు పేర్కొన్నారు. ఇంతటి ఘన విజయం సాధించిన విద్యార్థులకు, వారి తల్లి దండ్రులకు, అధ్యాపక బృందానికి పి.సింధూర నారాయణ అభినందనలు తెలిపారు.

టీడీపీ అధ్యక్షుడిగా లోకేశ్? ఏడాది తర్వాత ఏపీ కేబినెట్‌లోకి!

సాక్షి, అమరావతి: ఐదేళ్ల తర్వాత అధికారంలోకి వచ్చిన తెలుగుదేశం పార్టీ వ్యూహాత్మకంగా అడుగులు వేయబోతోంది. ప్రభుత్వంలోనూ, పార్టీలోనూ భవిష్యత్తుకు అనుగుణంగా నియామకాలు చేయడానికి కసరత్తు జరుగుతోంది. అందులో భాగంగానే చంద్రబాబు తన కుమారుడు లోకేశ్ విషయంలో కీలక నిర్ణయాలు తీసుకుంటారని టీడీపీ వర్గాల ద్వారా తెలిసింది. ఆయన్ను టీడీపీ అధ్యక్షుడిగా నియమించాలనే యోచనలో చంద్రబాబు ఉన్నట్లు సమాచారం. ఇప్పుడు అందరూ లోకేశ్ మంత్రివర్గంలో చేరి కీలక మంత్రిత్వ శాఖల బాధ్యతలు తీసుకుంటారనే చర్చ నడుస్తోంది. గతంలోనూ ఆయన చంద్రబాబు మంత్రివర్గంలో ఐటీ, పంచాయతీరాజ్ శాఖల మంత్రిగా పనిచేశారు. ఇప్పుడు మంగళగిరిలో ఎమ్మెల్యేగా గెలవడంతో ఆయన కచ్చితంగా గతంలో మాదిరిగా మంత్రివర్గంలో చేరతారనే అభిప్రాయం పార్టీలో నెలకొంది. రెండు, మూడేళ్ల తర్వాత చంద్రబాబు ఆయన్ను సీఎం పీఠంపై కూర్చోబెట్టే అవకాశాలున్నాయని చర్చించుకుంటున్నారు. అయితే, చంద్రబాబు కుటుంబంలో మాత్రం ప్రస్తుతం ఆయన్ను పార్టీ అధ్యక్షుణ్ణి చేసి అటు పార్టీలోనూ, ఇటు ప్రభుత్వంలోనూ కీలకంగా వ్యవహరించేలా చేయాలనే అభిప్రాయం ఉన్నట్లు తెలుస్తోంది. పార్టీ అధ్యక్షుడిగా పనిచేస్తూ ఇటు రాష్ట్రంలోనూ, అటు కేంద్రంలోనూ అందరితో సంబంధాలు పెంచుకునేందుకు లోకేశ్ ఆసక్తి చూపిస్తున్నట్లు తెలుస్తోంది. ఏడాది తర్వాత రాష్ట్ర మంత్రివర్గంలో చేరతారని ఆ తర్వాత ఇంకా పైస్థాయి పదవి స్వీకరించడానికి ఆయన మొగ్గు చూపుతున్నట్లు తెలుస్తోంది. అయితే, దీనిపై ఇంకా ఏ నిర్ణయం తీసుకోలేదు. ఈ రకమైన చర్చ ఆయన కుటుంబంలో జరుగుతోంది.





ఎన్నికల్లో గెలిచిన నేపథ్యంలో గురువారం హైదరాబాద్‌లోని తన సోదరుడు, మెగాస్టార్ చిరంజీవి ఇంటికి వెళ్లి ఆశీర్వాదం తీసుకుంటున్న జనసేన అధినేత పవన్ కల్యాణ్. ● తల్లి అంజనాదేవి, అన్నావదినలు చిరంజీవి, సురేఖ, భార్య అన్నా లెజినోవాతో కలిసి కేక్ కట్ చేస్తున్న పవన్ కల్యాణ్. చిత్రంలో నాగబాబు, సాయిధరమ్‌తేజ్, కుమారుడు అకీరానందన్, వరుణ్‌తేజ్, రామ్‌చరణ్, ఉపాసన, శ్రీజ తదితరులు

తొలుత ఫెయిల్.. రీవాల్యుయేషన్‌లో 90% మార్కులు

- టెన్త్ పేపర్ జవాబు పత్రాలు దిద్దడంలో నిర్లక్ష్యం
- ఓ విద్యార్థినికి తీవ్ర అన్యాయం..
- రీ వాల్యుయేషన్‌లో విద్యార్థినికి మంచిస్కోరు..







రీవాల్యుయేషన్‌కు ముందు ఫెయిలైనట్లు ఇచ్చిన మెమో. రీవాల్యుయేషన్‌లో 93 శాతం సాధించినట్లు ఇచ్చిన మెమో

దుండిగల్: పదవ తరగతి జవాబు పత్రాలను దిద్దడంలో టీచర్ల నిర్లక్ష్యం కారణంగా విద్యార్థులు మానసిక క్షోభకు గురవుతున్నారు. వా ల్యుయేషన్‌లో నిర్లక్ష్యం కారణంగా ఓ పదోతరగతి విద్యార్థిని తొలుత ఫెయిల్ అయినట్లు చూపించారు. రీవాల్యుయేషన్‌లో అదే విద్యార్థిని 90% మార్కులు సాధించడం విశేషం. మేడ్చల్ జిల్లా కుత్బుల్లాపూర్ నియోజకవర్గం సూరారం శివాలయనగర్‌కు చెందిన చెజెర్ల శ్రీనివాస్, శ్రీదేవిలు దంపతుల కుమార్తె లతశ్రీ రాజీవ్‌గాంధీనగర్‌లోని గీతాంజలి స్కూల్‌లో 10వ తరగతి చదువుతోంది. ఇటీవల పరీక్షలను రాసింది. అయితే ఫలితాల్లో లతశ్రీ ఇంగ్లిష్ సబ్జెక్ట్‌లో ఫెయిల్ అయినట్లుగా వచ్చింది. ఎంతో కష్టపడ్డానని, 9.5 గ్రేడ్ సాధిస్తానని నమ్మకముందని చెప్పిన విద్యార్థిని ఫలితం చూసుకుని తీవ్ర మానసిక క్షోభకు గురైంది. బాలిక పరిస్థితిని చూసి ఆవేదన చెందిన తల్లిదండ్రులు విషయాన్ని స్కూల్ ప్రిన్సిపాల్ మహిపాల్‌రెడ్డి దృష్టికి తీసుకువచ్చారు. వెంటనే ఆయన లతశ్రీకి కౌన్సిలింగ్ నిర్వహించి.. ధైర్యా న్ని నింపారు. తల్లిదండ్రులతో కలిసి ఆయన ఆంగ్లం సబ్జెక్టుకు రీవ్యాలుయేషన్ పెట్టించారు. మొదట రాసిన పరీక్షల్లో అన్ని సబ్జెక్టుల్లో 9, 10 గ్రేడ్ పాయింట్లు రాగా ఇంగ్లిష్ సబ్జెక్ట్‌లో 80 మార్కులకు 26 మార్కులే వచ్చాయి, తిరిగి రీవాల్యుయేషన్ చేయించగా 80కి 74 మార్కు లు వచ్చాయి.9.3 గ్రేడ్‌తో ఉత్తీర్ణత సాధించింది.

ఎగ్జామినర్లదే తప్పు..

పదవ తరగతి జవాబు పత్రాలను ముగ్గురు అధికారులు దిద్దుతారు. ముందుగా విద్యార్థి జవాబు పత్రాన్ని అసిస్టెంట్ ఎగ్జామినర్ తప్పు ఒప్పులను పరిశీలించి సరైన సమాధానాలకు మార్కులు వేస్తారు. ఆ పత్రాలను చీఫ్ ఎగ్జామినర్ పరిశీలించిన అనంతరం స్పెషల్ అసిస్టెంట్ అధికారి మరోసారి విద్యార్థికి వచ్చిన మార్కులను కూడి పునఃపరిశీలిస్తారు. కానీ ఇక్కడ లతశ్రీ పేపరును దిద్దిన ముగ్గురు అధికారులూ అజాగ్రత్తగా వ్యవహరించారు. రీ వ్యాలుయేషన్ చేసిన అనంతరం బోర్డ్ ఆఫ్ సెకండరీ ఎడ్యుకేషన్ అధికారులు తల్లిదండ్రులకు ఫోన్ చేసి బోర్డు కార్యాలయానికి పిలిచారు. రీ కరెక్షన్‌లో మీ అమ్మాయి పాసైందని, ఎస్ఎస్‌సీ సర్టిఫికెట్ తీసుకెళ్లండని చెప్పారు. దీంతో తల్లిదండ్రులు, గీతాంజలి పాఠశాల ఉపాధ్యాయులు అధికారులను నిలదీశారు. తప్పు చేసిన వారిపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. కానీ బోర్డు అధికారులు సమాధానం చెప్పకుండా నీళ్లు నమిలారు. ఎంతో మంది విద్యార్థుల జీవితాలతో చెలగాటమాడుతున్న ఎగ్జామినర్లపై విద్యాశాఖ అధికారులు చర్యలు తీసుకోవాలని తల్లిదండ్రులు కోరుతున్నారు.

కామర్సే 'దోస్త్'

37.5 శాతం విద్యార్థులు ఆ గ్రూపులో చేరిక

- లైఫ్‌సైన్స్ కోర్సులకూ ఆదరణ
- ఇంగ్లిష్ మీడియం విద్యార్థులే ఎక్కువ.. దోస్త్ తొలిదశ సీట్ల కేటాయింపు.. 76,290 సీట్ల భర్తీ

సాక్షి, హైదరాబాద్: డిగ్రీలో కామర్స్‌కోర్సు చదవడానికే విద్యార్థులు మొగ్గ చూపారు. తాజా దోస్త్ సీట్ల కేటాయింపుల్లో ఇదే కనిపించింది. లైఫ్‌సైన్స్ కోర్సులకూ ఆదరణ ఉంది. ఈసారి కూడా అబ్బాయిల కన్నా, అమ్మాయిలే ఎక్కువగా డిగ్రీ కోర్సుల్లో చేరారు. సెక్టార్ స్కిల్ కోర్సుల పట్ల విద్యార్థులు ఆసక్తి చూపుతున్నారు. గత ఏడాదితో పోలిస్తే తొలిదశలో డిగ్రీ అడ్మిషన్ల సంఖ్య 3 వేలు పెరిగింది. రాష్ట్రంలో డిగ్రీ కోర్సుల్లో ప్రవేశానికి చేపట్టే డిగ్రీ ఆన్‌లైన్ సేవలు, తెలంగాణ (దోస్త్) తొలిదశ సీట్ల కేటాయింపును విద్యాశాఖ ముఖ్యకార్యదర్శి బుర్రా వెంకటేశం గురువారం ప్రకటించారు. ఈ కార్యక్రమంలో ఉన్నత విద్యామండలి చైర్మన్ ప్రొఫెసర్ ఆర్.లింబాద్రి, కార్యదర్శి ప్రొఫెసర్ శ్రీరాంవెంకటేశ్, వైస్ చైర్మన్లు వి.వెంకటరమణ, ఎస్కే.మహ్మమూద్ తదితరులు పాల్గొన్నారు. దోస్త్‌కు 1,0,4784 మంది దరఖాస్తు చేశారు. వీరిలో 81,769 మంది వెబ్ ఆప్షన్లు ఇచ్చారు. వెబ్ ఆప్షన్లు ఉపయోగించుకున్న మొత్తంలో చాలాతక్కువ ఆప్షన్లు ఇవ్వడం వల్ల 5,479 మందికి సీట్లు కేటాయించలేదు. ఇవిపోను 76,290 సీట్లు వివిధ గ్రూపుల్లో కేటాయించారు. మొదటి ప్రాధాన్యం ఇచ్చి సీట్లు పొందిన విద్యార్థులు 55,124 మంది, రెండో ప్రాధాన్యంతో సీట్లు పొందిన వారు 21,166 మంది ఉన్నారు. బాలురు 28,423 (37.26 శాతం) సీట్లు పొందితే, బాలికలు 47,867 (62.74 శాతం) మంది సీట్లు పొందారు. దోస్త్‌లో మొత్తం 886 కాలేజీలు పాల్గొన్నాయి. 546 కోర్సులు ఉన్నాయి. మొత్తం సీట్ల సంఖ్య 3,84,748. వచ్చిన వెబ్ ఆప్షన్లు 3,91,973. రాష్ట్రవ్యాప్తంగా 70 కాలేజీల్లో జీరో అడ్మిషన్లు నమోదయ్యాయి. సీట్లు పొందిన అభ్యర్థులు 7 నుంచి 12వ తేదీలోపు సంబంధిత కాలేజీల్లో రిపోర్టింగ్ చేయాలని అధికారులు సూచించారు.

ఫ్యాకల్టీ వారీగా కేటాయించిన సీట్లు ఇలా..

ఆర్ట్స్	7,766 (10.18%)
కామర్స్	28,655 (37.56%)
లైఫ్‌సైన్స్	15,301 (20.06%)
ఫిజికల్ సైన్స్	14,964 (19.61%)
డేటాసైన్స్ (ఏఐఎంఎల్)	2,502 (3.28%)
డి ఫార్మసీ	90 (0.12%)
ఇతరులు	7,012 (9.19%)
మొత్తం	76,290

మీడియం వారీగా కేటాయించిన సీట్లు

ఇంగ్లిష్	72431	తెలుగు	3314
హిందీ	5	ఉర్దూ	540

నేడు టీఎస్ఐసెట్ ప్రాథమిక కీ విడుదల

కేయూ క్యాంపస్: ఎంబీఏ, ఎంసీఏ కోర్సుల్లో ప్రవేశాలకుగాను రెండు తెలుగు రాష్ట్రాల్లో రెండోరోజు గురువారం నిర్వహించిన టీఎస్ఐసెట్‌కు 90.82 శాతం మంది అభ్యర్థులు హాజరయ్యారు. తెలంగాణలో 108 కేంద్రాల్లో ఉదయం 10 నుంచి మధ్యాహ్నం 12.30 గంటల వరకు ఆన్‌లైన్‌లో జరిగిన పరీక్షలో 27,046 మందికి 24,702 మంది అభ్యర్థులు (91.3శాతం) హాజరయ్యారు. ఏపీలో నాలుగు కేంద్రాల్లో 1,210 మందికిగాను 960 మంది (79.3శాతం) హాజరయ్యారని టీఎస్ఐసెట్ కన్వీనర్, కాకతీయ యూనివర్సిటీ కామర్స్ అండ్ బిజినెస్ మేనేజ్‌మెంటు కళాశాల ప్రొఫెసర్ ఎస్.నర్సింహాచారి తెలిపారు. తెలంగాణ, ఏపీ కలిపి మొత్తంగా 112 పరీక్ష కేంద్రాల్లో 28,256 మందికిగాను 25,662 మంది (90.82శాతం) హాజరుకాగా 2,594 మంది గైర్హాజరయ్యారని పేర్కొన్నారు.

మూడు సెషన్‌లు కలిపి 90.47 శాతం..

రెండు తెలుగు రాష్ట్రాల్లో బుధ, గురువారం కలిపి మొత్తంగా మూడు సెషన్‌లలో టీఎస్ఐసెట్‌ను నిర్వహించారు. 86,156 మంది అభ్యర్థులకు 77,942 మంది (90.47శాతం) హాజరయ్యారు. కాగా, పరీక్ష ముగిసిన నేపథ్యంలో శుక్రవారం సాయంత్రం ప్రాథమిక కీని విడుదల చేయనున్నారు. దీనిపై అభ్యంతరాలను ఈ నెల 8, 9 తేదీల్లో స్వీకరిస్తారని కన్వీనర్ తెలిపారు. హెచ్‌టీటీపీఎస్://ఐసెట్.టీఎస్‌హెచ్ఈ.ఏసీ.ఇన్ అనే వెబ్‌సైట్‌లో నమోదు చేసుకోవచ్చునని, 10న అభ్యంతరాలను పరిశీలించి క్లారిఫికేషన్ నిమిత్తం సంబంధిత వెబ్‌సైట్‌లోనే తెలియజేస్తామని తెలిపారు. ఫైనల్ కీతో పాటు త్వరలోనే ఫలితాలనూ వెల్లడించనున్నట్లు కన్వీనర్ చెప్పారు.

'గ్రూప్-1' రిజర్వేషన్ల వివరాలు తెలుసుకొని చెప్పండి

టీజీపీఎస్సీ కౌన్సిల్‌ను ఆదేశించిన హైకోర్టు



సాక్షి, హైదరాబాద్: గ్రూప్–1లో రిజర్వేషన్లకు సంబంధించి వివరాలు తెలుసుకొని చెప్పాలని టీజీపీఎస్సీ కౌన్సిల్‌ను హైకోర్టు ఆదేశించింది. తదుపరి విచారణను ఈ నెల 10కి వాయిదా వేసింది. ప్రభుత్వ నియామకాలకు సంబంధించి నిర్వహించే పరీక్షల నోటిఫికేషన్‌లో సమాంతర రిజర్వేషన్లు అమలు చేయాలని సుప్రీంకోర్టు పలు తీర్పుల్లో వెల్లడించినా గ్రూప్–1 వికలాంగుల కేటగిరీలో అమలు చేయడం లేదంటూ మెదక్ జిల్లాకు చెందిన అర్జున్, అరుణ్ హైకోర్టులో పిటిషన్ దాఖలు చేశారు. సమాంతర రిజర్వేషన్లు అమలు చేసేలా టీజీపీఎస్సీని ఆదేశించాలని కోరారు. ఈ పిటిషన్‌పై జస్టిస్ పుల్ల కార్తీక్ ధర్మాసనం విచారణ చేపట్టింది. పిటిషనర్ తరఫున న్యాయవాది వాదనలు వినిపిస్తూ నియామక పరీక్షల్లో మహిళ, పీహెచ్‌సీ కోటాలో సమాంతర రిజర్వేషన్లు అమలు చేయాలని సుప్రీంకోర్టు, హైకోర్టు గతంలో పలు తీర్పుల్లో వెల్లడించిందన్నారు. టీజీపీఎస్సీ తరఫున స్టాండింగ్ కౌన్సిల్ వాదిస్తూ ఉద్యోగ నియామకాల్లో సమాంతర రిజర్వేషన్లు అమలు చేయడం కోసమే ప్రభుత్వం జీవో 35ని తీసుకొచ్చిందన్నారు. గ్రూప్–1తోపాటు ఇతర అన్ని నిమాయకాల్లో ఇది అమలవుతుందని చెప్పారు. వాదనలు విన్న ధర్మాసనం.. అధికారులను అడిగి వివరాలు చెప్పాలని ఆదేశిస్తూ విచారణ వాయిదా వేసింది.

Published and Printed by V. Murali, on behalf of Jagati Publications Limited, Published at Jagati Publications Limited, Survey No 300/E, Timmapur Village&Mandal, Karimnagar Dist–505527, T.G., and Printed at Jagati Publications Limited Survey No 300/E, Timmapur Village&Mandal, Karimnagar Dist–505527 T.G.,
Editor: V. Murali(Responsible for selection of News under the PRB Act), Phone No. 0878 - 2223017, Fax No. 0878 – 2223019. RNI Regn No. TELTEL/2008/23800.